సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 6.50

సంపుటి: 18 సంచిక: 326

సోమవారం 16-2-2026

SIMULTANEOUSLY PRINTED AT GUNTUR | MANGALAGIRI | VIJAYAWADA | BANGALORE | CHENNAI | DELHI | HYDERABAD | MUMBAI | ANANTAPUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

'అవినీతి, అసత్య వార్తలు క్యాన్సర్ కన్నా ప్రమాదకరం'

మళ్లీ మనమే..

టి20 ప్రపంచకప్‌లో భారత్ ఘన విజయం

61పరుగుల తేడాతో పాకిస్తాన్ చిత్తు

'సూపర్ ఎయిట్' దశకు..

10లో

ఉఫ్.. బిగ్ రిలీఫ్!

బ్యాంకులు, ఆర్థిక సంస్థలు మనకు పనికిరాని ఉత్పత్తుల్ని బలవంతంగా కొనిపించేదంతా మిస్-సెల్లింగే. దీన్నుంచి వినియోగదారులను కాపాడేందుకు రిజర్వ్ బ్యాంక్ చర్యలకు దిగింది. ఈ నేపథ్యంలో కష్టమర్లకుండే హక్కులపై కథనం.

మీ లాకర్ ఎంత భద్రం?

బ్యాంకు లాకర్లలో ఆభరణాలు పెట్టేదే భద్రంగా ఉంటాయని.. మరి అక్కడే చోరీ జరిగితే? బ్యాంకులు తప్పించుకోజూస్తే? ఇలాంటి పరిస్థితులు ఎదురవ్వకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కథనం.

వివరాలు వెల్త్ పేజీల్లో

నేటి గుడ్లు & చికెన్ గుంటూరు జోన్ ధరలు

12 గుడ్ల ట్రేటిల్ ధర ₹75	ఫారం దగ్గర లైవ్ బర్డ్	115 కిలో	డ్రెస్డ్ స్కిన్‌తో	206 కిలో
	లేయర్ లైవ్ బర్డ్	142 కిలో	స్కిన్ లెస్	234 కిలో

వినియోగదారుల శ్రేయస్సు దృష్ట్యా జారీచేయడమైనది

కమీషన్ ఇవ్వకపోతే..

మీ బియ్యం ఉడకవ్!

ఇబ్బందులు పడతారంటూ రైస్ మిల్లర్లకు బెదిరింపులు

కస్టమ్ మిల్లెడ్ రైస్‌లో కమీషన్లకు కక్కుర్తి

రూ.80 కోట్ల ముడుపులకు ఓ మంత్రి పక్కా స్కెచ్

మరో కీలక మంత్రి వియ్యంకుడి ద్వారా అమలు

- ముక్కు పిండి వసూలు చేస్తున్న అసోసియేషన్లు
- క్వింటాకు రూ.16 ఇవ్వాల్సిందేనని హుకుం
- ప్రభుత్వం ఇచ్చేదే రూ.10 అయితే అంత కమీషన్ అంటే ఎలా అంటున్న మిల్లర్లు
- అలాగైతే నూక, తవుడు మాటేంటని దబాయింపు
- కాదంటే బిల్లుల్లో ఇబ్బందులు, కోత తప్పదని హెచ్చరిక
- వసూళ్లలో కీలక పాత్ర పోషిస్తున్న అమాత్యుని వియ్యంకుడికి, మరో మిల్లర్‌కు కమీషన్ మినహాయింపు

3లో

పైగా తొలిసారి ఈ ఇద్దరు బడా ఎక్స్‌పోర్టర్లకు సీఎంఆర్ కోటా కింద 90 వేల టన్నులు	51 లక్షల టన్నులకు గాను ఇప్పటికే 48 లక్షల టన్నుల సేకరణ పూర్తి	మొత్తంగా 51 లక్షల టన్నులకు కమీషన్ల వసూళ్లు సైతం 60-70 శాతం పూర్తి	నెలాఖరులోగా మిగతా 30-40 శాతం వసూలు చేయాలని టార్గెట్

బాండ్లు పంచి బాబు బురిడీ

- సూపర్ సిక్స్ హామీలకు మంగళం.. మూడు బడ్జెట్లలో ఇచ్చింది సున్నా
- నిరుద్యోగ భృతి, ఆడబిడ్డ నిధి లాంటి ప్రధాన హామీలకూ దిక్కులేదు.. అరకొరగా విదిలించిన పథకాలకు భారీగా కోతలతో సరి..
- ఎన్నికల ప్రధాన హామీలను నెరవేర్చకుండా మూడేళ్లలో అన్ని వర్గాలకు రూ.2.22 లక్షల కోట్ల మేర ఎగ్గొట్టిన చంద్రబాబు సర్కారు
- ఓ రాజకీయ పార్టీ ఇంటింటికీ గ్యారంటీతో బాండ్లు పంచి మరీ మోసగించడం దేశ చరిత్రలో ఇదే తొలిసారి
- క్లాసిక్ కేస్ స్టడీ అంటున్న రాజకీయ విశ్లేషకులు.. అడ్డగోలుగా హామీలు, అధికారంలోకి వచ్చాక వంచించడంపై దేశవ్యాప్తంగా చర్చ
- రాజకీయ పార్టీలిచ్చే హామీలకు చట్టబద్ధత కల్పించాలని సర్వత్రా డిమాండ్లు
- మేనిఫెస్టోకు చట్టబద్ధత ఉంటేనే ఎన్నికల ప్రక్రియ, ప్రజాస్వామ్యం పరిఢవిల్లుతుందంటున్న న్యాయ నిపుణులు, ప్రజాస్వామ్యవాదులు
- దీనిపై సుప్రీం, ఎన్నికల కమిషన్ జోక్యం చేసుకుని ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలని వినతి

2లో

ముక్కంటీ.. మనసాస్మరామీ

విద్యుత్ దీపాల వెలుగుల్లో కోటప్పకొండ త్రికోటేశ్వరస్వామి ఆలయం, ప్రభలు

రాష్ట్రవ్యాప్తంగా మార్మోగిన పంచాక్షరీ మంత్రం

అత్యంత భక్తిశ్రద్ధలతో మహా శివరాత్రి వేడుకలు

5లో

శివ.. శివా!

శ్రీకాళహస్తీశ్వరుని దర్శనానికి వెళ్లిన భక్తురాలి మృతి

కోటప్పకొండలో పదేళ్ల బాలికకు ఊపిరాడక అస్వస్థత

5లో

శ్రీకాళహస్తిలో మరణించిన మణెమ్మ



25 YEARS Protecting Lives, Securing Future | SBI Life

మన కోసం. మనవాళ్ల కోసం.

జీవిత ప్రయాణంలో...

"మీ మాటను నిలబెట్టుకోండి, మీ ఆశయాలను నెరవేర్చుకోండి"

జీవిత ప్రయాణాన్ని రూపుదిద్దుకోనివ్వండి
మేము నిలబెట్టుకునే **మాటతో**
మరియు మేము ప్రేమించేవారితో మేము చేసే **వాగ్దానాలతో**

రెండున్నర దశాబ్దాల నుంచి,
ఎస్‌బిఐ లైఫ్ మీకు అండగా నిలుచుంది,
ప్రతి మెట్టులో **భద్రత వాగ్దానం** చేస్తుంది.

అదే వాగ్దనం ఇప్పుడు ప్రత్యక్షంగా చేస్తున్నారు **జాలీ మరియు పాలీ.**

కలిసిమెలిసి, వారు మీ పక్కనే మీతో నడుస్తారు, మీరు స్వేచ్ఛగా మీ కలలను **సాకారం** చేసుకునేందుకు మీకు మరియు ఆత్మీయులకు జీవిత ప్రయాణంలో **సాధికారిత** అందిస్తూ మరియు ప్రతి మెట్టులో పునః హామీ కలిగిస్తూ!

ఎస్‌బిఐ లైఫ్
మన కోసం. మనవాళ్ల కోసం.

ఎస్‌బిఐ లైఫ్ - స్మార్ట్ ప్లాటినా అడ్వాంటేజ్ గురించి అడగండి
(UIN: 111N175V01)

సుదీర్ఘ-వ్యవధి ఆర్థిక ఆత్మవిశ్వాసం కోసం
జీవిత బీమా హామీపూరిత పొదుపుల ప్లాన్

మరింత సమాచారం కోసం స్కాన్ చేయండి

ఎస్‌బిఐ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ లిమిటెడ్ మరియు ఎస్‌బిఐ అనేవి రెండు వేర్వేరు చట్టబద్ధమైన సంస్థలు.

దురుద్దేశమైన ఫోన్ కాల్స్ మరియు ఊహాజనితమైన/మోసపూరితమైన ఆఫర్స్‌తో జాగ్రత్తగా ఉండండి
ఇన్సూరెన్స్ పాలసీల అమ్మకం, బోనస్ ప్రకటించడం లేదా ప్రీమియం పెట్టుబడి వంటి ప్రక్రియలలో IRDAI లేదా దాని అధికారులు ప్రమేయం కలుగచేసుకోదు. అటువంటి ఫోన్ కాల్స్ అందుకున్న ప్రజలు పోలీసులకు ఫిర్యాదు చేయవలసిందని మనవి.

ఎస్‌బిఐ లైఫ్ - స్మార్ట్ ప్లాటినా అడ్వాంటేజ్, ఇదో వ్యక్తిగతమైన, నాన్-లింక్డ్, నాన్-పార్టిసిపేటింగ్, లైఫ్ ఇన్సూరెన్స్ పొదుపుల ఉత్పత్తి.

ప్రమాదాంశాలు, నిబంధనలు మరియు షరతులపై మరిన్ని వివరాల కోసం దయచేసి విక్రయాన్ని ముగించే ముందు, సేల్స్ బ్రోచర్‌ని శ్రద్ధగా చదవండి. పైన పేర్కొన్న వ్యాపార చిహ్నం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాది మరియు లైసెన్స్ కింద ఎస్‌బిఐ లైఫ్ ద్వారా వాడడం జరుగుతుంది. ఎస్‌బిఐ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ లిమిటెడ్. రిజిస్టర్డ్ మరియు కార్పొరేట్ ఆఫీస్ : నటరాజ్, ఎమ్. వి. రోడ్ అండ్ వెస్టర్న్ ఎక్స్‌ప్రెస్ హైవే జంక్షన్, అంధేరి (తూర్పు), ముంబయి-400069. • IRDAI రిజిస్ట్రేషన్ నం. 111 • వెబ్‌సైట్: www.sbilife.co.in • ఇమెయిల్: info@sbilife.co.in • టోల్ ఫ్రీ: 1800 267 9090 (కస్టమర్ సర్వీస్ సమయం : 24X7) • CIN: L99999MH2000PLC129113

JPJFM/Cr1/01/26/ADVT/TEL

సాక్షి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షి బదులుగా ఇతర దినపత్రికలు వేస్తున్నా.. మా టోల్ ఫ్రీ నెంబర్‌కు ఉ.7.00 గం.ల నుండి రా.8.00 గం.ల లోపు తెలుపగలరు. వెంటనే తగిన చర్యలు తీసుకుంటాం.
టోల్ ఫ్రీ నెం 1800 2125 9899

బాండ్లు పంచి బాబు బురిడీ!

సూపర్ సిక్స్ హామీలకు మంగళం.. మూడు బడ్జెట్లలో ఇచ్చింది సున్నా

అడ్డగోలుగా హామీలు.. అధికారంలోకి వచ్చాక వంచించడంపై దేశవ్యాప్తంగా చర్చ

టీడీపీ మేనిఫెస్టో విడుదల చేసిన సందర్భంగా ఈనాడులో ప్రచురితమైన కథనం



నంద్యాల జిల్లా ఆళ్లగడ్డ మండలం దొరకొట్టాల గ్రామానికి చెందిన పసాది సాలమ్మకు జరగబోయే లబ్ధికి సంబంధించి కూటమి నేతలు ఇచ్చిన బాండ్

బడ్జెట్ సాక్షిగా సూపర్ సిక్స్‌లు ఔట్..!

ఆడబిడ్డ నిధి, నిరుద్యోగ భృతి, 50 ఏళ్లకే పింఛన్, పొదుపు మహిళలు, రైతులకు సున్నా వడ్డీ పథకాలకు పైసా కూడా కేటాయింపులు చేయకుండా బడ్జెట్ సాక్షిగా చంద్రబాబు పూర్తిగా ఎగరగొట్టారు. ఎన్నికల హామీ మేరకు ఈ పథకాలను అమలు చేయకుండా చంద్రబాబు రూ.1.62 లక్షల కోట్లకుపైగా మహిళలు, నిరుద్యోగులు, రైతులకు ఎగ్గొట్టారు. ఇక తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, దీపం, ఉచిత బస్సు పథకాలకు అరకొరగా విదిలించి, తగినన్ని నిధులు ఇవ్వకుండా దాదాపు మరో రూ.60 వేల కోట్ల మేర ఎగ్గొట్టారు. ఇలా ఎన్నికల ప్రధాన హామీలను నెరవేర్చకుండా మూడేళ్లలో సుమారు రూ.2.22 లక్షల కోట్ల మేర అన్ని వర్గాలకు చంద్రబాబు ఎగ్గొట్టారు.

సాక్షి, అమరావతి:

- నిరుద్యోగ భృతి కింద యువతకు నెలకు రూ.3 వేలు..
- 18 నుంచి 59 ఏళ్ల లోపు మహిళలకు ఆడబిడ్డ నిధి ద్వారా ఏడాదికి రూ.18 వేలు..
- 50 ఏళ్లకే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు నెలకు రూ.4 వేల చొప్పున పెన్షన్..
- సున్నా వడ్డీతో మహిళా పొదుపు సంఘానికి రూ.10 లక్షలు, ఒక్కో రైతుకు రూ.3 లక్షలు చొప్పున రుణాలు..
- అధికారంలోకి రాగానే ఉద్యోగులకు ఐఆర్.. మెరుగైన పీఆర్సీ..!!
- టీడీపీ కూటమి ఎన్నికల మేనిఫెస్టోలో ప్రధాన హామీలివీ!

చంద్రబాబు ఎన్నికల మోసాలు.. ఇంటింటికీ బాండ్లు ఇచ్చి మరీ వంచించడం.. మూడు బడ్జెట్లలోనూ సూపర్ సిక్స్‌ల ఊసే లేకపోవడం.. ఓ రాజకీయ పార్టీ ఇచ్చిన ప్రధాన హామీలకే దిక్కులేకుండా పోవడంపై సర్వత్రా పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. ఎన్నికల హామీలను అమలు చేస్తామని ప్రతి ఇంటికీ గ్యారంటీతో బాండ్లు పంచి మరీ మోసగించడం దేశ చరిత్రలో ఇదే తొలిసారి.. ఇదో క్లాసిక్ కేస్ స్టడీ అని రాజకీయ విశ్లేషకులు స్పష్టం చేస్తున్నారు. రాష్ట్రంలో టీడీపీ కూటమి అధికారంలోకి రావడానికి సూపర్ సిక్స్‌తోపాటు ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలు ప్రధాన పాత్ర పోషించాయని కూటమి నేతలు కూడా పలు సందర్భాల్లో అంగీకరించారు. అలాంటిది.. కూటమి పార్టీలు అధికారంలోకి రావడానికి దారితీసిన ఆ హామీలను అమలు చేయకపోవడమంటే ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడమేనని, రాజకీయాల్లో నైతికతకు తిలోదకాలు ఇవ్వడమేనని స్పష్టం చేస్తున్నారు. మోసపూరిత హామీలతో అధికారాన్ని చేజిక్కించుకోవడం.. వాటిని అమలు చేయకుండా వెన్నుపోటు పొడిచారనేందుకు చంద్రబాబు సర్కార్ అత్యుత్తమ ఉదాహరణ అని రాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నారు. మేనిఫెస్టోను 'మోసఫెస్టో'గా మార్చేసి ఎన్నికల ప్రక్రియను, ప్రజాస్వామ్యాన్ని సీఎం చంద్రబాబు అపహాస్యం చేశారనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది. చంద్రబాబు నేతృత్వంలో 2024–25, 2025–26, తాజాగా ప్రవేశపెట్టిన 2026–27 బడ్జెట్‌లోనూ సూపర్ సిక్స్ హామీల అమలుకు కేటాయింపులు చేయలేదు. దీన్ని బట్టి ఆ హామీలకు ఇక మంగళం పాడేశామని మూడో బడ్జెట్ సాక్షిగా చంద్రబాబు సర్కార్ తేల్చి చెప్పినట్టైందని పేర్కొంటున్నారు. మహిళలు, నిరుద్యోగులు, రైతులు, ఉద్యోగులు.. ఇలా అన్ని వర్గాల ప్రజలకు సీఎం చంద్రబాబు సామూహికంగా వెన్నుపోటు పొడిచారన్నది స్పష్టమవుతోందని విశ్లేషిస్తున్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇలా అడ్డగోలుగా హామీలు ఇవ్వడం.. అధికారంలోకి వచ్చాక రాజకీయ పార్టీలు వాటిని అమలు చేయకుండా ప్రజలను మోసం చేయడంపై ఇటీవల దేశవ్యాప్తంగా చర్చ సాగుతోంది. మేనిఫెస్టోకు చట్టబద్ధత ఉంటేనే ఎన్నికల ప్రక్రియ, ప్రజాస్వామ్యం పరిఢవిల్లుతుందని న్యాయ నిపుణులు, రాజకీయ విశ్లేషకులు, ప్రజాస్వామ్యవాదులు స్పష్టం చేస్తున్నారు. దేశంలో అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టుతోపాటు ఎన్నికల కమిషన్ సైతం ఈ విషయంలో జోక్యం చేసుకుని ప్రజాస్వామ్య పునాదులను పరిరక్షించాలని కోరుతున్నారు.

హామీలకు గ్యారంటీ ఇస్తూ ఇంటింటికీ బాబు బాండ్లు..

సార్వత్రిక ఎన్నికలకు 11 నెలల ముందే 2023 మే 28న రాజమహేంద్రవరంలో నిర్వహించిన మహానాడు వేదికగా సూపర్ సిక్స్ హామీలను టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు ప్రకటించారు. సూపర్ సిక్స్.. సెవెన్.. అంటూ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను ఇంటింటా ప్రచారం చేసి.. వాటి ద్వారా ఆ కుటుంబానికి ఐదేళ్లలో చేకూరే ప్రయోజనంపై గ్యారంటీ ఇస్తూ బాండ్లు జారీ చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి 'బాబు ష్యూరిటీ–భవిష్యత్తుకు గ్యారంటీ'గా నామకరణం కూడా చేశారు. మహానాడు ముగిసినప్పటి నుంచి ఎన్నికల ప్రచారం ముగిసే వరకూ నియోజకవర్గాల టీడీపీ సమన్వయ కర్తలు, నాయకులు ఇంటింటికీ వెళ్లి కుటుంబ సభ్యుల పేర్లు ఆరా తీసి టీడీపీ మేనిఫెస్టో డాట్‌కామ్ వెబ్‌సైట్‌లో నమోదు చేశారు. కుటుంబ యజమాని ఫోన్ నెంబర్ తీసుకుని టీడీపీ మేనిఫెస్టో డాట్‌కామ్ వెబ్‌సైట్ ద్వారా ఓటీపీ పంపించారు. ఆ ఓటీపీ నెంబరును వెబ్‌సైట్‌లో నమోదు చేసుకుని సూపర్ సిక్స్ సహా వివిధ పథకాల ద్వారా ఆ కుటుంబానికి ఏటా చేకూరే లబ్ధి.. ఐదేళ్లకు ఒనగూరే ప్రయోజనంపై ప్రచారం చేశారు. టీడీపీకి మద్దతు ఇస్తున్నట్లు వెబ్‌సైట్‌కు మిస్డ్ కాల్ ఇప్పించారు. వారి ఫోన్ నెంబర్‌కు బాబు ష్యూరిటీ–భవిష్యత్తుకు గ్యారంటీ పేరుతో బాండ్లు పంపారు. వాటిని కుటుంబ సభ్యుల ముందే డౌన్‌లోడ్ చేయించారు. వివిధ పథకాల కింద ఆ కుటుంబానికి చేకూరే లబ్ధి, ఆ హామీలను అమలు చేస్తానని త్రికరణ శుద్ధిగా ప్రమాణం చేసి చెబుతున్నానని ఆ బాండ్లలో చంద్రబాబు స్పష్టం చేశారు. సూపర్ సిక్స్ సహా హామీలన్నీ 2024 జూన్ నుంచే అమలు ప్రారంభమవుతుందని ఆ బాండ్లలో తేల్చి చెప్పారు. ఎన్నికల మేనిఫెస్టోలో చంద్రబాబు ఇచ్చిన హామీల అమలు పూచీ తనదంటూ జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ అప్పట్లో నమ్మబలికారు.

బాండ్లు ఇచ్చి మోసగించడం దేశ చరిత్రలో ఇదే తొలిసారి...

టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి ఇచ్చి 20 నెలలు పూర్తయింది. మూడు బడ్జెట్‌లను ఇప్పటికే ప్రవేశపెట్టారు. వాటిలో సూపర్ సిక్స్ ప్రధాన హామీల అమలు ప్రస్తావనే లేదు. అంటే.. ఆ హామీలను అమలు చేయబోమని చంద్రబాబు సర్కార్ తెగేసి చెప్పిందన్నమాట! హామీల అమలుకు ఇంటింటా గ్యారంటీ బాండ్లు ఇచ్చి.. వాటిని అమలు చేయకుండా మోసం చేయడం దేశంలో ఇదే తొలిసారి అని రాజకీయ విశ్లేషకులు స్పష్టం చేస్తున్నారు. రాజకీయ పార్టీలు తమ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల్లో రెండో మూడో అమలు చేయకపోవడం సాధారణం. కానీ మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల్లో సింహభాగం తుంగలో తొక్కడం ఎన్నికల ప్రక్రియను, ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడమేనని పేర్కొంటున్నారు.

సామూహికంగా వెన్నుపోటు..

సూపర్ సిక్స్ సహా ఎన్నికల హామీల అమలు 2024 జూన్ నుంచే ప్రారంభమవుతుందంటూ ప్రతి ఇంటికీ బాబు ష్యూరిటీ–భవిష్యత్తుకు గ్యారంటీ ద్వారా ఇచ్చిన బాండ్ల మేరకు లబ్ధి చేకూరకపోవడంతో సర్వత్రా మండిపడుతున్నారు. టీడీపీ నేతలు ఇచ్చిన బాండ్లను పరిశీలించి సూపర్ సిక్స్ సహా వివిధ పథకాల కింద చంద్రబాబు ప్రభుత్వం తమ కుటుంబానికి ఎంత ఎగ్గొట్టిందో లెక్కలు వేసుకుంటున్నారు. ఆ బాండు ప్రకారం తమ ఇంటికి ఏడాదిలో రావాల్సిన మొత్తాన్ని లెక్కించి.. వడ్డీతో సహా చెల్లించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

భృతి ఇవ్వకుండా ఎగ్గొట్టింది రూ.21,600 కోట్లు

సూపర్ సిక్స్ పథకాల్లో భాగంగా 20 లక్షల మందికి ఉద్యోగాలు.. లేదంటే నెలకు రూ.3 వేల చొప్పున నిరుద్యోగ భృతి ఇస్తానని చంద్రబాబు హామీ ఇచ్చారు. కానీ.. మూడు బడ్జెట్లు ప్రవేశపెట్టినా నిరుద్యోగ భృతి మాటే లేదు. రాష్ట్రంలో 20 లక్షల మంది నిరుద్యోగులు ఉండగా హామీ ప్రకారం ఏడాదికి మొత్తం రూ.7,200 కోట్లు చెల్లించాలి. మూడు బడ్జెట్లలోనూ పైసా ఇవ్వకుండా నిరుద్యోగులకు సీఎం చంద్రబాబు మొత్తం రూ.21,600 కోట్లు ఎగ్గొట్టారు.

ఆడబిడ్డలకు రూ.97,200 కోట్ల ఎగనామం!

సూపర్ సిక్స్ హామీల్లో మరో ప్రధాన హామీ ఆడబిడ్డ నిధి పథకం. రాష్ట్రంలో 18 ఏళ్లు నిండిన మహిళలు 2.07 కోట్ల మంది ఉన్నారు. ఇందులో 18 నుంచి 59 ఏళ్ల మధ్య వయసు ఉన్న వారు 1.80 కోట్ల మంది ఉంటారు. వీరికి ఆడబిడ్డ నిధి కింద ఏటా రూ.18 వేలు చొప్పున ఇస్తామని సీఎం చంద్రబాబు హామీ ఇచ్చారు. ఈ పథకానికి ఏటా రూ.32,400 కోట్లు అవసరం. కానీ.. మూడు బడ్జెట్లలోనూ ఒక్క పైసా కేటాయించలేదు. 2026–27 బడ్జెట్‌లోనూ కనీసం ఆడబిడ్డ నిధి ప్రస్తావనే లేదు. ఆడబిడ్డ నిధి కింద మహిళలకు చంద్రబాబు ఇప్పటికే రూ.97,200 కోట్లు ఎగ్గొట్టారు.

బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు రూ.28,800 కోట్లు బురిడీ!

50 ఏళ్లు నిండిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు చెందిన మహిళలు, పురుషులకు పెన్షన్ ఇస్తానని సీఎం చంద్రబాబు ఎన్నికల ముందు హామీ ఇచ్చారు. రాష్ట్రంలో 50 ఏళ్లు నిండిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు 20 లక్షల మంది ఉన్నారు. వారికి నెలకు రూ.4 వేల చొప్పున ఏడాదికి రూ.9,600 కోట్లు పెన్షన్ రూపంలో ఇవ్వాలి. కానీ.. మూడు బడ్జెట్లు ప్రవేశపెట్టినా ఈ పథకానికి ఒక్క పైసా ఇవ్వకుండా బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు చంద్రబాబు రూ.28,800 కోట్ల మేర ఎగ్గొట్టారు.

సున్నా వడ్డీకి సున్నా..

సున్నా వడ్డీ పథకం కింద స్వయం సహాయక సంఘాల (డ్వాక్రా) మహిళలకు ఒక్కో సంఘానికి రూ.పది లక్షలు.. ఒక్కో రైతుకైతే రూ.3 లక్షలు చొప్పున రుణాలు ఇస్తామని సీఎం చంద్రబాబు హామీ ఇచ్చారు. రాష్ట్రంలో కోటి మందికిపైగా పొదుపు మహిళలు గతంలో ఏటా సున్నా వడ్డీ కింద లబ్ధి పొందారు. పొదుపు మహిళలకు సున్నా వడ్డీ పథకాన్ని వర్తింప చేయాలంటే ఏడాదికి రూ.5 వేల కోట్ల వడ్డీ రాయితీని ప్రభుత్వం చెల్లించాలి. మూడు బడ్జెట్లలో నిధులు కేటాయించకుండా మహిళలకు చంద్రబాబు రూ.15 వేల కోట్లు మేర ఎగ్గొట్టారు! ఇక సున్నా వడ్డీ కింద ఒక్కో రైతుకు రూ.3 లక్షల రుణాన్ని ఇవ్వాలంటే ఏడాదికి కనీసం రూ.వెయ్యి కోట్లు అవసరం. కానీ.. మూడు బడ్జెట్లు ప్రవేశపెట్టినా నిధులు కేటాయించకుండా రైతులకు రూ.3 వేల కోట్లు మేర ఎగ్గొట్టారు. మొత్తంగా సున్నా వడ్డీ పథకానికి సున్నా చుట్టి మహిళలు, రైతులకు రూ.18 వేల కోట్ల మేర చంద్రబాబు ఎగనామం పెట్టారు!

ఉద్యోగుల బకాయిలు రూ.40 వేల కోట్లు!

తాము అధికారంలోకి వచ్చిన వెంటనే ఉద్యోగులకు ఐఆర్, మెరుగైన పీఆర్సీ ఇస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారు. ఇంతవరకూ ఐఆర్ ప్రకటించకపోగా.. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నియమించిన పీఆర్సీ కమిషన్‌ను రద్దు చేశారు. కొత్త పీఆర్సీ కమిషన్‌ను నియమించలేదు. ప్రస్తుతం ఉద్యోగులకు ఇవ్వాల్సిన బకాయిలు దాదాపు రూ.40 వేల కోట్లకు చేరుకున్నట్లు ఉద్యోగ సంఘాలు చెబుతున్నాయి.

తల్లులకు బాబు వంచన..

తల్లికి వందనం కింద ఎంత మంది పిల్లలను బడికి పంపిస్తే అంత మందికీ రూ.15 వేల చొప్పున ఇస్తామని చంద్రబాబు ఎన్నికల ముందు హామీ ఇచ్చారు. యూడైస్ గణాంకాల ప్రకారం రాష్ట్రంలో 87,41,885 మంది పిల్లలు బడుల్లో చదువుతున్నారు. ఈ పథకానికి ఒక్కొక్కరికీ ఏటా రూ.15 వేల వంతున ఏడాదికి మొత్తం రూ.13,112.82 కోట్లు ఇవ్వాలి. తొలి ఏడాది పూర్తిగా ఎగ్గొట్టారు. 2025–26లో కేవలం 66 లక్షల మందికి రూ.6,377 కోట్లను మాత్రమే చెల్లించారు. రెండేళ్లలో ఇప్పటికే తల్లులకు రూ.19,848.64 కోట్లకుపైగా సీఎం చంద్రబాబు బకాయిపడ్డారు. ఇక ఇప్పుడు బడ్జెట్‌లో రూ.8457.07 కోట్లు మాత్రమే ప్రతిపాదించి ఏకంగా రూ.4,655.75 కోట్ల మేర కోతలు పెట్టారు. తద్వారా మూడేళ్లలో పిల్లలకు రూ.24,504 కోట్లను ఎగ్గొట్టారు!

రైతులకు వెన్నుపోటు..

పీఎం కిసాన్‌తో సంబంధం లేకుండా అన్నదాత సుఖీభవ కింద ఒక్కో రైతుకు ఏడాదికి రూ.20 వేల చొప్పున పెట్టుబడి సాయంగా అందిస్తానని చంద్రబాబు హామీ ఇచ్చారు. రాష్ట్రంలో 53,58,266 మంది రైతులు ఉన్నారు. వారికి రూ.20 వేల చొప్పున ఇవ్వాలంటే ఏటా రూ.10,716.53 కోట్లు అవసరం. తొలి ఏడాది పూర్తిగా ఎగ్గొట్టారు. 2025–26లో 46,85,838 మంది రైతులకు రూ.పది వేల చొప్పున రూ.4,685.54 కోట్లు మాత్రమే విదిల్చారు. 6,72,428 మంది రైతులకు పూర్తిగా ఎగనామం పెట్టారు. రెండేళ్లలో రూ.40 వేలు ఇవ్వాల్సి ఉండగా ఒక్కో రైతుకు రూ.30 వేలు బకాయి పడ్డారు. అన్నదాత సుఖీభవ కింద రైతులకు సీఎం చంద్రబాబు రెండేళ్లలో రూ.16,747.52 కోట్లు బకాయిపడ్డారు. తాజా బడ్జెట్‌లోనూ (2026–27) అరకొరగా కేటాయింపులు చేసి రైతులకు మొత్తంగా మూడేళ్లలో దాదాపు రూ.21 వేల కోట్ల మేర ఎగ్గొట్టారు.

మూడో బడ్జెట్‌లోనూ బుకాయింపులే

చంద్రబాబు ప్రభుత్వం ప్రవేశపెట్టిన మూడో బడ్జెట్‌లోనూ అబద్ధాలు, మోసాలు, బుకాయింపులే ఉన్నాయి. ఆడబిడ్డనిధి, నిరుద్యోగ భృతి, యాభై ఏళ్లకే పింఛన్ వంటి హామీలకు నిధులు కేటాయించలేదు. రైతులు, మహిళలు, ప్రభుత్వ ఉద్యోగులకు మొండి చేయి చూపారు. బడ్జెట్‌లో పీఆర్సీ, ఐఆర్ ప్రస్తావనే లేదు. వీటిపై మండలిలో నిలదీస్తాం.

– ఎంవీ రామచంద్రారెడ్డి, ఎమ్మెల్సీ

అన్ని వర్గాలకు మొండిచేయి

బడ్జెట్‌లో అన్ని వర్గాలకు చంద్రబాబు ప్రభుత్వం మొండిచేయి చూపింది. నిరుద్యోగ భృతి కోసం యువత రెండేళ్లుగా ఎదురు చూస్తున్నారు. 18–59 ఏళ్ల మహిళలందరికీ ఆడబిడ్డ నిధి ద్వారా ఏడాదికి రూ.18వేలు ఇస్తామని చెప్పారు. ఈ పథకాలకు నిధులు కేటాయించలేదు. పేదలకు మేలు చేయాలంటే జగనన్న లాగ పెద్ద హృదయం ఉండాలి. హామీలు అమలు చేయాలనే చిత్తశుద్ధి చంద్రబాబుకు లేదు.

– చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ ఒంగోలు పార్లమెంట్ ఇన్‌చార్జి

లెక్కలకు రెక్కలు!

ఆదాయంపై ఊహాజనిత గణాంకాలతో బాబు సర్కారు భారీ బడ్జెట్లు

- సవరించిన అంచనాల్లో భారీ కోతలు.. గత రెండు బడ్జెట్లలోనూ అదే తీరు
- అంకెల గారడీతో ఏమార్చడమే లక్ష్యం
- కేటాయించిన మేరకు వ్యయం చేయకుండా అన్ని వర్గాలకూ మోసం.
- 2024–25 బడ్జెట్‌లో రూ.22,141 కోట్లు కోత
- 2025–26 బడ్జెట్‌లో రూ.21,825 కోట్లు కోత

సాక్షి, అమరావతి: ప్రభుత్వ ఖజానాకు రావాల్సిన ఆదాయానికి గండి కొట్టి పచ్చముఠాల దోపిడీకి గేట్లు తెరిచిన చంద్రబాబు సర్కారు.. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ఊహాజనిత లెక్కలతో వరుసగా మూడు బడ్జెట్లను ప్రవేశపెట్టిందని ఆర్థిక నిపుణులు స్పష్టం చేస్తున్నారు. గత రెండు బడ్జెట్లలోనూ అంచనాల మేరకు రాష్ట్ర పన్నుల ఆదాయం రాకపోవడంతో సవరించిన అంచనాల్లో భారీ కోతలు విధించడమే దీనికి నిదర్శనమని తేల్చి చెబుతున్నారు. తద్వారా బడ్జెట్ కేటాయింపుల మేరకు వ్యయం చేయకుండా కోతలు పెడుతోందని, ఇది అంకెల గారడీతో ప్రజలను మోసగించడమేనని తప్పుబడుతున్నారు. చంద్రబాబు సర్కారు అధికారంలోకి వచ్చిన వెంటనే ఇసుక నుంచి మద్యం వరకూ.. చివరకు ప్రకృతి సంపదను సైతం వదలకుండా విచ్చలవిడిగా సిలికా, క్వార్ట్జ్, లేటరైట్, గనుల దోపిడీకి తెర తీసిన విషయం తెలిసిందే. దీంతో ప్రభుత్వ ఖజానాకు రావాల్సిన ఆదాయం అంతా టీడీపీ పెద్దల జేబుల్లోకి చేరిపోతోంది. సంపద సృష్టించకుండా... సూపర్ సిక్స్ హామీలను అమలు చేయకుండా.. అంతులేని అప్పులతో రాష్ట్ర ప్రజలపై పెను భారం మోపుతున్నారు.

హామీలు విస్మరించి.. పరిమాణం పెంచి

చట్టసభలో ప్రవేశపెట్టే బడ్జెట్‌ను అపహాస్యం చేస్తూ, వాస్తవాలకు దూరంగా, ఊహాజనిత గణాంకాలతో 2026–27 వార్షిక బడ్జెట్‌ను చంద్రబాబు సర్కారు రూపొందించింది. బడ్జెట్ కేటాయింపుల మేరకు నిధులను వ్యయం చేయకుండా ఆయా వర్గాలను వంచిస్తోంది. ఆదాయం, రాబడులు రావని తెలిసి కూడా ప్రజలను ఏమార్చేందుకు రూ.3,32,205 కోట్లతో 2026–27 వార్షిక బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. గత రెండు బడ్జెట్‌లలో ప్రజలకిచ్చిన హామీలను అమలు చేయకుండా మోసం చేసినట్లుగానే వచ్చే ఆర్థికఏడాదిలో కూడా వంచించడమే లక్ష్యంగా ఊహాజనిత గణాంకాలతో బడ్జెట్ పరిమాణాన్ని భారీగా పెంచారని, ఈ బడ్జెట్ వాస్తవికతను ప్రతిబింబించడం లేదని అధికార వర్గాల్లో చర్చ జరుగుతోంది.

ఉత్త కేటాయింపులే.. అంతా కోతలే

2024–25, 2025–26 బడ్జెట్ కేటాయింపుల మేరకు నిధులను వ్యయం చేయడంలో చంద్రబాబు సర్కారు దారుణంగా విఫలమైంది. 2024–25లో రూ.2,94,427 కోట్లతో బడ్జెట్‌ను ప్రవేశపెట్టగా ఆ ఆర్థిక సంవత్సరం ముగిసే సమయంలో సవరించిన అంచనాలంటూ రూ.19,820 కోట్ల మేర కోత విధించారు. చివరకు కోత విధించిన మేరకు కూడా బడ్జెట్‌ను అమలు చేయలేకపోయారు. వాస్తవ లెక్కల ప్రకారం 2024–25 బడ్జెట్ అంచనాల్లో రూ.22,141 కోట్ల మేర కోత పడింది. అంటే బడ్జెట్ రూ.2,72,286 కోట్లకే పరిమితమైంది. ఇక 2025–26లో చంద్రబాబు ప్రభుత్వం ఏకంగా రూ.3,22,359 కోట్లతో బడ్జెట్‌ను ప్రవేశపెట్టింది. తీరా ఆర్థిక సంవత్సరం ముగిసే సమయంలో సవరించిన అంచనాలంటూ బడ్జెట్‌లో రూ.21,825 కోట్ల మేర కోత విధించింది. వాస్తవ లెక్కలు వెల్లడైతే ఎంత మేర కోత విధించారో స్పష్టం కానుంది. ఇదే రీతిలో ఈదఫా కూడా పేదలను మోసం చేయడానికి 2026–27 బడ్జెట్‌లో ఇళ్ల నిర్మాణాలకు రూ.6,357 కోట్ల కేటాయింపులు చేసినట్లు పేర్కొన్నారు. ఇవి కాగితాలకే పరిమితమని, వాస్తవంగా వ్యయం చేసే ఉద్దేశం ప్రభుత్వానికి లేదని గత రెండు బడ్జెట్‌లు నిరూపిస్తున్నాయి.

పన్నుల ఆదాయం పతనం..

రాష్ట్ర సొంత పన్నుల ఆదాయం అంచనాల మేరకు లేదని తెలిసి కూడా వచ్చే ఆర్థిక ఏడాది బడ్జెట్‌ను ఊహాజనిత లెక్కలతో, భారీ పరిమాణంతో ప్రవేశపెట్టారని ఆర్థిక నిపుణులు తప్పుబడుతున్నారు. 2024–25లో రాష్ట్ర సొంత పన్ను ఆదాయం రూ.1,09,789 కోట్లు వస్తుందని అంచనా వేయగా వాస్తవంగా వచ్చిన ఆదాయం రూ.89,435 కోట్లు మాత్రమే. రూ.20,354 కోట్ల మేర సొంత పన్ను ఆదాయంలో కోత పడింది. 2025–26లో రాష్ట్ర సొంత పన్ను ఆదాయం రూ.1,09,006 కోట్లు వస్తుందని బడ్జెట్‌ను ప్రవేశపెట్టగా సవరించిన అంచనాల్లో రూ.98,025 కోట్లుగా చూపించారు. అంటే రూ.10,981 కోట్ల మేర సొంత పన్ను ఆదాయంలో కోత పడుతుందని పేర్కొన్నారు. సొంత పన్ను ఆదాయం లక్ష్యాన్ని చేరుకోకపోవడంతో సవరణల్లో తగ్గించారు. 2026–27 బడ్జెట్‌లో రాష్ట్ర సొంత పన్ను ఆదాయం ఏకంగా రూ.1,25,845 కోట్లు వస్తుందని చూపారు. 2025–26 సవరించిన అంచనాలను మించి ఏకంగా రూ.27,820 కోట్లు రాబడి వస్తుందని పేర్కొనడం గమనార్హం.

కాగితాల్లోనే పేదల ఇళ్లు..

పేదల ఇళ్ల నిర్మాణం విషయంలో చంద్రబాబు సర్కారు గత రెండు బడ్జెట్లలో ఎంత మోసం చేసిందో చెప్పేందుకు సవరించిన అంచనాలే నిదర్శనం. పేదల ఇళ్ల నిర్మాణం కాగితాలకే పరిమితమైనట్లు సవరించిన బడ్జెట్ అంచనాల్లో తేలింది. 2024–25లో పేదల ఇళ్ల నిర్మాణాలకు బడ్జెట్‌లో రూ.4,012 కోట్లు కేటాయించి చివరకు కేవలం రూ.1,611 కోట్లు మాత్రమే వ్యయం చేసింది. ఇక 2025–26 బడ్జెట్‌లో పేదల ఇళ్ల నిర్మాణాలకు రూ.6,317 కోట్లను కేటాయించగా సవరించిన అంచనాల్లో వ్యయం కేవలం రూ.2,017 కోట్లుగా స్పష్టం చేసింది. వాస్తవానికి ఈ మేరకు కూడా వ్యయం చేయడం లేదు.

ఆదాయం అంచనాలు

రంగం	2025-26 బడ్జెట్ అంచనా (రూ.కోట్లలో)	సవరించిన అంచనా (రూ.కోట్లలో)	2026- 27 బడ్జెట్ అంచనా (రూ.కోట్లలో)
జీఎస్టీ	40,718.12	39,335.87	45,078.22
వ్యవసాయేతర స్థిరాస్తి పన్ను	264.20	119.10	310.00
ఎక్సైజ్	27,097.26	23,648.37	30,066.66
అమ్మకం పన్ను	20,873.64	18,006.98	24,125.67
స్టాంపులు, రిజిస్ట్రేషన్లు	13,150.44	11,024.60	18,701.35
వాహనాల పన్ను	5,664.11	4,678.59	6,017.61

ఆచరణ సాధ్యం కాని బడ్జెట్

- రెవెన్యూ ఆదాయం రూ.2.34 లక్షల కోట్లు రానేరాదు
- 2025–26లో వచ్చింది రూ.1.96 లక్షల కోట్లు కదా?
- అంతకుముందు ఏడాది రూ.1.67 లక్షల కోట్లే..
- బడ్జెట్‌లో చెప్పిన చాలా పథకాలు కాగితాలకే పరిమితం
- ఏపీ బడ్జెట్‌పై మాజీ సీఎస్ 'ఐవైఆర్' విశ్లేషణ



సాక్షి, అమరావతి: రాష్ట్ర ప్రభుత్వం చట్టసభల్లో ప్రవేశపెట్టిన 2026–27 ఆర్థిక సంవత్సరం బడ్జెట్‌పై మేధావులు పెదవివిరుస్తున్నారు. వాస్తవాలకు విరుద్ధంగా ఉన్న ఈ బడ్జెట్ వల్ల ఆకాంక్షలు తప్ప ఆచరణ సాధ్యం కాదని విశ్లేషిస్తున్నారు. ఆ కోవలోనే సీనియర్ ఐఏఎస్, ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి(సీఎస్) ఐవైఆర్ కృష్ణారావు రాష్ట్ర బడ్జెట్‌పై సామాజిక మాధ్యమాల ద్వారా స్పందించారు. బడ్జెట్‌లో రెవెన్యూ ఆదాయం రూ.2.34 లక్షల కోట్లు అని ప్రభుత్వం అంచనా వేసింది గానీ, ఆ మేరకు కచ్చితంగా ఆదాయం రాదని ఆయన స్పష్టంచేశారు. 2025–26లో వచ్చింది రూ.1.96 లక్షల కోట్లు అయితే, అంతకుముందు ఏడాది కూడా రూ.1.67 లక్షల కోట్లే వచ్చిందని ఆయన గుర్తుచేశారు. ఇప్పుడు ఎంత ఎక్కువ లెక్కేసుకున్నా రూ.2.15 లక్షల కోట్లకు మించదన్నారు. ఈ లెక్కన రూ.20 వేల కోట్లు ఇక్కడే తగ్గిపోతుంటే, దానిని కూడా ఆదాయంగా భావించి పథకాలు రూపొందించడం వల్ల వాటి అమలుపై ప్రభావం పడుతుందని ఆయన స్పష్టంచేశారు. ఇలా రాని ఆదాయాన్ని సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు వినియోగిస్తామని చెప్పడం వల్ల బడ్జెట్‌లో చెప్పిన చాలా పథకాలు కాగితాలకే పరిమితమయ్యే అవకాశం ఉందని ఐవైఆర్ వివరించారు.

మసిపూసి మారేడు..

రెవెన్యూ లోటు విషయంలోనూ రాష్ట్ర ప్రభుత్వం ఊహాజనితంగా మాట్లాడుతోందని ఐవైఆర్ అన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో గత డిసెంబర్ నాటికే రూ.60 వేల కోట్ల రెవెన్యూ లోటు వచ్చిందని తెలిపారు. అలాంటిది వచ్చే ఆర్థిక సంవత్సరం ఏడాది మొత్తానికి గాను రూ.41 వేల కోట్ల దగ్గర రెవెన్యూ లోటును నియంత్రిస్తామని ప్రభుత్వం ఎలా చెబుతోందని ఆయన ప్రశ్నించారు. ఈ లోటు ప్రభుత్వం చెబుతున్న దానికి రెట్టింపు అయ్యి రూ.80 వేల కోట్లకు చేరే అవకాశం ఉందన్నారు. రివైజ్డ్ ఎస్టిమేట్స్‌కు తగ్గట్టుగానే బడ్జెట్ ఉండాలని, లేదంటే బడ్జెట్‌కు ఉన్న విశ్వసనీయత తగ్గిపోతుందని ఆయన అభిప్రాయపడ్డారు. మూలధన వ్యయం 2024–25లో రూ.16 వేల కోట్లు ఉంటే, 2025–26లో బడ్జెట్‌లో రూ.40 వేల కోట్లుగా చూపించి, సవరించిన పద్దుల్లో రూ.33 వేల కోట్లు ఉంటుందని చెప్పారన్నారు. అంచనాలకే బడ్జెట్ పరిమితమయ్యే అవకాశం ఉందా... ఆచరణ సాధ్యం కాదా... అంటే సాధ్యం కాదనే అనిపిస్తోందని ఐవైఆర్ తన విశ్లేషణలో స్పష్టంచేశారు. అప్పులు తీర్చడానికి బడ్జెట్‌లో ఎంత పోతుంది? పెండింగ్ బిల్లులకు ఎంత వెళుతుందనేది చెప్పాలి. ఈ బడ్జెట్‌ను చూస్తే మసిపూసి మారేడు చేసినట్లుగా ఉందని ఐవైఆర్ కృష్ణారావు అభిప్రాయపడ్డారు.

క్లుప్తంగా...

సంత్ సేవాలాల్ మహారాజ్‌కు వైఎస్ జగన్ నివాళి

సాక్షి, అమరావతి: బంజారా ప్రజల సంక్షేమం కోసం తన జీవితాన్ని అంకితం చేసిన మహోన్నతుడు సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ అని మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కొనియాడారు. 'సమాజ సేవే ఉన్నతమైన ధర్మమని చాటి చెప్పిన ఆ మహనీయుడి ఆశయాలు నేటి తరానికి ఆదర్శనీయం. సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ జయంతి సందర్భంగా నివాళులు' అంటూ వైఎస్ జగన్ ఆదివారం 'ఎక్స్'లో పోస్టు చేశారు.

రూ.14.70 లక్షల రేషన్‌బియ్యం పట్టివేత

స్వాధీనం చేసుకున్న బియ్యం లారీతో విజిలెన్స్, పౌరసరఫరాల శాఖ అధికారులు

మనుబోలు: శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా మనుబోలు మండలంలోని కాగితాలపూరు క్రాస్ రోడ్డులో జాతీయ రహదారిపై లారీలో అక్రమంగా తరలిస్తున్న 35 టన్నుల రేషన్ బియ్యాన్ని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఆదివారం పట్టుకున్నారు. ఎస్పీ ఆదేశాల మేరకు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏఎస్ఐ లక్ష్మీనారాయణ హైవేపై తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో ప్రకాశం జిల్లా దర్శి నుంచి చెన్నైకు బియ్యం లోడుతో వెళుతున్న లారీని పెట్రోల్ బంకు వద్ద ఆపి తనిఖీ చేయగా 700 బస్తాల (35 టన్నులు) రేషన్ బియ్యం పట్టుబడ్డాయి. వీటి విలువ రూ.14.70 లక్షలు ఉంటుందని అధికారులు తెలిపారు. అనంతరం లారీ డ్రైవర్, క్లీనర్‌తో పాటు అక్రమంగా బియ్యం తరలిస్తున్న మధ్యవర్తులను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. లారీని పౌర సరఫరాల శాఖ అధికారులకు అప్పగించారు. ఈ కార్యక్రమంలో సీఎస్‌డీటీ రవికుమార్, వీఆర్వో గుణశేఖర్, హెడ్ కానిస్టేబుల్ మధుసూదన్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో బైక్ రైడర్ దుర్మరణం

నల్లగొండ జిల్లా పెద్దకాపర్తి శివారులో ఘటన

చిట్యాల: హైదరాబాద్–విజయవాడ జాతీయ రహదారిపై నల్లగొండ జిల్లా చిట్యాల మండలం పెద్దకాపర్తి గ్రామ శివారులో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ బైక్ రైడర్ దుర్మరణం చెందాడు. చిట్యాల ఎస్ఐ మామిడి రవికుమార్ కథనం ప్రకారం.. హైదరాబాద్‌కు చెందిన చదురుప్పల రితీశ్‌రెడ్డి(40) ఏపీలోని పల్నాడు జిల్లా బాపట్లలోని హార్లీ డేవిడ్‌సన్ మోటార్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈవెంట్‌కు హైదరాబాద్ నుంచి 32 మంది బైక్ రైడర్స్‌తో కలిసి రెండు రోజుల క్రితం వెళ్లాడు. ఆదివారం అందరూ కలిసి తిరిగి హైదరాబాద్‌కు వెళ్తుండగా.. మధ్యాహ్నం పెద్దకాపర్తి గ్రామ శివారులోకి రాగానే గుర్తుతెలియని వాహనం రితీశ్‌రెడ్డి బైక్‌ను ఢీకొట్టింది. దీంతో బైక్ అదుపుతప్పి హైవే పక్కన ఉన్న చెట్ల పొదల్లోకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో రితీశ్‌రెడ్డికి తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని నల్లగొండలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి సోదరుడు రోహిత్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

హెల్మెట్ ధరించినా..

ప్రమాదం జరిగిన సమయంలో మృతుడు రితీశ్‌రెడ్డి అత్యంత భద్రత సదుపాయాలు కలిగిన రూ.25 లక్షల విలువైన బీఎండబ్ల్యూ బైక్‌ను నడుపుతున్నాడు. అతడు హెల్మెట్ ధరించినప్పటికీ అతివేగం కారణంగా ప్రాణాలు కోల్పోయినట్లు తెలుస్తోంది.

హెరిటేజ్ డెయిరీలను తక్షణమే సీజ్ చేయాలి

జనజాగరణ సమితి రాష్ట్ర కన్వీనర్ వాసు డిమాండ్

వాసు

ఎంవీపీ కాలనీ (విశాఖ జిల్లా): ముఖ్యమంత్రి చంద్రబాబు కుటుంబానికి చెందిన హెరిటేజ్, హెరిటేజ్ అనుబంధ సంస్థలను కేంద్ర ప్రభుత్వం తక్షణమే సీజ్ చేయాలని జగజాగరణ సమితి డిమాండ్ చేసింది. ఈ మేరకు సమితి రాష్ట్ర కన్వీనర్ ఎస్ఎల్ఎన్ వాసు ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. హెరిటేజ్ సంస్థ నాసిరకం ఉత్పత్తుల తయారీతో ప్రజల ఆరోగ్యానికి నష్టం కలిగిస్తోందని పేర్కొన్నారు. తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం తయారీలో కల్తీ నెయ్యి సరఫరా చేసిన ఆయన కుటుంబ సంస్థ కోట్లాది మంది హిందువుల మనోభావాలను దెబ్బతీసిందని ఆరోపించారు. హెరిటేజ్, హెరిటేజ్ అనుబంధ భాగస్వామ్య సంస్థలు ఉత్పత్తి చేస్తున్న పాలలో కనీస నాణ్యత లేదంటూ కొన్ని రాష్ట్రాలు ఇటీవల ప్రకటించడం ఆ సంస్థ దిగజారుడుతనానికి నిదర్శనమన్నారు. హెరిటేజ్ పాల నాణ్యతపై కేంద్ర ప్రభుత్వం నుంచి స్పష్టమైన ప్రకటన వచ్చే వరకు దేశ ప్రజలు ఎవరూ హెరిటేజ్ పాలు వాడొద్దని సూచించారు. కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డా తక్షణమే స్పందించి దేశవ్యాప్తంగా ఉన్న హెరిటేజ్, దాని అనుబంధ, భాగస్వామ్య సంస్థలపై ఆకస్మిక దాడులు నిర్వహించాలని కోరారు. ప్రజల ఆరోగ్యంతో చెలగాటం ఆడుతున్న ఆ సంస్థ డెయిరీలను సీజ్ చేయాలని డిమాండ్ చేశారు.

కమీషన్ ఇవ్వకపోతే.. మీ బియ్యం ఉడకవ్!

ఇబ్బందులు పడతారంటూ రైస్ మిల్లర్లకు బెదిరింపులు

చంద్రబాబు కూటమి ప్రభుత్వంలో ఎక్కడికక్కడ యథేచ్ఛగా దోపిడీ కొనసాగుతోంది.. ల్యాండ్, శాండ్, వైన్, మైన్ అంటూ అంతటా బలవంతపు వాటాలు, వసూళ్లు రాజ్యమేలుతున్నాయి.. ఇది చాలదన్నట్లు ఫ్యాక్టరీలు, కంపెనీల నుంచి మామూళ్ల వసూలూ జోరుగా సాగుతోంది.. ఈ క్రమంలో ఇద్దరు అమాత్యులు రైస్ మిల్లర్లను కూడా వదలక పోవడం విస్తుగొలుపుతోంది.. ధాన్యాన్ని ఆడించి క్వింటా బియ్యం ఇవ్వడానికి ప్రభుత్వం వారికి ఇస్తున్నది కేవలం రూ.10 మాత్రమే అయితే, అందుకు ప్రతిగా క్వింటాకు ఏకంగా రూ.16 బలవంతంగా వసూలు చేస్తుండటం పట్ల మిల్లర్లు ఇది అన్యాయం అంటూ గగ్గోలు పెడుతున్నారు.. అలాగైతే నూక, తవుడు మాటేంటని ఒక మంత్రి తరఫున మరో కీలక మంత్రి వ్యాపార వియ్యంకుడు దబాయిస్తూ కలెక్షన్లు వసూలు చేయడంలో బిజీగా ఉన్నారు.. కాదు కూడదంటే బిల్లులు రావంటూ తెగేసి చెబుతున్నారు.. ఇంకేముంది.. మిల్లర్లు లబోదిబో.. కమీషన్లు ఇవ్వక తప్పడం లేదు.



సాక్షి టాస్క్‌ఫోర్స్ : రైస్ మిల్లర్లకు ఊహించని రీతిలో కష్టం వచ్చి పడింది. తప్పించుకోవడానికి వీల్లేకుండా ప్రభుత్వంలో కీలక మంత్రులు ఇద్దరు ఫిక్స్ చేసేశారు. చెప్పినట్లు చేయాల్సిందేనని, లేదంటే తిప్పలు తప్పవని మధ్యవర్తి ద్వారా హుకుం జారీ చేశారు. ఏదైనా కిరికిరి చేస్తే నష్టపోయేది మీరేనంటూ హెచ్చరించారు. ఈ క్రమంలో ఏం చేయాలో తోచక వారు అడిగింది అడిగినట్లు ముట్టజెప్పుతున్నారు. సీజనల్‌గా రైతుల నుంచి సేకరించే ధాన్యాన్ని ప్రభుత్వం రైస్ మిల్లులకు పంపి (సీఎంఆర్–కస్టమ్ మిల్లెడ్ రైస్), బియ్యంగా మార్చి తీసుకుని.. పౌర సరఫరాల శాఖ ద్వారా పేదలకు పంపిణీ చేస్తుంది. ఈ క్రమంలో రైస్ మిల్లర్లు క్వింటాకు రూ.16 చొప్పున మామూళ్లు ఇచ్చేలా రేట్ ఫిక్స్ చేసింది. గతేడాది బిల్లులు మంజూరు కోసం ముడుపులు మెక్కిన అమాత్యుడు ఈసారి మరో అడుగు ముందుకేసి సీఎంఆర్ అనుమతి పొందిన మిల్లర్లపై పడి కోట్లు దండుకోవడానికి బరితెగించారు. కేబినెట్‌లో మరో కీలక మంత్రి కూడా ఇతనితో జత కలిశారు. ఇద్దరూ కూడబలుక్కుని.. కీలక మంత్రి వియ్యంకుడి ద్వారా ఈ మొత్తం వ్యవహారాన్ని గుట్టుచప్పుడు కాకుండా చక్కబెడుతున్నారు. ఈ దందాకు సంబంధించిన వివరాల్లోకి వెళితే..

2,280 మిల్లులపై ఒత్తిడి

ప్రభుత్వం సీఎంఆర్ ద్వారా 51 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం (సీఎంఆర్) సేకరించాలనే లక్ష్యం పెట్టుకుంది. అయితే కోట్ల రూపాయల కమీషన్ దండుకోవాలనే లక్ష్యంతో పాలక పెద్దలు గత సీజన్ కంటే ఈసారి 16 లక్షల మెట్రిక్ టన్నులు అదనపు లక్ష్యాన్ని నిర్దేశించారని సమాచారం. ప్రతి ఏటా సీఎంఆర్ లక్ష్యం అధిగమించిన మిల్లర్లకు తర్వాతి ఏడాది ప్రాధాన్యతనిస్తూ కోటా పెంచుతుంటారు. ఈ కేటాయింపు ప్రక్రియ ఏ జిల్లాకు ఆ జిల్లా రైస్ మిల్లర్ల అసోసియేషన్ చేపడుతుంటుంది. మిల్లింగ్ చేసే ధాన్యం పరిమాణాన్ని బట్టి బ్యాంక్ గ్యారెంటీ ఇస్తారు. అనంతరం మిల్లర్లకు ధాన్యం కేటాయిస్తారు. ఇలా సీఎంఆర్ ద్వారా సేకరించిన బియ్యాన్ని ప్రభుత్వం ప్రజా పంపిణీకి కేటాయిస్తుంది. ఈ మేరకు ఏటా రాష్ట్ర ప్రభుత్వానికి, మిల్లర్ల మధ్య మూడు నెలల కాలానికి ఒప్పందం జరుగుతుంది. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న సుమారు 2,280 మిల్లుల్లో దాదాపు చిన్న తరహా మిల్లులన్నీ మూడు నెలలపాటు సీఎంఆర్‌పైనే నడుస్తున్నాయి. మిగిలిన తొమ్మిది నెలలు దాదాపు ఖాళీగానే ఉంటాయి.

అదనపు ఆదాయం వస్తుందనుకుంటే..

గతేడాది కంటే ఈ ఏడాది 16 లక్షల మెట్రిక్ టన్నులు అదనంగా ప్రభుత్వం సేకరించేందుకు లక్ష్యాలు నిర్దేశించడంతో మిల్లర్లు అదనపు ఆదాయం వస్తుందని ఆశపడ్డారు. సీఎంఆర్ అదనపు కోటాతో ఈ ఏడాది అదనంగా పని దొరుకుతుందని పడ్డ సంబరం కాస్తా ఒక మంత్రి దోపిడీ ప్లాన్‌తో తల్లకిందులైంది. సీఎంఆర్‌కు అనుమతి పొందిన మిల్లర్లు మంత్రికి ముడుపులు మూటగట్టి ఇవ్వాలని అసోసియేషన్‌ల ద్వారా ఆదేశాలు రావడంతో వారంతా లబోదిబోమంటున్నారు. సీఎంఆర్ ద్వారా మిల్లింగ్ చేసే ప్రతి క్వింటా బియ్యానికి రూ.16 వంతున కమీషన్‌ను ముక్కు పిండి మరీ వసూలు చేస్తున్నారు. కస్టమ్ మిల్లింగ్ ద్వారా సేకరిస్తోన్న 51 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యంపై రూ.80 కోట్లు ముడుపులు (కొందరికి మినహాయింపు ఇవ్వడం వల్ల.. లేదంటే మరింత పెరుగుతుంది) ముట్టచెప్పేందుకు వసూళ్ల పర్వానికి తెరతీశారు. ఇప్పటికే 60–70 శాతం మిల్లుల నుంచి వసూలు చేసేశారని విశ్వసనీయ వర్గాల సమాచారం. మిగిలిన వారు ఈ నెలాఖరు లోపు చెల్లించాలంటూ ఆయా జిల్లాల్లో అసోసియేషన్‌ల నుంచి తీవ్రమైన ఒత్తిళ్లు వచ్చాయని మిల్లర్లు గగ్గోలు పెడుతున్నారు.

మంత్రి వియ్యంకుడా.. మజాకా!

- రాష్ట్ర వ్యాప్తంగా సీఎంఆర్ అనుమతించిన మిల్లుల నుంచి ముడుపులు మెక్కడానికి స్కెచ్ వేసిన అమాత్యుడు.. తన దందా సవ్యంగా సాగేందుకు సహచర కీలక మంత్రిని కలుపుకున్నారు. ఈ కీలక మంత్రి వియ్యంకుడిది బియ్యం వ్యాపారంలో అందె వేసిన చెయ్యి. దేశ, విదేశాలకు బియ్యం ఎగుమతుల్లో అపార అనుభవం గడించారు. సొంతంగా మిల్లులు కూడా ఉన్నాయి. ఇతన్ని అడ్డుగా పెట్టుకుని కమీషన్ల దందా నడుపుతున్నారు.
- ఈ క్రమంలో సదరు మంత్రి వియ్యంకుడి మిల్లుతో పాటు అతని సహచరుడైన మరో బడా ఎక్స్‌పోర్టర్ మిల్లులకు కమీషన్‌లో మినహాయింపు ఇవ్వడం అసోసియేషన్‌లో చర్చనీయాంశంగా మారింది. మంత్రి వియ్యంకుడైన గోదావరి జిల్లాలకు చెందిన బడా ఎక్స్‌పోర్టర్‌కు, మరో బడా ఎక్స్‌పోర్టర్ తోడై కమీషన్ల బాగోతాన్ని చక్కబెడుతున్నారు. ఇందుకు కమీషన్‌లో మినహాయింపుతో పాటు తొలిసారి సీఎంఆర్ కోటా దక్కించుకున్నారు.
- వాస్తవానికి మిల్లర్లకు జిల్లా స్థాయిలోనే మిల్లర్ల అసోసియేషన్ సీఎంఆర్ కోటా కేటాయిస్తుంటుంది. అటువంటిది అసోసియేషన్ ప్రమేయం లేకుండానే ఈ రెండు బడా రైస్ ఎక్స్‌పోర్ట్ కంపెనీలు నేరుగా ఉన్నత స్థాయిలో తమ పలుకుబడి ఉపయోగించి సీఎంఆర్ అనుమతి తెచ్చుకున్నాయి. ప్రకృతి వైపరీత్యాలప్పుడు నష్టపోయిన రైతుల నుంచి బస్తా ధాన్యం కొనుగోలు చేసిన చరిత్ర లేని ఈ కంపెనీలకు ప్రభుత్వం పెద్ద పీట వేయడం చర్చనీయాంశమైంది.
- సీఎంఆర్‌కు ఏ జిల్లాలో పండించిన ధాన్యాన్ని ఆ జిల్లాలోనే అనుమతిస్తారు. కానీ మంత్రి వియ్యంకుడు కావడంతో నిబంధనలన్నింటినీ తుంగలో తొక్కి పొరుగున కృష్ణా జిల్లా నుంచి ప్రత్యేక అనుమతి ఇచ్చారని సమాచారం. మంత్రి వియ్యంకుడికి 65 వేల టన్నులు, మరో బడా రైస్ ఎక్స్‌పోర్టర్‌కు 25 వేల టన్నులు సీఎంఆర్‌కు అనుమతించారు. ఇది ఆ జిల్లా మొత్తం సీఎంఆర్‌లో మూడింట (మూడు లక్షల టన్నులు) ఒక వంతు కావడం గమనార్హం.

సారూ.. 'సీజ్ ద కమీషన్స్' అనండి

ఏడాది క్రితం పేదల బియ్యం ఆఫ్రికా దేశాలకు తరలిపోతున్నాయని 'సీజ్ ద షిప్' అంటూ హడావిడి చేసిన ఉప ముఖ్యమంత్రి ఇప్పుడేం చేస్తున్నారని ఈ సందర్భంగా మిల్లర్లు ప్రశ్నిస్తున్నారు. ప్రజా పంపిణీ కోసం సేకరిస్తోన్న సీఎంఆర్‌లో ఇంతలా బరితెగించి కమీషన్లు వసూలు చేస్తుండటం మీ దృష్టికి రాలేదా అని నిలదీస్తున్నారు. ఈ విషయమై ఆయన స్పందించకపోతే, ఈ దందాలో ఆయనకూ వాటా ఉన్నట్లేనని భావించాల్సి వస్తుందని వ్యాఖ్యానిస్తున్నారు. చిత్తశుద్ధి ఉంటే 'సీజ్ ద కమీషన్స్' అంటూ ఈ కమీషన్లకు బ్రేక్ వేయాలని కోరుతున్నారు.

సీజన్ మొదట్లోనే స్కెచ్.. ఇప్పుడు అమలు

- సీఎంఆర్ విధానంలో అమాత్యునికి కమీషన్ విషయమై సీజన్ ప్రారంభంలోనే రాష్ట్ర అసోసియేషన్ సమావేశంలో చర్చించారు. నాటి సమావేశంలో పలువురు ప్రతినిధులు దీన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. దీంతో ఈ విషయమై మిల్లర్లు రోడ్డెక్కితే అల్లరై బియ్యం సేకరణకు ఆదిలోనే ప్రతిబంధకం ఎదురవుతుందని అప్పట్లో మిన్నకుండిపోయారు.
- సీఎంఆర్ కేటాయింపు ప్రకారం 51 లక్షల మెట్రిక్ టన్నుల లక్ష్యంలో ఇప్పటికే 48 లక్షల మెట్రిక్ టన్నుల సేకరణ పూర్తి అయింది. ఈ నేపథ్యంలో కమీషన్ వసూలుకు ఇదే తరుణమని స్కెచ్ వేశారు. క్వింటాల్‌కు రూ.16 వంతున కమీషన్ చెల్లించాల్సిందేనంటూ అసోసియేషన్ ద్వారా మిల్లర్లపై ఒత్తిడి తీసుకువస్తున్నారు.
- సీఎంఆర్ చివర్లో ఉన్న తరుణంలో అడిగినంత కమీషన్ ఇచ్చుకోక తప్పని పరిస్థితుల్లో మిల్లర్లు వెనక్కు పోయేది ఉండదు. అదే ధైర్యంతో గత పక్షం రోజులుగా కమీషన్ల వసూళ్ల దందాను మరింత ముమ్మరం చేశారు. కమీషన్ ఇవ్వకుంటే సీఎంఆర్ బిల్లుల్లో కోతలు తప్పవని పరోక్షంగా హెచ్చరిస్తున్నారు. క్వింటాకు ప్రభుత్వం ఇచ్చేది రూ.10. సంచులు, నూకలు, తౌడు వంటి వాటిపై కొంత ఆదాయం వచ్చే మాట నిజమైనా, ఏకంగా రూ.16 కమీషన్ చెల్లించాలనడం భావ్యం కాదని మిల్లర్లు వాపోతున్నారు. ఇంత కమీషన్ ఎక్కడి నుంచి తెచ్చి ఇవ్వాలని ప్రశ్నిస్తున్నారు. ఏడాదిలో తొమ్మిది నెలలు మూతేసుకుని కూర్చుంటున్న మిల్లులకు సీఎంఆర్‌తో మూడు నెలలు పని దొరుకుతుందనుకుంటుంటే మెడపై కత్తిపెట్టి కమీషన్ వసూలు చేయడం దారుణం అని, ఇదేం మంచి ప్రభుత్వం? అని మిల్లర్లు నిలదీస్తున్నారు.
- కమీషన్ ఇచ్చుకోలేమని ఎదురు తిరుగుతున్న మిల్లర్లకు సీఎంఆర్ బిల్లులు ఎలా మంజూరు అవుతాయో చూస్తామంటూ బెదిరింపులకు దిగుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఏ ప్రభుత్వంలోనూ ఇలా మంత్రుల కోసం కమీషన్లు వసూలు చేసిన దాఖలాలు లేవని చెబుతున్నారు. కాగా, ఇప్పటికే 90 శాతం వసూళ్లు పూర్తయ్యాయని సమాచారం. ప్రభుత్వ ముఖ్య నేతలకు బాగా తెలిసిన వారికి కమీషన్‌లో కొంత మినహాయింపు ఇచ్చినట్లు తెలిసింది.

రాష్ట్రాభివృద్ధిని దెబ్బతీసేలా బడ్జెట్: సీపీఎం

ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): చంద్రబాబు ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ రాష్ట్రాభివృద్ధిని దెబ్బతీసేలా ఉందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ధ్వజమెత్తారు. ఇది కేవలం కార్పొరేట్లకు ఊడిగం చేసే బడ్జెట్ అని పేర్కొన్నారు. శనివారం ప్రవేశపెట్టిన బడ్జెట్‌ను నిరసిస్తూ సీపీఎం ఆధ్వర్యంలో ఆదివారం విజయవాడ బీసెంట్ రోడ్డులో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ అంకెల గారడీతో ప్రజలను చంద్రబాబు ప్రభుత్వం వంచించిందని మండిపడ్డారు. సంక్షేమం, వ్యవసాయం, చివరికి విద్యారంగానికి కూడా కోతలు విధించారని దుయ్యబట్టారు. కూటమి ప్రభుత్వ 20 నెలల పాలనలో అభివృద్ధి శూన్యమని విమర్శించారు. బడ్జెట్ పద్దులు సవరించకపోతే ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

అరకొర కేటాయింపులతో రాయితీలు ఎలా చెల్లిస్తారు?

దళిత్ ఇండస్ట్రియల్ అసోసియేషన్ అధ్యక్షుడు సుదర్శన్

సాక్షి, అమరావతి: రాష్ట్ర బడ్జెట్‌లోఅరకొర కేటాయింపులు చేసి పరిశ్రమలకు పారిశ్రామిక ప్రోత్సాహకాలు ఏ విధంగా చెల్లిస్తారని దళిత్ ఇండస్ట్రియల్ అసోసియేషన్ అధ్యక్షుడు సుదర్శన్ ప్రభుత్వాన్ని నిలదీశారు. అధికారంలోకి వచ్చిన వెంటనే బకాయిలు చెల్లిస్తామంటూ చంద్రబాబు ప్రచారం చేసి రెండేళ్లు దాటినా ఆ దిశగా కేటాయింపులు చేయలేదని ఆదివారం విమర్శించారు. బడ్జెట్‌లో పారిశ్రామిక రంగానికి రూ.3,161 కోట్లే కేటాయించారన్నారు. పరిశ్రమలకు రూ.15 వేల కోట్లు పారిశ్రామిక ప్రోత్సాహకాలు చెల్లించాల్సి ఉందన్నారు. ఇంత తక్కువ కేటాయింపులు ఎప్పుడూ చూడలేదన్నారు.

జగన్ పాలనలోనే గిరిజనులకు మేలు

వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాయలంలో సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలను నిర్వహిస్తున్న దృశ్యం

సాక్షి, అమరావతి : గిరిజనులకు ఆర్థికంగా, రాజకీయంగా వైఎస్ జగన్ పాలనలోనే మేలు జరిగిందని, ఆయన మళ్లీ సీఎం అయితేనే మరింత అభివృద్ధి జరుగుతుందని పలువురు గిరిజన నాయకులు చెప్పారు. గత ఐదేళ్ల పాలనలో గిరిజినులకు వైఎస్ జగన్ అండగా నిలబడినందుకు వారు కృతజ్ఞత తెలిపారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో పార్టీ రాష్ట్ర గిరిజన విభాగం ఆధ్వర్యంలో శ్రీశ్రీశ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ 287వ జయంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. సంత్ సేవాలాల్ మహరాజ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం.. రాష్ట్ర ట్రైకార్ మాజీ చైర్మన్ గుండా సురేంద్ర మాట్లాడుతూ.. సంచార జాతులుగా ఉండే బంజారాలకు ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చిన ఘనత శ్రీశ్రీశ్రీ సంత్ సేవాలాల్ మహరాజ్‌కే దక్కుతుందన్నారు. పార్టీ ఎస్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు కాండ్లవత్ శ్రీనివాసుల నాయక్, దుర్గారావు మాట్లాడుతూ.. మైదాన ప్రాంత గిరిజనులకు రాజకీయ ప్రాధాన్యం కల్పించాలని కోరారు. సీఎం చంద్రబాబు గిరిజనలను పూర్తి విస్మరించారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడు ఎ.నారాయణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్సీ ఐలాపురం వెంకయ్య కన్నుమూత

- వయోభారం, అనారోగ్య సమస్యలతో తుదిశ్వాస
- నేడు అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబసభ్యులు వెల్లడి

మాజీ ఎమ్మెల్సీ ఐలాపురం వెంకయ్య

గాంధీనగర్(విజయవాడ సెంట్రల్): మాజీ ఎమ్మెల్సీ, బీసీ ఉద్యమ నేత ఐలాపురం వెంకయ్య(97) కన్నుమూశారు. వయోభారం, అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఆయన ఆదివారం ఉదయం విజయవాడలోని తన నివాసంలో తుదిశ్వాస విడిచారు. నిరుపేద కుటుంబంలో జన్మించిన వెంకయ్య కష్టపడి ఎదిగి.. విజయవాడలో 'ఐలాపురం' పేరుతో హోటల్ స్థాపించారు. కాంగ్రెస్ పార్టీలో సుదీర్ఘకాలం పనిచేశారు. 2009లో ఉమ్మడి కృష్ణా జిల్లా స్థానిక సంస్థల నుంచి ఎమ్మెల్సీగా ఎన్నికయ్యారు. బీసీల అభ్యున్నతికి నిరంతరం కృషి చేశారు. బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఏర్పాటుకు సహకరించారు. శాలివాహన(కుమ్మర) సంఘం అధ్యక్షుడిగా దశాబ్దాల పాటు సేవలందించారు. అలాగే విద్యాసంస్థలకు విరాళాలు, విద్యార్థులకు ప్రోత్సాహకాలు, తాగునీటి సరఫరా, ఆలయ నిర్మాణాలు, అన్నదాన సత్రాల ఏర్పాటు వంటి అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు దేవినేని అవినాష్, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, సీపీఐ జాతీయ నాయకులు నారాయణ, కె.రామకృష్ణ, రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య, వివిధ పార్టీలు, ప్రజా సంఘాల నాయకులు ఐలాపురం వెంకయ్య నివాసానికి చేరుకొని.. భౌతికకాయానికి నివాళులర్పించారు. కాగా, ఆయన అంత్యక్రియలు సోమవారం నిర్వహించనున్నట్లు వెంకయ్య కుమారుడు, ఆర్టీఐ మాజీ కమిషనర్ ఐలాపురం రాజా తెలిపారు.

వైఎస్ జగన్ సంతాపం

సాక్షి, అమరావతి: మాజీ ఎమ్మెల్సీ, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు ఐలాపురం వెంకయ్య మృతి పట్ల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంతాపం వ్యక్తం చేశారు. 'ఐలాపురం వెంకయ్య ప్రజలకు, సమాజానికి అందించిన సేవలు చిరస్మరణీయం. ఆయన మరణం కుటుంబసభ్యులకే కాకుండా సమాజానికి కూడా తీరని లోటు. ఈ దుఃఖ సమయంలో వెంకయ్య కుటుంబసభ్యులకు, బంధుమిత్రులకు నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నా. వారి ఆత్మకు శాంతి చేకూరాలని దేవుడిని ప్రార్థిస్తున్నా' అని వైఎస్ జగన్ పేర్కొన్నారు.

మిలాన్-2026 విన్యాసాలు ప్రారంభం

మిలాన్ విలేజ్‌ను ప్రారంభిస్తున్న సంజయ్ భల్లా

సాక్షి, విశాఖపట్నం: విశాఖలోని తూర్పు నౌకాదళం ప్రధాన కేంద్రంలో మిలాన్–2026 విన్యాసాల్ని ఆదివారం సాయంత్రం ఈఎన్‌సీ చీఫ్ వైస్ అడ్మిరల్ సంజయ్ భల్లా లాంఛనంగా ప్రారంభించారు. ప్రధాన కేంద్రం సమీపంలోని విపత్తు నిర్వహణ కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన మిలాన్ విలేజ్‌ని ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడుతూ..ఈ నెల 18న విశాఖ రాష్ట్రపతి ద్రౌపది ముర్ము విశాఖకు వస్తారని చెప్పారు. దేశ రక్షణ రంగ శక్తిసామర్థ్యాలను చాటిచెప్పేలా ఈసారి 'ఇంటర్నేషనల్ ఫ్లీట్ రివ్యూ–2026' ఘనంగా నిర్వహిస్తున్నామన్నారు. ఈ భారీ ప్రదర్శనలో మొత్తం 71 నౌకలు భాగస్వామ్యం అవుతున్నాయని తెలిపారు. స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన ఐఎన్ఎస్ విక్రాంత్ సహా ఇప్పటికే 17 యుద్ధ నౌకలు విశాఖ తీరానికి చేరుకున్నట్టు తెలిపారు. యుద్ధనౌకలే కాకుండా, గగనతలంలో విన్యాసాలు చేసేందుకు 50 ఎయిర్ క్రాఫ్టులు కూడా సిద్ధంగా ఉన్నాయన్నారు.

విద్యారంగం ప్రైవేట్‌కు ధారాదత్తం

పేరెంట్స్ అసోసియేషన్ ఆందోళన

సాక్షి, అమరావతి: రాష్ట్ర ప్రభుత్వ బడ్జెట్ కేటాయింపుల్ని చూస్తే ప్రభుత్వ విద్యారంగాన్ని ప్రైవేట్ శక్తులకు ధారాదత్తం చేస్తున్నారా అనే అనుమానం కలుగుతోందని ఆంధ్రప్రదేశ్ పేరెంట్స్ అసోసియేషన్ ఆందోళన వ్యక్తం చేసింది. ఈ మేరకు అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు మలిరెడ్డి కోటారెడ్డి, అధ్యక్షుడు నరహరి శిఖరం, ప్రధాన కార్యదర్శి జి.ఈశ్వరయ్య తదితరులు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. పాఠశాలల మౌలిక సదుపాయాల అభివృద్ధికి కేవలం రూ.1,500 కోట్లు మాత్రమే కేటాయించడం ద్వారా కనీస సౌకర్యాలు లేని ప్రభుత్వ బడుల్లో నాణ్యమైన విద్య ఎలా అందిస్తారని ప్రశ్నించారు. తల్లికి వందనం, విదేశీ విద్య వంటి పథకాల అమలులో ప్రభుత్వానికి చిత్తశుద్ధి లోపించిందని ఆవేదన వ్యక్తం చేశారు.

మనిషి ప్రకృతికి అతీతుడు కాదు... ప్రకృతిలో ఒక భాగం.
- ఎర్నెస్ట్ హెకెల్

సాక్షి
సోమవారం, 16 ఫిబ్రవరి 2026

గజేంద్ర 'మోక్షం'

'ఎవ్వనిచే జనించు, జగమెవ్వని లోపలనుండు లీనమై' అనే పోతన గారి పద్యం సుప్రసిద్ధం. ఇప్పటి సంగతేమో కానీ, ఇటీవలి వరకూ ఈ పద్యం విననివారు ఉండరు. దాని వెనక కథేమిటంటే, ఓ ఏనుగు మడుగులోకి దిగింది. ఓ మొసలి దాని కాలు పట్టుకుంది. విడిపించుకోడానికి ఏనుగు హోరాహోరీ పోరాడింది. ఆ పోరాటం ఏళ్ళ తరబడి సాగింది. ప్రాణం కడతేరే దశలో ఏనుగు ఈశ్వరునికి మొర పెట్టుకుంది. ఆ క్రమంలో ఏకంగా విశ్వమూలాల్లోకి వెళ్ళిపోయింది; ఈ జగత్తు ఎవరివల్ల పుట్టిందో, ఎవరిలో ఉంటుందో, ఎవరిలో లయమైపోతుందో, పరమేశ్వరుడెవరో, అనాది మధ్య లయుడెవరో, అంతా తనే అయినవాడెవరో– అతని నుంచి పుట్టిన ఈశ్వరుని శరణువేడుకుంటున్నానంటుంది. అప్పుడు ఈశ్వరుడు వచ్చి మొసలిని చంపి ఏనుగును రక్షిస్తాడు!

ఈ క్షణాన ఛత్తీస్‌గఢ్ అడవుల్లో ఏనుగులు ఇలాగే మొరపెట్టుకుంటున్నాయి; ఈసారి అక్కడి అటవీ గ్రామాల వాళ్ళు కూడా ఆ మొరలో గొంతు కలుపుతున్నారు. మనుషులకీ, ఏనుగులకీ మధ్య అక్కడ పతాక స్థాయిలో జీవన సమరం జరుగుతోంది. ఉభయులనూ రక్షించగల ఈశ్వరుడే కనుచూపు మేరలో కానరావడం లేదు. గత పన్నెండేళ్ళలోనే 68 ఏనుగులతోపాటు, 698 మంది మనుషులు మరణించారు. కొద్దిరోజుల క్రితమే ఓ 70 ఏళ్ళ వృద్ధుని ఏనుగులు తొక్కి చంపేశాయి. భారత వన్యప్రాణి సంస్థవారూ, జంతు సంక్షేమ సంఘంవారూ రంగంలోకి దిగి చేస్తున్న రోదనలు అక్షరాలా అరణ్యరోదనే అయినట్టు కనిపిస్తున్నాయి.

మరీ క్రూర జంతువులను మినహాయిస్తే, ఏనుగులు సహా వన్యప్రాణులతో మనిషి సహజీవనం చేయని దశ చరిత్రలో కనిపించదు. ఇప్పుడు సహజీవనం చేయలేని దశకు చేరుకున్నాడు. అందుకు తనే బాధ్యుడు తప్ప వన్యప్రాణులు కావు. ఈ భూమండలం మీద జీవించే హక్కు అన్ని ప్రాణులకూ ఉన్న సంగతి మరచిపోయి తన సర్వం సహాధిపత్యాన్ని స్థాపించుకోడానికి పూనుకున్నాడు. అభివృద్ధి పేరిట విచ్చలవిడిగా అడవుల్ని నరికేసి జనావాసాలను సృష్టిస్తున్నాడు, గనులు తవ్వేస్తున్నాడు, అడవుల్లో ఎక్కడబడితే అక్కడ విద్యుత్తంత్రులను వేలాడదీస్తున్నాడు. దాంతో వన్యప్రాణులకు సంచార భూమి కుదించుకుపోయి ఊళ్ళమీద పడుతున్నాయి. ఇటీవలి వరకూ ఛత్తీస్‌గఢ్ అడవుల్లో ఏనుగుల సంఖ్య నామమాత్రం. ఇప్పుడు మూడు వంతుల మేరకు, అంటే దాదాపు 400కు వాటి సంఖ్య పెరిగిపోయింది. అభివృద్ధి పేరిట జరుగుతున్న తవ్వకాల వల్ల అలవాటుపడిన దారులు మరచిపోయి అవి జనావాసాల్లోకి వచ్చిపడుతున్నాయి. 90 శాతం ఏనుగుల మరణానికి విద్యుదాఘాతాలే కారణమంటున్నారు. ఆ పైన గోతులు, బురద నేలలు వాటి ప్రాణాలు హరిస్తున్నాయి.

అడవి జంతువులను మచ్చిక చేసుకుని వాడుకోవడంలో ఎంతో తెలివి కనబరచిన మనిషి, చివరికి వాటితోనే పోరాడి ప్రాణాల మీదికి తెచ్చుకునే తెలివి హీనతకు దిగజారడం ఆశ్చర్యం కలిగిస్తుంది. స్వార్థం వికటించి ప్రకృతి విధించిన అన్ని రకాల హద్దులనూ, సహజీవన ధర్మాన్నీ ఉల్లంఘించడమే అందుకు కారణం. పురాణ, ఇతిహాస కాలంతో మొదలుపెట్టి, చరిత్ర కాలం వరకూ మనిషికీ, ఏనుగుకీ ఉన్న అనుబంధం అనేక రూపాల్లో అక్షరబద్ధమైంది. ఏనుగు ముఖంతో ఉన్న గణపతిని కొలవడం సరేసరి; 'ఏనుగు మీద రాముడు, ఎంతో చక్కని దేవు'డని పిల్లలు పాడుకోవడం మనకు తెలుసు. ధర్మరాజు వాకిట్లో ఏనుగుల నుంచి స్రవించే మదం బురద కట్టగా, కిక్కిరిసిన సామంత రాజులు ధరించిన ఆభరణాల నుంచి జారిన రజం ఆ బురదను కప్పేసిందంటూ ధర్మరాజు గజ సంపదనూ, సామంత రాజుల బలగాన్నీ కూడా – 'ఎవ్వాని వాకిట నిభమద పంకంబు రాజభూషణ రజోరాజి నడగు' అనే పద్యంలో అద్భుతంగా వర్ణిస్తాడు తిక్కన. యుద్ధంలో ఓడిన తర్వాత, ఏనుగునెక్కి, రెండు వైపులా అనేక ఏనుగులు వెంట రాగా పురవీథుల్లో ఎలా విహరించగలవంటూ, చక్కని మరో తిక్కన పద్యంలో అర్జునుడు దుర్యోధనుని ఆక్షేపిస్తాడు. 'ఏనుగునెక్కినాము ధరణీంద్రులు మొక్కగ నిక్కినాము' అంటూ తిరుపతి వెంకటకవులు సగర్వంగా చెప్పుకుంటారు. ఏనుగునెక్కి యుద్ధాలు చేసిన మనిషి ఏనుగుతో యుద్ధం చేయవలసి రావడమే అతని వివేక భ్రష్టతకు పరాకాష్ఠ. ఛత్తీస్‌గఢ్ అడవులు ఘోషిస్తున్న సత్యం అదే!

గ్రహం అనుగ్రహం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు మాఘ మాసం, **తిథి:** బ.చతుర్దశి సా.5.31 వరకు, తదుపరి అమావాస్య, **నక్షత్రం:** శ్రవణం రా.9.04 వరకు, తదుపరి ధనిష్ఠ, **వర్జ్యం:** రా.1.12 నుండి 2.51 వరకు, **దుర్ముహూర్తం:** ప.12.35 నుండి 1.20 వరకు, తదుపరి ప.2.52 నుండి 3.35 వరకు, **అమృత ఘడియలు:** ఉ.10.01 నుండి 11.41 వరకు.

సూర్యోదయం : 6.31
సూర్యాస్తమయం : 5.56
రాహుకాలం : ఉ.7.30 నుండి 9.00 వరకు
యమగండం : ఉ.10.30 నుండి 12.00 వరకు

సోషల్ టాక్

విడుదల

చిత్ర పరిశ్రమలో శుక్రవారం అన్నది ప్రతిదాన్నీ మార్చేస్తుంది. మీరు కేవలం పెద్ద లెక్కల్ని మాత్రమే పట్టించుకునే వారైతే, చిన్న లెక్కలు మిమ్మల్ని విచ్ఛిన్నం చేస్తాయి. విజయం అంటే కేవలం హిట్ అవటం కాదు, నలభై ఏళ్ల పాటు పని చేయగలిగి ఉండటం!

– శోమా ఆనంద్, సీనియర్ నటి

అమ్మ మాట

"దేవుడు నీకు ప్రతిభను ఇచ్చాడు. సరిగా ఉపయోగించుకో! ప్రతికూల పరిస్థితుల్లోనైనా దేవుని బహుమతిని వృథా చేసుకోవద్దు" అని మా అమ్మ నాతో ఎప్పుడూ అంటుండేవారు. ఆ మాట నిజం. మనం ఇంట్లోనే ఉండిపోతే ఎప్పటికీ ఏమీ చేయలేం.

– మీరా జాస్మిన్, నటి

ప్రతిబింబం

మీరు మరొక వ్యక్తితో కలిసి ఉన్న ప్రతి సంబంధం మీతో మీకున్న సంబంధాన్ని ప్రతిబింబిస్తుంది. మరింతగా అర్థమయ్యేలా చెప్పాలా? మీరేమిటన్న దానికి అనుగుణంగా మనుషలను మీరు ఎంపిక చేసుకోవటం ఉంటుంది. స్నేహితులైనా, శత్రువులైనా!

– విలియం సెల్వమూర్తి, సైంటిస్ట్

మీ స్థానం!

మానవుల స్థానాన్ని ఏఐ పూర్తిగా భర్తీ చేయలేదు. కానీ మనిషి చేసే పనిలో 50 శాతం వరకు చేయగలదు. ఆ పనిని కూడా 100 రెట్లు మెరుగ్గా చేయగలదు. కనుక మిగిలిన 50 శాతం పనిలో (ఏఐ చేయలేని పని) మీరు నైపుణ్యం సాధిస్తే, మీకు ఎదురే ఉండదు.

– నితీష్ జైన్, విద్యావేత్త

తప్పొప్పులు

ఓర్పు అంటే వేచి ఉండటం కాదు, సమయం కోసం వేచి ఉండటం! సమయం వచ్చిందా... ఇక ప్రతి క్షణమూ లక్ష్యమే మీ ఆలోచన కావాలి. ఆలోచనలోంచి ఆచరణలోకి మారాలి. తప్పొప్పుల భయం వదిలేయకుంటే, కాలం మిమ్మల్ని వదిలేసి వెళ్లిపోతుంది.

– ఆశుతోష్ గోవారీకర్, సినీ దర్శకుడు

పరిపూర్ణత

కొంతమంది అసంపూర్ణ వ్యక్తులు కలిసి ఒక పరిపూర్ణమైన ఉత్పత్తిని ఎలా సృష్టించగలరు? ఈ మాటకు అర్థం... దోష రహితంగా ఉండాలని చెప్పటమే కాదు. అసంపూర్ణ వ్యక్తులు సమష్టిగా పరిపూర్ణతను సాధించే వ్యవస్థలను వృద్ధి చేసుకోవాలని!

– శ్రీనాథ్ రవిచంద్రన్, అగ్నికుల్ కాస్మోస్ సీఈవో

దిద్దుబాటుకు ఇస్రో ఉపక్రమించాలి!

విశ్లేషణ

దినేశ్ సి. శర్మ

భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో)కు ఈ ఏడాది ఆదిలోనే హంస పాదు ఎదురైంది. శ్రీహరికోట నుంచి జనవరి 12న ప్రయోగించిన పోలార్ ఉపగ్రహ వాహక నౌక (పీఎస్ఎల్వీ) విఫలమైంది. ఈ వాహక నౌక వివిధ దేశాలకు చెందిన ఉపగ్రహాలతోపాటు, మన దేశానికి చెందిన ఒక వ్యూహాత్మక ఉపగ్రహాన్ని కూడా కక్ష్యలో ప్రవేశపెట్టవలసి ఉంది.

మిగిలిన అంతరిక్ష పరిశోధనా సంస్థల మాదిరిగానే ఇస్రో కూడా గతంలో కొన్ని వైఫల్యాలను చవిచూసింది. కానీ, కొన్ని సందర్భాల్లో అంతరిక్ష ప్రయోగాలు ఆందోళనను రేకెత్తిస్తాయి. లోతుగా ఆత్మపరిశీలన చేసుకోవలసిన, నిశితంగా సమీక్షించుకోవలసిన అవసరాన్ని చాటుతాయి. తాజా వైఫల్యం పలు కారణాల రీత్యా ఆ కోవకు చెందినదే!

పరుగెత్తని పంచకల్యాణి

పీఎస్ఎల్వీకి 63 సార్లు విజయం సాధించిన ఘన చరిత్ర ఉంది. చంద్రయాన్, మార్స్ ఆర్బిటర్ మిషన్ విజయాలు దాని ఖాతాలోకే వస్తాయి. దాన్ని తమ పంచకల్యాణి గుర్రంగా ఇస్రో చెప్పుకొంటుంది. ఒకటి రెండు వైఫల్యాలు లెక్కలోకి తీసుకోవలసిన అవసరం లేనివిగానే కనిపించవచ్చు. కానీ, పీఎస్ఎల్వీకి ఇది వరుసగా రెండో వైఫల్యం. గతేడాది మే 18న ప్రయోగించిన దానికి కూడా ఇదే గతి పట్టింది. ఈ రెండు సందర్భాలలోనూ రాకెట్ మూడవ దశలోనే లోపం తలెత్తింది. గత (2025) ప్రహసనం ఆధారంగా ఈసారి ఏమైనా మార్పులు చేసిందీ లేనిదీ ఇస్రో వెల్లడించలేదు.

వైఫల్యాలను కూలంకషంగా విశ్లేషించుకునే బలమైన వ్యవస్థ ఇస్రోకు ఉంది. దీనికి 2021లో జియో ఉపగ్రహ వాహక నౌక (జీఎస్ఎల్వీ) వైఫల్యంపై వెల్లడైన నివేదికే ఉదాహరణ. క్రయోజనిక్ దశ జ్వలన సమయంలో దిగువ లిక్విడ్ హైడ్రోజన్ ట్యాంకులో పీడనం, ఫ్యూయల్ బూస్టర్ టర్బో పంప్ సక్రమంగా పనిచేయకపోవడానికి కారణమైందనీ, ఫలితంగా మొత్తం మిషన్ విఫలమైందనీ ఆ ఉదంతంలో తేల్చారు. కానీ, 2025 మే నాటి వైఫల్యం గురించి ఎలాంటి సమాచారమూ బయటకు రాలేదు. పారదర్శకంగా వ్యవహరించడంలో ఇస్రోకు మంచి చరిత్రే ఉంది. అది ఆ బాట నుంచి వైదొలగుతున్న ప్రమాదకర సంకేతాలు కనిపిస్తున్నాయి.

కీలకమైన ఉపగ్రహాలకే ఎదురుదెబ్బ

వరుసగా రెండు పీఎస్ఎల్వీ వైఫల్యాలతోపాటు, గతేడాది కాలంలో, ఇస్రో మరో వైఫల్యపు అపఖ్యాతిని కూడా మూటగట్టుకుంది. కానీ, అది రాకెట్ వైఫల్యం కాదు. ఉపగ్రహ వైఫల్యం! ఇస్రో 2025 జనవరి 29న చేపట్టిన జీఎస్ఎల్వీ ప్రయోగంతో శ్రీహరికోట నుంచి వంద సార్లు ఉపగ్రహాలను ప్రయోగించిన రికార్డును సృష్టించింది. ఆ వాహక నౌక ప్రయోగానంతరం, అది ఎన్వీఎస్–02 నావిగేషన్ ఉపగ్రహాన్ని దానికి ఉద్దేశించిన ట్రాన్స్‌ఫర్ కక్ష్యలో విజయవంతంగా ప్రవేశపెట్టిందని ప్రకటించింది. అయితే, ఆన్‌బోర్డ్ థ్రస్టర్లను జ్వలింపజేసేందుకు ఆక్సిడైజర్‌కు వీలు కల్పించే కవాటాలు తెరుచుకోని కారణంగా, నిర్ణయించిన స్లాట్‌లో ఉపగ్రహం కుదురుకోలేక పోయిందని చెప్పింది.

ఏడాది కాలంలో మూడు వైఫల్యాలు ఎదురవడం అటు ఇస్రోకు గానీ, ఇటు దాని దేశ, విదేశీ కస్టమర్లకు గానీ తీవ్ర పర్యవసానాలనే కలుగజేస్తోంది. పైగా, ఈ వైఫల్యాల కారణంగా కోల్పోయిన మూడు భారతీయ ఉపగ్రహాలు కీలకమైన సైనిక ఉపగ్రహాలు. ఆశించిన కక్ష్యలో కుదురుకోలేకపోయిన ఎన్వీఎస్–02 ఒక నేవిగేషన్ ఉపగ్రహం. అది స్టాండర్డ్ పొజిషనింగ్ సర్వీసులతో పాటు, 'రిస్ట్రిక్టెడ్ సర్వీసులను' కూడా సమకూరుస్తుంది. గతేడాది వైఫల్యంతో ఇఓఎస్–09 ఉపగ్రహాన్ని కోల్పోయాం. ఆపరేషనల్ అప్లికేషన్లలో ఉన్న ఏజెన్సీలకు రిమోట్ సెన్సింగ్ డేటాను అందించేట్లుగా దాన్ని డిజైన్ చేశారు. దానిలో సింథటిక్ అపెర్చర్ రాడార్ ఉంది. ఎటువంటి వాతావరణ పరిస్థితులలోనైనా ఇమేజ్‌లను సమకూర్చగల సామర్థ్యం ఆ పేలోడ్‌కు ఉంది. రక్షణ పరిశోధన ఏజెన్సీలు అభివృద్ధి చేసిన ఇఓఎస్–ఎన్1 (అన్వేషగా పిలుస్తున్నారు) భూ పరిశీలనా ఉపగ్రహాన్ని ఈ జనవరిలో ప్రయోగించిన పోలార్ వాహక నౌకలో అమర్చారు.

అంతరిక్షం నుంచి సైన్యానికి ఉపయోగపడగలిగిన మూడు వ్యూహాత్మక ఆస్తులను కోల్పోవడం అంతరిక్ష, రక్షణ ఏజెన్సీలకు మేలుకొలుపు కావాలి. అంతరిక్షం నుంచి సైన్యం ప్రయోజనాలను తీర్చగలిగిన దాదాపు 52 ఉపగ్రహాలను వచ్చే ఐదేళ్ళలో ప్రయోగించాలని బెంగళూరులోని డిఫెన్స్ స్పేస్ ఏజెన్సీ ప్రణాళికలతో ఉంది. అంతరిక్ష ఆధారిత నిఘా (ఎస్‌బీఎస్) ప్రాజెక్టు 3వ దశ కింద వాటిని వినియోగించుకోవాలని భావిస్తున్నారు. ఉపగ్రహాలను తయారు చేసినా, ప్రైవేటు కంపెనీల ద్వారా పొందినా, వాటిని అంతరిక్షంలోకి చేర్చవలసిన బాధ్యత ఇస్రోపైనే ఉంటుంది.

◆ ఒక ఏడాది కాలంలో మూడు వైఫల్యాలు ఎదురవడం ఇస్రోకు గానీ, దాని దేశ, విదేశీ కస్టమర్లకు గానీ తీవ్ర పర్యవసానాలనే కలుగజేస్తుంది. పైగా, ఈ వైఫల్యాల కారణంగా కోల్పోయిన మూడు భారతీయ ఉపగ్రహాలు కీలకమైన సైనిక ఉపగ్రహాలు!

వాణిజ్య నష్టం అపారం

ఈ నెలలో వెళ్ళిన వాహక నౌక ఇఓఎస్–ఎన్1తో పాటు దేశ, విదేశీ కస్టమర్లకు చెందిన 15 ఉపగ్రహాలను మోసుకెళ్ళింది. వాటిలో 'ధ్రువ స్పేస్'కు చెందిన ఐదు ఉపగ్రహాలున్నాయి. ఆ ఐదింటిలో నేపాల్‌ది ఒకటి. బ్రెజిల్‌కు చెందిన ఆల్టో స్పేస్‌కు చెందిన మరో ఐదు ఉపగ్రహాలున్నాయి. బ్రిటన్–థాయిలాండ్ సంయుక్త ఉపగ్రహంతోపాటు, భారతీయ కస్టమర్లకు చెందిన మరో రెండు చిన్న ఇతర ఉపగ్రహాలు, యూరోపియన్ స్పేస్ ఏజన్సీ చేయూతతో స్పెయిన్ కంపెనీ తయారు చేసిన 'కిడ్' ఉపగ్రహం కూడా ఉంది.

ధ్రువతోపాటు ఇతర భారతీయ అంకుర సంస్థలు పీఎస్ఎల్వీ పైనే ఆశ పెట్టుకున్నాయి. అవి పెద్ద మొత్తంలో నగదుతోపాటు విలువైన కాలాన్ని, అవకాశాన్ని కూడా కోల్పోయినట్లు లెక్క. ఉపగ్రహాల సైజును బట్టి వాటిని తయారు చేసేందుకు కంపెనీలకు కొద్ది నెలల నుంచి కొద్ది ఏళ్ళు పట్టవచ్చు. కోల్పోయినవాటి స్థానంలో అవి కొత్త వాటిని వేగంగా తయారు చేసుకున్నా, పీఎస్ఎల్వీలో చోటు కోసం అవి చాలాకాలం ఎదురుచూడక తప్పదు. దీనికితోడు, రాకెట్ విశ్వసనీయత దెబ్బ తినడం వల్ల బీమా ఖర్చులు పెరుగుతాయి. అది తిరిగి మొత్తం ప్రాజెక్టు వ్యయాన్ని పెంచుతుంది.

వరుసగా రెండు వైఫల్యాల నేపథ్యంలో, భవిష్యత్ పీఎస్ఎల్వీ ప్రయోగాలను సమీక్షించుకోవడం ఇస్రోకు తక్షణ కర్తవ్యంగా మారుతోంది. ఈ ఏడాది మరికొన్ని ఇతర ప్రయోగాలు నిర్వహించవలసి ఉంది. ముఖ్యంగా గగన్‌యాన్ కార్యక్రమం కింద సిబ్బంది లేకుండా ఒక అంతరిక్ష నౌకను కక్ష్యలో తిప్పనున్నారు. మానవ సహిత అంతరిక్ష నౌకను పంపడంపై జోరుగా ప్రయత్నాలు సాగుతున్నాయి. భారతీయ అంతరిక్ష కేంద్రాన్ని నెలకొల్పడంపై దృష్టి పెట్టాం. ఈ స్థితిలో ఇస్రోపై బృహత్తర బాధ్యత పడుతోంది. అది టెక్నికల్, క్వాలిటీ, మేనేజీరియల్ ప్రక్రియలను పూర్తి స్థాయిలో సమీక్షించుకోవాలి. విశ్వసనీయమైనదని ఉన్న పేరును కాపాడుకునేందుకు అదొక్కటే మార్గం!

వ్యాసకర్త సైన్స్ అంశాల వ్యాఖ్యాత

వాస్తవికతకు 'డీప్' ముప్పు

నేటి డిజిటల్ యుగంలో కళ్లతో చూసేది, చెవులతో వినేది నిజమా కాదా అని నిర్ధారించుకోవడం కష్టతరంగా మారింది. కృత్రిమ మేధ సాయంతో వ్యక్తుల ముఖాలు, గొంతులను అచ్చుగుద్దినట్లుగా మార్చే 'డీప్‌ఫేక్' సాంకేతికత ఇప్పుడు పెను ముప్పుగా పరిణమించింది. 'డీప్ లెర్నింగ్', 'ఫేక్' అనే పదాల కలయికతో పుట్టిన ఈ మాయాజాలం వెనుక 'జనరేటివ్ అడ్వర్సరియల్ నెట్‌వర్క్స్' (జీఏఎన్‌లు) అనే శక్తిమంతమైన నమూనాలు పనిచేస్తాయి. ఇందులో ఒక నెట్‌వర్క్ నకిలీ కంటెంట్‌ను సృష్టిస్తే, రెండోది తప్పులను వెతికి దానిని మరింత వాస్తవికంగా తీర్చిదిద్దుతుంది. ప్రపంచవ్యాప్తంగా వస్తున్న డీప్‌ఫేక్ వీడియోల్లో దాదాపు 96 శాతం కేవలం ఇతరులను కించపరచడానికి, లేదా హాని చేసే ఉద్దేశ్యంతోనే రూపొందుతున్నాయని గణాంకాలు చెబుతున్నాయి.

రాజకీయ రంగంపై దీని ప్రభావం ఆందోళనకరం. 2024 అమెరికా ఎన్నికల్లో జో బైడెన్ గొంతును పోలిన రోబో కాల్స్ ఓటర్లను గందరగోళానికి గురిచేశాయి. స్లొవేకియా ఎన్నికలకు ముందు వైరల్ అయిన ఆడియో క్లిప్ ఓటర్ల నిర్ణయాలను ప్రభావితం చేసే ప్రయత్నం చేసింది. ఆర్థిక నేరాల విషయానికొస్తే, హాంకాంగ్‌లో ఓ బహుళజాతి సంస్థ ఉద్యోగిని నకిలీ వీడియో కాల్‌తో నమ్మించి సుమారు రూ. 200 కోట్లు కాజేసింది. భారత్‌లోనూ నటీమణుల వీడియోలను మార్ఫింగ్ చేయడం కలకలం సృష్టించింది.



ఈ ముప్పు వల్ల సమాజంలో నమ్మకం దెబ్బతింటోంది. తప్పు చేసి దొరికిపోయిన వారు కూడా అది డీప్‌ఫేక్ అని తప్పించుకునే 'లైయర్స్ డివిడెండ్' అనే ప్రమాదకర పరిస్థితి తలెత్తుతోంది. మహిళల అశ్లీల చిత్రాలను సృష్టించి వేధించడానికి ఇది ప్రధాన అస్త్రంగా మారింది. ఈ సవాలును ఎదుర్కోవడానికి భారత ప్రభుత్వం 'ఐటీ చట్టం–2000', 'ఐటీ నియమాలు–2021' కింద కఠిన నిబంధనలు తెచ్చింది. అభ్యంతరకర కంటెంట్‌ను 36 గంటల్లోగా తొలగించకపోతే సోషల్ మీడియా సంస్థలు చర్యలు ఎదుర్కోవాల్సి ఉంటుంది. 'డిజిటల్ వ్యక్తిగత డేటా రక్షణ చట్టం–2023' ప్రకారం నిబంధనలు ఉల్లంఘిస్తే రూ. 250 కోట్ల వరకు భారీ జరిమానా విధించవచ్చు.

డీప్‌ఫేక్ డిటెక్షన్

డీప్‌ఫేక్ సాంకేతికత మూలాలు 1990ల నాటి సీజీఐ పరిశోధనల్లో ఉన్నప్పటికీ, 2014లో జీఏఎన్‌ల ఆవిష్కరణతో ఇది కొత్త పుంతలు తొక్కింది. 2022 తర్వాత స్టేబల్ డిఫ్యూజన్, ఛాట్ జీపీటీ వంటి సాధనాల వల్ల ఇది సామాన్యులకు కూడా సులభంగా అందుబాటులోకి వచ్చింది. నేడు కేవలం ముఖాలు మార్చడమే కాకుండా, ఒకరి గొంతును క్లోనింగ్ చేయడం, శరీర కదలికలను మార్చడం, టెక్స్ట్ ద్వారా వీడియోలు సృష్టించే స్థాయికి ఇది ఎదిగింది. 2024–25 నాటికి ఇవి 'లైవ్ వీడియో కాల్స్'లో కూడా వాడగలిగేంత ప్రమాదకరంగా మారాయి. ఈ సవాలును ఎదుర్కోవడానికి 'రియాలిటీ డిఫెండర్' వంటి సంస్థలు స్వయంచాలక గుర్తింపు వ్యవస్థలను అభివృద్ధి చేస్తున్నాయి. భవిష్యత్తులో కంప్యూటర్ యాంటీ–వైరస్ లాగే, డీప్‌ఫేక్ డిటెక్షన్ కూడా మన నిత్యజీవితంలో భాగం కానుంది.

సాంకేతిక పరిష్కారాల విషయానికొస్తే... డిజిటల్ వాటర్ మార్కింగ్, బ్లాక్‌చెయిన్ పద్ధతులు కంటెంట్ మూలాలను గుర్తించడానికి ఉపయోగపడతాయి. మైక్రోసాఫ్ట్, గూగుల్ వంటి సంస్థలు వీటిని కనిపెట్టే ప్రత్యేక ఏఐ టూల్స్‌ను అభివృద్ధి చేస్తున్నాయి. ఏఐ కంటెంట్ అని స్పష్టంగా పేర్కొనడాన్ని ప్రభుత్వం ఇప్పుడు తప్పనిసరిచేసింది. చట్టాలు, సాంకేతికతలు ఎన్ని ఉన్నా పౌరుల అప్రమత్తతే అసలైన రక్షణ. వీడియోల్లో కనురెప్పలు ఆర్పే తీరు, పెదవుల కదలికలు, ముఖంపై నీడల్లోని అసంబద్ధతలను గమనిస్తే వీటిని గుర్తించవచ్చు. అనుమానాస్పద సమాచారాన్ని ఇతరులకు పంపకుండా సైబర్ క్రైమ్ పోర్టల్‌లో ఫిర్యాదు చేయాలి. డిజిటల్ అక్షరాస్యతను పెంపొందించుకోవడమే ఈ మాయా లోకం నుండి మనల్ని మనం కాపాడుకునే ఏకైక మార్గం.

– ఏటూరి సోమశేఖర్ శర్మ,
విశ్రాంత జిల్లా విద్యాధికారి (రిటైర్డ్), ఖమ్మం

అరుదైన ఆచార్యుడు

ఇన్ బాక్స్

సుప్రసిద్ధ వ్యవసాయ శాస్త్ర ఆచార్యులు కె.ఎ.సుబ్రమణియన్ (ప్రొఫెసర్ కూవాపాడి అనంతసుబ్రమణి బాలసుబ్రమణియన్) ఫిబ్రవరి 12న 85 సంవత్సరాల వయస్సులో అమెరికాలోని సియాటెల్‌లో వారి కూతురింట చనిపోయారు. వారి సేవలు ప్రత్యక్షంగా, పరోక్షంగా వేలాది మంది వ్యవసాయ శాస్త్రవేత్తలు, విద్యార్థులు, విశ్వవ్యాప్తంగా గుర్తు చేసుకుంటూ ఉన్నారు. ఇంతగా తన బోధనలతో ప్రభావితం చేసిన ఈ ప్రొఫెసర్ ఎవరు?

1939, మే 5న ఎక్కడో కేరళలోని ఎర్నాకుళంలో పుట్టి ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ విశ్వవిద్యాలయం (బాపట్ల), రాజేంద్ర నగర్ వ్యవసాయ కళాశాలల్లో పనిచేసి కేవలం తన వ్యక్తిత్వం, బోధన, నిరాడంబరత, క్రమశిక్షణ, నిజాయతీ, నిరంతర అధ్యయనంతో విద్యార్థుల మీద చెరగని ముద్ర వేశారు. సివిల్స్ వద్దు, వ్యవసాయ పరిశోధనలే ముద్దంటూ తన శిష్యులకు నూరిపోశారు. ప్యాథాలజీ విభాగం ప్రొఫెసర్ అయినా... ఆ అంశాలు తరగతి గదుల్లో బోధించిన తీరు అసాధారణం. ఆ ప్రతిభా పాటవాలు వారికే సొంతం. అందరూ భయపడే ఫిజిక్స్, మేథమేటిక్స్, బయో కెమిస్ట్రీ శాస్త్ర అంశాలను కూడా సమ్మిళితం చేస్తూ, తన విషయానికి సమన్వయం చేస్తూ, సులువుగా చెప్పటంలో దిట్ట. చెప్పే అంశాన్ని లోతుగా విశ్లేషించి పిల్లలకు అర్థమయ్యేలా ఆలోచనాత్మకంగా బోధించటం వారి శైలి. ఒక శాస్త్రీయ అవగాహనా దృష్టి పిల్లలకు అలవాటు చెయ్యాలనే తపన వారికి ఉండేది. దీనితో వారి పాఠం అంటే విద్యార్థులు చెవి కోసుకుంటారు.



కె.ఎ. సుబ్రమణియన్

'భారత వ్యవసాయ పరిశోధనా సంస్థ'లో పనిచేస్తూ 'ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ విశ్వవిద్యాలయం'లో ప్రొఫెసర్‌గా చేరారు. బాపట్ల వ్యవసాయ కళాశాల ప్రిన్సిపల్‌గా, ప్యాథాలజీ విభాగం యూనివర్సిటీ హెడ్‌గా పనిచేసి 1999లో పదవీ విరమణ చేశారు. తరువాత విశాఖలో కొంత కాలం ఓ ప్రైవేట్ విద్యాసంస్థలో ఫిజిక్స్ బోధించి, అమెరికా వెళ్ళి అక్కడ విశ్వవిద్యాలయాల్లో బోధన చేశారు. ఈయన మంచి సంగీత విద్వాంసులు కూడా! గాత్రం కమనీయంగా ఉంటుంది. ఆయన ఉపనిషత్తులను ఆపోశన పట్టారు. భగవద్గీత శ్లోకాలు నిరాఘాటంగా, అలవోకగా, రాగ యుక్తంగా చెప్పగలరు. పదవీ విరమణ తరువాత విశాఖలో స్థిరపడ్డారు. తరువాత అమెరికా వెళ్ళి అక్కడ తబలా, మృదంగంలో పిల్లలకు శిక్షణ ఇచ్చారు. వారి మార్గ దర్శనంలో 21 మంది పీహెచ్‌డీలు పొందారు. వారి ప్రత్యక్ష, పరోక్ష శిష్యగణం వారి పేరిట ప్రతి సంవత్సరం స్మారక ఉపన్యాసం, పురస్కారం ఏర్పాటు చేయటం ద్వారా వారి స్ఫూర్తిని కొనసాగించటమే వారికిచ్చే నివాళి కాగలదు.

– వలేటి గోపీచంద్ | ఆచార్య ఎన్.జి. రంగా వ్యవసాయ విశ్వ విద్యాలయ పూర్వ విద్యార్థి, ఆకాశవాణి విశ్రాంత ఉన్నతాధికారి

ఏ దేశం ఎంతెంత?

డేటా పాయింట్

ప్రపంచ జీడీపీకి ఇతోధికంగా తోడ్పడటంలో ఇండియా ఐదవ స్థానంలో ఉంది. 1980–2023 సంవత్సరాల లెక్కల ప్రకారం, ఊహించినట్టుగానే ఈ జాబితాలో యూఎస్ఏ అగ్రస్థానంలో, చైనా రెండో స్థానంలో ఉన్నాయి. ఉమ్మడిగా ఈ రెండు దేశాలు నలభై శాతానికి పైగా వాటాను కలిగివున్నాయి.

ప్రపంచ జీడీపీలో శాతం

ప్రపంచ జీడీపీలో టాప్ 10 దేశాల వాటా

దేశం	వాటా
యూఎస్ఏ	26.3
చైనా	17.33
జర్మనీ	4.29
జపాన్	4
ఇండియా	3.45
యూకే	3.2
ఫ్రాన్స్	2.9
ఇటలీ	2.19
బ్రెజిల్	2.08
కెనడా	2.06

ఆధారం: వరల్డ్ బ్యాంక్, ద గ్లోబల్ ఎకానమీ డాట్‌కామ్

తెలియక చేసినా...

జ్యోతిర్మయం

తెలిసి చేసినా, తెలియక చేసినా దైవ పూజ, స్మరణ అంతులేని ఫలితాన్నిస్తాయి. తెలిసి చేస్తే లభించే మేలు ద్విగుణీకృతం అవుతుంది. భక్తి లేకపోయినా, అంత్య దశలో అజామిళుడు, తన కొడుకును 'నారాయణా' అని పలవరించినందుకు అతడు మరణించాక విష్ణు భటులు వచ్చి వైకుంఠానికి తీసుకువెళ్ళిపోతారు. అదీ దైవ నామస్మరణలో ఉండే గొప్పదనం.

యజ్ఞదత్తుడనే పండితుని కొడుకైన గుణనిధి చిన్నతనం నుండి చెడు స్నేహాలకు, దుర్వ్యసనాలకు బానిసై తల్లిదండ్రులకు తీరని వ్యధను కలిగిస్తాడు. తండ్రి ఆర్జించిన అంతులేని సంపదనంతా హరిస్తాడు. తండ్రి ఆర్జించుకున్న పరువు ప్రతిష్ఠలకూ, గౌరవ ప్రపత్తులకూ భంగం కలిగిస్తాడు. దుష్టుడు, వ్యసనపరుడు అయిన కుపుత్రుని కంటె పుత్రుడు లేదనుకోవటమే మేలని, కొడుకును ఇంటి నుండి వెళ్లగొడతాడు యజ్ఞదత్తుడు.

ఆకలి దప్పులతో గుణనిధి ఊరు చివర చెట్టు కింద కూర్చుని తన దుఃస్థితికి బాధ పడుతుండగా, ఆ దారిన శివ భక్తులు కొందరు, ఆ రోజు శివరాత్రి అవటం వలన పూజా ద్రవ్యాలు, నైవేద్యాలు శివాలయానికి తీసుకువెళ్తుంటే, గుణనిధి వాళ్లతో వెళ్తాడు. వాళ్లంతా భక్తితో శివపూజ చేసి, నివేదనలు చేసి, వాటిని స్వీకరించి అర్ధరాత్రి దాటాక అలసిపోయి నిద్రించారు. అప్పుడు గుణనిధి దీపం కొండెక్కుతూ ఉండటం వల్ల వెలుతురు కోసం ఉత్తరీయం చింపి, నూనెలో తడిపి దీపం వెలిగిస్తాడు. శివుని దర్శిస్తాడు. అక్కడ ఉన్న ప్రసాదాలు స్వీకరిస్తాడు. బయటకి వెళుతుంటే పడుకున్న వారి కాళ్ళు తగిలి వాళ్ళు లేచి దొంగ అనుకుని గుణనిధిని కొడతారు. ఆ దెబ్బలకు అతడు మరణిస్తాడు.

శివ భటులు, యమ భటుల వాగ్వాదంలో గుణనిధి తెలియకుండానే శివాలయంలో దీపం వెలిగించి, ప్రసాదం స్వీకరించటం వల్ల కైలాసానికి వెళ్లే అర్హత పొందాడని తెలుస్తుంది. అదీ శివశక్తి మహిమ. పలుకుతున్న ప్రతీ దైవ నామాన్నీ అర్థం తెలుసుకుని పలికితే ఇంకెంత గొప్ప ఫలమో కదా!

– డా॥ చెంగల్వ రామలక్ష్మి

విజయవాడ యనమలకుదురులోని రామలింగేశ్వరస్వామి ఆలయానికి వెళ్తున్న ప్రభలు

పాగాలంకరణలో శ్రీశైలం ఆలయం

ముక్కంటీ.. మనసాస్మరామీ

- రాష్ట్ర వ్యాప్తంగా మార్మోగిన పంచాక్షరీ మంత్రం
- అత్యంత భక్తిశ్రద్ధలతో మహా శివరాత్రి వేడుకలు
- లింగోద్భవ వేళ తన్మయత్వంతో పులకించిన భక్తులు
- దేవదాయ శాఖ వీఐపీల సేవలో తరించడంతో సామాన్యులకు ఇక్కట్లు

సాక్షి, అమరావతి/సాక్షి నెట్‌వర్క్: సృష్టి లయకారకుడు పరమేశ్వరుని సన్నిధిలో పంచాక్షరీ మంత్రం మార్మోగింది. ఓం నమః శివాయ... హర హర మహాదేవ శంభో శంకర అంటూ భక్తజనం తన్మయత్వంతో పులకించిపోయారు. లింగోద్భవ వేళ మహాదేవుని తనివితీరా దర్శించుకుని భక్తిపారవశ్యంతో ఉప్పొంగిపోయారు. మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా రాష్ట్రంలోని ప్రముఖ శైవ క్షేత్రాలన్నీ భక్తుల కోలాహలంతో సందడిగా కనిపించాయి. శ్రీశైలం, శ్రీకాళహస్తి, కోటప్పకొండ, మహానంది, పిఠాపురం పాదగయతోపాటు పంచారామాలుగా పిలుచుకునే ద్రాక్షారామం, సామర్లకోట, అమరావతి, పాలకొల్లు, భీమవరంలో ఆదివారం వేకువ జాము నుంచే భక్తుల రద్దీ కనిపించింది. అయితే భక్తుల రద్దీకి తగ్గట్టు ఏర్పాట్లు చేయడంలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైంది. భక్తులకు సౌకర్యాలు కల్పించడం కంటే వీఐపీల సేవకే దేవదాయ శాఖ అధికారులు, సిబ్బంది ప్రాధాన్యమివ్వడంతో సామాన్యులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. శ్రీకాళహస్తి ఆలయంలో అధికారులను భక్తులు నిలదీయడంతో ఘర్షణ చోటు చేసుకుంది.

➤ **భక్తజన సంద్రంగా పాదగయ క్షేత్రం:** కాకినాడ జిల్లా పిఠాపురం పాదగయ క్షేత్రం భక్తజన సంద్రంగా మారింది. సుమారు 2 లక్షల మందికి పైగా భక్తులు పాదగయ పుష్కరిణిలో పుణ్యస్నానాలు ఆచరించి, కుక్కుటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. భారీగా భక్తులు తరలిరావడంతో ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించడం పోలీసులకు సవాల్‌గా మారింది.

➤ **వాయులింగేశ్వరుని దర్శనంతో తన్మయత్వం**
శ్రీజ్ఞాన ప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరాలయంలో వాయులింగేశ్వరుని దివ్య తేజస్సును వీక్షించిన భక్తులు తన్మయత్వంతో పులకించారు. శ్రీకాళహస్తీశ్వర స్వామి, జ్ఞానప్రసూనాంబ అమ్మవార్లు ఆదివారం ఉదయం ఇంద్ర విమానం, చప్పర వాహనాలపై, రాత్రి నంది, సింహ వాహనాలపై పట్టణంలోని నాలుగు మాడ వీధుల్లో విహరించారు. ఆదివారం అర్ధరాత్రి దాటాక స్వామి వారి లింగోద్భవ (నిజరూప) దర్శనానికి భక్తులు రాత్రంతా జాగారం చేశారు. మహా శివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం ఉదయం రథోత్సవం, రాత్రి పట్టణంలోని నారద పుష్కరణిలో శివపార్వతుల తెప్పోత్సవం నిర్వహించనున్నారు.

➤ మరోవైపు శ్రీకాళహస్తి ఆలయ అధికారులు వీఐపీల సేవలో తరించడంతో సర్వదర్శన క్యూలైన్లలో గంటల తరబడి సామాన్య భక్తులు వేచి ఉండాల్సి వచ్చింది. చంటి బిడ్డల తల్లులు తోపులాటల్లో ఇబ్బంది పడ్డారు. ఆలయ ఈవో, చైర్మన్‌కు వ్యతిరేకంగా భక్తులు నినాదాలు చేశారు.

➤ **శ్రీశైల మల్లన్నకు వైభవంగా పాగాలంకరణ**
మహా శివరాత్రి పర్వదినాన మల్లికార్జునస్వామి ఆలయంపై వైభవంగా పాగాలంకరణ చేశారు.

కోటప్పకొండ త్రికోటేశ్వరస్వామి

కోటప్పకొండకు బారులు తీరిన భక్తజన సందోహం

ఆదివారం రాత్రి 10 గంటల నుంచి బాపట్ల జిల్లా హస్తినాపురానికి చెందిన చేనేత కార్మికుడు పృధ్వీ సుబ్బారావు పాగాలంకరణ చేశారు. పండితులు, ప్రధాన అర్చకులు శాస్త్రోక్తంగా జ్యోతిర్లింగ మల్లికార్జునుడికి లింగోద్భవకాల మహాన్యాస ఏకాదశ రుద్రాభిషేకానికి శ్రీకారం చుట్టారు. వెంటనే పృధ్వీ సుబ్బారావు స్వామి వారి గర్భాలయ విమాన గోపురాన్ని, ముఖ మండపంపై ఉన్న 14 నందులను కలుపుతూ పాగాలంకరణ చేశారు. అనంతరం ప్రత్యేక వేదికపై అర్ధరాత్రి 12 గంటలకు నిర్వహించిన శివ పార్వతుల కల్యాణ మహోత్సవాన్ని తిలకించిన భక్తజనం పులకించిపోయారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా సాయంత్రం నిర్వహించిన ప్రభోత్సవం కనుల పండువగా సాగింది.

➤ **వైష్ణవ క్షేత్రంలో శివరాత్రి పూజలు:** విజయనగరం జిల్లా నెల్లిమర్ల మండలంలోని రామతీర్థానికి భక్తులు పోటెత్తారు. వైష్ణవ దేవాలయం అయినప్పటికీ ఏటా శివరాత్రికి లక్షలాది భక్తులు హాజరై పూజలు చేయడం ఆనవాయితీగా వస్తోంది. సాక్షాత్తు శ్రీరాముడే రామక్షేత్రంలో శివుని మంత్రాన్ని జపించారని విశ్వసించిన భక్తులు ఉత్తరాంధ్ర జిల్లాల నుంచే కాకుండా ఒడిశా నుంచి కూడా అధిక సంఖ్యలో తరలి వచ్చి పూజలు నిర్వహించారు.

➤ **కనులపండువగా యనమలకుదురు ప్రభోత్సవం**
కృష్ణా జిల్లా పెనమలూరు మండలం యనమలకుదురులో పార్వతీ సమేత రామలింగేశ్వరస్వామి దేవస్థానంలో మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహించారు. రంగురంగుల విద్యుత్ దీపాలతో ప్రభోత్సవం కనుల పండువగా సాగింది. ప్రభలను తిలకించేందుకు, స్వామి దర్శనం కోసం భక్తులు భారీగా తరలిరావడంతో యనమలకుదురులోని వీధులన్నీ రద్దీగా మారాయి.

శ్రీకాళహస్తీశ్వరాలయానికి పోటెత్తిన భక్తులు

ప్రభల వైభవం... భక్తుల కోలాహలం

వైభవంగా కోటప్పకొండ తిరునాళ్ల మహోత్సవం

సాక్షి, నరసరావుపేట: పల్నాడు జిల్లా నరసరావుపేట సమీపంలోని ప్రముఖ శైవక్షేత్రం కోటప్పకొండ భక్తజనంతో కిటకిటలాడింది. లక్షలాది భక్తులు త్రికోటేశ్వర స్వామిని దర్శించుకున్నారు. తెలుగు రాష్ట్రాలతోపాటు కర్ణాటక, తమిళనాడు నుంచి భక్తులు భారీగా తరలిరావడంతో కోటప్పకొండ శివనామస్మరణతో మార్మోగింది. ఆదివారం తెల్లవారుజామున ఒంటి గంటకు బిందె తీర్థంతో స్వామికి అభిషేకాలు నిర్వహించి, ప్రత్యేకంగా అలంకరించిన తర్వాత భక్తులను దర్శనానికి అనుమతించారు. త్రికూటాద్రి పర్వతంపై కొలువై ఉన్న మహానందీశ్వరునికి అర్చకులు పంచామృతాభిషేకాలు నిర్వహించారు.

23 భారీ విద్యుత్ ప్రభలతో సందడి

కోటప్పకొండ ప్రభల ఉత్సవం భక్తుల సందడి మధ్య కోలాహలంగా సాగింది. 23 భారీ విద్యుత్ ప్రభలతోపాటు చిన్న చిన్న ప్రభలన్నీ ప్రభల నిధికి చేరాయి. కోటప్పకొండకు చేరే క్రమంలో భక్తులు ట్రాఫిక్ కష్టాలు ఎదుర్కొన్నారు. ఆదివారం మధ్యాహ్నం పెట్లూరివారిపాలెం వద్ద గంటకు పైగా ట్రాఫిక్ స్తంభించిపోవడంతో వందలాది వాహనాలు రోడ్డుపై నిలిచిపోయాయి. చిలకలూరిపేట యూటీ జంక్షన్ వద్ద మధ్యాహ్నం వాహనదారులు ఇబ్బంది పడ్డారు. రాష్ట్ర పండుగ హోదాలో కోటప్పకొండ త్రికోటేశ్వరస్వామికి మంత్రి గొట్టిపాటి రవికుమార్ పట్టువస్త్రాలు సమర్పించారు.

➤ అమరావతి శ్రీబాల చాముండిక సమేత అమరేశ్వరస్వామి ఆలయంలో, రెంటచింతల మండలంలోని సత్రశాల గంగా భ్రమరాంబ సమేత మల్లిఖార్జునస్వామిని, గురజాల మండల పరిధి దైద గ్రామ కృష్ణా నది తీరాన వేంచేసియున్న అమరలింగేశ్వర స్వామిని వేలాది మంది భక్తులు దర్శించుకున్నారు.

శివ.. శివా!

శ్రీకాళహస్తీశ్వరుని దర్శనానికి వెళ్లిన భక్తురాలి మృతి

కోటప్పకొండలో పదేళ్ల బాలికకు ఊపిరాడక అస్వస్థత

- శ్రీశైలం పాతాళగంగ రోడ్డులో ఇరుక్కుపోయిన భక్తులు
- కిందపడిపోయిన మల్లన్న లడ్డూ ప్రసాదం
- శ్రీకాకుళం జిల్లా రావివలసలో తోపులాట.. పలువురికి గాయాలు
- శైవక్షేత్రాల్లో భక్తుల భద్రతను గాలికొదిలేసిన బాబు సర్కారు
- శ్రీకాళహస్తి క్షేత్రంలో అడ్డగోలు దర్శనాలు

శ్రీకాళహస్తి క్యూలైన్‌లో సొమ్మసిల్లి పడిపోయిన భక్తురాలు

శ్రీకాకుళం జిల్లాలోని రావివలస క్షేత్రం వద్ద గాయపడిన మహిళకు చికిత్స చేస్తున్న ఆస్పత్రి సిబ్బంది

కోటప్పకొండ మెట్లమార్గంలో స్పృహ తప్పిన బాలిక నందినిని తీసుకెళుతున్న పోలీసులు, వైద్యసిబ్బంది

శ్రీకాళహస్తి/శ్రీశైలం టెంపుల్/నరసరావుపేట/టెక్కలి రూరల్/మహానంది: ముక్కంటి దర్శనం కోసం శైవక్షేత్రాలకు వెళ్లిన భక్తులకు బాబు సర్కారు ప్రత్యక్ష నరకం అంటే ఏమిటో చూపించింది. భక్తుల భద్రతను గాలికొదిలేసి.. టీడీపీ నేతలు, వీఐపీల సేవలో ప్రభుత్వ యంత్రాంగం తరించడంతో రాష్ట్రంలో అనేకచోట్ల మహాశివరాత్రి రోజున అపశృతులు చోటుచేసుకున్నాయి. శ్రీకాళహస్తీశ్వరుడి దర్శనానికి వెళ్లిన భక్తురాలు మృతి చెందింది. కోటప్పకొండలో పదేళ్ల బాలికకు ఊపిరాడకపోవడంతో తీవ్ర అస్వస్థతకు గురైంది. శ్రీశైలం పాతాళగంగ రోడ్డులో భక్తులు ఇరుక్కుపోవడంతో తోపులాట జరిగింది. ఇదే క్షేత్రంలో మల్లన్న లడ్డూ ప్రసాదం నేలపాలవడం భక్తులను కలచివేసింది. శ్రీకాకుళం జిల్లా రావివలసలో తోపులాట జరగ్గా.. పలువురికి గాయాలయ్యాయి. అనేకచోట్ల సామాన్య భక్తులు క్యూలైన్లలో అల్లాడిపోయారు.

అస్వస్థతకు గురై.. భక్తురాలి దుర్మరణం

శ్రీకాళహస్తీశ్వరాలయంలో మొదటి గేటు వద్ద సర్వదర్శనం క్యూలైన్‌లో గంటల తరబడి నిరీక్షించడంతో తోపులాట జరిగి భక్తులు కిందపడిపోయారు. అదే క్యూలైన్‌లో తిరుపతి జిల్లా చిట్టమూరు మండలం ఓగిలి గొల్లపల్లి చెందిన మణెమ్మ (45) తన కుమార్తెతో కలసి ముక్కంటి దర్శనానికి మొదటి గేటులోకి వెళ్లింది. కుమార్తె తప్పిపోవడంతో ఊపిరాడక క్యూలైన్‌లో నుంచి బయటకు వచ్చేసింది. ఆ తరువాత ఆందోళనకు గురైన ఆమెకు అకస్మాత్తుగా మూర్ఛ రావటంతో నోటినుంచి నురగలు కక్కుతూ అక్కడే కిందపడిపోయింది. అపస్మారక స్థితికి చేరుకున్న ఆమెకు వైద్య సిబ్బంది ప్రథమ చికిత్స చేసినా.. కళ్లు తెరవకపోవటంతో 108వాహనంలో హుటాహుటిన శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మణెమ్మ మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు.

నేతల అడ్డగోలుతనమే ఘటనకు కారణం

శ్రీకాళహస్తి క్షేత్రంలో టీడీపీ కూటమి నేతలు తమ అనుయాయులను అడ్డగోలుగా వీవీఐపీ మార్గంలో తీసుకెళ్లి అడ్డొచ్చిన పోలీసులపైనే తిరగబడ్డారు. ప్రోటోకాల్ విధుల్లో నిమగ్నమైన పోలీసు అధికారులపై టీడీపీ నాయకుడొకరు వీరంగం సృష్టించారు. 'మేం కష్టపడి పనిచేసి గెలిపించిన ప్రభుత్వమిది. మమ్మల్నే ఆపేస్తారా?' అంటూ ఆ నాయకుడు పోలీసులపై ఆగ్రహంతో ఊగిపోయాడు. స్థానిక పోలీసు అధికారి జోక్యం చేసుకుని ఆ నాయకుడికి ప్రోటోకాల్ మార్గంలో వెళ్లేందుకు అనుమతి ఇచ్చారు. ఇదిలావుండగా నాలుగో గేటు ద్వారా లోపలికి వచ్చే వీఐపీ లైన్‌లో ఉన్న పలువురు ప్రోటోకాల్ లైన్‌లోకి ప్రవేశించేందుకు ప్రయత్నించడంతో ఇబ్బందికర పరిస్థితులు ఏర్పడ్డాయి. పలువురు నాయకులు ప్రోటోకాల్ లైన్‌లోకి రావడానికి పదేపదే ప్రయత్నించడంతో అక్కడ ఉద్రిక్త వాతావరణం నెలకొంది. భక్తుల రద్దీ అధికంగా ఉన్న వేళ రాజకీయ నేతల ఒత్తిళ్లు పెరగడంతో పరిస్థితిని అదుపులోకి తేవడం పోలీసులకు కష్టమైంది.

శ్రీశైలం ఆలయంలో ట్రే నుంచి కిందపడిన లడ్డూ ప్రసాదం

'డౌన్.. డౌన్' అంటూ నినదించిన భక్తులు

శ్రీకాళహస్తి క్షేత్రంలో వీవీఐపీ, ప్రోటోకాల్ దర్శనాల లైన్‌లో టీడీపీ నాయకులు తమ అనుయాయులను ఎలాంటి పాస్‌లు లేకుండా నేరుగా తీసుకెళ్లి దర్శనం చేయించారు. సామాన్య భక్తులకు కేటాయించిన సర్వదర్శనం క్యూలైన్లు గంటల తరబడి ముందుకు కదలకుండా ఎక్కడి భక్తులు అక్కడే నిలబడిపోవాల్సి వచ్చింది. ఓ దశలో సహనం కోల్పోయిన భక్తులు 'ఆలయ చైర్మన్ డౌన్.. డౌన్', 'ఈవో డౌన్.. డౌన్..' అంటూ పెద్ద పెట్టున నినాదాలు చేశారు.

క్యూలైన్‌లో ఊపిరాడక బాలికకు అస్వస్థత

కోటప్పకొండ మెట్ల మార్గంలో భక్తుల రద్దీ పెరగడంతో ఊపిరాడక కృష్ణా జిల్లా గూడవల్లికి చెందిన పదేళ్ల పాప నందిని అపస్మారక స్థితికి చేరుకుంది. ఆ బాలిక మెట్ల మార్గానికి మధ్యలో ఉండిపోవడంతో కొండపైకి గాని, కొండ దిగువకు గాని తీసుకురాలేని పరిస్థితి ఎదురైంది. బాలికను చికిత్స నిమిత్తం 108 వాహనం వద్దకు తీసుకువెళ్లేందుకు తీవ్రంగా శ్రమించాల్సి వచ్చింది. బాలిక పరిస్థితి విషమంగా ఉన్నట్టు సమాచారం.

పాతాళగంగ రోడ్డులో ఇరుక్కుపోయిన భక్తులు

శ్రీశైలం మల్లికార్జున స్వామిని దర్శించుకునేందుకు భక్తులు పాతాళగంగ రోడ్డులో గంటల తరబడి ఇరుక్కుపోయారు. దీంతో తొక్కిసలాట జరిగింది. ప్రమాదకరమైనప్పటికీ రోప్‌వే దారిలోనే భక్తులు నడుచుకుంటూ వెళ్లాల్సివచ్చింది. పాతాళగంగలో పుణ్యస్నానాలు ఆచరించిన మహిళా భక్తులకు సరిపడినన్ని దుస్తులు మార్చుకునే గదులు ఏర్పాటు చేయకపోవడంతో అవస్థలు ఎదుర్కొన్నారు. ఆలయంలో సిద్ధం చేసిన మల్లన్న లడ్డూ ప్రసాదాలను కౌంటర్లకు తరలించే క్రమంలో ట్రేలు కిందపడి లడ్డూ ప్రసాదం నేలపాలైంది. ఈ ఘటనను భక్తులు మహా అపచారంగా భావిస్తున్నారు. మరోవైపు పాగాలంకరణ దర్శనం సామాన్య భక్తులకు అందని ద్రాక్షగానే మిగిలింది. కేవలం వీఐపీలకే ప్రాధాన్యత ఇవ్వగా.. భక్తులను ప్రతిచోటా పోలీసులు అడ్డుకున్నారు. భక్తులు ఒక దశలో 'ఈఓ డౌన్ డౌన్' అంటూ పెద్దఎత్తున నినాదాలు చేశారు.

ఎండల మల్లికార్జునస్వామి క్షేత్రంలో..

శ్రీకాకుళం జిల్లాలోని ప్రసిద్ధ రావివలస ఎండల మల్లికార్జునస్వామి ఆలయం సమీపంలో మెట్లపై ఆదివారం తోపులాట జరిగింది. నిర్మాణంలో ఉన్న అయ్యప్పస్వామి ఆలయం వద్ద స్థానికులు ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో తోపులాట జరిగి బారికేడ్లకు ఉన్న రేకులు భక్తుల కాళ్లకు తగిలి పలువురు గాయపడ్డారు. క్షతగాత్రుల్లో నందిగాం మండలం మర్లపాడుకు చెందిన డి.శ్రీనివాసరావు, సంతబొమ్మాళి మండలం రెయ్యిపేట గ్రామానికి చెందిన ఆర్.అనసూయమ్మ, ఆమె భర్త సింహాచలం తదితరులు ఉన్నారు. వీరిని టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు.

మహానందిలో దర్శనం కరువు

నంద్యాల జిల్లాలోని మహానంది క్షేత్రంలో కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి దర్శనంకోసం భక్తులు గంటల తరబడి వేచి ఉండాల్సి వచ్చింది. మరోవైపు ఇదే క్షేత్రంలోని రామాలయం, ఆంజనేయస్వామి ఆలయాల దర్శనాలను ఈవో నల్లకాలువ శ్రీనివాసరెడ్డి ఏకపక్షంగా నిలిపివేశారు. ఇదేమని అడిగిన భక్తులపై 'నాకు నచ్చిందే చేస్తా. అంతా నా ఇష్టం. ఏం చేసుకుంటారో చేసుకోండి' అంటూ విరుచుకుపడ్డారు.

ప్రభ ఎదుట ప్రమాదకర విన్యాసాలు

- శృతి మించిన పచ్చమూకల ఆగడాలు
- ఆందోళన చెందిన భక్తులు

నరసరావుపేట టౌన్: కోటప్పకొండ తిరునాళ్ల సందర్భంగా ప్రభ వద్ద ఏర్పాటు చేసిన ప్రమాదకర విన్యాసాలు భక్తుల్లో ఆందోళన కలిగించాయి. తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో కాకాని గ్రామంలో ప్రభను ఏర్పాటు చేశారు. ఆదివారం కోటప్పకొండకు తరలించుకు వెళ్లారు. ఈ సందర్భంగా విద్యుత్ ప్రభ వద్ద నిర్వహించిన విన్యాసాలు శృతి మించాయి. ప్రభను కనకతప్పెట్లు, డీజే ఏర్పాట్ల నడుమ ఊరేగింపుగా తీసుకువెళ్లారు. మార్గమధ్యంలో అక్కడక్కడా జేసీబీ యంత్రాన్ని నడిరోడ్డుపై వేగంగా తిప్పుతూ విన్యాసాలు చేశారు. డీజే పాటల శబ్దానికి దీటుగా జేసీబీని రోడ్డుకు మధ్యలో తిప్పుతూ రోడ్డును ధ్వంసం చేశారు. దీంతో అటుగా వెళ్లే భక్తులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. కొన్ని చోట్ల రోడ్డు పాక్షికంగా దెబ్బతింది. జేసీబీ పొరపాటున అదుపుతప్పి ఉంటే భారీ ప్రాణనష్టం సంభవించి ఉండేదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. తిరునాళ్ల వేళ ఇలాంటి ప్రమాదకర విన్యాసాలు కట్టడి చేయాలని భక్తులు కోరుతున్నారు.

జేసీబీతో పచ్చమూకల విన్యాసాలు

మామిడి తోటలో ఎలుగుబంటి

భయాందోళనలో ప్రజలు

ఓబులవారిపల్లె: తిరుపతి జిల్లా శేషాచల అటవీ ప్రాంత సమీప గ్రామాల్లో ఎలుగుబంటి సంచరిస్తుండడంతో స్థానికులు హడలిపోతున్నారు. ఆదివారం టి కమ్మపల్లి, బలిజపల్లి గ్రామాల్లోని మామిడి తోటలో ఎలుగుబంటి కనిపించింది. స్థానికులు వీడియో తీసి సోషల్ మీడియాలో షేర్ చేశారు. ఇటీవలే వైకోట గ్రామంలోని రైతులు బీగాల కుమార్, బాలిరెడ్డిపల్లిలోని అమర్నాథరెడ్డి ఎలుగుబంట్ల దాడిలో తీవ్రంగా గాయపడ్డారు. దీంతో గుండాలకోనకు వెళ్లే భక్తులకు కూడా ఆంక్షలు విధించారు. అయితే గ్రామాల సమీపంలో ఎలుగుబంట్లు సంచరిస్తుండడంతో రైతులు, ప్రజలు తమ పంట పొలాల వద్దకు వెళ్లాలంటే భయపడుతున్నారు. అటవీశాఖ అధికారులు చర్యలు తీసుకొని ఎలుగుబంటిని పట్టుకోవాలని కోరుతున్నారు.

రైతుపై అడవి పందుల దాడి

బంగారుపాళెం: చిత్తూరు జిల్లా బంగారుపాళెం మండలం మొగిలివారిపల్లెలో ఆదివారం అడవి పందుల దాడిలో ఓ రైతు గాయపడ్డాడు. గ్రామానికి చెందిన ఏకోదర నాయుడు తన మామిడి తోటలో చెట్లకు మందులు పిచికారీ చేసేందుకు కూలీలతో వెళ్లాడు. సమీపంలోని అటవీ ప్రాంతం నుంచి మూడు అడవి పందులు మామిడి తోటలోకి వచ్చాయి. వాటిని మళ్లించేందుకు కేకలు వేయడంతో అవి రైతు ఏకోదర నాయుడిపై దాడి చేశాయి. అక్కడే ఉన్న కూలీలు అప్రమత్తమై గట్టిగా కేకలు వేయడంతో అడవి పందులు వెళ్లిపోయాయి. రైతుకు ఎడమ కాలు, శరీరంపై స్వల్ప గాయాలయ్యాయి.

ఆరుగురు టీటీడీ ఉద్యోగులపై చర్యలకు సిట్ లేఖ!

తిరుపతి అన్నమయ్య సర్కిల్: తిరుమలలో నెయ్యి కల్తీ ఆరోపణల కేసుకు సంబంధించి మరో ఆరుగురు టీటీడీ ఉద్యోగులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని తిరుమల తిరుపతి దేవస్థానానికి సిట్ అధికార బృందం లేఖ రాసింది. డిప్యూటీ ఈవో పద్మావతితో పాటు వీఎస్ సురేష్‌కుమార్, జ్యోతీశ్వరుడు, పార్థసారథి, భోపాలన్ మురళి, వెంకట రమణ పేర్లు ఇందులో ఉన్నట్లు సమాచారం. వీరు కొనుగోళ్లు, గోదాముల విభాగంలో విధులు నిర్వర్తించారు.

ఉభయ రామేశ్వర క్షేత్రంలో కుటుంబ సమేతంగా రుద్ర హోమం చేస్తున్న హైకోర్టు జడ్జి జస్టిస్ సుబ్బారెడ్డి

చిలుమూరులో హైకోర్టు జడ్జి ప్రత్యేక పూజలు

బాపట్ల జిల్లా కొల్లూరు మండలం చిలుమూరు ఉభయ రామేశ్వర క్షేత్రాన్ని మహాశివరాత్రిని సందర్భంగా హైకోర్టు జడ్జి జస్టిస్ ఎస్.సుబ్బారెడ్డి ఆదివారం సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సమీపంలోని వేణుగోపాలస్వామి ఆలయాన్ని సందర్శించారు. తొలుత జస్టిస్ సుబ్బారెడ్డిని ఆలయ ట్రస్టీ, అర్చకులు శాలువాలు, పూలమాలలతో సత్కరించారు.

– కొల్లూరు

చంద్రబాబు అవినీతిపై సీజేఐకి లేఖ రాయడం నేరమా?

సాక్షి, టాస్క్‌ఫోర్స్: రాష్ట్రంలో జరుగుతున్న ల్యాండ్ పూలింగ్ అవినీతిపై భారత ప్రధాన న్యాయమూర్తికి ఫిర్యాదు లేఖ రాసినందుకు తనపై విజయవాడ పోలీసులు ఈ నెల 12న అక్రమంగా కేసు నమోదు చేశారని బాధితుడు చింతా రాజశేఖరరావు ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో జరుగుతున్న అవినీతి అక్రమాలపై తాను సుప్రీం కోర్టు సీజేఐకి స్పీడ్‌పోస్టు పంపినట్లు పేర్కొన్నారు. బాధ్యత గల ప్రతిపౌరుడు ఇలాగే లేఖలు రాయాలంటూ సోషల్ మీడియాలో పిలుపునిచ్చారు. రాష్ట్రంలో జరుగుతోన్న అవినీతిని ఎండగడుతూ పోస్టు పెట్టడంతో బాధితుడిపై టీడీపీ ప్రభుత్వం కక్షసాధింపు చర్యలకు దిగింది. పోస్టులో సీఎం, డిప్యూటీ సీఎంల ఫొటోలు మార్ఫింగ్ చేసి పెట్టారంటూ జనసేనకు చెందిన రాధాకిరణ్‌తో ఫిర్యాదు చేయించి, అక్రమ కేసు నమోదు చేశారు. ప్రభుత్వం చేస్తున్న అవినీతిపై సీజేఐకి లేఖ రాయడం కూడా నేరమేనాని బాధితుడు వాపోయారు.

విద్యార్థి అనుమానాస్పద మృతి

- ఉరేసుకుని చనిపోయాడని చెబుతున్న పాఠశాల యాజమాన్యం
- తమ కుమారుడిని చంపేసి.. ఆత్మహత్యగా చిత్రీకరిస్తున్నారని తల్లిదండ్రుల ఆరోపణ
- ప్రకాశం జిల్లా సింగరాయకొండ మండలంలోని శ్రీ చైతన్య నవోదయలో ఘటన

తౌషిక్ (ఫైల్)

పాఠశాల వద్ద ఆందోళన చేస్తున్న కుటుంబసభ్యులు, బంధువులు

సింగరాయకొండ: ప్రకాశం జిల్లా సింగరాయకొండ మండలం మూలగుంటపాడులోని శ్రీ చైతన్య నవోదయ స్కూలులో శనివారం రాత్రి ఓ విద్యార్థి అనుమానాస్పద స్థితిలో మరణించాడు. వివరాలు.. కనిగిరికి చెందిన సయ్యద్ ఆలీ, భార్య మౌలాబికి ఇద్దరు కుమారులు. రెండో కుమారుడు తౌషిక్(11) మూలగుంటపాడులోని శ్రీచైతన్య నవోదయలో ఆరో తరగతి చదువుతున్నాడు. పాఠశాల వార్డెన్ బాబ్జి తరుచూ తౌషిక్‌ను కొడుతుండటంతో.. కరస్పాండెంట్ రమణారెడ్డికి విద్యార్థి తల్లిదండ్రులు ఇటీవల ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో శనివారం రాత్రి వార్డెన్ బాబ్జి సెల్‌ఫోన్ నుంచి తౌషిక్ తన తల్లి మౌలాబితో ఆనందంగా మాట్లాడాడు. ఆ తర్వాత అరగంటకే పాఠశాల నిర్వాహకుల నుంచి తౌషిక్ తల్లిదండ్రులకు ఫోన్ వచ్చింది. మీ కుమారుడు బాత్రూంలో టవల్‌తో ఉరేసుకున్నాడని.. కందుకూరు ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్తున్నామని చెప్పడంతో వారు ఆందోళనకు గురయ్యారు. వెంటనే ఆస్పత్రి వద్దకు వెళ్లగా.. తమ కుమారుడి మృతదేహాన్ని అప్పగించేసి వెళ్లిపోయారంటూ తౌషిక్ తల్లిదండ్రులు విలపించారు. తన సెల్‌ఫోన్‌ను ఉపయోగించినందుకు వార్డెన్ బాబ్జి కొట్టడంతో తౌషిక్ స్పృహ తప్పి పడిపోయాడని సహ విద్యార్థులు చెప్పినట్లు తల్లిదండ్రులు తెలిపారు. పాఠశాల నిర్వాహకులు మాత్రం తౌషిక్ బాత్రూంలోని హ్యాంగర్‌కు ఉరేసుకొని చనిపోయాడంటున్నారని వాపోయారు. ఆ హ్యాంగర్ పిల్లల చేతికి అందే ఎత్తులో ఉందని.. దానికెలా ఉరేసుకొని చనిపోతాడంటూ వారు ప్రశ్నించారు. గొంతుపై గాట్లు ఎందుకున్నాయని నిలదీశారు. తమ కుమారుడిని చంపేసి.. ఆత్మహత్యగా చిత్రీకరిస్తున్నారని తండ్రి ఆలీ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఆదివారం తౌషిక్ మృతదేహంతో తల్లిదండ్రులు, బంధువులు పాఠశాల వద్ద ధర్నా చేశారు. కరస్పాండెంట్ రమణారెడ్డి, ఆయన కుమారులిద్దరూ పరారయ్యారని తెలియడంతో.. పాఠశాలపై దాడి చేసి పలు వస్తువులను ధ్వంసం చేశారు. ఎస్సై బి.మహేంద్ర పాఠశాల వద్దకు చేరుకొని.. వారికి నచ్చజెప్పి పంపించేశారు.

జస్టిస్ సంజయ్ కరోల్‌కు అప్పన్న చిత్రపటాన్ని అందజేస్తున్న ఈవో

అప్పన్న సన్నిధిలో సుప్రీం కోర్టు న్యాయమూర్తి

సింహాచలం శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సంజయ్ కరోల్ ఆదివారం దర్శించుకున్నారు. అనంతరం ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకుని బేడా మండపంలో ప్రదక్షిణ చేశారు. అర్చకులు వేద ఆశీర్వచనం అందజేశారు. ఈవో స్వామివారి చిత్రపటం, శేషవస్త్రం, ప్రసాదం అందజేశారు.

– సింహాచలం

ఆలయం వెలుపల హైకోర్టు న్యాయమూర్తి కృష్ణమోహన్ దంపతులు

త్రికోటేశ్వరుని సన్నిధిలో న్యాయమూర్తులు

పల్నాడు జిల్లా నరసరావుపేటలోని కోటప్పకొండ త్రికోటేశ్వర స్వామిని హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ బి.కృష్ణమోహన్, జస్టిస్ కె.సురేష్ రెడ్డి, జస్టిస్ వి. సుజాత, జస్టిస్ పీవీ జ్యోతిర్మయి దర్శించుకున్నారు. వారిని అర్చకులు ఆశీర్వదించగా, అధికారులు స్వామివారి చిత్రపటం, ప్రసాదాలు అందజేశారు.

– సాక్షి, నరసరావుపేట

రోదసిలో నిఘా యుద్ధం!

అంతరిక్షంలో ఉపగ్రహాలతో దేశాల నిఘా యుద్ధం ● వైరి దేశాల శాటిలైట్లపై దృష్టి సారించిన వైనం

జేమ్స్‌బాండ్ సినిమాల్లో హీరో అలవోకగా ఖండాలన్నీ చుట్టేస్తుంటాడు. చట్టవ్యతిరేక, విద్రోహ సంస్థల గుట్టుమట్లు రట్టుచేసి భారీ ఉపద్రవాలను అడ్డుకుంటాడు. శత్రువుల రహస్య స్థావరాలను నేలమట్టం చేస్తుంటాడు. ఈ నిఘా పోరు 21వ శతాబ్దపు వాస్తవిక ప్రపంచంలో భూమిని దాటేసి ఏకంగా అంతరిక్షానికి చేరింది! ఇంతకాలం నేలల తేమ శాతం, అతివృష్టి, అనావృష్టి, భూకంపాలు తదితరాలపై అధ్యయనం చేస్తూ వచ్చిన ఉపగ్రహాలు నిఘా కార్యకలాపాల్లో తలమునకలు అవుతున్నాయి. వైరి దేశాల ఉపగ్రహాలపై కన్నేస్తున్నాయి. ఏ సమయంలో ఏ దేశంపై ఎందుకు తిరగాడుతున్నాయో కూపీ లాగుతున్నాయి. ప్రధాన దేశాలన్నీ దాదాపుగా ఇదే బాటపట్టడంతో ఇప్పుడు అంతరిక్షంలో సరికొత్త శాటిలైట్ నిఘా యుద్ధానికి తెర లేచింది. బెంగళూరుకు చెందిన దిగంతర సంస్థ ఒకటి ఇటీవల ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్‌కు చెందిన స్టార్‌లింక్ శాటిలైట్ల జాడను విజయవంతంగా కనిపెట్టడం తెలిసిందే. హైదరాబాద్‌కు చెందిన అజిస్టా స్పేస్ సంస్థ ఏకంగా అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం(ఐఎస్ఎస్) ఎప్పుడు, ఎక్కడ తిరుగుతోందో కనిపెట్టి ఔరా అనిపించింది. వీటిని ఒకరకంగా ఇతర ఉపగ్రహాలపై నిఘా ఘటనలుగానే చెప్పొచ్చు. శత్రు ఉపగ్రహాల జాడను కనిపెట్టేందుకు సరికొత్త 'స్పేస్ సిచ్యువేషనల్ అవేర్‌నెస్' (ఎస్ఎస్ఏ) పరిజ్ఞానం ఇప్పుడు కీలకంగా మారింది. రెండు ఉపగ్రహాలు పొరపాటున ఢీకొనే ఆస్కారాన్ని తప్పించడమే గాక వాటి సిగ్నళ్లను జామ్ చేయడం, శాటిలైట్‌ను ధ్వంసం చేయడాన్ని నిలువరించడం కోసం ముందు ప్రత్యర్థి ఉపగ్రహాలు ఎక్కడున్నాయో కనీసం పక్కాగా తెలిసి ఉండాలి. ఈ కారణంగా కూడా నింగిలో నిఘా నేత్రాన్ని తెర

వాల్సిన అనివార్యత దేశాలకు ఏర్పడిందని ఇండియన్ స్పేస్ అసోసియేషన్ డైరెక్టర్ జనరల్ లెఫ్టినెంట్ జనరల్ (రిటైర్డ్) ఏకే భట్ అన్నారు. ఈ నేపథ్యంలో 'స్పైయింగ్ ఇన్ స్కై' ఇప్పుడిక ఎంతమాత్రమూ సైన్స్‌ఫిక్షన్ స్థాయికి పరిమితం కాలేదు. భూమిపై జేమ్స్‌బాండ్ చేసే పనినే ఇప్పుడు ఆకాశంలో కృత్రిమ ఉపగ్రహాలు విస్తృతస్థాయిలో చేయబోతున్నాయి. ఇందులో ఆధిపత్యం ఎవరిదో భవిష్యత్తులో తేలిపోనుంది.

ఎవరు గమనిస్తున్నారో తెలిసుండాలి

''కమ్యూనికేషన్, సైనిక, పౌర, పరిశోధనావసరాల కోసం ఉపగ్రహాలను ప్రయోగిస్తున్నా అవి రహస్య పనులనూ చేస్తున్నాయి. ఇతర దేశాల ఉపగ్రహాలు భారత్‌లోని ఏఏ భూభాగాలపై ఎందుకు తిరుగుతున్నాయో కచ్చితంగా మనకు తెల్సి ఉండాల్సిందే. ఇది నిఘా, వ్యూహాత్మక ఆపరేషన్లకు అత్యంత కీలకం. అందుకే శత్రు దేశాల ఉపగ్రహాలపై నిఘా పెట్టాల్సిన అవసరం ఏర్పడింది'' అని అజిస్టా స్పేస్‌లో స్పేస్‌క్రాఫ్ట్ ఇంజనీరింగ్ విభాగ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ భరత్ సింహా రెడ్డి చెప్పారు. ''ఉక్రెయిన్–రష్యా యుద్ధం మొదలు ఆపరేషన్ సిందూర్‌దాకా ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న యుద్ధాలకు కీలక సమాచారం ఉపగ్రహాల నుంచే అందింది. కమ్యూనికేషన్స్, ఇంటెలిజెన్స్, నేవిగేషన్, టార్గెట్ ఇలా అన్ని విభాగాలను పటిష్టంచేయడంలో శాటిలైట్లే కీలక పాత్ర పోషించాయి'' అని దిగంతర సీఈఓ, వ్యవస్థాపకులు అనిరుధ్ శర్మ అన్నారు.

సామర్థ్యాన్ని పెంచుకుంటున్న భారత్

స్పేస్ సిచ్యువేషనల్ అవేర్‌నెస్ (ఎస్ఎస్ఏ)లో ప్రైవేట్ భాగస్వాములను ప్రోత్సహిస్తూ భారత్ అంతర్జాతీయ నిఘా సామర్థ్యాన్ని పెంచుకుంటోంది. ఏటా ఆరు నుంచి పది ఉపగ్రహాలను తయారు చేసేలా అజిస్టా సంస్థ కొత్త ఎల్రక్టో–ఆప్టికల్ పేలోడ్ తయారీ కర్మాగారాన్ని నిర్మిస్తోంది. ఇది 2027 ద్వితీయార్ధంలోపు ప్రారంభం కావచ్చు. శత్రువులు ప్రయోగించే క్షిపణుల జాడను శాటిలైట్ ద్వారా గుర్తించే కొత్త ఉపగ్రహాన్ని 2027లోపు ప్రయోగిస్తామని ఈ సంస్థ తెలిపింది. అంతరిక్షంలో అర్లీ వార్నింగ్ సిస్టమ్‌ను ఇది మరింత పటిష్టపరచనుంది. సాంప్రదాయకంగా భూతలంపై రాడార్ వ్యవస్థలు, ఆకాశంలో చక్కర్లు కొట్టే నిఘా విమానాలకు తోడుగా ఇప్పుడు అంతరిక్షంలోనూ నిఘా ఉపగ్రహాల రాకతో భారత రక్షణ వ్యవస్థ మరింత పటిష్టం కాబోతోంది.

– సాక్షి, నేషనల్ డెస్క్

ఏఐ మేధోమథనం

నేటి నుంచే ఇండియా ఏఐ ఇంపాక్ట్ సదస్సు

- ప్రధాని మోదీ చేతుల మీదుగా ఆరంభం
- 20 దేశాల అధినేతలు, మంత్రుల రాక
- 40 మందికి పైగా సీఈఓలు కూడా
- జాబితాలో పిచాయ్, ఆల్ట్‌మన్ తదితరులు
- ఐదు రోజుల పాటు విస్తృత చర్చలు

న్యూఢిల్లీ: విద్యుత్ ఆవిష్కరణ తర్వాత మళ్లీ ఇన్నాళ్లకు ప్రపంచవ్యాప్తంగా అన్ని వ్యవస్థల్లోనూ సమూల మార్పులకు కారణమవుతున్న కృత్రిమ మేధ సాంకేతికతపై కూలంకషమైన చర్చకు దేశ రాజధానిలోని భారత్ మండపం సిద్ధమైంది. సోమవారం నుంచి 20వ తేదీ దాకా ప్రతిష్టాత్మక ఇండియా ఏఐ ఇంపాక్ట్ సదస్సు జరగనుంది. ఇందుకోసం భారీ స్థాయిలో ఏర్పాట్లుచేశారు. ప్రధాని నరేంద్ర మోదీ చేతుల మీదుగా సాయంత్రం ఐదింటికి సదస్సు ప్రారంభమవుతుంది. ఇందులో పాల్గొనేందుకు 45 దేశాలకు చెందిన మంత్రుల బృందాలు ఇప్పటికే ఢిల్లీకి చేరుకున్నాయి. ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెరస్ సహా పలు అంతర్జాతీయ సంస్థల అధ్యక్షులు సైతం సదస్సులో కీలక ప్రసంగాలు చేయనున్నారు. ఐదు రోజుల్లో 700కుపైగా సెషన్స్ నిర్వహించనున్నారు. 20 దేశాల అధినేతలు సదస్సుకు హాజరవుతారని భావిస్తున్నారు. మోదీ ఆహ్వానం మేరకు ఫ్రాన్స్ అధ్యక్షుడు ఎమ్మాన్యుయేల్ మేక్రాన్, బ్రెజిల్ అధ్యక్షుడు లూలా డసిల్వా తదితరులు రానున్నారు. సురక్షిత కృత్రిమ మేధ, ఏఐ నిర్వహణ, నైతిక విలువలతో కూడిన ఏఐ, డేటా భద్రత, ఏఐలో భారత్ స్వయంసమృద్ధి, దేశీయంగా వ్యూహాత్మక రంగాలకు కొత్త ఏఐ మోడళ్ల తయారీ వంటి అంశాలపై నిపుణులు, విధాన కర్తలు చర్చించనున్నారు.

కీలక సంస్థ సీఈఓల ప్రసంగాలు

దక్షిణార్ధ గోళంలో జరుగుతున్న తొలి ఏఐ సదస్సు కావడంతో దీనిపై అందరి దృష్టీ నెలకొంది. గూగుల్ సీఈఓ సుందర్ పిచాయ్, ఓపెన్ఏఐ సీఈఓ శ్యామ్ ఆల్ట్‌మన్, డీప్‌మైండ్ టెక్నాలజీస్ సీఈఓ డెమిస్ హస్సాబీస్, ఆంత్రోపిక్ సీఈఓ డేరియో ఆమోడెయి, మైక్రోసాఫ్ట్ అధ్యక్షుడు బ్రాడ్ స్మిత్, అడోబ్ సీఈఓ శంతను నారాయణ వంటి దిగ్గజాలు సైతం సదస్సులో ప్రసంగించనున్నారు. సదస్సుతోపాటు ఇండియా ఏఐ ఇంపాక్ట్ ఎక్స్‌పో–2026ను కూడా నిర్వహిస్తున్నారు. ఎక్స్‌పోను సందర్శించాక ప్రధాని మోదీ దిగ్గజ సంస్థల సీఈఓలతో భేటీ అయ్యే అవకాశముంది.భారత్‌లోని ఏఐ అంకుర సంస్థలు తమ నూతన ఆవిష్కరణలను సదస్సు వేదికగా ప్రకటించే ఆస్కారముంది. ప్రజారోగ్యం, వ్యవసాయం, ఆర్థిక, విద్య, కార్పొరేట్ రంగాల్లో రాబోతున్న మార్పులకు ఏఐ ఏవిధంగా ఇతోధికంగా దోహదపడుతుందో వక్తలు వివరించనున్నారు. 2025లో ఫ్రాన్స్‌లోని పారిస్‌లో, 2024లో దక్షిణకొరియాలోని సియోల్‌లో, 2023లో బ్రిటన్‌లోని బ్లెచ్లీ పార్క్‌లో ఏఐ సదస్సులు జరిగాయి. ప్రపంచంలోనే అతి పెద్ద డిజిటల్ ప్రజా మౌలిక సదుపాయాల వ్యవస్థల్లో భారత్ ఒకటి కావడంతో ఈసారి ఢిల్లీలో నిర్వహిస్తున్నారు. ''ఈ రంగంలో ఎంతటి మార్పులొచ్చినా మానవీయ, సమ్మిళిత కోణంలోనే అవి జరగాలనే సందేశం విన్పిస్తున్నాం. ఏఐ వనరులు ప్రజాస్వామ్యయుతంగా అందరికీ అందుబాటులో ఉండాలి'' కేంద్ర ఐటీ శాఖ కార్యదర్శి ఎస్.కృష్ణన్ చెప్పారు. ఏఐ రంగంలో భారత్ తన సామర్థ్యాన్ని పెంచుకోవడంతో పాటు ఇక్కడి యువతలో ఏఐ పట్ల మక్కువ పెంచే ఉద్దేశంతో ఢిల్లీలో ప్రతిష్టాత్మకంగా మోదీ సర్కార్ ఈ సదస్సును నిర్వహిస్తోంది. పలు దేశాల ప్రభుత్వాలు, అంతర్జాతీయ ఏఐ రంగ సంస్థలు, పరిశోధకులు, స్టార్టప్‌లు, విద్యార్థులు, పౌరులు ఇందులో పాల్గొననున్నారు. ''ప్రపంచంలోనే అత్యధిక యువకార్మికశక్తి భారత్‌లోనే ఉంది. ఇక్కడ జనాభాలో 65 శాతం మంది వయసు 35 ఏళ్లలోపే. ఈ యువతరంలో ఏఐపై అనురక్తిని పెంచి ఏఐ బాటలు పయనించేలా చేస్తే ఈ రంగంలో భారత్ ఎన్నెన్నో అద్భుతాలు చేయగలదని, ఇక్కడ ఏఐ ఆధారిత పరిశ్రమలు పెరిగి, ఆవిష్కరణలు ఎక్కువై, డిజిటల్ సేవలు విస్తరించి, ఉపాధి అవకాశాలు భారీ స్థాయిలో పెరుగుతాయి'' అని ఏఐరంగ నిపుణులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. సదస్సులో ఓపెన్ఏఐ, ఆంత్రోపిక్, మైక్రోసాఫ్ట్, గూగుల్ తమ కొత్త ఏఐ ఉత్పత్తులపై సదస్సు వేదికగా ప్రకటనలు చేయొచ్చని చెబుతున్నారు.

భారతీయ ఏఐపైనే దృష్టి

ఏఐ సదస్సులో ప్రధానంగా భారతీయ ఏఐపైనే అందరి దృష్టీ నెలకొననుంది. ఫౌండేషన్ మోడల్ పిల్లర్ కార్యక్రమంలో భాగంగా ప్రధాని మోదీతో ఇప్పటికే 12 భారతీయ అంకురసంస్థలు భేటీ అయ్యాయి. ఇండియన్ లాంగ్వేజ్ ఫౌండేషన్ మోడల్, మల్టీ లింగ్వల్ లార్జ్ లాంగ్వేజ్ మోడల్ (ఎల్ఎల్ఎం), స్పీచ్–టు–టెక్స్ట్, టెక్స్ట్–టు–ఆడియో, టెక్స్ట్–టు–వీడియో, ఇ–కామర్స్ కోసం జనరేటివ్ ఏఐతో త్రిమితీయ సమాచారం, మార్కెటింగ్, వ్యక్తిగత సమాచార సృష్టి, ఇంజనీరింగ్ సిములేషన్, మెటీరియల్ రీసెర్చ్, అధునాతన అనలైటిక్స్, ఆరోగ్యరంగంలో వ్యాధుల నిర్ధారణ, వైద్య పరిశోధన ఇలా పలు రంగాల్లో అంకుర సంస్థలు తమ కొత్త పరిశోధనలను ఇంపాక్ట్ ఎక్స్‌పో2026లో ప్రదర్శించే ఆస్కారముంది. 70,000 చదరపు మీటర్ల విస్తీర్ణంలో ఎక్స్‌పోలో 600కుపైగా కీలక స్టార్టప్‌లు తమ ఉత్పత్తులను ప్రదర్శించనున్నాయి. ఆస్ట్రేలియా, జపాన్, రష్యా, బ్రిటన్, ఫ్రాన్స్, జర్మనీ, ఇటలీ, నెదర్లాండ్స్, స్విట్జర్లాండ్, సెర్బియా, ఇస్తోనియా, తజకిస్తాన్, ఆఫ్రికా పెవీలియన్లు సందర్శకులను ఆకట్టుకోనున్నాయి.

డేటా కేంద్రంగా మార్చండి

''ఇన్నాళ్లూ అప్లికేషన్లు, ప్లాట్‌ఫామ్‌లు, డివైజ్‌ల రంగంలో అభివృద్ధి పైనే దృష్టిపెట్టాం. అంతకంటే ముఖ్యంగా మరో ప్రాథమిక రంగంలోనూ ఆధిపత్యం కనబర్చాల్సి ఉంది. అదే డేటా సెంటర్ల ఏర్పాటు. ఇకనైనా డిజిటల్ మౌలికవసతులు, కృత్రిమ మేధారంగంలో భారత్‌ను గ్లోబల్ హబ్‌గా మార్చుకుందాం. ఈ మేరకు ప్రపంచ సమాచార స్టోరేజీకి భారత్‌ను కేంద్రంగా మార్చండి. దీంతో సాంకేతిక విప్లవంతో మరో సంస్కరణల తరంగాలను సృష్టించండి. ఈ రంగంలో పెట్టుబడులను పెంచేందుకే తాజా బడ్జెట్‌లో పన్ను రాయితీలను ప్రకటించాం. సదుపాయాల కల్పన ఖర్చులను తగ్గించాం. తద్వారా డేటా ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌లో భారత్‌ను అంతర్జాతీయ ప్రధాన పోటీదారుగా మార్చండి'' అని మోదీ అన్నారు.

సరైన వేదిక భారత్: గుటెరస్

''అభివృద్ధిచెందుతున్న ఆర్థికవ్యవస్థగా భారత్ విజయపథంలో దూసుకుపోతోంది. ఇలాంటి భారత్ ఈ సదస్సుకు సరైన వేదిక. సూపర్‌పవర్ లాంటి రెండు శక్తివంతమైన దేశాలు లేదా అభివృద్ధి చెందిన దేశాలకు మాత్రమే ఏఐ ఫలాలు దక్కొద్దు. యావత్ ప్రపంచదేశాలూ ఏఐ ప్రయోజనాలను పొందాలి. ఈ సదస్సును నిర్వహిస్తున్న భారత్‌కు అభినందనలు. ఏఐ స్వతహాగా వృద్ధిచెందితే అది అందరి ఉపయోగకరమే'' అని ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెరస్ అన్నారు.

జమ్మూకశ్మీర్‌లో భారీ హవాలా రాకెట్

8 వేల నకిలీ బ్యాంకు ఖాతాలు సీజ్

న్యూఢిల్లీ/శ్రీనగర్: జమ్మూకశ్మీర్‌లో భారీ హవాలా రాకెట్ వ్యవస్థను అధికారులు ఛేదించారు. ప్రపంచవ్యాప్త స్కామ్ నెట్‌వర్క్‌లకు ఆర్థిక వెన్నెముకగా నిలుస్తూ, జమ్మూకశ్మీర్‌లో విస్తరిస్తున్న 'మ్యూల్ అకౌంట్స్' దందాను బయటపెట్టారు. జమ్మూకశ్మీర్ వ్యాప్తంగా నిర్వహిస్తున్న 8 వేలకు పైగా మ్యూల్ ఖాతాలను అధికారులు సీజ్ చేశారు. మనీలాండరింగ్ నేరగాళ్లు ఈ వ్యవస్థను మూడేళ్లుగా నడిపిస్తున్నట్లు గుర్తించారు. ఈ ఖాతాల ద్వారా మళ్లించిన నిధులను వేర్పాటువాదం, దేశ వ్యతిరేక కార్యకలాపాల కోసం మళ్లించి ఉంటారని అనుమానిస్తున్నారు. అక్రమంగా సంపాదించిన డబ్బును చట్టబద్ధమైనదిగా చూపించడానికి ఇతరుల బ్యాంక్ ఖాతాలను ఉపయోగించడమే 'మనీ మ్యూలింగ్'. ఈ ఖాతాలను నిర్వహించే వారిని 'మనీ మ్యూల్స్' అంటారు. ఖాతాదారులకు తెలియకుండా లేదా వారికి కొంత కమీషన్ ఆశచూపిన నేరగాళ్లు తమ గుర్తింపు బయటపడకుండా ఈ ఖాతాలను నిర్వహిస్తున్నారు. 2017లో ఎన్ఐఏ కశ్మీర్‌లోని ఉగ్రవాద సంస్థల నిధుల సేకరణ నెట్‌వర్క్‌ను బట్టబయలు చేయడంతో అక్రమార్కులు ఈ 'డిజిటల్ హవాలా'మార్గాన్ని ఎంచుకున్నారని అంటున్నారు. ఈ ఖాతాలను సైబర్ నేరాల గొలుసులో అత్యంత బలహీనమైన, అత్యంత కీలకమైన లింక్ అని వారు చెబుతున్నారు. ఎందుకంటే నకిలీ ఖాతాలు లేకుండా, దోచుకున్న సొమ్మును జాడ దొరకని క్రిప్టోకరెన్సీ రూపంలోకి మార్చడం అసాధ్యమని పేర్కొంటున్నారు. డబ్బు ఆశతో నేరగాళ్లకు తమ బ్యాంకు ఖాతాలను అప్పగించే వారు బాధితులు మాత్రమే కాదు, నేరగాళ్లకు వంతపాడుతున్నట్లేనని అధికారులు హెచ్చరిస్తున్నారు.

అమెరికాతో ఒప్పందం మాటున ద్రోహం

మోదీ సర్కారుపై రాహుల్ ధ్వజం ● ఐదు ప్రశ్నలు సంధించిన కాంగ్రెస్ నేత

సాక్షి, న్యూఢిల్లీ: అమెరికాతో వాణిజ్య ఒప్పందం పేరుతో రైతులకు మోదీ సర్కారు తీవ్ర ద్రోహం తలపెడుతోందని ఆదివారం ఆరోపించారు. ఈ విషయమై ప్రధాని మోదీకి ఆయన పలు ప్రశ్నలు సంధించారు. ''ఇంపోర్ట్ డ్రైడ్ డిస్టిలర్స్ గ్రెయిన్ (డీడీజీ) అంటే ఏమిటి? అమెరికాలో మద్యం తయారీ తర్వాత మిగిలే జన్యుపరివర్తిత (జీఎం) మొక్కజొన్న వ్యర్థాలను మన పశువులకు దాణాగా వేస్తారని దాని అర్థమా? అదే జరిగితే మన పాల ఉత్పత్తులు పూర్తిగా అమెరికా వ్యవసాయ రంగంపై ఆధారపడవా? జీఎం సోయా నూనె దిగుమతులకు అనుమతిస్తే ఆ ప్రభావం మన సోయా రైతులపై పడదా? సోయా ఉత్పత్తుల ధరలు మరింతగా తగ్గితే వారు తట్టుకోగలరా? ఒప్పందంలో అదనపు ఉత్పత్తులనే ప్రస్తావన ఉంది. ముున్ముందు పప్పు ధాన్యాలు, ఇతర పంటలను కూడా దిగుమతి చేసుకోవాలని అమెరికా మనపై ఒత్తిడి పెంచుతుందని దీనర్థమా? వాణిజ్య అవరోధాలను తొలగించడమంటే ఏమిటి? జీఎం పంటలు, పంటల సేకరణను తగ్గించడం, కనీస మద్దతు ధర, బోనస్‌లు వంటివాటిని తగ్గించడమా? అమెరికా వ్యవసాయోత్పత్తులకు ఒక్కసారిగా తలుపులు తెరిస్తే, ఏటికేడు మరింతగా ఒత్తిడులు పెరుగుతాయి. వాటిని అడ్డుకుంటామా, లేక లొంగిపోతామా? మన సాగు రంగంపై విదేశీ పెత్తనానికి అనుమతిస్తున్నామా?'' అని రాహుల్ ప్రశ్నించారు.

రాహుల్ చెప్పేవన్నీ అసత్యాలు

హోం మంత్రి అమిత్ షా విమర్శ ● బహిరంగ చర్చకు రావాలంటూ సవాల్

గాంధీనగర్: అమెరికా, యూకే, ఈయూతో వాణిజ్య ఒప్పందాలపై కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ఆరోపణలను కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఆదివారం తీవ్రంగా ఖండించారు. రాహుల్ రైతులను తప్పుదోవ పట్టించడంతో పాటు అబద్ధాలను ప్రచారం చేస్తున్నారంటూ మండిపడ్డారు. ఆయనకు చేతనైతే బహిరంగ చర్చకు రావాలని సవాల్ విసిరారు. చర్చా వేదికను ఆయనే నిర్ణయించుకోవచ్చన్నారు. మన రైతులు, డెయిరీ ఉత్ప త్తులకు కేంద్రం పూర్తి రక్షణ కల్పిస్తుందని భరోసా ఇచ్చారు. ''వాణిజ్య ఒప్పందాలు మన రైతులకు హాని చేస్తాయన్న కాంగ్రెస్ ఆరోపణలు హాస్యాస్పదం. ప్రజలను తప్పుదోవపట్టించడంలో ఆ పార్టీ నేతలు సిద్ధహస్తులు. నిజానికి యూపీఏ హయాంలో కుదుర్చుకున్న పలు ఒప్పందాలు మన వ్యవసాయ రంగాన్ని దెబ్బతీసేలా ఉన్నాయి. వాటిలోని ప్రమాదకరమైన అంశాలను మోదీ ప్రభుత్వం రాగానే తొలగించింది'' అని అమిత్ షా చెప్పారు.

తదుపరి దశాబ్దిలోకి... త్రికరణ శుద్ధితో!

నిర్మాణాత్మక సంస్కరణలు, వినూత్న ఆవిష్కరణలు, సులభతర పాలన

ఇవే మా ప్రభుత్వ లక్ష్యాలు: మోదీ ● సంస్కరణల ఎక్స్‌ప్రెస్‌తో సత్వర ప్రగతి

న్యూఢిల్లీ: పదేళ్లకు పైగా తమ ప్రభుత్వం తలపెట్టిన పలు సంస్కరణలతో సామాన్య పౌరులకు భారీ స్థాయిలో లబ్ధి చేకూరుతోందని ప్రధాని నరేంద్ర మోదీ వ్యాఖ్యానించారు. ఆదివారం పీటీఐ వార్తా సంస్థకు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో పలు అంశాలపై ఆయన సుదీర్ఘంగా మాట్లాడారు. ''నిర్మాణాత్మక సంస్కరణలు, మరింత విస్తృత ఆవిష్కరణలు, మరింత సులభతర పాలన. వచ్చే దశాబ్దంలో ఈ మూడు కీలక సంస్కరణలకు కట్టుబడతా. సంస్కరణల్లో పోటీతత్వాన్ని, ఉత్పాదకతను పెంచాలి. తర్వాత సాంకేతికత, తయారీ, సేవల రంగంల వినూత్న ఆవిష్కరణలను సుసాధ్యం చేయాలి. పౌరులు, ప్రభుత్వాలు, పరిశ్రమల మధ్య మరింత సమన్వయం సాధించాలి. అప్పుడే పరిపాలన అత్యంత సులభతరం అవుతుంది. ప్రజల విశ్వాసమూ బలపడుతుంది. ఇప్పటికే మేం తెచ్చిన సంస్కరణలతో దళారీ వ్యవస్థ దోపిడీ తగ్గిపోయింది. మౌలిక వసతుల విస్తరణతో రాష్ట్రాల మధ్య అనుసంధానత పెరిగి రవాణా ఖర్చులు భారీగా తగ్గాయి. సంస్కరణలనే పదం వినగానే ఆర్థిక, పరిశ్రమలకే పరిమితమవుతాం. వాస్తవానికి సంస్కరణలు సామాజిక రంగంలో కీలకమైనవి. ఒకప్పుడు వెనకబాటుకు గురైన ప్రాంతాలు ఇప్పుడు ఆశావహ (ఆస్పిరేషనల్) జిల్లాలు, బ్లాకులుగా అభివృద్ధి చెందాయి. గతంలో అభివృద్ధికి నోచుకోని గిరిజనులకు పీఎం–జన్‌మన్ పథకం ఎంతగానో ఉపయోగపడుతోంది. సంస్కరణల ఎక్స్‌ప్రెస్‌తో దేశంలో ఎంతో అభివృద్ధి జరిగింది. దేశాన్ని, ప్రజలను ఇంకా ముందుకు తీసుకెళ్లాలనే బలమైన కాంక్ష నాలో రగులుతోంది'' అని అన్నారు.

అందుకు గర్విస్తున్నా

''నత్తనడకన సాగే దశలవారీ సర్దుబాట్ల స్థాయి నుంచి వ్యవస్థీకృత సంస్కరణల దిశలోకి భారత్‌ను తీసుకొచ్చాం. ఈ విషయంలో ఎంతగానో గర్విస్తున్నా. ఉదాహరణకు వస్తుసేవల పన్ను (జీఎస్టీ) వచ్చాక రెండు శ్లాబుల పన్నులతో కుటుంబాలు మొదలు సూక్ష్మ,చిన్న,మధ్యతరహా పరిశ్రమల, అధిక కార్మిక ఆధారిత రంగాల కష్టాలు తీరాయి. చిన్న కంపెనీల నిర్వహణ వ్యయాలు తగ్గాయి. బీమా రంగంలోకి 100 శాతం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులతో నచ్చిన బీమా కంపెనీని పోర్టబుల్‌గా ఎంచుకునే వెసులుబాటు సగటు భారతీయునికి అందుబాటులోకి వచ్చింది. అభివృద్ధికి నోచుకోని రంగాలకు మంత్రిత్వ శాఖలను ఏర్పాటుచేశాం. దాంతో నైపుణ్యాభివృద్ధి, ఫిషరీ, సహకార సంఘాలు, ఆయుష్ వంటివి వేగంగా వృద్ధి చెందుతున్నాయి. యూపీఐ చెల్లింపులతో భారత్ డిజిటల్ లీడర్‌గా ఎదుగుతోంది. స్టార్టప్‌ల్లోనూ దూసుకెళ్తోంది. మన యువతరం కొత్త ఆర్థికవ్యవస్థను సృష్టిస్తోంది'' అన్నారు.

సంస్కరణల ఫలాలు సిందూర్ వేళ చేతికి

''భద్రతా సవాళ్లను అన్ని వేళలా సర్వసన్నద్ధంతో ఎదుర్కోవాలి. ఆ మేరకు దశాబ్దం క్రితం చేపట్టిన రక్షణ రంగ సంస్కరణల ఫలాలు ఆపరేషన్ సిందూర్ వేళ చేతికొచ్చాయి. రక్షణ రంగం ఆధునీకరణలో భాగంగా బడ్జెట్‌లో దానికి కేటాయింపులు ఏకంగా 15 శాతం పెంచాం. రక్షణరంగంలో స్వయంసమృద్ధికి ఎన్‌డీఏ సర్కారు కృషి చేస్తోంది'' అని మోదీ అన్నారు.

యూపీఏ ఉండుంటే వాణిజ్య చర్చలు హుళక్కే

''అమెరికా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, బ్రిటన్ దేశాలతో పాటు యూరోపియన్ యూనియన్ కూటమితో కీలక వాణిజ్య ఒప్పందాలు కుదుర్చుకున్నాం. దీంతో సూక్ష్మ,చిన్న, మధ్యతరహా పరిశ్రమల వంటి అధిక కార్మికుల ఆధారిత పరిశ్రమల ఉత్పత్తులకు అంతర్జాతీయ మార్కెట్లోకి అవకాశాలు పెరిగాయి. ఇవన్నీ మన పోటీతత్వమున్న స్థానిక పరిశ్రమలు, విశ్వసనీయ ధోరణితో సాధ్యమయ్యాయి. గతంలో యూపీఏ ప్రభుత్వాలు సైతం విదేశాలతో వాణిజ్య ఒప్పందాలకు ప్రయత్నించి ఘోరంగా విఫలమయ్యాయి. ఆర్థికనిర్వహణలో అసమర్థతే దీనికి అసలు కారణం. ఇంకా యూపీఏ సర్కార్ ఉండి ఉంటే వాణిజ్య ఒప్పందాలు కలగానే మిగిలిపోయేవి'' అని మోదీ అన్నారు.

పనిపై ఎప్పుడూ సంతృప్తి చెందను

ప్రజాజీవితం అంటేనే విశ్రాంతిలేకుండా పని చేయడమని ప్రధాని మోదీ అభిప్రాయపడ్డారు. ''సంస్కరణల ఎక్స్‌ప్రెస్‌తో ఒనగూరిన అభివృద్ధి, చేసిన పని విషయంలో నేనెప్పుడూ సంతృప్తి చెందలేదు. ఇంకా బాగా పని చేయాలనుకుంటా. మరింత వేగంగా, మెరుగ్గా పని చేసేందుకు ఉవ్విళ్లూరుతుంటా. ప్రజల కోసం ఎంతో సాధించాలన్న బలమైన కోరిక నాలో రగిలిపోతుంటుంది. ఎందుకంటే దేశాన్ని మరింత ముందుకు తీసుకెళ్లాలి'' అని చెప్పారు.

బిర్లా తొలగింపు తీర్మానంపై...

9న చర్చ, ఓటింగ్: రిజిజు

తవాంగ్: లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాపై విపక్షాల అవిశ్వాస తీర్మానంపై మార్చి 9న చర్చ, ఓటింగ్ ఉంటాయని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరెణ్ రిజిజు ఆదివారం వెల్లడించారు. ''పార్లమెంటు రెండో దశ బడ్జెట్ సమావేశాలు మరింత రక్తి కట్టనున్నాయి. తొలి రోజే స్పీకర్‌పై అవిశ్వాస తీర్మానం సభ ముందుకు వస్తుంది. తొలి విడత భేటీల్లో విపక్షసభ్యులు లోక్‌సభలో అమర్యాదగా వ్యవహరించారు. ఇకనైనా పద్ధతి మార్చుకోవాలి. కాదని అలాగే ప్రవర్తిస్తే వాళ్లకే నష్టం. చర్చలకు పదేపదే అడ్డు తగిలితే నేరుగా గిలెటిన్ విధానానికి వెళ్తాం'' అని రిజిజు అన్నారు. ''ఉభయ సభల్లో విపక్షాలకు తగు సమాధానాలు ఇచ్చేందుకు ప్రత్యేకంగా మంత్రులనే ఎంపిక చేశాం'' అని అన్నారు. జమిలి ఎన్నికల బిల్లుపై పార్లమెంటరీ కమిటీ నివేదిక సిద్ధం కానందున ఈసారి అది సభ ముందుకు రాకపోవచ్చన్నారు.

అణు ఒప్పందంపై రాజీకి సిద్ధం

అమెరికాతో చర్చలకు ఇరాన్ సానుకూలత

టెహ్రాన్: తమ అణు కార్యక్రమం విషయంలో ఇరాన్ రాజీకి సిద్ధపడింది. ఈ విషయంలో అమెరికాతో ఒప్పందం కుదుర్చుకునేందుకు సిద్ధమని తెలిపింది. అయితే, ముందుగా తమపై విధించిన ఆంక్షలను తొలగించాలంటూ అమెరికాకు షరతు విధించింది. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలకు తోడు, గల్ఫ్ ప్రాంతానికి అమెరికాలోని ట్రంప్ ప్రభుత్వం భారీ సైనిక సంపత్తిని తరలిస్తూ ఒత్తిళ్లు తీవ్రతరం చేసిన వేళ ఇరాన్ ఈ ప్రకటన చేయడం గమనార్హం. ఇరాన్ విదేశాంగ శాఖ ఉపమంత్రి మజిద్ తఖ్త్ రవంచి బీబీసీకిచ్చిన ఇంటర్వ్యూలో ఈ విషయం తెలిపారు. ఒప్పందం కుదుర్చుకునే విషయంలో బంతి ఇప్పుడు అమెరికా కోర్టులోనే ఉందంటూ ఆయన వ్యాఖ్యానించారు. ''అమెరికా నిజాయితీగా వ్యవహరించిన పక్షంలో ఒప్పందం కుదురుతుందన్నది మా నమ్మకం. ఆంక్షల తొలగింపు ఎజెండాలో ఉంటే అణు కార్యక్రమం పరిమితులపై చర్చలకు సిద్ధం'' అని స్పష్టం చేశారు. ఇరాన్ అణు కార్యక్రమాన్ని వదలుకునేందుకు ఇరాన్ సిద్ధపడకుంటే దాడులు తథ్యమని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ హెచ్చరికలు చేయడం తెలిసిందే.

బంగ్లా ప్రధానిగా రేపు రహ్మాన్ ప్రమాణం

ఢాకా: బంగ్లాదేశ్ ఎన్నికల్లో ఘన విజయం సాధించిన తారిఖ్ రహ్మాన్ సారథ్యంలోని బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ (బీఎన్‌పీ) ప్రభుత్వం మంగళవారం కొలువుతీరనుంది. రహ్మాన్ తొలిసారి ప్రధానిగా బాధ్యతలు చేపడతారు. అధ్యక్షుడు మొహమ్మెద్ షాహబుద్దీన్ ఆయనతో ప్రమాణం చేయిస్తారు. షేక్ హసీనా ప్రభుత్వం కుప్పకూలాక ఆమెతో పాటు స్పీకర్ కూడా దేశం వీడి అజ్ఞాతంలోకి వెళ్లగా డిప్యూటీ స్పీకర్ జైల్లో ఉన్నారు. దాంతో రాజ్యాంగంలోని మూడో షెడ్యూల్ ప్రకారం నూతన పార్లమెంట్ సభ్యులతో చీఫ్ ఎలక్షన్ కమిషనర్ నజీరుద్దీన్ ప్రమాణం చేయించనున్నారు. రహ్మాన్ తండ్రి జియావుర్ రహ్మాన్ దేశాధ్యక్షునిగా, తల్లి బేగం ఖలీదా ప్రధానిగా పనిచేశారు. ఆ కుటుంబం నుంచి అత్యున్నత పదవులను అధిరోహించిన మూడో వ్యక్తిగా రహ్మాన్ నిలవనున్నారు. తాజా ఎన్నికల్లో 297 స్థానాలకుగాను బీఎన్‌పీ 209 చోట్ల గెలిచింది. అతివాద జమాతే ఇస్లామీ కేవలం 68 సీట్లకు పరిమితమైంది. జూలై ఉద్యమానికి నేతృత్వం వహించిన విద్యార్థి సంఘాలు ఏర్పాటుచేసిన నేషనల్ సిటిజెన్ పార్టీ కొత్తగా షాడో కేబినెట్‌ను ఏర్పాటు చేయనుంది. ప్రభుత్వ పనితీరును ఎప్పటికప్పుడు విమర్శించడమే లక్ష్యంగా ఈ షాడో కేబినెట్‌ను ఏర్పాటుచేస్తున్నారు.

భారత్ తరఫున ఓం బిర్లా

ప్రధానిగా తారిఖ్ రెహ్మాన్ ప్రమాణస్వీకారోత్సవానికి భారత్ తరఫున లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా హాజరుకానున్నారు. ఢాకాలో జరిగే కార్యక్రమానికి రావాలని ప్రధాని మోదీని బంగ్లాదేశ్ ఆహ్వానించగా ఆయన తరఫున భారత్ నుంచి బిర్లా ఈ కార్యక్రమంలో పాల్గొనబోతున్నారని భారత విదేశాంగ శాఖ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొంది.

బెంగళూరులో రోడ్డు ప్రమాదం

ఐదుగురి దుర్మరణం

బనశంకరి: బెంగళూరు సమీపంలో ఇటీవల కారు ప్రమాదంలో ఆరుగురు మైనర్లు, సహా ఏడుగురు దుర్మరణం చెందిన దుర్ఘటనను మరువకముందే మరో ఘోరం జరిగింది. అతి వేగంగా వెళ్తున్న కారు బస్సును ఢీకొని ఐదుగురు ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటన శనివారం అర్ధరాత్రి తుమకూరు–బెంగళూరు హైవేలో మాదనాయకనహళ్లి పరిధిలో సంభవించింది. దొడ్డబళ్లాపుర నివాసులైన దుర్గాప్రసాద్ (20), కేశవ్ (19), లలిత్‌కుమార్ (22), హర్షిత్(20), ధనుశ్(17) కారులో తుమకూరు నుంచి బెంగళూరుకు వస్తున్నారు. వేగంగా వెళ్తున్న కారు అదుపుతప్పి డివైడర్ దాటుకుని ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సును ఢీకొని పల్టీలు కొట్టింది. కారులోని అయిదుగురూ తీవ్ర గాయాలతో అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. బస్సు ముందు భాగం ధ్వంసమైంది. కొందరు ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి. మృతుల్లో ఇద్దరు విద్యార్థులు కాగా, ముగ్గురు పనులు చేసుకుంటూ జీవించేవారు.

అమెరికాలో అదృశ్యమైన భారతీయ విద్యార్థి మృతి

న్యూయార్క్: అమెరికాలో అదృశ్యమైన కర్నాటకకు చెందిన విద్యార్థి సాకేత్ శ్రీనివాసయ్య మృతి చెందారు. 22 ఏళ్ల సాకేత్ మృతదేహం శనివారం పోలీసులకు లభించినట్లు శాన్‌ఫ్రాన్సిస్కోలోని భారత కాన్సులేట్ ధ్రువీకరించింది. మృతదేహాన్ని వీలైనంత త్వరగా భారత్‌కు తరలించడానికి అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తామని, కుటుంబానికి అవసరమైన సహాయాన్ని అందిస్తామని ఒక ప్రకటనలో తెలిపింది. సాకేత్ బర్కిలీ యూనివర్సిటీలో కెమికల్ అండ్ బయోమాలిక్యులర్ ఇంజనీరింగ్‌లో మాస్టర్స్ చదువుతున్నారు. ఆయన ఫిబ్రవరి 9 నుంచి కనిపించకుండా పోయారు. మంగళవారం టిల్డెన్ రీజనల్ పార్క్‌లోని లేక్ అంజా దగ్గర కనిపించినట్టు పోలీసులు తెలిపారు. పార్క్ హిల్స్ పరిసరాల్లోని ఒక ఇంటి సమీపంలో ఆయన పాస్‌పోర్ట్, ల్యాప్‌టాప్‌తో కూడిన బ్యాక్‌పాక్ పోలీసులకు లభించింది.

పశ్చిమ డెల్టాకు నీటి విడుదల

దుగ్గిరాల:ప్రకాశం బ్యారేజీ నుంచి పశ్చిమ డెల్టాకు ఆదివారం 2,304 క్యూసెక్కులు విడుదల చేసినట్లు అధికారులు తెలిపారు. బ్యారేజీ వద్ద 11.1 అడుగుల నీటి మట్టం స్థిరంగా ఉంది.

సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ మట్టం ఆదివారం 537.50 అడుగులకు చేరింది. శ్రీశైలం నుంచి 21,176 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది.

దుర్గమ్మకు బంగారు ఆభరణాలు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మకు ఆలయ స్థానాచార్య విష్ణుభట్ల శివప్రసాద్‌శర్మ కుటుంబం రూ.4 లక్షల విలువైన బంగారు ఆభరణాలను సమర్పించింది.

రాష్ట్ర బడ్జెట్‌పై 'మన్‌కీ' బాత్

మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలకు వెన్నుపోటు

గుంటూరు ఎడ్యుకేషన్: రాష్ట్ర ఆర్థిక సంవత్సర బడ్జెట్‌లో కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో మేనిఫెస్టోలో పొందుపర్చిన హామీలను తుంగలో తొక్కింది. విద్యారంగానికి కేటాయింపులు పెంచకుండా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు అన్యాయం చేశారు. తల్లికి వందనం పథకానికి నిధులను తగ్గించడం ద్వారా వేలాది మంది విద్యార్థులను అనర్హులుగా చేయాలని ఆలోచన తగదు.

– వై.థామస్ రెడ్డి, వైఎస్సార్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు

అంకెల గారడిలా రాష్ట్ర బడ్జెట్

చీరాల:రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ అంతా అంకెల గారడిలా ఉంది. సున్నాలు పెంచుకుంటూ పోవడం వల్ల ప్రయోజనం లేదు. మేనిఫెస్టోలో ఏ విధంగా చెప్పారో అది అమలు చేయడం లేదు. సూపర్ సిక్స్ హామీలకు ఏ మేర కేటాయింపుల చేశారో స్పష్టత లేదు. నిరుద్యోగ భృతి, సున్నా వడ్డీ, ఆడబిడ్డ నిధి, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు 50ఏళ్లకే పింఛన్ వంటి హామీలకు కేటాయింపులు లేవు.

– కరణం వెంకటేష్‌బాబు, వైఎస్సార్ సీపీ చీరాల నియోజకవర్గ ఇన్‌చార్జి

కౌలు రైతులను విస్మరించిన బడ్జెట్

లక్ష్మీపురం(గుంటూరు వెస్ట్): చంద్రబాబు ప్రభుత్వం ఆర్భాటంగా ప్రవేశపెట్టిన భారీ బడ్జెట్‌లో కౌలు రైతుల పంట రుణాల ప్రస్తావనే లేదు. రాష్ట్రంలో 70 శాతం సాగుభూమిని కౌలు రైతులే సాగు చేస్తున్నారని, వారికి యజమాని సంతకంతో నిమిత్తం లేకుండా గుర్తింపు కార్డులిచ్చి పంట రుణాలు మంజూరు చేస్తామని ఎన్నికల్లో చేసిన వాగ్దానాన్ని ప్రభుత్వం విస్మరించింది. అలాగే గుంటూరు జిల్లాకు నిధులు కేటాయింపులోనూ అన్యాయం జరిగింది. 50 గ్రామాలకు తాగునీరు అందించే గుంటూరు చానల్ పర్చూరు వరకు పొడిగింపునకు, నల్లమడ వాగు ఆధునీకరణకు నిధులు కేటాయింపు లేక పోవడం శోచనీయం. సంక్షేమ రంగానికి, వ్యవసాయ అభివృద్ధికి తగిన కేటాయింపులు లేవు.

– పాశం రామారావు, కౌలు రైతుల సంఘం జిల్లా ఉపాధ్యక్షులు

పూర్తి తిరోగమన బడ్జెట్



చినగంజాం: ఇది తిరోగమన బడ్జెట్ తప్ప పేద వర్గాలకు మేలు చేసే విధంగా లేదు. సూపర్ సిక్స్ హామీలలో మహిళలకు నెలకు ఇస్తామన్న రూ.1500 బడ్జెట్‌లో కనిపించలేదు. విద్యారంగంలో రూ.15 వేల కోట్ల నుంచి రూ.14 వేల కోట్లకు కేటాయింపులు తగ్గించారు. సంక్షేమానికి 17.03 శాతం నుంచి 16 శాతానికి తగ్గించారు. అంగన్‌వాడీ, ఆశాలు వంటి స్కీం వర్కర్‌లకు సంబంధించి జీతాల పెంపుపై బడ్జెట్‌లో ఎక్కడా ప్రస్తావనే లేదు. చేనేత వర్గాలకు రిక్తహస్తం చూపారు. పేద వర్గాల వారిపై కక్షతో ఇళ్లస్థలాలు గాని, ఇళ్ళు కట్టించే పరిస్థితి లేకుండా పోయింది. ఇవన్నీ చూస్తుంటే పేద వర్గాలకు తీవ్ర అన్యాయం జరిగింది.

–బత్తుల బ్రహ్మానందరెడ్డి వైఎస్సార్‌సీపీ బాపట్ల, ప్రకాశం జిల్లాల టాస్క్‌ఫోర్స్ పరిశీలకులు

హర హర మహాదేవ..
శంభో శంకర

క్వారీలోని బాలకోటేశ్వరస్వామి ఆలయానికి పోటెత్తిన భక్తులు

క్వారీలో విద్యుత్ ప్రభల వెలుగులు

- జిల్లా నలుమూలల నుంచి తరలివచ్చిన భక్తులు
- ఇష్టానుసారంగా వీఐపీ పాసులు పంపిణీ
- సామాన్య భక్తులకు ఇక్కట్లు

క్వారీ బాలకోటేశ్వరస్వామి మూల విరాట్

క్వారీలో బాలకోటేశ్వరస్వామి దర్శనం కోసం బారులు తీరిన భక్తులు

చేబ్రోలు: హర హర మహదేవా శంభో శంకర.. చేదుకో కోటయ్యా ... అంటూ శివనామస్మరణతో మహాశివరాత్రి సందర్భంగా చేబ్రోలు మండలం వడ్లమూడి క్వారీ బాలకోటేశ్వరస్వామి మారుమోగింది. సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దిన ఆలయం వద్దకు ఆదివారం తెల్లవారుజాము నుంచే భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావటంతో ఆలయం ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది. మహాశివ రాత్రి పండుగ సందర్భంగా క్వారీ బాలకోటేశ్వర స్వామి దర్శనానికి వేలాది మంది భక్తులు తరలివచ్చారు. తిరునాళ్ల సందర్భంగా జిల్లా నలుమూలల నుంచి భక్తులు, ట్రాక్టర్లు, ఆటోలు, కార్లు, ద్విచక్ర వాహనాలతో తరలివచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. ఆర్టీసీ ప్రత్యేక బస్సు సర్వీసులను ఏర్పాటు చేసింది. చేబ్రోలు మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన భక్తులు సుమారు 15 వరకు భారీ విద్యుత్ ప్రభలను నిర్మించారు. దేవాలయం ప్రాంగణం వద్ద వంద అడుగుల పైన ఉన్న భారీ సెట్టింగ్ విద్యుత్ ప్రభలను ఏర్పాటు చేశారు. చేబ్రోలు, తెనాలి పరిసర గ్రామాల నుంచి వందల సంఖ్యలో చిన్నచిన్న ప్రభలు, బాల ప్రభలు, మొక్కుబడు ప్రభలు తరలివచ్చాయి. ఎద్దుల బండ్లు, ట్రాక్టర్లు, ఆటోలలో భక్తులు దేవాలయానికి తరలివచ్చారు. దర్శనం కోసం మహిళలు, వృద్ధులు, పిల్లలు భక్తులు క్యూలైన్లతోపాటు బయట వరకు బారులు తీరారు. గంటల తరబడి దర్శనం కోసం క్యూలైన్లో వేచి ఉండాల్సి వచ్చింది. మొక్కులు తీర్చుకోవటం కోసం మహిళలు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన షెడ్లలో పొంగళ్లు పొంగించుకున్నారు. దేవాలయ సమీపంలో జెయింట్ వీల్, రంగుల రాట్నాలు, తినుబండారాలు, పిల్లలు కొనుగోలు కోసం దుకాణాలు, చెరుకు గడల విక్రయాలు అధికంగా జరిగాయి.

మానిటరింగ్ పాయింట్ వద్ద సూచనలు చేస్తున్న జిల్లా జాయింట్ కలెక్టర్ ఆశుతోష్ శ్రీ వాస్తవ

ఎండలో వేచి ఉన్న భక్తులు

సమస్యలపై ప్రత్యేక దృష్టి

భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా వివిధ శాఖల అధికారులు పలు జాగ్రత్తలు తీసుకున్నారు. పారిశుద్ధ్యం, ట్రాఫిక్ వంటి సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించారు. అర్చక బృందం ప్రత్యేక పూజలు చేశారు. అభిషేక మండపం వద్ద భక్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం దర్శనానికి అవకాశం కల్పించారు.

పటిష్ట పోలీసు బందోబస్తు

తెనాలి డీఎస్పీ జనార్ధనరావు పర్యవేక్షణలో జిల్లా పరిధిలోని 12 మంది సీఐలు, 30 మంది ఎస్‌ఐలు, 350 మందికిపైగా పోలీసు సిబ్బందితో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.

అన్నదానం

క్వారీ బాలకోటేశ్వరస్వామి దర్శనం కోసం వచ్చే భక్తుల కోసం ఆలయ సమీప ప్రాంతంలోని రెండు చోట్ల అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటుచేశారు. ఆలయ ప్రాంగణం వద్ద పులిహోర, పొంగలి, లడ్డూ, మజ్జిగ ఉచిత పంపిణీ కార్యక్రమాన్ని వివిధ భక్త బృందాలు ఏర్పాటు చేశాయి.

కిక్కిరిసినస వీఐపీ క్యూలైన్

మహాశివరాత్రి సందర్భంగా క్వారీ బాలకోటేశ్వరస్వామి దేవస్థానం వద్దకు ఆదివారం భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ప్రత్యేక దర్శనం, ఉచిత దర్శనం కోసం క్యూలైన్‌లలో ఉన్న భక్తుల కంటే వీఐపీల కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక క్యూలైన్‌లు కిక్కిరిసిపోయాయి. వేల సంఖ్యలో వీఐపీ పాసులను ఇష్టానుసారంగా పంపిణీ చేయటంతో సామాన్య భక్తులకు తీవ్ర అసౌకర్యం కలిగింది. భక్తులు క్యూలైన్ల దాటి బయట వరకు దర్శనం కోసం వేచిఉన్నారు. మహాశివరాత్రి సందర్భంగా క్వారీ బాలకోటేశ్వర స్వామిని కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, నరసరావుపేట పార్లమెంటు సభ్యులు లావు శ్రీకృష్ణదేవ రాయులు, పొన్నూరు ఎమ్మెల్యే డి నరేంద్రకుమార్ దర్శించుకున్నారు. జిల్లా జాయింట్ కలెక్టర్ ఆశుతోష్ శ్రీ వాస్తవ మానటరింగ్ పాయింట్ వద్ద గంటలకొద్దీ కూర్చుని భక్తుల రాకపోకలను పర్యవేక్షించి సిబ్బందికి పలు సూచనలు చేశారు.

ఆకట్టుకున్న ప్రభలు

వేజండ్లకు చెందిన భక్తులు పోట్టేళ్లతో ఆకర్షణీయంగా మొక్కుబడి ప్రభలను తీసుకువచ్చారు. గరువుపాలెంకు చెందిన భక్తులు గుడి ఆకారంలో ఏర్పాటు చేసిన ప్రభ ఆకట్టుకుంది. చేబ్రోలు మండలం వేజండ్ల గ్రామానికి చెందిన రెడ్డివారి సంఘం భారీ ప్రభ భక్తులను విశేషంగా ఆకర్షించింది. మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డిపై ఉన్న ప్రేమ అభిమానంతో రాజశేఖర రెడ్డి ఫొటోను, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, బైరెడ్డి సిదార్థరెడ్డి ఫొటోలతో ఏర్పాటు చేసిన ప్రభను ప్రత్యేక ఏర్పాటు చేసిన ట్రాక్టర్‌పై మేళతాళలతో వేజండ్ల నుంచి క్వారీ గుడి వరకు ఊరేగింపుగా తరలివచ్చారు. యువత, గ్రామస్తులు, అభిమానుల కేరింతలతో సందడి చేశారు.

దేవస్థానం వద్దకు చేరుకున్న చిన్న చిన్న ప్రభలు

వేజండ్ల రెడ్డి సంఘం ఆధ్వర్యంలో ఆలయానికి తరలిస్తున్న భారీ ప్రభ

నేటి నుంచి తెలుగులో తీర్పులు

న్యాయమూర్తి పవన్ కుమార్

తెనాలి రూరల్: మాతృ భాష వారోత్సవాలను పురస్కరించుకొని కోర్టు తీర్పులు వారం రోజులపాటు తెలుగులోనే వెల్లడించనున్నట్లు ప్రధాన పౌర న్యాయమూర్తి(కనిష్ట విభాగం) ఏకా పవన్‌కుమార్ ఆదివారం తెలిపారు. తీర్పులు ప్రజల మాతృభాషలో ఉంటేనే, న్యాయస్థానాలను ఆశ్రయించే వారికి తాము ఎందుకు గెలిచామో, ఎందుకు ఓడామో కూడా స్పష్టమవుతుందని చెప్పారు. సాధ్యమైనంత వరకూ న్యాయస్థాన తీర్పులు మాతృభాషలోనే ఇవ్వడం మంచిదనీ భారత ఉన్నత న్యాయస్థానం సూచించిన విధంగా వెల్లడించనున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా తెనాలిలోని రెండో అదనపు పౌర న్యాయమూర్తి (కనిష్ట విభాగం) పల్లగాని రాజశేఖర్ కూడా ఇటీవల తెలుగులో ఒక తీర్పు వెల్లడించడం తెలిసిందే. తెలుగులో తీర్పులు రావడం చాలా ముదావహమని, కేవలం న్యాయం కోసం వచ్చే వారికే కాక, ప్రజలందరికీ కూడా న్యాయస్థాన తీర్పులు అర్థమయ్యేందుకు అవకాశం ఉంటుందనీ ప్రజలు కూడా అభిప్రాయపడుతున్నట్లు వారు వెల్లడించారు.

గోవాడకు పోటెత్తిన భక్తులు

- తెల్లవారుజాము నుంచే భక్తుల కోలాహలం
- కిక్కిరిసిన క్యూలైన్లు
- భారీగా ట్రాఫిక్ రద్దీ
- ఆకట్టుకున్న ప్రభలు

క్యూలైన్లలో బారులు తీరిన భక్తులు

వేమూరు: బాపట్ల జిల్లా అమర్తలూరు మండలం గోవాడలోని బాలకోటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణం శివనామస్మరణతో మార్మోగింది. బాలకోటేశ్వరస్వామి దర్శనం కోసం భక్తులు పోటెత్తారు. భక్తులు ఆదివారం తెల్లవారుజాము నుంచే ఆలయానికి చేరుకున్నారు. దీంతో క్యూలైన్లు భక్తులతో కిక్కిరిసిపోయాయి. భక్తుల సౌకర్యార్థం తాగునీటి వసతి ఏర్పాటుచేశారు. క్యూలైన్లలో నిల్చున్న భక్తులకు వాటర్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. సాయంత్రానికి భక్తుల రద్దీ మరింత పెరిగింది. పరిసర గ్రామాల రైతులు తమ పశువులను తీసుకొచ్చి ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేయించారు. భక్తులు పోటెత్తడంతో అదుపు చేసేందుకు పోలీసులు నానా వస్థలు పడ్డారు. బాలకోటేశ్వరస్వామి దర్శనం కోసం భక్తులు ట్రాక్టర్లు వేసుకొని వచ్చారు. గతేడాది కన్నా ఈ ఏడాది భక్తుల సంఖ్య పెరిగిందని అధికారులు చెబుతున్నారు.

భారీగా పోలీసు బందోబస్తు

శివరాత్రిని పురస్కరించుకుని ఆలయం వద్ద పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటుచేశారు. ప్రత్యేకంగా పోలీసు కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. ట్రాఫిక్ సమస్య లేకుండా పోలీసులు ఎప్పటికప్పుడు చర్యలు తీసుకున్నారు. రాత్రి సమయంలో భక్తులు ఎలాంటి ఇబ్బందులు ఏర్పడకుండా చర్యలు తీసుకున్నట్లు తెనాలి డీఎస్పీ ఆవుల శ్రీనివాసరావు తెలిపారు. దేవస్థానం చుట్టు పక్కల సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి పర్యవేక్షణ జరుపుతున్నట్లు తెలిపారు.

బాలకోటేశ్వరస్వామిని దర్శించుకున్న ప్రముఖులు

బాలకోటేశ్వరస్వామి పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్, బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ, మాజీ మంత్రి మేరుగ నాగార్జున, మార్కెట్ యార్డు చైర్మన్ గొట్టిపాటి పూర్ణకుమారి ఉన్నారు. పలు సంఘాల ఆధ్వర్యంలో అన్నదానం బాలకోటేశ్వరస్వామి దర్శనం కోసం పలు సంఘాలు అన్నదానం ఏర్పాటుచేశాయి. ఆర్య వైశ్యులు, పద్మశాలీ, కాకతీయ ధర్మ సత్రాల వద్ద భక్తులకు ఉచితంగా అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. బాలకోటేశ్వరస్వామి దేవస్థానం పాలక వర్గం కూడా ఉచిత అన్నదాన కార్యక్రమం నిర్వహించింది.

ఆర్టీసీ ప్రత్యేక సేవలు

బాలకోటేశ్వరస్వామి దర్శనం కోసం వచ్చిన భక్తులకు ఆర్టీసీ ప్రత్యేక సేవలు అందించింది. బాపట్ల, రేపల్లె, తెనాలి, గుంటూరు డిపోల నుంచి గోవాడకు ప్రత్యేక బస్సులను నడిపారు. సమాచార కేంద్రాన్ని ఏర్పాటు చేసి భక్తులకు సేవలు అందించారు. బస్సుల వద్ద రద్దీ నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు.

పెదకాకానిలో భక్త జన సందోహం

- భక్తులతో కిటకిటలాడిన పెదకాకాని శివాలయం
- శివనామస్మరణతో మార్మోగిన శివసన్నిధి
- భ్రమరాంబ మల్లేశ్వరస్వామిని దర్శించుకున్న ప్రముఖులు
- ఒక్కరోజులో స్వామివారి ఆదాయం రూ.6,50,000

పెదకాకాని శివాలయంలో స్వామివారి దర్శనం కోసం క్యూలైన్లలో బారులు తీరిన భక్తులు

పెదకాకాని: దక్షిణ కాశీగా విరాజిల్లుతున్న గంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి దేవస్థానం మహాశివరాత్రి రోజున శివనామస్మరణతో మార్మోగింది. పెదకాకాని శివాయలంలో ఆదివారం భ్రమరాంబ అమ్మవారు స్వర్ణ కవచాలంకృత భ్రమరాంబదేవిగా భక్తులను అనుగ్రహించారు. తెల్లవారుజాము మూడు గంటల నుంచే భక్తులను దర్శనానికి అనుమతించారు. మహాశివరాత్రి పర్వదినం కావడంతో జిల్లా నలుమూలల నుంచే కాక ఇతర ప్రాంతాల నుంచి వేలాదిగా భక్తులు తరలివచ్చారు. ఆలయ ప్రాంగణం అంతా భక్తులతో కళకళలాడింది. భక్తులు పొంగలి నైవేద్యాలతో ఓం నమఃశివాయ నామం స్మరిస్తూ ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. భ్రమరాంబ మల్లేశ్వరస్వామి వారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ఉప కమిషనరు గోగినేని లీలాకుమార్, ధర్మకర్తల మండలి చైర్మన్ కోసూరి పూర్ణచంద్రరావు, ధర్మకర్తల మండలి సభ్యులు అధిక సంఖ్యలో తరలివచ్చిన భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు. ముఖ్యంగా క్యూలైనులు ఏర్పాటు చేసి భక్తులకు సకాలంలో స్వామి వారి దర్శనం కలిగేలా చర్యలు తీసుకున్నారు. ఆలయ ప్రాంగణమంతా భక్తులతో కిక్కిరిసిపోయింది. క్యూలైనులలో నిల్చున్న భక్తులకు దేవస్థానం ఆధ్వర్యంలో తాగునీరు, మజ్జిగ, పాలు పంపిణీ చేశారు. మహాశివరాత్రి స్వామివారి కల్యాణం కావడంతో ఆలయాన్ని పుష్పమాలలతో శోభాయమానంగా అలంకరించారు. భక్తులందరికి తీర్థ ప్రసాదాలు అందజేశారు. దేవస్థానం, వర్తక సంక్షేమ సంఘం, శివాలయం మాజీ ట్రస్టు బోర్డు సభ్యులు పెండెం విజయ్, దూపాటి వెంకట్రావుల ఆధ్వర్యంలో ఉచితంగా అన్నప్రసాద వితరణ చేశారు. గూడూరి రామకృష్ణ, కాకతీయ యూత్, ఆర్యవైశ్య సంఘం, జనసేన పార్టీ, పలు యువజన సంఘాల ఆధ్వర్యంలో పులిహోర, పొంగలి, దద్దోజనం ఉచిత ప్రసాద పంపిణీ చేశారు. ఒక్కరోజులో స్వామి వారికి వివిధ సేవా కార్యక్రమాల ద్వారా రూ.6,50,000 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఉప కమిషనర్ తెలిపారు. రాత్రి వేళల్లో కాలక్షేపంగా కూచిపూడి నృత్య ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. ఆలయ ప్రాంగణం విద్యుత్ కాంతులతో కళకళలాడుతుంది.

పెదకాకానిలోని మల్లేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో భక్తుల రద్దీ

స్వామి వారిని దర్శించుకున్న ప్రముఖులు

మల్లేశ్వరస్వామి వారిని పలువురు ప్రముఖులు దర్శించుకుని పూజలు నిర్వహించారు. పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ దంపతులు స్వామి, అమ్మవార్లకు పట్టువస్త్రాలు సమర్పించారు. కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ దంపతులు, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజారపు అచ్చెన్నాయుడు, కురుపాం ఎమ్మెల్యే టి జగదీశ్వరీ, హైకోర్టు న్యాయమూర్తి రవీంద్రబాబు, గుంటూరు 5వ నెంబరు జిల్లా జడ్జి నీలిమలు భ్రమరాంబ మల్లేశ్వరస్వామి వారిని దర్శించుకుని పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆలయ అర్చక స్వాములు, వేదపండితులు వేద ఆశీర్వచనం చేయగా ఆలయ అధికారులు, స్వామి వారి శేషవస్త్రంతో సత్కరించి చిత్రపటం, ప్రసాదాలు అందజేశారు.

రుద్రాభిషేకం

శివరాత్రి సందర్భంగా రాత్రి 11 గంటలకు లింగోద్భవ కాలమున స్వామి వారికి ఏకాదశ ద్రవ్యాలతో రుద్రాభిషేకం నిర్వహించారు. 12గంటలకు గజవాహనంపై ఎదుర్కోలోత్సవం, తెల్లవారు జాము న 2 గంటలకు గంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి వారి కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఆలయ పునః నిర్మాణ దాతలు కొల్లిపర వంశీకులు అమ్మవారికి పట్టువస్త్రాలు, ముత్యాలతలంబ్రాలు సమర్పించారు.

పెదకాకాని శివాలయంలో స్వర్ణకవచాలంకృత భ్రమరాంబగా అమ్మవారు

పెదకాకాని శ్రీ మల్లేశ్వరస్వామి మూలవిరాట్

క్లుప్తంగా

నేడు పోలీస్ గ్రీవెన్స్ తాత్కాలిక రద్దు

నగరంపాలెం (గుంటూరు వెస్ట్): మహా శివ రాత్రి పర్వదినం సందర్భంగా పోలీస్ బందోబస్త్ దృష్ట్యా ఈనెల 16న జిల్లా పోలీస్ కార్యాలయ (డీపీఓ) ఆవరణలో జరగాల్సిన పీజీఆర్ఎస్ (గ్రీవెన్స్)ను తాత్కలికంగా రద్దు చేసినట్లు డీపీఓ కార్యాలయపు వర్గాలు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపాయి. జిల్లాలోని ప్రజలు గమనించాలని, తద్వారా పోలీస్ శాఖకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

సీఎం, బిల్‌గేట్స్ పర్యటనకు ఏర్పాట్లు

తాడేపల్లి రూరల్ : రాజధాని ముఖద్వారమైన ఉండవల్లి కరకట్ట వెంబడి ఉన్న ప్రాంతాన్ని పరిశీలించేందుకు సోమవారం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మైక్రోసాఫ్ట్ సహ వ్యవస్థాపకుడు బిల్‌గేట్స్ రానున్నారు. వారి రాకను పురస్కరించుకుని గుంటూరు జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదివారం ఉండవల్లి చిన్నడొంకలో ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ చంద్రబాబునాయుడు, బిల్‌గేట్స్‌లు రాజధానిలో పలు ప్రాంతాలను పరిశీలించనున్నారని తెలిపారు. ఆ ఏర్పాట్లను అన్ని శాఖల సమన్వయంతో పూర్తిచేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ ఎం.పద్మావతి, ఉద్యానశాఖ ఉప సంచాలకులు రవీంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

17 నామినేషన్ల స్వీకరణ

నెహ్రూ నగర్: గుంటూరు నగరపాలక సంస్థ ఎన్టీఆర్ మున్సిపల్ క్రీడా ప్రాంగణం, స్విమ్మింగ్ పూల్ సొసైటీ పాలకవర్గ ఎన్నికకు ఆదివారం 17 నామినేషన్లు దాఖలు అయ్యాయని నగర పాలక సంస్థ డిప్యూటీ కమిషనర్, ఎన్టీఆర్ స్టేడియం ఎక్స్ అఫిషియో జాయింట్ సెక్రటరీ, ఎన్టీఆర్ స్టేడియం పాలకవర్గ ఎన్నికల అధికారి సీహెచ్ శ్రీనివాస్ తెలిపారు. పాలకవర్గ ఎన్నికకు ఆదివారం సెక్రటరీకి 4, వైస్ ప్రెసిడెంట్ 1, ట్రెజరర్‌కి 2, జాయింట్ సెక్రటరీకి 4, ఎగ్జిక్యూటివ్ మెంబర్‌కు 6 (పురుషులు 5, మహిళలు 1) నామినేషన్లు దాఖలయ్యాయని తెలిపారు. నామినేషన్లకు 16వ తేదీ చివరి రోజు అని అన్నారు.

పాఠశాలల అభివృద్ధికి రూ.10 లక్షల విరాళం

గుంటూరు వెస్ట్: వడ్లమూడి వెంకట లక్ష్మమ్మ ఫౌండేషన్ ట్రస్ట్ తరపున తెనాలికి చెందిన డాక్టర్ వడ్లమూడి బాబు రాజేంద్ర ప్రసాద్ , వడ్లమూడి గోపాలకృష్ణయ్యలు ఆదివారం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియాకు రూ.10 లక్షల చెక్కును విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తెనాలి నియోజకవర్గ పరిధిలోని పాఠశాలల అభివృద్ధికి ఈ మొత్తం వెచ్చిస్తామన్నారు. పీ4 లో భాగంగా ఈ మొత్తం చెక్కును దాతలు అందజేశారన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఆర్డీఓ లక్ష్మీకుమారి, డిప్యూటీ స్టాటిస్టికల్ అధికారి జెట్టి సౌలరాజు, ప్రతిపాటి సురేష్ పాల్గొన్నారు.

అదుపు తప్పి కాలువలోకి దూసుకువెళ్లిన కారు

వ్యక్తికి తీవ్ర గాయాలు

గాయపడిన వ్యక్తిని ఆసుపత్రికి తరలిస్తున్న స్థానికులు

తాడేపల్లి రూరల్: తాడేపల్లి రూరల్ పరిధిలోని కొలనుకొండ వద్ద జాతీయ రహదారిపై ఆదివారం తెల్లవారుజామున ఓ కారు అదుపుతప్పి గుంటూరు చానల్ పక్కనే ఉన్న నీళ్లులేని కాలువలోకి దూసుకు వెళ్లింది. సేకరించిన వివరాల ప్రకారం గుంటూరు జిల్లా పెదకాకానిలో నివాసముండే అనురాగ్ స్థానికంగా పార్శిల్ సర్వీస్‌లో పనిచేస్తున్నాడు. శనివారం రాత్రి విజయవాడ వెళ్లి తిరిగి వస్తుండగా కొలనుకొండ వద్ద అతని కారు డివైడర్‌ను ఢీకొని అదుపుతప్పి గుంటూరు చానల్ పక్కనే ఉన్న మరో కాలువలోకి దూసుకువెళ్లింది. ఈ ప్రమాదంలో కారు ధ్వంసమైంది. స్థానికులు 108కు, తాడేపల్లి పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారొచ్చి కారులో ఇరుక్కుపోయిన అనురాగ్‌ను బయటకు తీసి ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ఎస్ఐ ఖాజావలి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బ్రిడ్జి కింద ముళ్ల పొదల్లో ఉన్న కారు

భక్తిశ్రద్ధలతో శివరాత్రి వేడుకలు

మంగళగిరి టౌన్: మహాశివరాత్రి పర్వదినం భక్తకోటిలో అనిర్వచనీయమైన ఆధ్యాత్మిక అనుభూతులు నింపింది. పరమేశ్వర పాహిమాం, శివశివ శంకర.. భక్త శుభంకర అంటూ శివనామ స్మరణతో ఆలయాలు ప్రతిధ్వనించాయి. మహాశివుడు విశేష పూజలందుకున్నాడు. లయకారుడు లంకేశ్వరుడు కరుణ కోసం ఆలయాల ఎదుట భక్తులు బారులు తీరారు. ఉపవాసాలు ఆచరిస్తూ స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. రాత్రంతా భక్తులు జాగరణ చేశారు. మంగళగిరి నియోజకవర్గ పరిధిలో మంగళగిరి, తాడేపల్లి, దుగ్గిరాల మండలాల్లోని శివాలయాలతో పాటు పలు ఆలయాలు ఆదివారం భక్తులతో కిటకిటలాడాయి. తెల్లవారుజామున 3 గంటల నుంచి భక్తులు ఆలయాలకు చేరుకున్నారు. అభిషేక ప్రియుడైన భోళాశంకరుడికి పంచామృతాభిషేకాలు, రుద్రాభిషేకాలు, రుద్రహోమాలు నిర్వహించారు. మంగళగిరి పట్టణ పరిధిలోని శ్రీ గంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి దేవస్థానంలో ఉదయం నుండి స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో భక్తులు ధ్వజస్తంభం వద్ద దీపాలు వెలిగించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వామివారిని దర్శించుకున్నారు. శ్రీ రాజ్యలక్ష్మి అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు క్యూలైన్‌లో బారులు తీరారు. పాత మంగళగిరిలోని శ్రీహరిహర క్షేత్రంలో తెల్లవారుజాము నుంచి భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. పలు సేవా సంస్థలు అన్నదాన తదితర కార్యక్రమాలు నిర్వహించాయి. ఆలయాల వద్ద ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేకంగా నిలిచాయి. భక్తులకు అసౌకర్యం కలగకుండా దేవదాయ శాఖ అధికారులు, ఆయా ఆలయాల కమిటీ ప్రతినిధులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. నార్త్ సబ్ డివిజన్ డీఎస్పీ మురళీకృష్ణ ఆధ్వర్యంలో ఆలయాల వద్ద పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేశారు.

శ్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో రాజ్యలక్ష్మి అమ్మవారిని దర్శించుకునేందుకు వేచియున్న భక్తులు

మంగళగిరి మల్లేశ్వర స్వామి ఆలయంలో కిక్కిరిసిన భక్తులు

గుండవరం గ్రామ ప్రభ

గొడవర్రు గ్రామ ప్రభ

చేబ్రోలు గ్రామ ప్రభ

సుద్దపల్లి గ్రామ కాపు సంఘం ప్రభ

మహాకాళేశ్వరుడికి విశేషపూజలు

కోటిలింగాల క్షేత్రంలో భక్తుల కోలాహలం

ఫిరంగిపురం: మండలంలోని పలు గ్రామాల్లో మహాశివరాత్రి సందర్భంగా ఆదివారం శివాలయాల్లో అర్చకులు విశేష పూజలు నిర్వహించారు. వేములూరిపాడులోని జలపాలేశ్వరుడికి, ఫిరంగిపురంలోని కాళహస్తీశ్వరస్వామికి, రామాలయంలోని నగరేశ్వరస్వామికి, వేమవరంలోని మహాకాళేశ్వరుడికి అర్చకులు విశేషపూజలు చేశారు. వేమవరంలోని కోటిలింగాల క్షేత్రంలోని మహాకాళీ సమేత మహాకాళేశ్వరుడికి అర్చకులు పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. ఆలయ ముఖమండపం వద్ద అన్నపూర్ణాదేవి ఉత్సవమూర్తిని ఏర్పాటు చేసి భక్తుల స్వహస్తాలతో అక్షయ బియ్యంతో అభిషేకాలు నిర్వహింపజేశారు. అనంతరం ఏడు అడుగుల వెంకటేశ్వరుడి విగ్రహానికి భక్తులు అభిషేకాలు చేశారు. సాయంత్రం శివపార్వతుల ఉత్సవ మూర్తులకు శాంతి కల్యాణం నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కోటి లింగాల క్షేత్రంలో కరసేవకులుగా పనిచేసేందుకు తుని, తాడేపల్లిగూడెం, విజయవాడ, విశాఖపట్నం, ఆరేపల్లి ముప్పాళ్ల, గుంటూరు, కడియం, మేడికుండూరు ప్రాంతాల నుంచి సుమారు 300 మంది వరకు వచ్చారు. నుదురుపాడు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో భక్తుల కోసం వైద్యశిబిరం ఏర్పాటు చేసినట్లు పంచాయతీ కార్యదర్శి శౌరిజోజి తెలిపారు.

విశేష అలంకారంలో మహాకాళేశ్వరుడు

తరలివచ్చిన భక్తులు

శైవక్షేత్రాల వద్ద పోలీసుల బందోబస్తు

నగరంపాలెం (గుంటూరు వెస్ట్) : మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా జిల్లాలోని శివాలయాల వద్ద పోలీసులు పటిష్ట బందోబస్త్ చేపట్టారు. జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు జిల్లా ఏఎస్పీ మొదలు హోంగార్డుల వరకు విధుల్లోకెళ్లారు. భారీగా తరలివచ్చిన భక్తులు స్వామి వార్లను ప్రశాంత వాతావరణంలో దర్శించుకునేలా భద్రత చేపట్టారు. భక్తుల సౌకర్యార్థం సూచిక బోర్డులు, ఆలయ ప్రాంగణాల్లో బారికేడ్లు ఏర్పాటు చేశారు. మైక్‌ల ద్వారా భక్తులకు అవసరమైన సూచనలు చేశారు. ప్రతి ఆలయం వద్ద పోలీస్ కంట్రోల్ కేంద్రాలు నెలకొల్పారు. ఆలయాల పరిసర ప్రాంతాల్లో సీసీ కెమెరాలు, డ్రోన్ కెమెరాలతో గస్తీ నిర్వహించారు. జిల్లాలోని ప్రధాన శివాలయాలు, నిర్వహించిన జాతరలు, ఊరేగింపులు, విద్యుత్ ప్రభలు దృష్ట్యా పోలీస్ ఉన్నతాధికారులకు విధుల కేటాయించారు. వడ్లమూడి క్వారీ తిరునాళ్ళ వద్ద జిల్లా ఏఎస్పీ (పరిపాలన) జీవీ.రమణమూర్తి, డీఎస్పీలు జనార్దన్‌రావు, శ్రీనివాసులు (ఎస్‌బీ), ఎస్‌బీ సీఐ అళహరి శ్రీనివాస్, పెదకాకాని శివాలయం వద్ద ఉత్తర డీఎస్పీ మురళీకృష్ణ, కైలాసగిరి కొండ వద్ద తుళ్లూరు డీఎస్పీ మురళీకృష్ణ, మేడికొండూరు సీఐ మధుసూదన్, తాళ్లాయపాలెం శైవ క్షేత్రం వద్ద తుళ్లూరు సీఐ శ్రీనివాసరావు, తెనాలి వైకుంఠపురంలోని శివాలయం వద్ద తెనాలి డీఎస్పీ జనార్దన్‌రావు, రూరల్ సీఐ నాయబ్‌రసూల్, తాడేపల్లి కృష్ణానది తీరం వద్ద తాడేపల్లి సీఐ వీరేంద్రబాబు, ఎస్ఐ ఖాజావలి, పోలీస్ బలగాలు, సిబ్బంది బందోబస్త్ విధులు నిర్వహించారు.

తరలిన భారీ విద్యుత్ ప్రభలు

చేబ్రోలు: మహాశివరాత్రి సందర్భంగా వడ్లమూడి క్వారీ తిరునాళ్లలో ఆదివారం రాత్రి భారీ విద్యుత్ ప్రభలు కాంతులు వెలుగులు నింపాయి. ఉమ్మడి గుంటూరు జిల్లాలో కోటప్ప కొండ తరువాత పేరు గాంచిన చేబ్రోలు మండలం వడ్లమూడి క్వారీ తిరునాళ్లకు ఈ ఏడాది 15 భారీ విద్యుత్ ప్రభలు తరలివచ్చాయి. నారాకోడూరు నుంచి గ్రామ ప్రభ, సెంట్రల్ యూత్, మిత్రమండలి ప్రభలు వచ్చాయి. సుద్దపల్లి గ్రామ కాపు సంఘం, చేబ్రోలు, గొడవర్రు, గుండవరం, వడ్లమూడి, శలపాడు గ్రామాల నుంచి ప్రభలు తరలివచ్చాయి. నారాకోడూరు మీదుగా వడ్లమూడి క్వారీ దేవాలయం వరకు వెళ్లే మార్గాల వద్ద ట్రాఫిక్ అంతరాయం కలగకుండా, అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు తగిన జాగ్రత్తలు తీసుకున్నారు.

విద్యుత్ వెలుగుల్లో క్వారీ బాల కోటేశ్వరస్వామి దేవాలయం

ఆలయం ముందు విద్యుత్ ప్రభలు

మిర్చి వ్యాపారి కళ్లల్లో కారం స్ప్రే కొట్టి రూ.11 లక్షల దోపిడీ

గుంటూరు రూరల్: రాత్రి సమయంలో ఇంటికి వెళుతున్న మిర్చి వ్యాపారిని అడ్డగించి కళ్ళలో కారం స్ప్రేకొట్టి అతని వద్ద నుంచి రూ.11 లక్షలు దోచుకువెళ్ళిన సంఘటన నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం రాత్రి జరిగింది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం పల్నాడు జిల్లా నాదెండ్ల మండలం సాతులూరుకు చెందిన కాసుల రామారావు, కొడుకు వెంకటేష్ మిర్చి వ్యాపారం చేస్తుంటారు. ఈ క్రమంలో శనివారం గుంటూరు నగరం లాలాపేట సమీపంలోగల మిర్చి దుకాణం వద్దకు వచ్చి వారికి రావాల్సిన రూ.11 లక్షల నగదు తీసుకుని వెంకటేష్ తన ద్విచక్రవాహనంపై తిరిగి ఇంటికి వెళుతున్నాడు. ఈ క్రమంలో వెంగళాయపాలెం సమీపంలో తనకు ఫోన్ రాగా ద్విచక్ర వాహనాన్ని నిలిపి ఫోన్‌లో మాట్లాడుతున్నాడు. ఈ సమయంలో గుర్తు తెలియని వ్యక్తి కళ్ళలో మిర్చి స్ప్రే కొట్టి డబ్బులు అపహరించుకు పోయారని బాధితుడు తెలిపాడు. నల్లపాడు పోలీసులను ఆశ్రయించగా సీఐ వంశీధర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ఏడీసీ ఆధ్వర్యంలో ముస్తాబు

తాడికొండ: మైక్రోసాఫ్ట్ సహ వ్యవస్థాపకులు బిల్‌గేట్స్ సోమవారం అమరావతిలో పర్యటించనున్న నేపథ్యంలో ఏడీసీ ఆధ్వర్యంలో రోడ్లు అభివృద్ధి, ఆధునీకరణ పనులు చేపడుతున్నట్లు అమరావతి అభివృద్ధి సంస్థ(ఏడీసీ) ఛైర్‌పర్సన్, మేనేజింగ్ డైరెక్టర్ డి.లక్ష్మీపార్థసారథి తెలిపారు. కృష్ణా కరకట్ట, సీడ్ యాక్సిస్ రోడ్డు(ఈ–3 ఫేజ్–1,2), రాష్ట్ర సచివాలయం వద్దకు వెళ్ళే ఎన్–9 రోడ్లలో సుమారు 10 కిలోమీటర్ల మేర శుభ్రపరిచారు. డివైడర్లకు రంగులు వేసే పనులు జరుగుతున్నట్లు తెలిపారు.

అభివృద్ధి పేరుతో అనైతిక పనులు సహించం

గౌతమ బుద్ధ రోడ్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న ఖబరస్తాన్ పరిరక్షణ కమిటీ

ర్యాలీలో పాల్గొన్న ముస్లిం మహిళలు

- ఖబరస్తాన్‌పై ఫ్లై ఓవర్ నిర్మించడం సరికాదు
- ఖబరస్తాన్ పరిరక్షణ కమిటీ ప్రతినిధుల ర్యాలీ

మంగళగిరి టౌన్ : శతాబ్దాల చరిత్ర కలిగిన ముస్లింల పవిత్ర ఖబరస్తాన్‌ను రహదారి విస్తరణలో భాగం చేయడమే కాకుండా అభివృద్ధి పేరుతో ఖబరస్తాన్‌పై ఫ్లై ఓవర్ నిర్మించాలని చూడడం సరికాదని ఖబరస్తాన్ పరిరక్షణ కమిటీ సభ్యులు పేర్కొన్నారు. దీనికి వ్యతిరేకంగా మంగళగిరి పట్టణంలో ఆదివారం భారీ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ జామియా మసీద్ వద్ద ప్రారంభమై ఎంటీఎంసీ కార్యాలయం, మెయిన్ బజార్, మిద్దె సెంటర్ మీదుగా తిరిగి గౌతమ బుద్ధ రోడ్ నుంచి నిడమర్రు కూడలి వరకు జరిగింది. అనంతరం మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిటీ ప్రతినిధులు మాట్లాడుతూ ఎన్నో ప్రత్యామ్నాయ మార్గాలు ఉన్నా ఖబరస్తాన్ పై నుండి ఎందుకు ఫ్లై ఓవర్ నిర్మాణం చేస్తామని అంటున్నారని నిలదీశారు. ముస్లింల మనోభావాలతో చెలగాటం తగదని అన్నారు. ఖబరస్తాన్ భూమిలో ఫ్లై ఓవర్ వంటి నిర్మానాలు చేపట్టాలని ప్రణాళిక సిద్ధం చేయడం ముస్లిం మత స్వేచ్ఛపై ప్రత్యక్ష దాడి చేసినట్టేనని విమర్శించారు. దానిని కాపాడుకునే వరకు పోరాటం ఆగదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో కమిటీ కన్వీనర్ యూసుఫ్, అహ్లె సున్నతువల్ జమాద్ అధ్యక్షులు మునీర్, తబ్లీగ్ జమాత్ అధ్యక్షులు అఫీ, జమాత్ ఏ ఇస్లామీ హింద్ అధ్యక్షులు అజీమ్, జమియ్యతే అహలే హదీస్ అధ్యక్షులు రఫీ, ముస్లిం యువతరం గౌరవ అధ్యక్షులు ఇక్బాల్ అహ్మద్, ముస్లిం ఫ్రంట్ అధ్యక్షులు ముహమ్మద్ రఫీ, జమాతుల సభ్యులు, ముస్లిం మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

వీఐపీలకు సేవ.. భక్తులకు లేదు తోవ

- రూ.200 టికెట్ భక్తులకు నాలుగు గంటలు పైగా దర్శన సమయం
- సహనం కోల్పోయి వాగ్వాదానికి దిగిన భక్తులు... బెదిరించిన పోలీసులు
- ఉచిత ప్రసాదం కొంతమందికే
- నడవలేక తీవ్ర ఇబ్బందులు పడ్డ ఆర్టీసీ బస్సుల ప్రయాణికులు
- గతంతో పోల్చితే దూరంగా ఏర్పాటు చేసిన తాత్కాలిక బస్ స్టేషన్లు

'సామాన్య భక్తులను పట్టించుకోరా..' అంటూ పోలీసులతో వాగ్వాదం చేస్తున్న భక్తులు

సాక్షి, నరసరావుపేట, నరసరావుపేట రూరల్: కోటప్పకొండలో త్రికోటేశ్వర స్వామి వారి దర్శనానికి వచ్చే సామాన్య భక్తులకే పెద్దపేట వేస్తామన్న అధికారుల మాటలు ప్రకటనలకే పరిమితమయ్యాయి. మహాశివరాత్రిని పురస్కరించుకొని స్వామివారి దర్శనానికి వచ్చిన సామాన్య భక్తులు వీఐపీల తాకిడితో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. రూ. 200, రూ.500 అభిషేక దర్శనం క్యూలైన్లను భక్తులు స్వామివారిని దర్శించుకున్నందుకు దాదాపు నాలుగు గంటల పాటు క్యూ లైన్‌లో వేచి ఉండాల్సి వచ్చింది. వీఐపీలతోపాటు అధికారుల కుటుంబ సభ్యులను పెద్ద సంఖ్యలో దర్శనానికి అనుమతించారు. కింద నుంచి నేరుగా లిఫ్ట్ సదుపాయంతో వస్తున్న అధికారపార్టీ నేతలు, కార్యకర్తల వల్ల ఆ ప్రదేశంలో భారీ క్యూ కనిపించింది. ఈ సమయంలో శీఘ్ర ,అభిషేక దర్శనం క్యూలైన్‌ను నిలిపివేయడంతో భక్తులకు స్వామివారి దర్శనం ఆలస్యం అయింది.

తాత్కాలిక బస్టాండ్ నుంచి ఘాట్‌రోడ్డు వద్దకు నడుస్తున్న చిన్నారులు, మహిళలు

పోలీసులతో భక్తుల వాగ్వాదం ..

స్వామి వారికి దర్శనానికి నాలుగు గంటలకు పైగా సమయం పడుతుండటంతో భక్తుల్లో ఆగ్రహం వ్యక్తం అయింది. వీవీఐపీల సేవలలోనే తరిస్తారా సామాన్య భక్తులను పట్టించుకోరా అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. దీంతో పోలీసులు అక్కడ చేరుకొని వారిని సముదాయించే ప్రయత్నం చేశారు. అయినప్పటికీ భక్తుల్లో ఆగ్రహం చల్లారకపోవడంతో పోలీసులు బెదిరింపు ధోరణిలో విరుచుకుపడ్డారు. మాకు ప్రోటోకాల్ ఉంటది ఇష్టం ఉంటే ఉండండి లేకుంటే బయటకు వెళ్లిపోండి అంటూ పోలీసులు భక్తులపై ఫైర్ అయ్యారు. ఆగ్రహంతో మాట్లాడుతున్న భక్తులు పట్ల పోలీస్ అధికారులు అసభ్యకరంగా బూతుల దండకాన్ని అందుకున్నారు. కొంతసేపటి తర్వాత జిల్లా అదనపు ఎస్పీ జేవీ సంతోష్ అక్కడికి చేరుకొని వీ వీఐపీ దర్శనాలలో ఇతరులు రాకుండా చర్యలు తీసుకున్నారు.

ఆన్‌లైన్ టికెట్ల దర్శనం భేష్...

ఆలయంలో ఈ ఏడాది నుంచి కొత్తగా ప్రవేశపెట్టిన ఆన్‌లైన్ విధానంలో కొనుగోలు చేసే వీఐపీ టికెట్ల విధానం సత్ఫలితాలను ఇచ్చింది. గతంలో వీఐపీ పాసుల పేరుతో ఉచితంగా దర్శనానికి అనుమతి ఇచ్చేవారు. దీని వల్ల దేవస్థానానికి ఆర్థికంగా నష్టంతో పాటు సామాన్య భక్తులు ఇబ్బందిపడేవారు. ఈ ఏడాది వీఐపీ దర్శనానికి రూ.300 టికెట్ ను నిర్ణయించి ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచారు. దాదాపు 6 వేల మంది కి పైగా ఆన్ లైన్‌లో భక్తులు దర్శన టికెట్లను కొనుగోలు చేశారు. టైం స్లాట్‌లో స్వామివారిని శీఘ్రంగా దర్శించుకున్నారు.

ఉచిత లడ్డూ ప్రసాదం కొంతమందికే...

స్వామివారి దర్శనానికి వచ్చే భక్తులకు ఏడాది నుంచి ఉచిత లడ్డూ ప్రసాదాన్ని అందజేస్తున్నట్లు రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి ఇటీవల కోటప్పకొండకు వచ్చిన సమయంలో ప్రకటించారు. తిరునాళ్ల రోజు అందరికి స్వామి వారి ఉచిత ప్రసాదం అందజేస్తామన్నారు. అయితే ఆదివారం కొంతమందికే ఉచిత లడ్డూ ప్రసాదం అందింది. ఉదయం 11 గంటల వరకు దర్శనం చేసుకొని బయటకు వచ్చే భక్తులకు ప్రసాదాన్ని పంపిణీ చేసి తరువాత లడ్డూలు లేవంటూ నిలిపివేశారు. పలువురు భక్తులు దీనిపై ప్రశ్నించడంతో మధ్యాహ్నం రెండు గంటల తర్వాత పంపిణీని తిరిగి ప్రారంభించారు.

కొండకు దూరంగా బస్టాండ్... భక్తులకు తీవ్ర ఇబ్బందులు

నరసరావుపేట నుంచి కోటప్పకొండ తిరుణాలకు వెళ్లిన భక్తులు ఆదివారం తీవ్ర ఇబ్బందులు పడ్డారు. నరసరావుపేట వైపు నుంచి వచ్చే ఆర్టీసీ బస్సులను పెట్లూరువారి పాలెం రోడ్ లో నిలిపివేశారు. అక్కడ నుంచి కొండ దిగున ఘాట్ రోడ్డు వద్ద ఏర్పాటుచేసిన తాత్కాలిక బస్టాండ్ కు భక్తులు కాలినడకన చేరుకోవాల్సి వచ్చింది. కిలోమీటర్‌కు పైగా ఉన్న బస్టాండ్‌కు చేరుకోవాలంటే వృద్ధులు, వికలాంగులు, మహిళలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. గతంలో లేని విధంగా నరసరావుపేట వైపు నుంచి వచ్చే బస్సులను దూరంగా నిలిపివేయటంపై భక్తుల నుంచి తీవ్ర విమర్శలు ఎదురయ్యాయి. భక్తుల గురించి ఆలోచించకుండా నిర్ణయం తీసుకున్న అధికారుల తీరుపై మండిపడ్డారు.

సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE

TO-LET

■ IJM రెయిన్‌ట్రీ పార్కులో 5 B/R డూప్లెక్స్ విల్లా అద్దెకు. విశాలమైన లే-అవుట్, ప్రైవేట్ టెర్రస్, 24x7 భద్రత, VJA-GNT హైవే ప్రక్కన, నంబూరు ✆ 77024 75525.

SERVICES

FINANCIAL SERVICES

■ శింగో కంపెనీ:లోన్స్, ప్రాపర్టీ లోన్స్, ప్రాజెక్ట్ లోన్స్, పర్సనల్ లోన్స్, అగ్రికల్చర్ ప్రాజెక్టు లోన్స్, బిజినెస్ టేక్ ఓవర్ లోన్ & లోన్ ఏజెంట్ కావలెను. జీతం+కమీషన్. ✆ 9050130793

GOLD FINANCE

■ బంగారం బ్యాంకులలో / ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) ఫోన్ : 81422 92071

■ బంగారం కొనబడును. బ్యాంకులలో ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టు లో ఉన్న మీ బంగారం మా డబ్బుతో విడిపించి అధిక దరకు తీసుకుంటాం ✆ 83338 33368

■ బంగారం కొనబడును. బ్యాంకులలో ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారం మా డబ్బుతో విడిపించి అధిక దరకు. కొనబడును సంప్ర ✆ 87907 41166

WANTED

■ గుంటూరు హాస్పిటల్ నందు ఆయా కావలెను. ANM, GNM, నర్సింగ్ అనుభవం కలిగిన స్టాఫ్ మరియు ఇంగ్లీష్‌లో O.P రాయగలిగిన లేడీ రిసెప్షనిస్ట్ లోకల్ వారు కావలెను. 7997777108

■ M.S.M ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్, Guntur. ఇంటర్వ్యూ : ఇంటర్ (MPC) & M.P.H.W, MLT వెటర్నరీ, B.Sc Comp, B.Com Comp అన్ని సబ్జెక్టులకు లెక్చరర్స్& స్కూల్స్ ప్రీ ప్రైమరీ మదర్ టీచర్స్ ప్రైమరీ సబ్జెక్ట్ టీచర్స్ కావలెను. 7386706839

■ ఫ్రీ కంప్యూటర్ స్పోకెన్ ఇంగ్లీష్, MS ఆఫీస్ కోర్సు 3నెలల శిక్షణఇచ్చి జాబ్ చూపబడును. ఫ్రీ భోజనం & హాస్టల్, 10th, ఇంటర్, డిగ్రీ. వ:18-28 సం॥లోపు ✆ 9133444985 / 89

■ కొటక్ బ్యాంక్ అనుబంధ సంస్థకు రిటైర్డ్, వ్యాపారస్తులు, గృహిణిలు టీచర్స్ కావలెను. వయస్సు :45 to 65 yrs సంప్ర ✆ 98853 08538

■ Teachers Required for reputed St.Ann's School-Ponnur. Subjects: Physics, English [M.A], Maths, Lady P.E.T, Computers, Social, Computer operator (B.Tech) & a Counsellor. Minimum qualification: B.Ed and post related. Please submit your resumes in School Office. Ph.No: 8886302740.

■ హరేకృష్ణ హోంకేర్‌లో వృద్ధులను పేషెంట్లను చంటి పిల్లలను చూసుటకు వర్కర్స్/ నర్సులు కావెలను. ఫ్రీవసతి భోజనం, జీ. 17K, Ph: 9640648899, 9848999184.

సాక్షి క్లాసిఫైడ్స్ గుంటూరు జిల్లా రూ. 475/- మాత్రమే ప్రతి అదనపు లైను రూ.100 మాత్రమే ప్రతి 3 ప్రకటనలకు 2 ప్రకటనలు ఉచితం

గుంటూరు 7075167663 7075167541

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని క్షుణ్ణంగా పరిశీలించిన పిదప ప్రత్యుత్తరం ఇవ్వాల్సిందిగా మా పాఠకులను కోరుతున్నాము. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

శంకరా.. పాహిమాం

- శైవాలయాల్లో మహాశివరాత్రి పూజలు
- కృష్ణాతీరంలో పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు

మహాశివరాత్రి సందర్భంగా కృష్ణానదిలో పుణ్యస్నానాలు చేసేందుకు వచ్చిన భక్తులు

తాడేపల్లి రూరల్: మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా ఆదివారం తాడేపల్లి పట్టణ, రూరల్ పరిధిలోని పలు ప్రాంతాల్లో శైవాలయాలన్నీ శివనామంతో హోరెత్తాయి. సీతానగరం కృష్ణాతీరంలో పుష్కర్ ఘాట్‌ల వద్ద భక్తులు పుణ్యస్నానాలు ఆచరించేందుకు భారీగా తరలివచ్చారు. కనకదుర్గ వారధి వద్ద శివాలయంలో పుణ్యస్నానాలు ఆచరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఘాట్ వద్ద శివాలయం.. కొండపై మరో శివాలయం.. మరొక శివాలయం సైతం స్థానికంగా ఉండడంతో భక్తులు అధిక సంఖ్యలో వచ్చి ఈశ్వరుడిని దర్శించుకునేందుకు బారులు తీరారు. వారధి వద్ద కృష్ణానదీ తీరంలో గల శివాలయంలో శివరాత్రి మహోత్సవాలను నిర్వహించారు. వేలాది మంది భక్తులు పాల్గొని పుణ్యస్నానాలు ఆచరించి శివపార్వతులను దర్శించుకున్నారు. తాడేపల్లి పట్టణ పరిధిలో సోమేశ్వరాలయం, శ్రీ బాలత్రిపుర సుందరి తాండవేశ్వర దేవస్థానం, ఉండవల్లి, కొలనుకొండ, ఇప్పటం, గుండిమెడ, చిర్రావూరు, పెనుమాక, మెల్లెంపూడి తదితర గ్రామాల్లో శివాలయాల్లో వేడుకలను వైభవంగా నిర్వహించారు. కాగా పుష్కర ఘాట్‌ల నుంచి ప్రకాశం బ్యారేజ్ వరకు రోడ్డు వెంబడి వాహనాలు నిలిపివేయడంతో వచ్చివెళ్లే భక్తులకు తీవ్ర అసౌకర్యం ఏర్పడింది. ఎప్పటికప్పుడు కార్పొరేషన్ అధికారులు, పోలీస్ సిబ్బంది భక్తులకు సూచనలు చేస్తూ ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకున్నారు.

జంగాల సందడి..

తాడేపల్లి కృష్ణానదీ తీరంలో జంగాలు సందడి చేశారు. తమ పెద్దలకు పిండప్రదానాలు సమర్పించే కుటుంబ సభ్యులను కలిసి వారి పెద్దల పేర్లమీద జంగాలు కథలు చెబుతూ సందడి చేశారు. నులకపేటలో చైతన్య తపోవనంలో మహాశివరాత్రి సందర్భంగా శివకేశవ క్షేత్రంలో వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహించారు. మహాశివరాత్రిని పురస్కరించుకుని మాతా శివానంద ఆధ్వర్యంలో ఏకాదశ పంచామృత రుద్రాభిషేకాలు నిర్వహించారు. సంస్కార భారతి ఆధ్వర్యంలో ఛత్రపతి శివాజీ నాటకాన్ని ప్రదర్శించారు.

పుష్కర ఘాట్‌లో గల శివాలయం వద్ద బారులు తీరిన భక్తులు

మెల్లెంపూడిలో స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

ప్రత్యేక అలంకరణలో మెల్లెంపూడి శివయ్య

దుగ్గిరాల మండలంలో ప్రభతో భక్తుల ప్రదక్షిణలు

తాళ్లాయపాలెం శైవక్షేత్రంలో భక్తుల సందడి

తాడికొండ: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని తాడికొండ, తుళ్లూరు మండలాల్లోని శైవక్షేత్రాలు భక్తులతో కిటకిటలాడాయి. తుళ్లూరు మండలం తాళ్లాయపాలెం శైవక్షేత్రంతో పాటు లాం గంగా ఉమా సహిత సోమేశ్వరస్వామి వారి ఆలయం, తాడికొండ కొండపై గల కొండ మల్లికార్జున స్వామి ఆలయంలో భక్తులు విశేష పూజలు జరిపారు. అలానే మండలంలోని పలు ఆలయాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శించి అభిషేకాలు నిర్వహించారు. తాడికొండతో పాటు నిడుముక్కల, మోతడక, పొన్నెకల్లు, బండారుపల్లి, లాం, దామరపల్లి, తుళ్లూరు, మందడం, వెలగపూడి, పెదపరిమి, అనంతవరం గ్రామాల్లో శివరాత్రి వేడుకలు ఘనంగా జరిగాయి. శివనామ జాగరణకు ఆలయాల్లో ప్రత్యేక భక్తి సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు.

దుగ్గిరాల: శివనామస్మరణ చేస్తూ భక్తులు మహాశివరాత్రి పర్వదినాన శైవాలయాల్లో ప్రత్యేక పూజలు జరిపారు. వేకువజామునే ఆలయాలకు చేరుకుని లింగాకారుడికి విశేష ద్రవ్యాలతో అభిషేకాలు గావించారు. మండలంలోని దుగ్గిరాల, తుమ్మపూడి, చింతలపూడి, ఈమని శివాలయాల్లో భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. ఉపవాసాలతో జాగరణ చేసి స్వామి కృపకు పాత్రులయ్యారు. పొంగళ్లు చేసి శివయ్యకు సమర్పించారు. మహిళలు సహస్రనామ పారాయణం చేపట్టారు. చింతలపూడి గ్రామంలో పుట్ట దగ్గర అన్నసంతర్పణ చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

తాళ్లాయపాలెం శైవక్షేత్రంలో క్యూ లైన్‌లో భక్తుల కిటకిట

తాడికొండలోని కొండపై గల కొండ మల్లికార్జునుడు

క్లుప్తంగా

ఈటే హెలెన్ ఫ్లోరెన్స్‌కు నివాళులు

తాడేపల్లి రూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని వైఎస్సార్ సీపీ సానుభూతి పరురాలు ఈటే హెలెన్ ఫ్లోరెన్స్(65) అనారోగ్యంతో మృతిచెందారు. విషయం తెలుసుకున్న తాడేపల్లి వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షులు, పొన్నూరు నియోజకవర్గ పరిశీలకులు బుర్రముక్కు వేణుగోపాల సోమిరెడ్డి 3వ వార్డు అధ్యక్షులు ఈటె నానితో కలిసి ఆదివారం ఆమె మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆమె కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర సోషల్‌మీడియా కార్యదర్శి మేకా వెంకటరామిరెడ్డి, పట్టణ ఎస్సీ సెల్ అధ్యక్షులు చిలుకోటి శ్రీనివాస మధు, పార్టీ నాయకులు అనుమలశెట్టి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

గిరిజనులపై ప్రభుత్వం శీతకన్ను

వడిత్యా శంకర్ నాయక్

తాడేపల్లి రూరల్: చంద్రబాబు ప్రభుత్వానికి గిరిజనులపై చిత్తశుద్ధి లేదని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ ఎస్టీ కమిషన్ సభ్యులు వడిత్యా శంకర్ నాయక్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గిరిజన బంజారాల ఆరాధ్యదైవం సంత్ శ్రీసేవాలాల మహారాజ్ 287వ జయంతి సందర్భంగా ప్రభుత్వం కేవలం రూ.50 లక్షలను మాత్రమే ప్రకటించిందని, గిరిజన సమాజానికి సేవాలాల్ మహారాజ్ జయంతి ఎంతో పవిత్రమైనదని పేర్కొన్నారు. ఇంత ముఖ్యమైన కార్యక్రమానికి తక్కువ నిధులు కేటాయించడం దారుణమని, రాష్ట్ర వ్యాప్తంగా సేవాలాల్ జయంతిని నిర్వహించేందుకు కనీసం రూ.5 కోట్లు విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. గిరిజన అభివృద్ధి మాటల్లో కాకుండా నిధులు కేటాయించడం, పథకాల రూపంలో చూపించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నామని ఆయన ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

వాయులింగ శివునికి అభిషేకాలు

తెనాలి: పట్టణ మారీసుపేటలోని శ్రీసువర్ణ సూర్యకాంత స్వామి, శ్రీఅన్నపూర్ణ సమేత సనార్ విశ్వనాథ స్వామివార్ల మందిరంలో ఆదివారం మహాశివరాత్రి వేడుకలను ఘనంగా జరిపారు. మారేడు చెట్టు కింద ప్రతిష్ఠించిన వాయులింగం శివునికి ఉదయం అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. బ్రహ్మంగారి భజనల అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.

ఉచిత వైద్య శిబిరం

తెనాలి అర్బన్: మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని గంగానమ్మపేటలోని పాత శివాలయంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యాధికారి డాక్టర్ దేవరపల్లి సుభాష్ రమాదేవి పలువురు భక్తులకు ప్రాథమిక చికిత్స చేశారు. మహిళలకు వైద్య సలహాలు, సూచనలు ఇచ్చారు. ఆరోగ్య విస్తరణాధికారి అందే బాలచంద్రమౌళి, ఎఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

నూతన వస్త్రాలు పంపిణీ



తెనాలి: సమాజంలో మానవత్వం నింపటమే తమ లక్ష్యమని మానవత సంస్థ తెనాలి చైర్మన్ డాక్టర్ కొలసాని రామ్‌చంద్ అన్నారు. మహాశివరాత్రి పర్వదినం రోజైన ఆదివారం స్థానిక ఏఎస్ఎన్ డిగ్రీ కాలేజీ ఆవరణలో 35 మంది చర్మకార వృత్తిదారులకు నూతన వస్త్రాలను బహూకరించారు. కార్యక్రమంలో రీజినల్ చైర్మన్ కొత్త సుబ్రహ్మణ్యం, ఎగ్జిక్యూటివ్ ప్రెసిడెంట్ పి.వాసు, కార్యదర్శి పి.వెంకట్, మల్లాది అర్జున్, ఆలపాటి వెంకట్రామయ్య, మొవ్వా సత్యనారాయణ, చదలవాడ సాంబశివరావు, కూరపాటి కల్యాణి, రవీంద్రనాథ్ తదితరులు పాల్గొన్నారు.

బలహీన పడుతున్న ప్రజాస్వామ్య వ్యవస్థ

మాట్లాడుతున్న దాసరి కత్తిరేణమ్మ

ఫిరంగిపురం: రాష్ట్రంలో ప్రజాస్వామ్య వ్యవస్థ బలహీన పడుతుందని ఫిరంగిపురం జెడ్పీటీసీ సభ్యురాలు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర మహిళా విభాగం జనరల్ సెక్రటరీ దాసరి కత్తిరేణమ్మ అన్నారు. శాంతిపేటలోని తన నివాసంలో ఆదివారం ఆమె మాట్లాడారు. అసెంబ్లీలో ప్రజాసమస్యలపై గళమెత్తితే ఎక్కడ సమాధానం చెప్పాల్సి వస్తుందనే తలంపుతో మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రతిపక్ష హోదా ఇవ్వడం లేదని ఆమె విమర్శించారు. ఎన్నికల సమయంలో ఎన్నో వాగ్దానాలు చేసిన కూటమి నాయకులు ప్రభుత్వం రాగానే వాటిని నెరవేర్చలేకపోతున్నారన్నారు. వాటిని ప్రజల తరుపున వైఎస్ జగన్ ప్రశ్నిస్తారని.. దానికి ఎక్కడ సమాధానం చెప్పాల్సి వస్తుందోనని వారు ఆందోళన చెందుతున్నారన్నారు. రాజకీయ లాభాల కోసం ప్రభుత్వం పనిచేస్తుందే తప్ప ప్రజల సమస్యల పరిష్కారానికి పనిచేయడంలేదని చెప్పారు. ప్రజల పక్షాన పోరాటం చేసేందుకు ఎప్పుడూ ముందుంటామని ఆమె స్పష్టం చేశారు.

విద్యార్థికి ఆర్థికసాయం

తెనాలి: శ్రీసంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి సందర్భంగా చినరావూరులో బంజారా నాయక్ ఎడ్యుకేషనల్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలను నిర్వహించారు. స్థానిక చినరావూరు 12వ వార్డులో పదో తరగతి విద్యార్థి బి.చరణ్‌కు రూ.9 వేల నగదును అందజేశారు. పేద కుటుంబానికి చెందిన చరణ్‌కు తల్లిదండ్రులు లేరు. స్కూలు ఫీజు నిమిత్తం ఆర్థికసాయం అందజేశారు. ఏల్చూరి అమ్మ చారిటబుల్ ట్రస్ట్ వృద్ధాశ్రమంలో అన్నదానం చేశారు. ఈ కార్యక్రమానికి బంజారా నాయక్ ఎడ్యుకేషనల్ చారిటబుల్ ట్రస్టు చైర్మన్ యశోద కపూర్, కేతావత లక్ష్మణ్ నాయక్, లక్ష్మి, బాలాజీ, అయ్యప్ప, ప్రశాంత్, ముని, గోపి, రమేష్ , సామ్యా, శరత్ సీతయ్య, జయరాం నాయక్ తదితరులు పాల్గొన్నారు.

అంతా శివనామస్మరణే

గుంటూరు రూరల్: నల్లపాడులోని అగస్తేశ్వర స్వామి దేవస్థానంలో మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హోమాలు, వ్రతాలు నిర్వహించారు. స్వామికి ప్రత్యేక అలంకారం చేసి భక్తులకు దర్శనం కల్పించారు. పూజల్లో సౌత్ సబ్‌డివిజన్ డీఎస్పీ భానోదయ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వామివారి తీర్థ ప్రసాదం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. నల్లపాడు, చల్లవారిపాలెం, పరిసర ప్రాంతాల భక్తులు భక్తి శ్రద్ధలతో స్వామిని దర్శించి తీర్థ, ప్రసాదాలు స్వీకరించారు. ఆలయంలో తెల్లవారుజాము నుంచి అభిషేకాలు, హోమాలు, పూర్ణాహుతి కార్యక్రమం నిర్వహించారు. అన్న సంతర్పణ కార్యక్రమంలో సమీప గ్రామాలకు చెందిన గ్రామంలోని ప్రజలు 20 వేల మందికిపైగా భక్తులు పాల్గొని స్వామి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

ప్రత్యేక అలంకారంలో అగస్తేశ్వర స్వామి

అన్నదానాన్ని ప్రారంభిస్తున్న సౌత్ సబ్‌డివిజన్ డీఎస్పీ భానోదయ

పుష్యాద్రి లక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో మహాశివరాత్రి ఉత్సవాలు

గుంటూరు రూరల్: మండలంలోని వెంగళాయపాలెంలోని పుష్యాద్రి లక్ష్మీనరసింహ క్షేత్రం, పుష్యాద్రి ఆకాశమల్లేశ్వరస్వామి క్షేత్రంలో ఆదివారం మహ శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయంలో రుద్రాభిషేకాలు, బిల్వార్చనలు, అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కళ్యాణ మహోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. కార్యక్రమాల్లో రూరల్ మండలం పరిషత్ అధ్యక్షురాలు ఇంటూరి పద్మావతి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. రాత్రి కార్యక్రమాల్లో భాగంగా ఎం.సాంబిరెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్వామివారి తీర్థ ప్రసాదం అన్నదాన కార్యక్రమాన్ని ఎంపీపీ ప్రారంభించారు. కార్యక్రమంలో ఇంటూరి అంజిరెడ్డి, గ్రామంలోని ప్రజలు, పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

వైభవంగా మహాశివరాత్రి ఉత్సవాలు

పొన్నూరు: మహాశివరాత్రి సందర్భంగా పొన్నూరులోని శైవక్షేత్రాలు శివనామ స్మరణతో మార్మోగాయి. తెల్లవారుజాము నుంచే ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. మండలంలోని ఆరమండలోని సంగమేశ్వర స్వామి దేవాలయంలో శివరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఆలయ మేనేజరు మల్లెల రమేష్ కార్యక్రమాలను పర్యవేక్షించారు. పట్టణంలోని సహస్ర లింగేశ్వర స్వామి దేవస్థానంలో మహాశివరాత్రి సందర్భంగా తెల్లవారుజామున రుద్రహోమం, సహస్ర లింగేశ్వర స్వామి గంధం వొలిచి స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సాయంత్రం స్వామికి గంధాభిషేకం, స్వామి వారి కళ్యాణం అత్యంత వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ కార్యనిర్వాహనిధికారి జి.వి.అమరనాథ్, చైర్మన్ జి.ఎం.ఎస్.గుప్త, ధర్మకర్త సభ్యులు కార్యక్రమాలను పర్యవేక్షించారు.

మల్లవరం మహా లింగేశ్వరాలయంలో బలసాని పూజలు

గుంటూరు రూరల్: మహ శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని మండలంలోని మల్లవరం గ్రామంలోని గంగా పార్వతీ సమేత మహాలింగేశ్వర స్వామి దేవస్థానంలో మహాశివరాత్రి మహోత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆదివారం వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు నియోజకవర్గం సమన్వయకర్త బలసాని కిరణ్‌కుమార్ ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. బలసాని మాట్లాడుతూ ఆ పరమశివుని అనుగ్రహం ప్రత్తిపాడు నియోజకవర్గ ప్రజలందరికీ కలగాలని శివుడిని కోరారు. అనంతరం స్వామి తీర్థ ప్రసాదం స్వీకరించి భక్తులకు పంపిణీ చేశారు.

ఆగని కార్మికుల ఆకలి కేకలు

కార్మికులకు మద్దతు తెలియజేస్తున్న యూనియన్ నాయకులు

తాడేపల్లి రూరల్: తాడేపల్లి పట్టణంలోని బ్రహ్మానందపురంలో ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు నిర్వహిస్తున్న దీక్షలు ఆదివారంతో 439వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు దీక్షా శిబిరాన్ని సందర్శించి కార్మికులకు మద్దతు తెలియజేసి మాట్లాడారు. సుమారు 30 ఏళ్ల కిందట సిమెంట్ ఫ్యాక్టరీని యాజమాన్యం అక్రమంగా లాకౌట్ చేసిందని.. దీంతో దాదాపు 300 కుటుంబాలు రోడ్డున పడ్డాయని వివరించారు. కార్మికులకు చెల్లించాల్సిన వేతనాలు చెల్లించలేదని పేర్కొన్నారు. కార్మికులు దీక్షలు చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమని అన్నారు. కార్యక్రమంలో నాయకులు కూరపాటి స్టీవెన్, తుపాకుల నాగేశ్వరరావు, షేక్ సుభాని, ఇస్మాయిల్, సూర్యప్రకాష్, దర్శి మాణిక్యరావు పాల్గొన్నారు. దీక్షల్లో నవనీతమ్మ, ముసలా సాంబశివరావు, ఏనుగుల సాంబయ్య, డి.నాగేశ్వరరావు, షేక్ ఖాసిం కూర్చున్నారు.

నర్తకీమణులతో కూచిపూడి నృత్య ప్రదర్శన

కూచిపూడి నృత్య ప్రదర్శన

నగరంపాలెం: స్థానిక శ్రీవెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో ఆదివారం నృత్య కళాభారతి 27వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తొలుత అతిథులు జ్యోతి ప్రజ్వలన చేశారు. సభకు నాట్యాచార్య ఎన్.బాలు అధ్యక్షత వహించారు. మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా 76 మంది నర్తకీమణులు కూచిపూడి నృత్యాన్ని ప్రదర్శించారు. శ్రీవిఘ్నరాజం భజే, గం గం గణదీపతే, నాట్య హేళ, జయ జనార్ధన కృష్ణ, గోవర్ధనగిరి ధారి వినాయక కౌతమ్, బ్రహ్మాంజలి, రామాయణ శబ్దం వంటి కీర్తనలకు కూచిపూడి నాట్యాన్ని ప్రదర్శించగా, ప్రేక్షకులను అలరించాయి. నృత్య దర్శకత్వం ఎన్.బాలు నవ్యశ్రీ, గాత్రం బి.భువనేశ్వరి, కీబోర్డుపై తిన్నలూరి శ్రీహరిబాబు, మృదంగంపై తిరునగరం ప్రభాకరరావు, వయోలిన్‌పై ధూళిపాళ్ల శ్రీనివాస్‌శర్మ, డ్రమ్స్‌పై పి.బాలాజీ వాయిద్యాన్ని అందించారు. కార్యక్రమంలో తూర్పు ఎమ్మెల్యే మహమ్మద్ నజీర్‌అహ్మద్, పయనీర్ గ్రూప్స్ చైర్మన్ చుక్కపల్లి రమేష్, రాయపాటి మమత, వై.వి.ఎస్.ప్రభాకర్, పద్మావతిదేవి చాగంటి పాల్గొనగా, ఏఎన్‌యూ నాట్య శిఖామణి మట్టుపల్లి విశ్వంను సత్కరించారు.

స్కిన్ ఫర్‌ఫెక్ట్ హాస్పిటల్ ప్రారంభం

మాట్లాడుతున్న కేంద్రమంత్రి డాక్టర్ పెమ్మసాని, పక్కన ఎమ్మెల్యే నసీర్ అహ్మద్, డాక్టర్ సింధూర మన్నె

గుంటూరు మెడికల్: డెర్మటాలజీ, కాస్మోటాలజీ వైద్య సేవలను అందరికి అందుబాటులోకి తీసుకొచ్చేందుకు ఏపీలోనే అతిపెద్ద అత్యంత అధునాతన వైద్య సౌకర్యాలతో స్కిన్‌ఫర్‌ఫెక్ట్ హాస్పిటల్‌ను ప్రారంభిస్తున్నామని చర్మ వ్యాధులు, కాస్మటాలజీ వైద్య నిపుణులు డాక్టర్ సింధూర మన్నె చెప్పారు. ఆదివారం గుంటూరు కొత్తపేట ఓల్డ్‌క్లబ్‌రోడ్డులో నూతనంగా నిర్మించిన స్కిన్‌ఫర్‌ఫెక్ట్ డెర్మటాలజీ, డెర్మటోసర్జరీ, కాస్మోటాలజీ హాస్పిటల్‌ను కేంద్ర మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ పెమ్మసాని మాట్లాడుతూ హైదరాబాద్, చెన్నై లాంటి మెట్రోపాలిటన్ నగరాల్లో ఉండే విధంగా గుంటూరు నగరంలో స్కిన్‌ఫర్‌ఫెక్ట్ డెర్మాలజీ సెంటర్‌ను ఏర్పాటు చేయటం చాలా అభినందనీయన్నారు. కార్యక్రమంలో ఇంట్రవెన్షనల్ కార్డియాలజిస్ట్ డాక్టర్ ఉప్పుటూరి అంజిత్, గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మెహ్మద్ నసీర్‌అహ్మద్, డెప్యూటీ మేయర్ షేక్ సజీల, ఇంట్రవెన్షనల్ కార్డియాలజిస్ట్ డాక్టర్ అంజిత్ ఉప్పుటూరి, న్యూరోసర్జన్ డాక్టర్ హేమంత్ ఉప్పుటూరి, డాక్టర్ లక్ష్మీప్రియ, మన్నె వెంకటరత్నం పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం

తెనాలి: మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా వృద్ధులకు అన్నప్రసాద వితరణ చేసినవారికి ఆ పరమేశ్వరుని అనుగ్రహం లభిస్తుందని స్థానిక బుర్రిపాలెంరోడ్డులోని శ్రీమహాత్మ సేవాశాంతి ఆశ్రమ నిర్వాహకులు వజ్రాల రామలింగాచారి అన్నారు. ఆశ్రమంలోని వృద్ధులకు ఆదివారం పండుగను పురస్కరించుకుని శ్రీనాథ్ రావిపాటి అన్నప్రసాద వితరణ చేశారు. వితరణశీలి చీమకుర్తి శివరామ కృష్ణ ప్రసాద్ కూడా ఆశ్రమవాసులకు అన్నప్రసాదం అందించారు.

నేడు కార్పొరేషన్‌లో పీజీఆర్ఎస్

నెహ్రూనగర్: ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక సోమవారం నిర్వహించనున్నట్లు నగర కమిషనర్ కె మయూర్ అశోక్ ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు గుంటూరు నగర పాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెస్సెల్ సిస్టం) కార్యక్రమం ద్వారా నగరపాలక సంస్థ విభాగాధిపతులతో కలిసి ప్రజల నుంచి నేరుగా అర్జీలు, ఫిర్యాదులు తీసుకుంటామని కమిషనర్ తెలిపారు.

నేటి నుంచి ప్రత్యేక ఆధార్ క్యాంప్‌లు

ఫిరంగిపురం: మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం నుంచి ప్రత్యేక ఆధార్ క్యాంపులు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో పి.శివసుబ్రహ్మణ్యం తెలిపారు. శిశువు నుంచి 6 ఏళ్ల లోపు పిల్లలు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా.. 6 నుంచి 15 ఏళ్ల వారు నూతన ఆధార్ నమోదు, బయోమెట్రిక్, మాండేటరీ నిర్వహించేందుకు ప్రత్యేక ఆధార్ క్యాంపులు ఏర్పాటు చేశామన్నారు. 16న బేతపూడి పంచాయతీ, అమీనాబాద్ ఎంపీపీ పాఠశాల, సెయింట్ జోసఫ్ ఇంగ్లిష్ మీడియం స్కూల్, 17న ఫిరంగిపురం సెయింట్ ఆన్స్ హైస్కూల్, 18న యర్రగుంట్లపాడు పంచాయతీ, మార్నింగ్ స్టార్ కళాశాల, ఫిరంగిపురం సెయింట్ పాల్స్ హైస్కూల్, 19న తక్కెళ్లపాడు సచివాలయం, నుదురుపాడు, వేములూరిపాడు ఎంపీపీఎస్ పాఠశాల(ఎస్సీకాలనీ), 20న జెడ్పీ పాఠశాల వేములూరిపాడులో క్యాంపులు నిర్వహిస్తామని తెలిపారు.

ఉరి వేసుకుని వివాహిత ఆత్మహత్య

తాడేపల్లి రూరల్: కుంచనపల్లిలో నివాసం ఉండే ఓ వివాహిత భర్తపై అనుమానంతో ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటనపై తాడేపల్లి పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. ఎస్ఐ సాయికుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. కర్నూలుకు చెందిన గుడిపూడి రవిప్రకాష్‌రెడ్డి, గుంటూరుకు చెందిన చంద్రకళ(34)కు 2015లో వివాహమయ్యింది. వృత్తిరీత్యా రవి ప్రకాష్ తాడేపల్లిలోని కుంచనపల్లి నివాసం ఉంటున్నారు. గత కొంతకాలం నుంచి రవిప్రకాష్‌రెడ్డికి వేరే మహిళతో వివాహేతర సంబంధం ఉందని అనుమానించి చంద్రకళ శనివారం ఇంట్లో ఉరివేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డారు. ఘటనపై చంద్రకళను తన భర్త వేధించేవారని.. దీంతో ఆమె మరణించారని వివాహిత బంధువులు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించినట్లు ఎస్ఐ సాయికుమార్ తెలిపారు.

భద్రత దృష్ట్యా ప్రత్యేక బృందాల ఏర్పాటు

తాడేపల్లి రూరల్: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆదివారం కృష్ణానదిలో పవిత్ర స్నానాలు ఆచరించే భక్తుల భద్రతను దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర విపత్తుల నిర్వహణసంస్థ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ మాట్లాడుతూ.. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఏ విధమైన అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నామన్నారు. పలు శివాలయాల వద్ద, కృష్ణానదీ తీరంలో క్రౌడ్, క్యూలైన్ నిర్వహణ, అత్యవసర సేవలు కోసం ఎస్‌డీఆర్ఎఫ్ బృందాలను నియమించామని తెలిపారు. బృందంలో 10 టన్నుల ప్రత్యేక వాహనం, బోట్లు, రక్షణ పరికరాలతో ఎస్‌డీఆర్ఎఫ్ గజ ఈతగాళ్లు విధులు నిర్వహించారని పేర్కొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
99122 25447 (మంగళగిరి)
7075167541 (తాడికొండ)
Office mail : sakshigntadvt@gmail.com

రన్నరప్ హర్మీత్-యశస్విని జోడీ

చెన్నై: స్వదేశంలో జరిగిన వరల్డ్ టేబుల్ టెన్నిస్ (డబ్ల్యూటీటీ) స్టార్ కంటెండర్ చెన్నై ఓపెన్ టోర్నీ మిక్స్‌డ్ డబుల్స్ విభాగంలో హర్మీత్ దేశాయ్-యశస్విని (భారత్) జోడీ రన్నరప్‌గా నిలిచింది. ఆదివారం జరిగిన ఫైనల్లో హర్మీత్-యశస్విని ద్వయం 9-11, 2-11, 8-11తో ఎడువార్డ్ లొనెస్కు-బెర్నాడెట్ జాక్స్ (రొమేనియా) జంట చేతిలో ఓడిపోయింది. **19 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో భారత జోడీ తమ** సర్వీస్‌లో 11 పాయింట్లు గెలిచింది. హర్మీత్-యశస్విని జంటకు 3,567 డాలర్ల (రూ. 3 లక్షల 22 వేలు) ప్రైజ్‌మనీతోపాటు 420 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి. పురుషుల సింగిల్స్ విభాగంలో లుబోమిర్ జాన్ కారిక్ (చెక్ రిపబ్లిక్) టైటిల్ సాధించాడు. ఫైనల్లో లుబోమిర్ 11-8, 9-11, 11-7, 11-9, 9-11, 11-8తో థిబాల్ట్ పొరెట్ (ఫ్రాన్స్)పై గెలిచాడు. మహిళల సింగిల్స్ టైటిల్ జపాన్ ప్లేయర్ సత్సుకి ఒడో సొంతం చేసుకుంది. జపాన్‌కే చెందిన మియు హిరానోతో జరిగిన తుది పోరులో **సత్సుకి 11-2, 11-7, 13-11, 11-5తో విజయం సాధించింది.**

భారత్ ‘రుద్ర’ రూపం

పాకిస్తాన్‌పై మరో విజయం • 61 పరుగులతో టీమిండియా గెలుపు

ఇషాన్ కిషన్ మెరుపు బ్యాటింగ్ • ‘సూపర్-8’కు భారత్ అర్హత

‘ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్’
ఇషాన్ కిషన్

‘విక్రమార్కుడు మళ్లీ వెనక్కి వెళ్లి ఆ శవాన్ని భుజాన వేసుకొని మళ్లీ నడక సాగించాడు... చందమామ కథలో బేతాళ ప్రశ్నకు విక్రమార్కుడు సరైన సమాధానం ఇవ్వగానే బేతాళుడు మళ్లీ చెట్టెక్కటం... ‘బేతాళ పంచ విశతి’లో మళ్లీ మళ్లీ ఇదే దృశ్యం, ఇదే సంవాదం... భారత్, పాకిస్తాన్ మధ్య వరల్డ్ కప్‌లో మ్యాచ్ అంటే దీనికి సరిగ్గా సరిపోతుంది! ఐసీసీ టోర్నీలో ఇరు జట్ల మధ్య మ్యాచ్ తేదీ ప్రకటనతో హడావిడి మొదలు... ప్రత్యక్షంగా మైదానంలో చూడాలనుకునే అభిమానుల ఏర్పాట్లు ఒక వైపు... ప్రసారకర్తల ప్రకటనలు మరోవైపు... వ్యాఖ్యాతలు, విశ్లేషకుల తీవ్ర చర్చ... మ్యాచ్ సమీపిస్తున్న కొద్దీ ఎన్నో కథలు, కథనాలు, వివాదాలు... ఈ మ్యాచ్ లేకపోతే క్రికెట్ లేదన్నట్లుగా ఏమార్పు... ఒక రకమైన యుద్ధ వాతావరణం... ఇరు జట్ల బలాబలాల మధ్య ఉన్న అంతరం గురించి అందరికీ తెలుసు... ఫలితం ఎలా రావచ్చో కూడా అంచనాకు రావచ్చు... అయినా సరే మ్యాచ్ గురించి హంగామా... చివరకు ఎప్పటిలాగే భారత్‌దే విజయం. పిచ్ బ్యాటింగ్‌కు తగినంత అనుకూలంగా లేదు... బంతి ఆగుతూ నెమ్మదిగా వస్తోంది. భారత్ ఇన్నింగ్స్ రెండో అర్ధభాగంలో ఇది కనిపించింది కూడా. కానీ ఆరంభంలో ఇషాన్ కిషన్ చూపించిన దూకుడు పిచ్‌ను లెక్కలోకి తీసుకోవాల్సిన అవసరం లేకుండా చేసింది. మిగతా జట్టంతా కలిసి ఎక్స్‌ట్రాలు సహా 80 బంతుల్లో 98 పరుగులు రాబడితే... ఇషాన్ ఒక్కడే మిగిలిన 40 బంతుల్లో 77 పరుగులు చేసి మ్యాచ్‌లో అసలు తేడా ఏంటో చూపించాడు. టి20 వరల్డ్ కప్‌లో పాకిస్తాన్‌పై అత్యధిక స్కోరు నమోదు చేసిన తర్వాత ప్రత్యర్థిని నిలువరించడం భారత్‌కు ఏమాత్రం కష్టం కాలేదు. ఆరుగురు బౌలర్లు కనీసం ఒక్క వికెట్ అయినా పడగొట్టగా, సమష్టి ప్రదర్శనతో పాక్‌ను టీమిండియా కుప్పకూల్చింది. ఐదు ఓవర్ల లోపే టాప్-4 వికెట్లు కోల్పోయిన పాక్ కోలుకోలేకపోయింది. అసలు పాకిస్తాన్ తమకు ఏమాత్రం పోటీ కాదన్నట్లుగా నిరూపిస్తూ భారత్ ఏకపక్షంగా ఘన విజయం అందుకుంది.

కొలంబో: టి20 ప్రపంచకప్‌లో పాకిస్తాన్‌పై భారత్ తమ ఆధిక్యాన్ని మరింత పెంచుకుంది. ఇప్పటి వరకు 7-1తో పైచేయి ఉండగా ఇప్పుడు ఎనిమిదోసారి పాక్‌ను విశ్వవేదికపై మట్టికరిపించింది. భారత్ ముందు పాక్ ఏమాత్రం నిలవలేకపోవడంతో ఊహించిన ఫలితమే వచ్చింది. ఆదివారం జరిగిన గ్రూప్ ‘ఎ’ మ్యాచ్‌లో భారత్ 61 పరుగుల తేడాతో పాకిస్తాను చిత్తు చేసింది. టి20ల్లో పాక్‌పై భారత్‌కు ఇదే అతి పెద్ద విజయం. టాస్ గెలిచి పాకిస్తాన్ ఫీల్డింగ్ ఎంచుకోగా... ముందుగా బ్యాటింగ్‌కు దిగిన భారత్ 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 175 పరుగులు చేసింది. ‘ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్’ ఇషాన్ కిషన్ (40 బంతుల్లో 77; 10 ఫోర్లు, 3 సిక్స్‌లు) మెరుపు బ్యాటింగ్‌తో చెలరేగగా, సూర్యకుమార్ యాదవ్ (29 బంతుల్లో 32; 3 ఫోర్లు) ఫర్వాలేదనిపించాడు. పాక్ బౌలర్లలో సయీమ్ అయూబ్ 3 వికెట్లు పడగొట్టాడు. అనంతరం పాకిస్తాన్ 18 ఓవర్లలో 114 పరుగులకే కుప్పకూలింది. ఉస్మాన్ ఖాన్ (34 బంతుల్లో 44; 6 ఫోర్లు, 1 సిక్స్) మినహా అంతా విఫలమయ్యారు. వరుసగా మూడో విజయంతో భారత్ ‘సూపర్ ఎయిట్స్’కు అర్హత సాధించింది. అహ్మదాబాద్‌లో బుధవారం జరిగే తమ చివరి లీగ్ మ్యాచ్‌లో నెదర్లాండ్స్‌తో భారత్ తలపడుతుంది. ఆసియా కప్ తరహాలోనే తమ నిర్ణయాన్ని కొనసాగిస్తూ ఈ మ్యాచ్‌లో కూడా పాక్ కెప్టెన్ సల్మాన్ ఆఘాకు భారత సారథి సూర్యకుమార్ ‘షేక్ హ్యాండ్’ ఇవ్వలేదు. భారత్ చేతిలో భారీ ఓటమితో పాకిస్తాన్ ‘సూపర్-8’ అవకాశాలపై తీవ్ర ప్రభావం పడింది. బుధవారం నమీబియాతో జరిగే మ్యాచ్‌లో పాకిస్తాన్ తప్పనిసరిగా గెలిస్తేనే ‘సూపర్-8’ దశకు అర్హత సాధిస్తుంది. పాకిస్తాన్ ఓడిపోతే అమెరికా ‘సూపర్-8’కు చేరుతుంది.

అభిషేక్ మళ్లీ డకౌట్...

పార్ట్ టైమ్ స్పిన్నర్ సల్మాన్ వేసిన తొలి ఓవర్లో వరుసగా మూడు బంతులు పరుగు తీయలేకపోయిన అభిషేక్ శర్మ (0) తర్వాతి బంతికి భారీ షాట్‌కు ప్రయత్నించి వెనుదిరిగాడు. టోర్నీలో అతనికి ఇది వరుసగా రెండో డకౌట్. అయితే ఇషాన్ చెలరేగిపోవడంతో జట్టు దూసుకుపోయింది. షాహీన్ అఫ్రిది ఓవర్లో వరుసగా 6, 4 కొట్టిన అతను అబ్రార్ ఓవర్లోనూ 6, 4 కొట్టాడు. పవర్ ప్లేలో భారత్ 52 పరుగులు చేసింది. అనంతరం అబ్రార్ ఓవర్లో వరుసగా మూడు ఫోర్లు కొట్టిన ఇషాన్ 27 బంతుల్లోనే అర్ధ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. ఆ తర్వాత కూడా దూకుడుగా ఆడిన ఇషాన్‌ను ఎట్టకేలకు 9వ ఓవర్లో పాక్ అవుట్ చేయగలిగింది. ఆ సమయంలో భారత్ స్కోరు 88 అయితే ఇషాన్ ఒక్కడే 76 బాదడం విశేషం! మరోవైపు తిలక్ వర్మ (24 బంతుల్లో 25; 2 ఫోర్లు, 1 సిక్స్) ఇన్నింగ్స్ కాస్త తడబడుతూనే సాగింది. వరుసగా మూడో మ్యాచ్‌లోనూ అతను ఒకే స్కోరు (25) చేశాడు. తిలక్, పాండ్యా (0)లను అయూబ్ వరుస బంతుల్లో అవుట్ చేశాడు. ఈ దశలో సూర్య, శివమ్ దూబే (17 బంతుల్లో 27 నాటౌట్; 3 ఫోర్లు, 1 సిక్స్) కూడా పిచ్ అనుకూలంగా లేకపోవడంతో జాగ్రత్తగా ఆడారు. ఐదో వికెట్‌కు వీరిద్దరు 38 పరుగులు జోడించేందుకు 34 బంతులు పట్టాయి. అఫ్రిది వేసిన చివరి ఓవర్లో దూబే, రింకూ సింగ్ (11 నాటౌట్) కలిసి 2 ఫోర్లు, సిక్స్‌తో 16 పరుగులు రాబట్టారు. భిన్నమైన యాక్షన్‌తో తీవ్ర చర్చను రేకెత్తించిన ఉస్మాన్ తారిఖ్ (1/24) 2 ఫోర్లు మాత్రమే ఇచ్చి అందరికంటే మెరుగైన బౌలింగ్ ప్రదర్శన చేశాడు.

ఉస్మాన్ ఖాన్ మినహా...

తొలి ఓవర్ నాలుగో బంతికి ఫర్హాన్ (0) అవుట్ కావడంతో మొదలైన పాక్ పతనం వేగంగా సాగింది. బుమ్రా వేసిన తర్వాతి ఓవర్లో అయూబ్ (6), సల్మాన్ (4) వెనుదిరగ్గా, అక్షర్ తన తొలి ఓవర్లోనే బాబర్ ఆజమ్ (5)ను బౌల్డ్ చేశాడు. పవర్ ప్లేలో జట్టు స్కోరు 38/4కు చేరింది. ఉస్మాన్ ఒక్కడే కాస్త పోరాడుతూ కొన్ని చక్కటి షాట్లు ఆడాడు. అయితే 57 బంతుల్లో 103 పరుగులు చేయాల్సిన స్థితిలో ఉస్మాన్‌ను అక్షర్ అవుట్ చేయడంతో పాక్ గెలుపు ఆశలు కోల్పోయింది. చివర్లో షాహిన్ అఫ్రిది (19 బంతుల్లో 23 నాటౌట్; 2 ఫోర్లు, 1 సిక్స్) కొన్ని పరుగులు సాధించినా లాభం లేకపోయింది. గత మ్యాచ్ ఆడిన తుది జట్టులో భారత్ రెండు మార్పులు చేసింది. అనారోగ్యం నుంచి కోలుకున్న అభిషేక్...సామ్సన్ స్థానంలో రాగా, అర్ష్‌దీప్‌కు బదులుగా అదనపు స్పిన్నర్ కుల్దీప్‌ను మేనేజ్‌మెంట్ ఎంచుకుంది.

బుమ్రా

బాబర్

స్కోరు వివరాలు

భారత్ ఇన్నింగ్స్: ఇషాన్ కిషన్ (బి) అయూబ్ 77; అభిషేక్ (సి) అఫ్రిది (బి) సల్మాన్ 0; తిలక్ (ఎల్బీ) (బి) అయూబ్ 25; సూర్యకుమార్ (సి) అయూబ్ (బి) తారిఖ్ 32; పాండ్యా (సి) బాబర్ (బి) అయూబ్ 0; దూబే (నాటౌట్) 27; రింకూ (నాటౌట్) 11; అక్షర్ (సి) అయూబ్ (బి) అఫ్రిది 0; ఎక్స్‌ట్రాలు 3; **మొత్తం (20 ఓవర్లలో 7 వికెట్లకు)** 175. **వికెట్ల పతనం:** 1-1, 2-88, 3-126, 4-126, 5-159, 6-175, 7-175. **బౌలింగ్:** సల్మాన్ 2-0-10-1, షాహీన్ అఫ్రిది 2-0-31-1, సయీమ్ అయూబ్ 4-0-25-3, అబ్రార్ 3-0-38-0, షాదాబ్ 1-0-17-0, నవాజ్ 4-0-28-0, తారిఖ్ 4-0-24-1.

పాకిస్తాన్ ఇన్నింగ్స్: ఫర్హాన్ (సి) రింకూ (బి) పాండ్యా 0; అయూబ్ (ఎల్బీ) (బి) బుమ్రా 6; సల్మాన్ (సి) పాండ్యా (బి) బుమ్రా 4; బాబర్ (బి) అక్షర్ 5; ఉస్మాన్ (స్టంప్డ్) ఇషాన్ కిషన్ (బి) అక్షర్ 44; షాదాబ్ (సి) దూబే (బి) తిలక్ 14; నవాజ్ (సి) దూబే (బి) కుల్దీప్ 4; ఫహీమ్ (సి) రింకూ (బి) వరుణ్ 10; అఫ్రిది (నాటౌట్) 23; అబ్రార్ (ఎల్బీ) (బి) వరుణ్ 0; తారిఖ్ (బి) పాండ్యా 0; ఎక్స్‌ట్రాలు 4; **మొత్తం (18 ఓవర్లలో ఆలౌట్) 114.** వికెట్ల పతనం: 1-0, 2-6, 3-13, 4-34, 5-73, 6-78, 7-78, 8-97, 9-97, 10-114. **బౌలింగ్:** పాండ్యా 3-1-16-2, బుమ్రా 2-0-17-2, అక్షర్ 4-0-29-2, వరుణ్ 3-0-17-2, కుల్దీప్ 3-0-14-1, తిలక్ 2-0-11-1, రింకూ 1-0-9-0.

గ్రూప్ ‘ఎ’ టి20 ప్రపంచకప్ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	పా	నె.ర.రే
భారత్	3	3	0	6	3.050
అమెరికా	4	2	2	4	0.788
పాకిస్తాన్	3	2	1	4	-0.403
నెదర్లాండ్స్	3	1	2	2	-1.352
నమీబియా	3	0	3	0	-2.443

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు, నె.ర.రే-నెట్ రన్‌రేట్

టి20 ప్రపంచకప్‌లో నేడు

అఫ్గానిస్తాన్ X యూఏఈ
వేదిక: న్యూఢిల్లీ; ఉ.గం. 11 నుంచి

ఇంగ్లండ్ X ఇటలీ
వేదిక: కోల్‌కతా; మ.గం. 3 నుంచి

ఆస్ట్రేలియా X శ్రీలంక
వేదిక: కొలంబో; రాత్రి గం. 7 నుంచి

స్టార్ స్పోర్ట్స్, హాట్ స్టార్‌లో ప్రత్యక్ష ప్రసారం

హడలెత్తించిన హోల్డర్

‘హ్యాట్రిక్’ విజయంతో ‘సూపర్-8’కు వెస్టిండీస్ అర్హత

హోల్డర్

ముంబై: ఎలాంటి అంచనాలు లేకుండా టి20 ప్రపంచకప్‌లో బరిలోకి దిగిన వెస్టిండీస్ జట్టు వరుసగా మూడో విజయం అందుకుంది. ‘హ్యాట్రిక్’ గెలుపుతో కరీబియన్ జట్టు ‘సూపర్-8’ దశకు అర్హత సాధించింది. గతంలో రెండుసార్లు (2012, 2016) టి20 ప్రపంచ చాంపియన్‌గా నిలిచిన వెస్టిండీస్... ఆదివారం జరిగిన గ్రూప్ ‘సి’ లీగ్ మ్యాచ్‌లో 9 వికెట్ల తేడాతో క్రికెట్ కూన నేపాల్‌పై ఏకపక్ష విజయాన్ని సాధించింది. టాస్ నెగ్గిన విండీస్ ఫీల్డింగ్ ఎంచుకోగా... తొలుత బ్యాటింగ్ చేపట్టిన నేపాల్ నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 133 పరుగులు చేసింది. మిడిలార్డర్ బ్యాటర్ దీపేంద్ర సింగ్ (47 బంతుల్లో 58; 3 ఫోర్లు, 3 సిక్స్‌లు) ఒక్కడే పోరాడాడు. సంపల్ (15 బంతుల్లో 26 నాటౌట్; 4 ఫోర్లు) డెత్ ఓవర్లలో ధాటిగా ఆడాడు. కరీబియన్ పేసర్ జాసన్ హోల్డర్ (4/27) నిప్పులు చెరిగాడు. అనంతరం వెస్టిండీస్ 15.2 ఓవర్లలో ఒక్క వికెట్ మాత్రమే కోల్పోయి 134 పరుగులు చేసి గెలిచింది. బ్రాండన్ కింగ్ (22; 4 ఫోర్లు) అవుట్ కాగా, కెప్టెన్ షై హోప్ (61 నాటౌట్; 5 ఫోర్లు, 3 సిక్స్‌లు), హెట్‌మైర్ (32 బంతుల్లో 46 నాటౌట్; 4 ఫోర్లు, 2 సిక్స్‌లు) నేపాలీ బౌలర్లపై చెలరేగారు. అబేధ్యమైన రెండో వికెట్‌కు 91 పరుగులు జోడించి... ఇంకా 4.4 ఓవర్లు మిగిలుండగానే లక్ష్యాన్ని ఛేదించేశారు. హోల్డర్‌కు ‘ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్’ అవార్డు లభించింది. గ్రూప్ ‘సి’లో విండీస్ 3 విజయాలు, 6 పాయింట్లతో అగ్రస్థానంలో ఉంది. ఆడిన మూడూ ఓడిన నేపాల్ మెగా ఈవెంట్ నుంచి నిష్క్రమించింది.

గ్రూప్ ‘సి’ టి20 ప్రపంచకప్ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	పా	నె.ర.రే
వెస్టిండీస్	3	3	0	6	1.820
ఇంగ్లండ్	3	2	1	4	-0.143
స్కాట్లాండ్	3	1	2	2	0.359
ఇటలీ	2	1	1	2	-0.352
నేపాల్	3	0	3	0	-1.942

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు, నె.ర.రే-నెట్ రన్‌రేట్

హాకీలో మళ్లీ ఓడిన భారత్

రూర్కెలా: సొంతగడ్డపై భారత పురుషుల హాకీ జట్టు తమ నిరాశాజనక ప్రదర్శన కొనసాగించి వరుసగా నాలుగో పరాజయం చవిచూసింది. భారత అంచె పోటీల్లో భాగంగా ఆదివారం జరిగిన చివరిదైన నాలుగో మ్యాచ్‌లో టీమిండియా 2-4 గోల్స్ తేడాతో అర్జెంటీనా చేతిలో ఓడిపోయింది. భారత్ తరఫున ఆదిత్య లలాగే (50వ నిమిషంలో), సంజయ్ (59వ నిమిషంలో) ఒక్కో గోల్ సాధించారు. అర్జెంటీనా జట్టుకు టడియో మారుకి (28వ, 49వ నిమిషాల్లో) రెండు గోల్స్ అందించగా... టొమాస్ డొమెనె (18వ నిమిషంలో), లూసియో మెండెజ్ (43వ నిమిషంలో) ఒక్కో గోల్ చేశారు. తొమ్మిది జట్లు పోటీపడుతున్న ప్రొ లీగ్‌లో భారత జట్టు ఆడిన నాలుగు మ్యాచ్‌ల్లో ఓడి ఎనిమిదో స్థానంలో ఉంది. లీగ్‌లో భాగంగా తదుపరి మ్యాచ్‌ల కోసం భారత జట్టు ఆస్ట్రేలియాకు వెళుతుంది. హోబర్ట్ వేదికగా ఈనెల 21న స్పెయిన్‌తో, 22న ఆస్ట్రేలియాతో... 24న స్పెయిన్‌తో, 25న ఆస్ట్రేలియాతో భారత్ మొత్తం నాలుగు మ్యాచ్‌లు ఆడుతుంది.

అరుంధతి

అరుంధతి 4-0-22-4

తొలి టి20లో ఆస్ట్రేలియాపై భారత మహిళల జట్టు విజయం

సిడ్నీ: ఆస్ట్రేలియా పర్యటనలో భారత మహిళల క్రికెట్ జట్టు శుభారంభం చేసింది. వర్షం అంతరాయం కలిగించిన తొలి టి20లో హర్మన్‌ప్రీత్ సారథ్యంలోని భారత్ డక్‌వర్త్ లూయిస్ పద్ధతిలో 21 పరుగుల తేడాతో ఆసీస్ జట్టుపై గెలిచింది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన ఆస్ట్రేలియా 18 ఓవర్లలో 133 పరుగులకే ఆలౌటైంది. జార్జియా వేర్‌హామ్ (19 బంతుల్లో 30; 4 ఫోర్లు) చేసిన పరుగులే ఇన్నింగ్స్ టాప్ స్కోరు కాగా... లిచ్‌ఫీల్డ్ (26), ఎలీస్ పెరీ (20) రెండు పదుల స్కోర్లు చేశారంతే! హైదరాబాద్ పేస్ బౌలర్ అరుంధతి రెడ్డి (4/22) తన కెరీర్‌లో అత్యుత్తమ బౌలింగ్ ప్రదర్శనతో ప్రత్యర్థిని కోలుకోలేని విధంగా దెబ్బతీసింది. ఆంధ్ర స్పిన్నర్ నల్లపురెడ్డి శ్రీచరణి, రేణుక చెరో 2 వికెట్లు తీశారు. అనంతరం లక్ష్యఛేదనకు దిగిన భారత జట్టు 5.1 ఓవర్లలో వికెట్ నష్టానికి 50 పరుగులు చేసింది. ఈ దశలో భారీ వర్షం రావడంతో ఆట సాధ్యపడలేదు. ధాటిగా ఆడిన షఫాలీ (21; 1 ఫోర్, 2 సిక్స్‌లు) అవుట్ కాగా, స్మృతి మంధాన (16 నాటౌట్; 2 ఫోర్లు), జెమీమా (9 నాటౌట్; 2 ఫోర్లు) క్రీజులో ఉన్నారు. భారీ వర్షం వల్ల మ్యాచ్ మళ్లీ కొనసాగించలేకపోయారు. డక్‌వర్త్ లూయిస్ పద్ధతి ప్రకారం 5.1 ఓవర్లలో భారత విజయ సమీకరణం 29 పరుగులు. ఈ సమీకరణం కంటే భారత్ 21 పరుగులతో ముందంజలో ఉండటంతో విజేతగా నిలిచింది.

సంజయ్, మోనాంక్ మెరుపులు

నమీబియాపై అమెరికా గెలుపు

సంజయ్

చెన్నై: భారత సంతతి ఆటగాళ్లు సంజయ్ కృష్ణమూర్తి (33 బంతుల్లో 68; 4 ఫోర్లు, 6 సిక్స్‌లు), కెప్టెన్ మోనాంక్ పటేల్ (30 బంతుల్లో 52; 3 ఫోర్లు, 3 సిక్స్‌లు) ధనాధన్ షోతో అదరగొట్టారు. ఫలితంగా టి20 ప్రపంచకప్‌లో అమెరికా జట్టు రెండో విజయం అందుకుంది. గ్రూప్ ‘ఎ’లో ఆదివారం జరిగిన తమ చివరి లీగ్ మ్యాచ్‌లో అమెరికా 31 పరుగుల తేడాతో నమీబియాపై గెలిచింది. టాస్ నెగ్గి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన అమెరికా నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 199 పరుగుల భారీ స్కోరు చేసింది. మోనంక్, జహంగీర్ (22) ఓపెనింగ్ వికెట్‌కు 68 పరుగులు జోడించి మెరుపు ఆరంభమిచ్చారు. తర్వాత సంజయ్, మిలింద్ కుమార్ (28; 1 ఫోర్, 1 సిక్స్) నాలుగో వికెట్‌కు 87 పరుగులు జతచేశారు. ఈ రెండు భాగస్వామ్యాలు అమెరికా భారీస్కోరుకు బాట వేశాయి. నమీబియా బౌలర్లపై ‘ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్’ సంజయ్ భారీ సిక్సర్లతో విరుచుకుపడ్డాడు. నమీబియా బౌలర్లలో విలెమ్, ఎరాస్మస్ చెరో 2 వికెట్లు తీశారు. అనంతరం కొండంత లక్ష్యాన్ని ఛేదించేందుకు దిగిన నమీబియా 20 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 168 పరుగులు చేసి ఓడింది. లారెన్ స్టీన్‌కాంప్ (39 బంతుల్లో 58; 5 ఫోర్లు, 3 సిక్స్‌లు) రాణించాడు. స్మిత్ (31; 1ఫోర్, 1 సిక్స్) మెరుగ్గా ఆడాడు. షాడ్లే వాన్‌కు 2 వికెట్లు దక్కాయి. నిర్ణీత నాలుగు మ్యాచ్‌లు పూర్తి చేసుకున్న అమెరికా రెండు విజయాలు, రెండు పరాజయాలతో నాలుగు పాయింట్లు సాధించి గ్రూప్ ‘ఎ’లో రెండో స్థానానికి చేరింది.

రాహుల్, పడిక్కల్ సెంచరీలు: కర్ణాటక 355/2

రాహుల్ పడిక్కల్

లక్నో: ఉత్తరాఖండ్‌తో ఆదివారం మొదలైన రంజీ ట్రోఫీ తొలి సెమీఫైనల్లో మాజీ చాంపియన్ కర్ణాటక భారీ స్కోరు దిశగా సాగుతోంది. తొలిసారి సెమీఫైనల్ చేరిన ఉత్తరాఖండ్ జట్టు టాస్ గెలిచి ఫీల్డింగ్ ఎంచుకోగా... మొదట బ్యాటింగ్‌కు దిగిన కర్ణాటక మొదటి రోజు ఆట ముగిసే సమయానికి 90 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి 355 పరుగులు సాధించింది. భారత క్రికెటర్లు కేఎల్ రాహుల్ (141; 11 ఫోర్లు, 5 సిక్స్‌లు), కెప్టెన్ దేవ్‌దత్ పడిక్కల్ (148 బ్యాటింగ్; 16 ఫోర్లు, 2 సిక్స్‌లు) సెంచరీలతో అదరగొట్టారు. ఓపెనర్ మయాంక్ అగర్వాల్ (5) తక్కువ స్కోరుకే వెనుదిరగ్గా... రాహుల్, పడిక్కల్ రెండో వికెట్‌కు 278 పరుగుల భారీ భాగస్వామ్యం జోడించారు. రాహుల్ అవుటయ్యాక వచ్చిన కరుణ్ నాయర్ (37 బ్యాటింగ్; 5 ఫోర్లు, 1 సిక్స్) కూడా నిలకడ కనబరిచాడు.

సుదీప్ అజేయ శతకం

జమ్మూ కశ్మీర్ జట్టుతో సొంతగడ్డపై జరుగుతున్న రెండో సెమీఫైనల్లో బెంగాల్ జట్టు తొలి రోజు ఆట ముగిసే సమయానికి 79.5 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 249 పరుగులు చేసింది. వన్‌డౌన్ బ్యాటర్ సుదీప్ కుమార్ ఘరామి (136 బ్యాటింగ్; 19 ఫోర్లు, 1 సిక్స్) అజేయ సెంచరీ సాధించాడు.

వృంద ధనాధన్

- 29 బంతుల్లో 12 ఫోర్లతో 55 నాటౌట్
- పాక్ ‘ఎ’ జట్టుపై భారత్ ‘ఎ’ జట్టు గెలుపు

బ్యాంకాక్: మహిళల ఆసియా కప్ రైజింగ్ స్టార్స్ టి20 క్రికెట్ టోర్నీలో భారత ‘ఎ’ జట్టు తొలి విజయం నమోదు చేసింది. మొదటి మ్యాచ్‌లో యూఏఈ ‘ఎ’ జట్టు చేతిలో అనూహ్యంగా ఓడిన భారత ‘ఎ’ జట్టు రెండో మ్యాచ్‌లో అదరగొట్టింది. పాకిస్తాన్ ‘ఎ’తో ఆదివారం జరిగిన గ్రూప్ ‘ఎ’ లీగ్ మ్యాచ్‌లో రాధా యాదవ్ బృందం 8 వికెట్ల తేడాతో గెలుపొందింది. పాకిస్తాన్ ‘ఎ’ నిర్దేశించిన 94 పరుగుల లక్ష్యాన్ని భారత ‘ఎ’ జట్టు 10.1 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి ఛేదించింది. భారత ఓపెనర్ దినేశ్ వృంద (29 బంతుల్లో 55 నాటౌట్; 12 ఫోర్లు) మెరుపు అర్ధ సెంచరీ చేసింది. హుమైరా కాజీ (0) డకౌట్ కాగా... అనుష్క శర్మ (24; 4 ఫోర్లు), తేజల్ హసబ్నిస్ (5 బంతుల్లో 12 నాటౌట్; 1 ఫోర్, 1 సిక్స్) రాణించారు. అంతకుముందు టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న పాకిస్తాన్ ‘ఎ’ జట్టు 18.5 ఓవర్లలో 93 పరుగులకే ఆలౌటైంది. షవాల్ జుల్ఫికర్ (23; 3 ఫోర్లు), గుల్‌రుఖ్ (21; 1 ఫోర్, 1 సిక్స్), అనోషా నాసిర్ (17; 2 ఫోర్లు) మాత్రమే రెండంకెల స్కోరు దాటారు. భారత ‘ఎ’ బౌలర్లు సైమా ఠాకూర్ (2/14), రాధా యాదవ్ (2/11), ప్రేమ రావత్ (2/16) పాక్ ‘ఎ’ జట్టును కట్టడి చేయడంలో కీలకపాత్ర పోషించారు. మంగళవారం జరిగే చివరి లీగ్ మ్యాచ్‌లో నేపాల్‌తో భారత్ ఆడుతుంది.

Tenth Class English Model Paper

ENGLISH (THIRD LANGUAGE)

Time : 3.15 hours Max. Marks : 100

Instructions:

1. The question paper has 37 questions in three sections (A, B and C)
2. Answer all the questions on a separate answer book supplied to you.
3. 15 minutes of time is allotted exclusively for reading the question paper and 3 hours for writing the answers.
4. Answer all the questions of SECTION - B (Grammar and Vocabulary) in the same order at one place in your answer book.

SECTION - A : READING COMPREHENSION

(Questions 1- 5) : ***Read the following passage carefully.***

The house - the only one in the entire valley - sat on the crest of a low hill. From this height one could see the river and the field of ripe corn dotted with the flowers that always promised a good harvest. The only thing the earth needed was a down pour or at least a shower. Throughout the morning Lencho - who know his fields intimately - had done nothing else but see the sky towards the north-east. "Now we're really going to get some water, woman". The woman, who was preparing supper, replied "yes, God willing". The older boys were working in the field, while the smaller ones were playing near the house until the woman called them all. "Come for dinner". It was during the meal that just as Lencho had predicted, big drops of rain began to fall. In the north-east huge mountains of clouds could be seen approaching. The air was fresh and sweet.

(A Letter to God)

Now, answer the following questions **5 × 2 = 10M**

1. Where was the house?

2. What did the ripe corn field promise?

3. Why was Lencho eagerly looking at north-east sky?
A) Because there were birds flying
B) Because he was looking forward for a rain or shower
C) Because the sky towards north-east is filled with dotted flowers

4. "Now we're really going to get some water, women". These words of Lencho prove ____
A) his hope for a shower of rain
B) his worry for a good crop
C) his carelessness towards nature

5. What is the figure of speech in the phrase 'huge' mountains of clouds"?
A) Metaphor B) hyper bole C) simile

(Questions 6 - 10): ***Read the following stanza carefully.***

Some say the world will end in fire
Some say in ice.
From what I've tasted of desire
I hold with those who favour fire.
But if it had to perish twice,
I think I know enough of hate
To say that for destruction ice
Is also great
And would suffice. (Fire and Ice)

Now, answer the following questions. **5 × 1 = 5 M**

6. What brings the world to an end?

7. What do fire and ice stand for?

8. Who does the poet favour?
A) ice B) fire C) destruction of fire

9. What does hatred lead to?
A) great desire B) favour C) destruction of world

10. What is the tone of the poem?
A) Strength of individual in destroying the world
B) Casual and peaceful
C) unconcerned about human potentiality

(Questions 11-15): ***Read the following passage carefully.***

The only way was to get Tricki out of the house for a period. I suggested that he be hospitalised for about a fortnight to be kept under observation. The poor lady almost swooned. She was sure he would pine and die if he did not see her everyday. But I took a firm line. Tricki was very ill and this was the only way to save him; infact, I thought it best to take him without delay and followed by the Mrs. Pamphrey's wailings. I marched out to the car carrying the little dog wrapped in a blanket. Mrs. Pumphrey was distraught. Tricki would eat nothing Refused ever his favourite dishes; and besides, he had bouts of vomiting. He spent all his time lying on a rag, pasting. Didn't want to go for walks, didn't want to do anything. (A Triumph of Surgery)

Now answer the following questions. **5×1 = 5M**

11. Why was Mrs. Pumphrey distraught?
A) Because Tricki didn't obey her.
B) Because Tricki ate nothing
C) Because she became old and unable to look after Tricki.

12. How was Tricki affected by over - eating?
A) Tricki had severe vomiting and became immovable
B) Tricki became over - active
C) Tricki was greedy for more and more food.

13. What did Dr. Herriot suggest for Tricki's treatment?
A) to give high dosage medicine.
B) to Keep away from Mrs. Pumphrey for a period.
C) to leave its for playing in the streets.

14. What did the woman believe about Tricki if kept away from her?
A) Tricki would be happy enjoying more food
B) Tricki would forget the woman.
C) Tricki would miss the woman and die for her.

15. Where did Dr. Herriot take Tricki?
A) To Mrs. Pumphrey's surgery
B) To his surgery C) To a dietician

16. Study the following table which shows the major export destinations of Indian mangoes in 2019-2020.

S.No.	*Country*	*Percentage %*
1	USA	2
2	Kuwait	2
3	Saudi Arabia	3
4	Quatar	6
5	Bangladesh	6
6	Oman	7
7	UK	9
8	Nepal	24
9	United Arab Emirates	33
10	Bahrain	2
11	Others	6

Now, answer the following questions. **5 × 1= 5M**

i) What does the given table represent ?
ii) Which destination has the highest percentage of important of Indian mangoes ?
iii) India exports 24% of mangoes to ....
iv) India exports the same percentage of mangoes to ....
a) U.S.A, Kuwait, Bahrain
b) Quatar, UK, Nepal
c) Bangladesh, Oman, UK
v) Choose the correct statement based on the table given.
a) The second top importing country of mangoes in the given table is Nepal.
b) United Arab Emirates is exporting mangoes to the destinations given in the table.
c) Oman imports 6 percentage of mangoes.

17. ***Read the following passage carefully:***

Birds nest building is a fascinating display of instinct and ingenuity. Birds utilize a wide range of materials, from twigs and leaves to mud and even saliva, to construct their nests. The specific materials and construction techniques vary greatly, between species, with some birds weaving intricate baskets, while others create simple platforms or burrows. Nest building is typically a collaborative effort between the male and female, although in some species, one partner takes on the primary responsibility. The nests serve as vital shelters for eggs and young birds, protecting them from the elements and predators.

Now arrange the following sentences in meaningful order: **5×1 = 5M**

a) Nests serve as vital shelters for protecting eggs and young birds.
b) Construction techniques and material differ greatly with some birds weaving simple platforms, while others intricate baskets.
c) Nests are built by a collaborative effort between the male and female birds.
d) Building nests is a fascinating display of instinct and ingenuity in birds.
e) A variety of materials like twigs, mud and saliva are used by birds to construct their nests.

SECTION — B
GRAMMAR & VOCABULARY

Note: Answer all the questions of Section - B in the same order at one place in your answer book.

18. Combine the following sentences using `who **2 M**
My mother is going to host a TV show on cooking. She cooks very well.

19. Change the following sentence into `passive voice' **2 M**
Rakesh had completed his homework perfectly.

20. Change the following into Reported Speech. **2 M**
He said, "What were you doing with these keys?"

21. Fill in the blanks with suitable preposition given in brackets. **2 × 1= 2 M**
i) The book is full ______ interesting stories. (with, of, in)
ii) She is good _____ playing chess. (at, to, with)

22. Edit the following passage. **4 × 1 = 4 M**
The mobile phone users should keep in their mind that while drive (a) they should not used (b) it and it

Continued on next page..

is dangerous too. Excessive surfing of mobility (¢) phone may entailing (d) health hazards

a) .... b) ....

c) .... d) ....

23. Fill in the blanks with suitable articles. **2 × 1 = 2 M**

1. My sister works in .... bank.
2. Have you ever visited .... U.S.A ?

24. Change the following into Repeated action in the past using 'would/used to' **2 × 1 = 2 M**

1. When I was a child, I play outside for hours everyday
2. Our teacher gives us a quiz every day.

25. Rewrite the sentences into a single sentence using Noun-modifiers. **2 × 1 = 2 M**

i) Our teacher showed us a beautiful painting. it was old and valuable

ii) I read a short story. It was an interesting and heart touching.

26. Give a suitable advice for the situation given below. **2 × 1 = 2 M**

Your brother is paying no attention while crossing the busy street. Advise him to follow traffic rules.

27. Read the following paragraph and write the synonyms of the underlined words, choosing the words given in the box. **4 × 1 = 4 M**

Consumption, bravery, filled, connected, famous, shrubs, tried

Coorg people are known for their valour (a) and hospitality. Their traditions and culture are linked (b) with the martial races. The region is covered (c) with evergreen forests and coffee plantations. It is renowned (d) for its scenic beauty and brave soldiers.

28. Read the following paragraph and write the antonyms of the underlined words. **4 × 1 = 4 M**

Let me put it more <u>clearly</u> (a), since no one will <u>believe</u> (b) that a thirteen-year-old girl is <u>completely</u> (c) alone in the world. And I'm not. I have <u>loving</u> (d) parents and a sixteen- year-old sister.

29. Fill the blanks with the right form of words given in the brackets. **2 × 1 = 2 M**

The days passed ...., (a) (peace, peaceful, peacefully), at Basra, but I dreaded the prospect of .... (b) (transport, transporting, transportation) Mij to England and to Camusfearna.

30. Complete the words with correct Prefixes and Suffixes given in the brackets. **2 × 1 = 2 M**

i) Teachers are the most ....predictable creatures on earth. (in/un)

ii) Don't excite yourself, my preci..........(eous/ous) one

31. Find the wrongly spelt word and write the correct spelling. **2 × 1 = 2 M**

i) shrilly, upbraiding, threatening, strve ....

ii) leadge, cliff, taunt, dozing ....

32. Read the following dictionary entry of the word given below. **2 × 1 = 2 M**

> Journey/d3\3:ni/ noun [C]
>
> 1. 1. The act of travelling from one place to another.
> 2. 2. A process of personal or emotional growth.
> 3. 3. (verb, literary) To travel or move from one place to another.
>
> Example
>
> For Valli, the bus ride was not just a trip-it was a journey of discovery. Now, answer the following questions using the information above.

Now, answer the following questions using the information above.

i) What is the part of speech of the word Journey?

ii) Write one synonym for journey?

33. Use the following expressions in sentences of your own. **2 × 1 = 2 M**

i) Phrasal verb : make up for

Ans. ....

ii) Idiomatic expression : caught my eye

Ans. ....

34. Match the following. **4 × ½ = 2 M**

Part - A	*Part - B*
i) Home sick	( ) a) search
ii) look for	( ) b) remain inside
iii) fly high	( ) c) missing home and family
iv) stay in	( ) d) be successful

SECTION — C : CREATIVE EXPRESSION

35. A) You read the lesson 'Tea from Assam', In the lesson Pranjal and Rajvir are childhood friends. Pranjal was from Assam and Rajvir was from Delhi. Pranjol had invited Rajvir to visit his home during vacation. Rajvir was so much exited seeing the beautiful greenery and tea plantations of Assam. During journey Rajvir told Pranjol so many legendary stories about 'tea.

Now write a possible conversation between Pranjol and Rajvir during their train journey to Assam.

(OR)

B) In the lesson 'The Black Aeroplane' the narrator flew his Dakota and reached England safely through the huge black storm clouds. The pilot of the black aeroplane guided him.

After landing in England he enquired the woman in the control station about that pilot. But the woman said that there was no other pilot and other aeroplane flown that night. The narrator was surprised

Imagine you are in the place of the narrator and write a diary entry expressing your feelings on the above context

36 A) A. Drug abuse is the burning issue to be resolved in the society. More over it has been spread to school going children which is a menace to the future of the students. It would affect the studies and career of students. A wide campaign had been conducted in schools to create awareness among students. Making posters, writing essays and speaking on the topic are encouraged.

Write a letter to your friend about the event and suggesting necessary precautions to be followed in their school. **10 M**

(OR)

B) A Baker from 'Goa', Coorg and Tea from Assam are the best examples for instigating the desire for "Travel & Tourism'.

Prepare a script for speech on Importance and advantages of Tourism.

37. A) A. In the story, 'A Question of Trust', Horace Danby, a thief who sees himself as honest is tricked by a woman who pretends to be the owner of a house he plans to rob. She outsmarts him and leaves him, to get caught. Now, describe the feelings of Horace Danby after being tricked by the woman and the importance of honesty and trust in life. **10M**

(OR)

B) Study the following bar graph and write a paragraph based on the information given in it.



ANSWERS

1. The house was on the crest of a low hill in the valley.
2. It promised a good harvest.
3. B) Because he was looking forward for a rain or shower
4. B) His hope for a shower of rain.
5. B) Hyperbole
6. Fire and ice.
7. Fire stands for desire; Ice stands for hatred.
8. B) fire.
9. C) destruction of world.
10. A) Strength of individual in destroying the world.
11. B) Because Tricki ate nothing
12. A) Tricki had severe vomiting and became immovable
13. B) To keep away from Mrs. Pumphrey for a period
14. C) Tricki would miss the woman and die for her
15. B) To his surgery
16. (i) The major export destinations of Indian Mangoes in 2019-2020
    (ii) United Arab Emirates
    (iii) Nepal
    (iv) a) U.S.A, Kuwait, Bahrain
    (v) a) The second top importing county of mangoes in the given table is Nepal.
17. d e b c a
18. My mother, who cooks very well, is going to host a TV show on cooking.
19. Rakesh's homework had been completed perfectly (by him).
20. He asked what I was doing with those keys.
21. i) of; ii) at
22. a) driving; b) use; c) mobile; d) entail
23. i) a ii) the
24. i) When I was a child, I used to play outside for hours every day.
    ii) Our teacher would give us a quiz every day.
25. i) Our teacher showed us a valuable beautiful old painting.
    ii) I read an interesting heart-touching short story.
26. You should follow traffic rules while crossing the road
27. a) bravery; b) connected; c) filled; d) famous
28. a) unclearly; b)disbelieve; c) incomplete; d) unloving
29. a) peacefully b) transporting
30. i) un; ii) ous **31.** i) strave; ii) ledge **32.** i) Noun ii) trip
33. i) Prathyusha worked extra hours to make up for her absence
    ii) The red dress in the shop window caught my eye
    Note: Any relevant sentence may be given credit.
34. c a, d, b

C. Bhagya Sekhar Reddy
SA, English
Govt. High School
Chandragiri, Tirupati Dt

Daily Quiz

1. **He doesn't like coffee, ___?**
   A) does he B) doesn't he
   C) is he D) isn't he

2. **The teacher is grading the papers.**
   A) The papers will be graded by the teacher.
   B) The papers were graded by the teacher.
   C) The papers have been graded by the teacher.
   D) The papers are being graded by the teacher.

3. **She said, "I will meet you at 5pm."**
   A) She said that she will meet me at 5pm.
   B) She said that she would meet me at 5pm.
   C) She said that she meets me at 5pm.
   D) She said that she met me at 5pm.

సమాధానాలు రాయడానికి ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి.

4. **I ________ for the bus when it arrived.**
   A) have waited B) wait
   C) was waiting D) waited

5. **This cake is _________ than the one we had yesterday.**
   A) delicious
   B) more delicious
   C) most delicious
   D) less delicious

● మంచి మాట

వృద్ధాప్యం ఆధ్యాత్మిక సాధనకు వరం

వృద్ధాప్యం అనేది జీవితమనే పుస్తకంలో చివరి అధ్యాయం కావచ్చు, కానీ అది అత్యంత విలువైన గౌరవప్రదమైన దశ. దీనిని కేవలం శారీరక క్షీణతగా కాకుండా, 'అనుభవాల పండగ'గా చూడాలి. వయసు పెరిగే కొద్దీ కంటి చూపు తగ్గొచ్చు కానీ, జీవితాన్ని చూసే దృష్టి పెరుగుతుంది. ఏది ముఖ్యం, ఏది అనవసరం అనే విచక్షణ వారికి ఉన్నంతగా మరెవరికీ ఉండదు. అందుకే వారిని జ్ఞాన నిధులు అంటారు.

వృద్ధాప్యంలో ఆధ్యాత్మికత అనేది కేవలం పూజలు, పునస్కారాలకే పరిమితం కాదు. ఇది మనసును ప్రశాంతంగా ఉంచుకోవడానికి., జీవితం పట్ల ఒక స్పష్టమైన అవగాహన పెంచుకోవడానికి చేసే ప్రయాణం. వృద్ధాప్యంలో శారీరక శక్తి తగ్గడం వల్ల కలిగే అసహనాన్ని ఆధ్యాత్మికత తగ్గిస్తుంది. రోజుకు కొద్దిసేపు కళ్ళు మూసుకుని ప్రశాంతంగా కూర్చోవడం వల్ల ఒత్తిడి తగ్గి, మనసు నియంత్రణలోకి వస్తుంది. జీవితంలో జరిగిన మంచి చెడులను సమానంగా స్వీకరించే గుణం అలవడుతుంది.

వృద్ధాప్యం అనేది కేవలం శారీరక శక్తిని కోల్పోయే దశ కాదు, అది ఆధ్యాత్మిక పురోగతికి అత్యంత అనుకూలమైన సమయం. జీవితంలో బాధ్యతలన్నీ తీరిన తర్వాత, మనసును బయటి ప్రపంచం నుండి మళ్లించి లోపలికి (అంతర్ముఖం) పంపడానికి ఇది ఒక గొప్ప అవకాశం. యవ్వనంలో ఉన్నప్పుడు ధనం, పదవి, పిల్లల భవిష్యత్తుపై ఉండే విపరీతమైన వ్యామోహం వృద్ధాప్యంలో క్రమంగా తగ్గుతుంది. కుటుంబంలో జరిగే విషయాలను ఒక సాక్షిలా గమనించడం అలవడుతుందిఅంతా 'దైవేచ్ఛ' అని భావించడం ఆధ్యాత్మిక పురోగతికి మొదటి మెట్టు.

వృద్ధాప్యంలో శారీరక కదలికలు తగ్గినప్పుడు, మనసు లోపలికి వెళ్లడానికి ప్రయత్నిస్తుంది. ఈ జీవిత పరమార్థం ఏమిటనే ప్రశ్నలకు సమాధానం వెతకడం మొదలవుతుంది. అనవసరమైన మాటలు తగ్గించి, మౌనంగా ఉండటం వల్ల ప్రాణశక్తి వృధా కాకుండా ఆత్మజ్ఞానానికి తోడ్పడుతుంది. వృద్ధాప్యంలో అహంకారం సహజంగానే తగ్గుతుంది. నా వల్ల ఏమీ కాదు అని తెలిసినప్పుడు, భగవంతుడిపై నమ్మకం పెరుగుతుంది. ''నేను నీ వాడిని, నీవే నన్ను నడిపించు'' అని భగవంతుడికి పూర్తిగాఅప్పగించుకోవడం (శరణాగతి) వల్ల కలిగే ప్రశాంతత అద్భుతమైనది. ఇది మరణం పట్ల భయాన్ని పోగొట్టి, ప్రశాంతమైన చిరనిద్రకు (మరణానికి) సిద్ధం చేస్తుంది. తమకున్న అనుభవాన్ని యువతరానికి పంచడం, నిస్వార్థంగా సలహాలు ఇవ్వడం కూడా ఒక ఆధ్యాత్మిక సాధనే.

అందరికీ వృద్ధాప్య దశ వరకు చేరుకునే అదృష్టం కలగదు. ఉన్న పెద్దలను గౌరవించడం అంటే మన భవిష్యత్తును మనం గౌరవించుకోవడమే. జీవిత ప్రయాణంలో ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొని, అనుభవాలను గడించి, ఒక తరాన్ని తీర్చిదిద్దిన వ్యక్తులు వృద్ధులు. దురదృష్టవశాత్తూ నేటి సమాజంలో లేదా కొన్ని కుటుంబాలలో వారిని ఒక భారంలా చూడటం కనిపిస్తుంది, కానీ అది సరైన దృక్పథం కాదు. ఈరోజు మనం వృద్ధులను ఎలా చూస్తామో, రేపు మన పిల్లలు మనల్ని అలాగే చూస్తారు.

వృద్ధాప్యం అనేది ప్రతి ఒక్కరికీ వచ్చే ఒక సహజ ప్రక్రియ. వారిని అనాథ శరణాలయాలకు పంపడం లేదా ఇంట్లో ఒక మూలకు పరిమితం చేయడం వంటివి కాకుండా, వారిని గౌరవప్రదంగా చూసుకోవడం మన సంస్కృతి.

– రామలక్ష్మీ సదానందమ్

వృద్ధాప్యం అనేది ఒక పండు పక్వానికి వచ్చినట్లు. పండు పండితే తీపి పెరుగుతుంది. అలాగే వయసు పెరిగే కొద్దీ మనిషిలో శాంతి, క్షమ, ప్రేమ అనే ఆధ్యాత్మిక గుణాలు పెరగాలి. అదే నిజమైన పురోగతి. ఆధ్యాత్మికంగా ఎదగడం అంటే మనలోని అశాంతిని వదిలి, శాశ్వతమైన ఆనందాన్ని వెతుక్కోవడం. వృద్ధాప్యంలో ఈ సాధన మరింత సులభం, ఎందుకంటే లోక జ్ఞానం మనకు అప్పటికే అనుభవంలోకి వచ్చి ఉంటుంది.

వృద్ధులను వేధించే ప్రధాన సమస్య ఒంటరితనం. ఆధ్యాత్మిక మార్గంలో ఉంటే భజనలు, ప్రవచనాలు లేదా ఆధ్యాత్మిక చర్చల (సత్సంగం) ద్వారా సమాజంతో సంబంధం ఏర్పడుతుంది. పరమాత్మ ఎప్పుడూ నాతోనే ఉన్నాడు (భగవంతునితో అనుసంధానం) అనే నమ్మకం వారిలో ధైర్యాన్ని నింపుతుంది. జీవితం ఒక నిరంతర ప్రక్రియ అని, మరణం కేవలం ఒక మార్పు మాత్రమే అనే సత్యాన్ని ఆధ్యాత్మిక గ్రంథాలు బోధిస్తాయి. భగవద్గీత వంటి గ్రంథాల పఠనం ద్వారా మరణం పట్ల ఉండే భయం పోయి, చిత్తశుద్ధి కలుగుతుంది. గతాన్ని తలచుకుని బాధపడకుండా, ఉన్నదానితో తృప్తి చెందడం (సంతోషం) అనేది గొప్ప ఆధ్యాత్మిక లక్షణం. బాధ్యతలు తీరిపోయాయి, ఇప్పుడు స్వేచ్ఛగా ఉన్నాననే భావన వారికి కొత్త ఉత్సాహాన్ని ఇస్తుంది.

● తాత్త్వికకథ

జీవన చిత్రం

భార్యాభర్తలిద్దరూ సాఫ్ట్ వేర్ ఉద్యోగులు. ఆఫీస్‌లో అలసిపోయిన వారిద్దరూ ఓ సాయంత్రం ఇంటికి వచ్చారు. అప్పటికే వారి ఆరేళ్ళ కొడుకు బడినుంచి ఇంటికి వచ్చి ఉన్నాడు.

తమ పుత్రరత్నం, చుట్టుప్రక్కల ఉన్న స్నేహితులనంతా ఇంటికి పిలిచి ఉన్నాడు. వారందరూ చేరి ఇల్లంతా పీకి పందిరి వేసి ఉన్నారు. భార్యాభార్తలిద్దరికీ కోపమొచ్చింది. ఇరుగుపొరుగు పిల్లల్ని గట్టిగా అరిచారు. తమ పుత్రరత్నాన్ని తిట్టిన తిట్టు తిట్టకుండా తిట్టారు.

అమ్మనాన్నల తిట్లకు వాడు బుంగ మూతి పెట్టి సోఫాలో కూర్చుండిపోయాడు. వారిలో కోపం తగ్గలేదు. అలా బయటికి వెళ్ళి వస్తే మామూలు స్థితికి వస్తామనిపించింది. ఇద్దరూ ఇంటి బయటికి వచ్చారు. దగ్గరలోనే ఓ కళ్యాణ మంటపం ఉంది. ఆ రోజు ఆ కళ్యాణ మంటపంలో ఓ ఉత్తర భారత దేశ చిత్రకారుడు తన చిత్రాల్ని ప్రదర్శిస్తూ ఉన్నాడు. వాటిని చూద్దామని అక్కడికి వెళ్ళారు.

మొత్తం చిత్రాలన్నీ పిల్లల చిత్రాలే. అందంగా అమాయకంగా ఉన్నాయి. మరికొన్ని కొంటె చూపుల్తో, పెద్దపెద్ద కళ్ళతో, కవ్వింపు ముఖంతో చూడముచ్చటగా ఉన్నాయి. మూడు వందలకి పైగా ఉన్న ఆ పిల్లల చిత్రాలన్నీ ఆ చిత్రకారుడు గీసినవే. కన్నార్పకుండా చూశారు. ఎంతసేపు చూసినా ఇంకా చూడాలనిపించసాగాయి ఆ చిత్రాలు. చిత్రకారుడిని అభినందించాలని అతడి దగ్గరకు వెళ్ళారు.

'మీకు మీ పిల్లలంటే చాలా ఇష్టం కాబోలు, వారు చిన్నప్పుడు ఇంత అందంగా ఉండేవారేమో. అందుకే జీవం ఉట్టిపడేట్లు గీయగలిగారు' అన్నారు. అతడు ఏమీ మాట్లాడలేదు. తన పనిలో తాను నిమగ్నమయ్యాడు.

చిత్రపటాలను సర్దుతున్న చిత్రకారుడి సహాయకుడు వీరిని పక్కకి పిలిచాడు. చిన్న గొంతుతో 'ఆయనకు పెళ్లై పాతికేళ్ళయ్యింది కానీ, పిల్లలు లేరు. పుట్టే అవకాశం కూడా లేదు. పుట్టి ఉంటే ఇలా ఉంటారన్న ఊహే అతడిలోని చిత్రకారుడిని నిద్ర లేపింది. పెళ్లి అయ్యేంతవరకు అతడు చిత్రకారుడు కాదు. పిచ్చి గీతలు గీసే మనిషి మాత్రమే. పిల్లలు పుట్టరన్న విషయం తెలిసాకే అతడిలోని చిత్రకారుడు మేల్కొన్నాడు' అని చెప్పి అక్కడినుంచి వెళ్ళిపోయాడు.

నీరు లేని నాడే కదా నీటి విలువ తెలుస్తుందన్న విషయం గుర్తుకొచ్చింది భార్యాభర్తలకి. 'పిల్లలన్నాక గొడవ చేయడం సహజం, మనకి పిల్లలున్నారు కాబట్టి మనకి వారి విలువ తెలియడం లేదు. పిల్లలు లేని వారి బాధ వర్ణనాతీతం కదా' అని ఆలోచించారు. పరుగుపరుగున ఇంటికి వెళ్ళారు. కొడుకుతో పాటు వాడి మిత్రులకంతా తీపి మిఠాయిలు పంచారు.

– ఆర్.సి. కృష్ణస్వామి రాజు

● చెట్టు నీడ

ఈ చెట్టు... ఆ నీళ్లు

అది మంచి ఎండా కాలం. ఎండలు దంచేస్తున్నాయి. దరిదాపులలో నీడనిచ్చేందుకు ఒక చెట్టు కూడా లేదు. దాహం వేస్తోంది. నాలిక పిడచగట్టుకు పోయింది. ఇంకా రెండు మైళ్ళు నడిస్తే ఊరు చేరుకుంటాను. అనుకుంటూ అలానే రొప్పుతూ, ఆయాసపడుతూ టవలు తలపై వేసుకొని నడుస్తున్నాడు ఆ వ్యక్తి. ఎండ నిప్పులు కక్కుతోంది. దూరాన ఓ చెట్టు కనపడితే ప్రాణం లేచి వచ్చినట్లు అయింది. గబ గబ అడుగులు పెద్దగా వేసుకుంటూ అక్కడి కి చేరుకున్నాడు. ఓ పెద్ద కానుగ చెట్టు గుబురుగా ఉంది. రోడ్డంతా నీడ నిస్తుంది. ఆ చెట్టు చుట్టూ అరుగు కట్టారు. ఒకరిద్దరు అక్కడ గుర్రుపెట్టి నిద్రపోతున్నారు. చెట్టు కిందకు చేరగానే అలసట తీరింది. 'అబ్బా ఎంత చల్లగా ఉంది. ఎవరో పుణ్యాత్ముడు వేసిన చెట్టు అనుకుని 'ఆహా..ఆహా' అంటూ చెట్టు కింద చూశాడు. ఓ కుండ కనిపించింది. వెంటనే వెళ్లి కాడ గరిటతో నీళ్ళు ముంచుకొని తాగాడు. 'ఆహా ఎవరో పుణ్యాత్ముడు చల్లటి నీళ్ళు పెట్టాడు, ఇక్కడ చెట్టు నాటాడు'' అనుకుంటూ అక్కడ విశ్రమిస్తుండగా ఓ వృద్ధురాలు ఆ కుండలో నీళ్ల పోస్తూ కనిపించింది.

ఇంతటి ఎండలో ఈమె ఎక్కడికి వెళ్లి నీళ్లు తెచ్చింది... అనుకుంటూ 'అవ్వా! ఇంతటి ఎండలో ఎక్కడ నుంచి నీళ్లు తెచ్చావు? ఈ వయసులో నీకు ఈ అవసరమేమిటి?' అడిగాడు. అవ్వ నవ్వి 'మీలాంటి వాళ్ళ దాహార్తి తీరుస్తున్నాను. అదే నా సేవ నాయన. ఇక్కడ దరి దాపులలో చెట్లు లేకపోతే మా ముసలోడు ఈ చెట్టు నాటాడు, అక్కడ బోరు వేసాడు. దారిన పోయే వాళ్ళు ఈ చెట్టు కింద కూర్చుని చలట్టి నీళ్లు తాగుతూ సేద తీరుతున్నారు. నా కొడుకు..కూతురు ఈ చెట్టు ఆ నీళ్లే నాయనా' అంటూ అవ్వ అక్కడినుంచి వెళ్ళింది. 'మానవ సేవే మాధవ సేవ అంటే ఇదేనేమో' అనుకుంటూ అక్కడ సేద తీరాడు ఆ వ్యక్తి.

– కనుమ ఎల్లారెడ్డి

సాక్షి సినిమా

వేసవిలో మహా సంగ్రామం

● విరాట్ కర్ణ

ఒక ధర్మ యుద్ధాన్ని, మహా సంగ్రామాన్ని చూసేందుకు ఈ సమ్మర్‌లో గెట్ రెడీ అంటోంది 'నాగబంధం' యూనిట్. విరాట్ కర్ణ హీరోగా నభా నటేష్, ఐశ్వర్య మీనన్, మహేష్ మంజ్రేకర్, జగపతిబాబు ముఖ్య పాత్రల్లో అభిషేక్ నామా దర్శకత్వంలో కిషోర్ అన్నపురెడ్డి, నిషితా నాగిరెడ్డి నిర్మిస్తున్న చిత్రమిది. ఈ చిత్రం టీజర్‌ని మహా శివరాత్రి సందర్భంగా హీరో మహేశ్‌బాబు విడుదల చేసి, ''వరల్డ్ ఆఫ్ నాగబంధం' అద్భుతంగా ఉంది. త్వరలో ఈ మూవీని ఎక్స్‌పీరియన్స్ చేయడానికి ఎదురు చూస్తున్నా'' అన్నారు. ''అహ్మద్ షా అబ్దాలి నేతృత్వంలో జరిగిన అఫ్ఘాన్ దాడి నుండి కొంత ప్రేరణ పొందిన ఈ కథలో మైథాలజీ, చరిత్ర, ఆధ్యాత్మిక యుద్ధం వంటి అంశాలు ఉంటాయి. హిమాలయాల రహస్య మార్గాల్లో దాగి ఉన్న నాగబంధం దేవాలయం నేపథ్యంలో సాగే కథ ఇది. లార్డ్ శివ పాత్రలో విరాట్ కర్ణ తన నటనతో పూర్తి న్యాయం చేస్తున్నారు'' అని అభిషేక్ నామా పేర్కొన్నారు.

● 'పెద్ది' సెట్‌లో బుచ్చిబాబు పుట్టినరోజు వేడుకలో వెంకట సతీష్ కిలారు, రామ్‌చరణ్, రత్నవేలు...

మ్యాజికల్ స్టోరీస్ చేద్దాం

– హీరో రామ్‌చరణ్

హీరో రామ్‌చరణ్, దర్శకుడు బుచ్చిబాబు సానా దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'పెద్ది'. ఇందులో జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఆదివారం (ఫిబ్రవరి 15) బుచ్చిబాబు బర్త్ డే సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఓ వీడియోను రిలీజ్ చేసింది యూనిట్. ''ఎగస్ పార్టీవాడికి దూల తీర్చి ధూపం వేయాలంటే ఈ మాత్రం మంట పెట్టాలి లేరా'' అని బుచ్చిబాబు చెప్పిన డైలాగ్ ఈ వీడియోలో వినిపిస్తుంది. ఈ డైలాగ్‌ను సినిమాలో రామ్ చరణ్ చెబుతారని ఊహించవచ్చు. ''సెట్స్‌పై ప్రతిరోజూ మీరు (బుచ్చిబాబు) చూపించే ప్యాషన్, డీటైలింగ్, రూటెడ్ స్టోరీ టెల్లింగ్ ఇన్‌స్పైరింగ్‌గా ఉంటుంది. మనం కలిసి ఇంకా ఎన్నో మ్యాజికల్ స్టోరీస్ చేద్దాం'' అని 'ఎక్స్'లో పేర్కొన్నారు రామ్‌చరణ్. ఈ పోస్టుకు బుచ్చిబాబు స్పందించారు. ''ఈ ప్రయాణంలో మీ నుంచి ఏదో ఒకటి కొత్తగా నేర్చుకుంటూనే ఉన్నాను. 'పెద్ది' పాత్ర చాలా సంవత్సరాల పాటు ప్రేక్షకుల మనసుల్లో నిలిచిపోతుంది. నాపై నమ్మకం ఉంచి, ఈ ప్రాజెక్ట్ బాధ్యతను నాపై ఉంచినందుకు ఎప్పటికీ మీకు కృతజ్ఞుడిగా ఉంటాను సార్'' అని స్పందించారు. సుకుమార్ రైటింగ్స్, మైత్రీ మూవీ మేకర్స్ సమర్పణలో వెంకట సతీష్ కిలారు నిర్మిస్తున్న ఈ సినిమా ఏప్రిల్ 30న విడుదల కానుంది.

భార్య-భర్త - ఓ కూతురు

● రవితేజ, ప్రియా భవానీశంకర్

రవితేజ, ప్రియా భవానీశంకర్ హీరో హీరోయిన్లుగా నటిస్తున్న చిత్రం 'ఇరుముడి'. రవితేజ కెరీర్‌లోని ఈ 77వ సినిమాను శివ నిర్వాణ దర్శకత్వంలో నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో రవితేజ కుమార్తెగా బేబీ నక్షత్ర నటిస్తుండగా, సాయి కుమార్, అజయ్ ఘోష్, రమేష్ ఇందిర, స్వాసిక ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. 'ఇరుముడి'లోని కావేరీ పాత్రలో ప్రియా భవానీశంకర్ నటిస్తున్నట్లుగా మహా శివరాత్రి సందర్భంగా వెల్లడించి, ఆమె ఫస్ట్ లుక్‌ను రిలీజ్ చేశారు. గ్రామీణ నేపథ్యంలో ఈ చిత్రం రూపొందుతోందని, రవితేజ-ప్రియ భార్యాభర్తలుగా నటిస్తున్నారనీ తెలుస్తోంది. ''తండ్రి-కూతురు అనుబంధం ఈ చిత్రానికి హైలెట్‌గా ఉంటుంది. సరికొత్త ఎమోషనల్ షేడ్స్‌తో కూడిన పాత్రలో రవితేజ కనిపిస్తారు'' అని యూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: జీవీ ప్రకాశ్‌కుమార్.

● అశ్విన్ చంద్రశేఖర్, సంతోష్, మానస, అజయ్‌కుమార్, ధీరజ్ మొగిలినేని

హౌస్‌ఫుల్ బోర్డ్స్ చూస్తుంటే హ్యాపీగా ఉంది

– హీరో సంతోష్ శోభన్

''థియేటర్స్ ముందు హౌస్‌ఫుల్ బోర్డ్స్ కనిపించాలనేది మా కల. ఈ రోజు మా 'కపుల్ ఫ్రెండ్లీ' సినిమాకు ఇన్ని హౌస్‌ఫుల్ బోర్డ్స్ చూస్తుంటే హ్యాపీగా ఉంది. మంచి కథను నిజాయితీతో తెరకెక్కిస్తే ప్రేక్షకులు ఆదరిస్తారని మరోసారి ప్రూవ్ అయ్యింది'' అని సంతోష్ శోభన్ అన్నారు. సంతోష్ శోభన్, మానసా వారణాసి హీరో హీరోయిన్లుగా నటించిన చిత్రం 'కపుల్ ఫ్రెండ్లీ'. యూవీ క్రియేషన్స్ సమర్పణలో యూవీ కాన్సెప్ట్స్ నిర్మాణంలో అజయ్‌కుమార్ రాజు. పి సహ నిర్మాతగా అశ్విన్ చంద్రశేఖర్ దర్శకత్వంలో రూపొందిన ఈ సినిమా ఈ నెల 14న తెలుగు, తమిళ భాషల్లో విడుదలైంది. ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లో ధీరజ్ మొగిలినేని ఈ సినిమాను డిస్ట్రిబ్యూట్ చేశారు. తొలి రోజు ప్రపంచ వ్యాప్తంగా ఈ సినిమా రూ. 1.89 కోట్ల గ్రాస్ వసూళ్లు సాధించిందని యూనిట్ పేర్కొంది. ఈ సందర్భంగా ఆదివారం సక్సెస్‌మీట్‌లో అజయ్‌కుమార్ రాజు. పి మాట్లాడుతూ– ''ఆరు నెలల ముందే ఈ సినిమా రిలీజ్‌కు సిద్ధమైనా వాలెంటైన్స్ డేకు కరెక్ట్‌గా ఉంటుందని, ఆగి రిలీజ్ చేశాం. మా మూవీకి సక్సెస్ ఇచ్చిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు'' అన్నారు. ''కపుల్ ఫ్రెండ్లీ' ప్రేక్షకులకు గుర్తుండిపోయే ప్రేమకథ అవుతుందని రిలీజ్‌కు ముందే చెప్పాను. నా మాటను నిజం చేస్తూ, ప్రేక్షకులు మంచి విజయాన్ని అందించారు. సంతోష్-మానసలతో యూవీ సంస్థతో కలిసి నేను మరో ప్రేమకథా సినిమాను నిర్మించి, వచ్చే ఏడాది వాలెంటైన్స్ డేకి రిలీజ్ చేస్తాం'' అన్నారు ధీరజ్ మొగిలినేని. ''ప్రేక్షకుల నుంచి వస్తున్న ఈ ఆదరణ ఇలాగే కొనసాగాలని కోరుకుంటున్నాం'' అన్నారు అశ్విన్ చంద్రశేఖర్. ''మా టీమ్‌లోని ప్రతి ఒక్కరూ ఈ సినిమా విజయానికి కారణం'' అని తెలిపారు మానసా వారణాసి.

డాక్టర్ కాదు!

● నవీన్ చంద్ర

నవీన్ చంద్ర హీరోగా శ్రీకాంత్ నాగోతి దర్శకత్వంలో ఓ చిత్రం రూపొందుతోంది. స్వధర్మ్ ఎంటర్‌టైన్‌మెంట్స్‌పై 'మళ్ళీ రావా, ఏజెంట్ సాయి శ్రీనివాస ఆత్రేయ, మసూద' వంటి బలమైన కథా చిత్రాలను నిర్మించిన రాహుల్ యాదవ్ నక్కా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి 'నాట్ ఎ డాక్టర్' టైటిల్‌ని ప్రకటించి, పోస్టర్‌ని విడుదల చేశారు. 'రాయని ఓ నవల ఆధారంగా' అనేది ట్యాగ్ లైన్. ''ఓ వినూత్న కథతో ఈ చిత్రన్ని రూపొందిస్తున్నాం'' అని నిర్మాత చెప్పారు.

శివ్ కైలాశోం కే వాసి

● రాశీ ఖన్నా

సింగర్‌గా హీరోయిన్ రాశీ ఖన్నా 'జోరు, జవాన్, ప్రతిరోజూ పండగే' వంటి సినిమాల్లో పాటలు పాడారు. తాజాగా 'శివ్ కైలాశోం కే వాసి' అనే భక్తి పాటను పాడారు రాశీ. శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఈ పాటను తన ఇన్‌స్టా ఖాతాలో ఆమె షేర్ చేయగా, వ్యూయర్స్ నుంచి మంచి స్పందన లభిస్తోంది.

ఈ సందర్భంగా రాశీ మాట్లాడుతూ– ''శివ్ కైలాశోం కే వాసి' అనేది అహంకారాన్ని నాశనం చేయడం, అంతరంగాన్ని మేల్కొల్పడం, అతీంద్రియ శక్తి అయిన మహాదేవుడి మీద భక్తిని చాటే ప్రార్థనగా నిలుస్తుంది. 'మహా శివరాత్రి' అత్యంత పవిత్రమైన పర్వదినం. ఇలాంటి విశిష్టమైన రోజున పాడటం హ్యాపీగా ఉంది'' అన్నారు.

మొన్ననే చెప్పిన కదా...

● కావ్య, అన్వేష్

అన్వేష్ మైఖేల్, కావ్యా కల్యాణ్ రామ్ హీరో హీరోయిన్లుగా రూపొందిన చిత్రం 'వాట్స్ అప్ నరేష్'. సీవీ విశాల్ దర్శకత్వంలో భాగ్యలక్ష్మీ చింత నిర్మించారు. ఆదివారం ఈ చిత్రం రెండో గ్లింప్స్‌ని విడుదల చేశారు. ఈ గ్లింప్స్‌లో 'ఎట్ల నడుస్తుంది డేటింగ్ లైఫ్' అని హీరో అంటే, 'మొన్ననే చెప్పిన కదా నాకు ఇష్టం లేదని' అని హీరోయిన్ అంటుంది. 'నువ్వెప్పుడూ డేట్స్‌కి వెళ్లడం లేదా?' అని హీరోయిన్ అంటే, 'వెళ్లినా సెట్ అవ్వడం లేదు' అని హీరో అంటాడు. అలాగే బ్యాక్ గ్రౌండ్‌లో 'అయోమయంగా సాగుతున్న పయనమే ఇదా' అనే పాట కూడా వినిపిస్తుంది. ఈ చిత్రానికి సంగీతం: స్మరణ్ సాయి, కెమెరా: వేదరామన్ శంకరన్.

జీవితాన్ని చూసినట్లు ఉందంటున్నారు

– అర్జున్

● అనూప్, సాయిమాధవ్, అర్జున్, ఐశ్వర్య, నిరంజన్

''పదమూడేళ్ల క్రితం నేను చూసిన యాక్సిడెంట్‌తో 'సీతా పయనం' స్టోరీ లైన్ తట్టింది. ఒక పది సెకన్లు వెనకా ముందూ అయినా ఆ యాక్సిడెంట్ జరిగేది కాదు. సినిమా చూసిన ప్రతీ ఒక్కరూ తమ జీవితాన్ని చూసినట్టుగా ఉందని అంటున్నారు. 'సీతా పయనం' ఫలితం పట్ల హ్యాపీగా ఉన్నాను. నా కూతురు అద్భుతంగా నటించిందని అంటున్నారు. నేను అక్కడే పాస్ అయిపోయాను'' అని అర్జున్ అన్నారు. ఆయన కీలక పాత్రలో నటించి, స్వీయ దర్శకత్వంలో నిర్మించిన చిత్రం 'సీతా పయనం'. నిరంజన్, ఐశ్వర్యా అర్జున్ హీరో హీరోయిన్లుగా నటించిన ఈ సినిమా ఈ నెల 14న విడుదలైంది. ఆదివారం జరిగిన థ్యాంక్స్ మీట్‌లో ఐశ్వర్యా అర్జున్ మాట్లాడుతూ– ''నాపై నమ్మకంతో నాకు అవకాశం ఇచ్చిన మా నాన్నకు థ్యాంక్స్'' అని చెప్పారు. ''ఫ్యామిలీ అంతా చూడదగ్గ చిత్రమిది'' అన్నారు నిరంజన్.

చాటు... చాటు



● రాయంచ, పవన్ కల్యాణ్, హాసిని

పవన్ కల్యాణ్ బత్తులను హీరోగా పరిచయం చేస్తూ బత్తుల సరస్వతి సమర్పణలో బత్తుల కోటేశ్వర రావు నిర్మించిన చిత్రం 'పురుషః'. వీరు ఉలవల దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రంలో హాసినీ సుధీర్, రాయంచ కొక్కురి, విషిక, సప్తగిరి, కసిరెడ్డి రాజకుమార్ ముఖ్య పాత్రలు పోషించారు. ఈ చిత్రం నుంచి 'చాటు చాటు...' అంటూ సాగే పాటను రిలీజ్ చేశారు. శ్రవణ్ భరద్వాజ్ స్వరపరచిన ఈ పాటకు అనంత శ్రీరామ్ సాహిత్యం అందించగా చిన్మయి శ్రీపాద ఆలపించారు. ''మంచి కుటుంబ కథా చిత్రంగా రూపొందించిన 'పురుషః' అన్ని వర్గాల వారినీ అలరిస్తుందనే నమ్మకం ఉంది. త్వరలోనే మా సినిమా విడుదల తేదీని ప్రకటిస్తాం'' అని నిర్మాత తెలిపారు.

స్టాక్ మార్కెట్లు (శుక్రవారం ముగింపు)

గతవారం (9-02-13 నుంచి 6-02-26 వరకు)

సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
954	223
82,627	25,471

విదేశీ సూచీలు

సూచీ	విలువ		మార్పు
నాస్‌డాక్	22,542	▽	55
డోజోన్స్	49,502	△	50
ఎఫ్‌టీఎస్‌ఈ 100	10,446	△	44
డాక్స్	24,915	△	62
హాంగ్‌సెంగ్	4,082	▽	52
నికాయ్	56,942	▽	698

అమెరికా · బ్రిటన్ · జర్మనీ · చైనా · జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. లలో

	కరెన్సీ		కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	88.80	91.81
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	121.18	125.55
€	యూరో	ఎస్‌బీఐ	105.38	109.41
¥	జపాన్ యెన్ (100)	ఎస్‌బీఐ	48.00	61.00
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	61.73	65.63
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	69.47	73.23
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	23.27	24.78
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	23.79	25.05
¥	చైనా యువాన్	థామస్‌కుక్	12.24	14.07

మీ లాకర్ ఎంత భద్రం?



బ్యాంకు లాకర్లో పెట్టేవే భద్రంగా ఉంటాయని. మరి అక్కడే చోరీ జరిగితే? తమకు సంబంధం లేదని బ్యాంకులు తప్పించుకోజూస్తే? పశ్చిమ బెంగాల్‌లోని బాగ్‌దోగ్రా సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో ఇదే జరిగింది. 2016లో ఈ బ్యాంకు లాకర్లో ఓ కస్టమర్ ఉంచిన విలువైన వస్తువులు చోరీ అయ్యాయి. రాష్ట్ర వినియోగ వివాదాల పరిష్కార కమిషన్ రూ.59 లక్షల పరిహారానికి ఆదేశించింది. బ్యాంకు జాతీయ కమిషన్‌కు అప్పీల్ చేసింది. తాజాగా జాతీయ కమిషన్ తీర్పునిస్తూ... లాకర్ భద్రతలో వైఫల్యం ఉన్నప్పుడు బ్యాంక్ తప్పించుకోలేదని స్పష్టంచేసింది. నష్ట పరిహారాన్ని రూ.5 లక్షలకు తగ్గించింది. మరి ఈ సంఘటన నుంచి నేర్చుకోవాల్సిందేంటి? అదే ఈ 'వెల్త్' స్టోరీ...

నూరుశాతం రక్షణ ఎక్కడయినా అసాధ్యమే

- **ఇల్లయినా, బ్యాంకు లాకర్లయినా కొంతవరకే భద్రత**
- **లాకర్లలో వస్తువులకు నష్టం జరిగితే బ్యాంకుల బాధ్యత తక్కువే**
- ఒకవేళ అవి బాధ్యత తీసుకున్నా... లాకర్ చార్జీకి గరిష్టంగా 100 రెట్లే పరిహారం
- వస్తువులకు వ్యక్తిగతంగా ఇన్సూరెన్స్ తీసుకోవడం నయం
- ఖరీదైన ఆభరణాలు, డాక్యుమెంట్లకే పరిమితం కావాలి
- పరిమితులను తెలుసుకున్న తర్వాతే.. నిర్ణయం

రెండేళ్లలో బంగారం ధర 150 శాతానికి పైనే పెరిగింది. వెండి ధర ఐదు రెట్లు ఎగిసింది. మరి ఇంతటి విలువైన వస్తువుల్ని ఇంట్లో ఉంచటం సేఫేనా? పోనీ బ్యాంకు లాకర్లో పెడితే భద్రతకు గ్యారంటీ ఉంటుందా? వాస్తవానికి ఇల్లయినా, బ్యాంకయినా పటిష్ట రక్షణ చర్యలతోనే అక్కడ పెట్టిన వస్తువులకు భద్రత. ఒకవేళ లాకర్‌లో విలువైన వస్తువులను కోల్పోతే పరిస్థితేంటి? అందుకు బ్యాంక్‌లు పూర్తి బాధ్యత తీసుకోవా? సేఫ్ లాకర్ విషయంలో కస్టమర్లు తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఏవైనా ఉన్నాయా? అసలు లాకర్ ఎవరికి అవసరం? ఒకసారి చూద్దాం...

లాకర్ చార్జీలు ఎంతంటే..

- ప్రాంతం, బ్యాంక్, లాకర్ పరిమాణం ఆధారంగా చార్జీలుంటాయి
- సాధారణంగా చిన్న లాకర్‌కు వార్షిక చార్జీ రూ.1,000–3,000
- మధ్యస్థ లాకర్‌కు రూ.3- 6వేలు... పెద్ద లాకర్‌కు రూ.6 –12 వేలు
- ఈ చార్జీపై జీఎస్టీని ... ఒప్పందానికి సంబంధించి స్టాంప్ డ్యూటీని చెల్లించాలి.
- లాకర్ కోసం బ్యాంక్‌లు డిపాజిట్లు అడుగుతాయి. లాకర్‌ను క్లోజ్ చేసినప్పుడు వీటిని తిరిగి పొందొచ్చు.
- వార్షిక చార్జీలు బకాయి పడి, కస్టమర్ స్పందించని సందర్భాల్లో లాకర్ బ్రేకింగ్‌కు అయ్యే చార్జీలను బ్యాంక్‌లు వసూలు చేస్తాయి.

బ్యాంకులపై బాధ్యత లేదా..?

- లాకర్ల నిర్వహణకు సంబంధించి బ్యాంకులపై బాధ్యత ఎంత వరకు అన్నది కస్టమర్‌తో కుదుర్చుకునే ఒప్పంద పత్రాల్లో వివరంగా ఉంటుంది.
- నిర్లక్ష్యం లేదా భద్రత వైఫల్యం కారణంగా లాకర్లలో ఉంచిన వాటికి నష్టం వాటిల్లితే అందుకు బ్యాంకులదే బాధ్యత.
- చోరీ, దోపిడీ, అగ్ని ప్రమాదం, భవనం కూలిపోవడం లేదా బ్యాంక్ ఉద్యోగుల మోసం కారణంగా నష్టం ఏర్పడితే పరిహారం చెల్లించాల్సిందే.
- ప్రకృతి విపత్తులు, భూకంపాలు, వరదల కారణంగా లాకర్లలో వాటికి నష్టం కలిగితే బ్యాంకులపై బాధ్యత ఉండదు. కానీ, బ్యాంక్ తగిన రక్షణ చర్యలు తీసుకోకపోవటం వల్ల ఈ సమయాల్లో నష్టం ఏర్పడితే అప్పుడు పరిహారం చెల్లించాల్సి ఉంటుంది.
- లాకర్‌లోని వాటికి నష్టం జరిగినప్పటికీ.. బ్యాంకుల బాధ్యత పరిమితంగానే ఉంటుంది. లాకర్ వార్షిక అద్దె చార్జీలకు గరిష్టంగా 100 రెట్ల వరకే అవి చెల్లిస్తాయి. ఉదాహరణకు లాకర్‌లోని రూ.20 లక్షల విలువైన ఆభరణాలు కనిపించకుండాపోయాయనుకోండి. లాకర్ చార్జీ రూ.6,000 ఉంటే, అప్పుడు గరిష్టంగా రూ.6 లక్షల మొత్తాన్ని బ్యాంక్ చెల్లిస్తుంది.
- వరుసగా మూడేళ్ల పాటు వార్షిక చార్జీలు చెల్లించకపోతే లేదా ఏడేళ్లపాటు లాకర్‌ను తెరవకపోతే నోటీసు జారీ చేసి.. మూడు నెలల తర్వాత లాకర్లను బ్యాంక్‌లు బ్రేక్ చేయాల్సి ఉంటుంది. నోటీసులకు స్పందన రానప్పుడు.. పేపర్ ప్రకటన ఇచ్చి, ఇద్దరు సాక్షుల సమక్షంలోనే ఈ పని చేయాలి.

ఇన్సూరెన్స్‌తో రక్షణ

- లాకర్లను సురక్షితంగా ఉంచేందుకు దాదాపు అన్ని బ్యాంక్‌లు గట్టి చర్యలు చేపడతాయి. అయినా, కొన్ని ఘటనల్లో కస్టమర్లకు నష్టం జరుగుతుంటుంది
- కాబట్టి లాకర్లలో విలువైన ఆభరణాలు, డాక్యుమెంట్లు ఉంచే వారు వ్యక్తిగతంగా వాటికి ఇన్సూరెన్స్ పాలసీ తీసుకోవాలి.
- బ్యాంకుల మాదిరి లాకర్ చార్జీకి గరిష్టంగా 100 రెట్ల వరకే పరిహారం అన్న పరిమితి బీమాలో ఉండదు.
- బంగారం, వెండి ఆభరణాలు, విలువైన రాళ్లు, ఇతర విలువైన వస్తువులు, పత్రాలకు సైతం బీమా రక్షణ పొందొచ్చు.
- దోపిడీ, దొంగతనాలు, బ్యాంకు ఉద్యోగుల నిర్లక్ష్యం లేదా మోసం, అగ్ని ప్రమాదాలు, పేలుడు, భూకంపాలు లేదా వరదలు కారణంగా లాకర్‌లోని వాటికి ఏర్పడే నష్టానికి బీమా పరిహారం పొందొచ్చు.
- లాకర్లలో ఉంచిన కరెన్సీ నోట్లకు నష్టం వాటిల్లితే బీమా పరిహారం రాదు.
- తుప్పు పట్టడం, చెద పురుగులు, వాతావరణంలో తేమ కారణంగా ఏర్పడే నష్టానికి కూడా బీమా పాలసీలో రక్షణ ఉండదు.

ఇలాంటి లాకర్లుంటేనే భరోసా...

- బ్యాంక్‌లు లాకర్లకు సంబంధించి సీసీటీవీ కెమెరా, అలారమ్ (హెచ్చరించే) సిస్టమ్‌లను ఏర్పాటు చేసుకోవాలి.
- లాకర్‌లు సురక్షితంగా ఉండేలా భవన నిర్మాణం ఉండాలి. రాత్రిళ్లు తగినంత భద్రత ఉండేలా చర్యలు తీసుకోవాలి.
- లాకర్ తెరిచిన ప్రతి సందర్భంలో ఖాతాదారుడి రిజిస్టర్ మొబైల్ నంబర్‌కు ఎస్ఎంఎస్ అలర్ట్‌ను పంపించాల్సి ఉంటుంది.
- లాకర్‌కు సంబంధించి బ్యాంక్‌లకు ఉండే బాధ్యత ఎంత మేర? అనేది ఒప్పందంలో వివరంగా ఉండాలి.
- నామినేషన్ సదుపాయం కల్పించాలి. ఒప్పందంపై సంతకాలు చేయించుకుని, కాపీని కస్టమర్‌కు సైతం అందించాలి.

వీరికి పెద్దగా ఉపయోగం ఉండదు..

- కేవలం కొన్ని ఆభరణాలే ఉన్నా... వాటి విలువ తక్కువగా ఉన్నా..
- బ్యాంక్‌కు వెళ్లి లాకర్ నుంచి తీసుకొచ్చి, మళ్లీ లాకర్లో పెట్టడం వీలు పడని వారు.

లాకర్‌లో వేటికి చోటు..?

- బంగారం, వజ్రాభరణాలు
- ప్రాపర్టీ క్రయ, విక్రయ దస్తావేజులు
- వీలునామాలు, చట్టబద్ధమైన పత్రాలు
- బాండ్ సర్టిఫికెట్లు, అరుదైన కలెక్షన్లు

అసలు లాకర్లు ఎవరికి..?

- అధిక విలువ కలిగిన ఆభరణాలున్నప్పుడు. ముఖ్యంగా వారసత్వంగా వచ్చిన ఆభరణాలున్న వారికి అనుకూలం.
- వ్యాపార లావాదేవీలకు సంబంధించి సున్నితమైన డాక్యుమెంట్లు ఉన్నప్పుడు.
- ప్రాపర్టీ ఒరిజినల్ డాక్యుమెంట్లు, పార్టనర్‌షిప్ డీడ్లు ఉన్నవారు.
- పటిష్టమైన రక్షణ చర్యలు లేని అద్దె ఇళ్లలో నివసించే వారు.
- ఇళ్లల్లో కేవలం వృద్ధులే ఉండే వారికి బ్యాంకు లాకర్లు ఎంతో ఉపయోగకరం.

నమోదు చేస్తే నయం...

- లాకర్‌లో ఏవేవి ఉంచుతున్నారనే విషయాన్ని ఒక రికార్డులో రాసి ఉంచుకోవటం మంచిది.
- ఆభరణాలు, వాటి బరువు, వస్తువుల వివరాలు రాయండి. వీటి కొనుగోలు బిల్లులు, ఫొటోలు కూడా జాగ్రత్తగా ఉంచుకోవాలి.
- లాకర్‌లో తీసి, పెడుతున్న ప్రతి సారీ వాటి వివరాలు తప్పకుండా నమోదు చేయాలి.
- ఆభరణాలకు సంబంధించి విలువ నిర్ధారణ సర్టిఫికెట్లు దగ్గర ఉంచుకోవాలి.
- లాకర్‌కు తప్పకుండా నామినేషన్ తీసుకోవాలి. అవసరమైనప్పుడు నామినీని అప్‌డేట్ చేసుకోవాలి.
- ఏడాదిలో ఒకసారి అయినా లాకర్‌ను తెరిచి, మూయడం చేయాలి.
- డాక్యుమెంట్లు తేమ కారణంగా దెబ్బతినే రిస్క్ ఉంటుంది. కనుక దెబ్బతినని విధంగా ప్యాక్ చేసి పెట్టాలి.

వీటిని ఉంచకండి..

- దేశ, విదేశీ కరెన్సీ నోట్లు
- హానికారక మెటీరియల్స్
- పాడైపోయే వస్తువులు
- ప్రమాదకరమైన వస్తువులు
- ఆయుధాలు, డ్రగ్స్, మందుగుండు సామగ్రి
- చట్టవిరుద్ధమైనవి కూడా..

నష్టం జరిగితే...

- లాకర్లో ఉంచినవి దెబ్బతిన్నట్టు గుర్తించినా లేదా కనిపించక పోయినా బ్యాంక్ మేనేజర్‌కు లిఖిత పూర్వక ఫిర్యాదు ఇవ్వాలి.
- బ్యాంక్ ఏ పోలీస్ స్టేషన్ పరిధిలోకి వస్తుందో అక్కడి వెళ్లి ఫిర్యాదు చేయాలి.
- కస్టమర్ నిర్లక్ష్యం లేని సందర్భాల్లో జరిగిన నష్టానికి బ్యాంక్‌లు పరిహారం చెల్లించాల్సిందే.
- బ్యాంక్‌లు పరిహారానికి నిరాకరిస్తే బ్యాంకింగ్ అంబుడ్స్‌మన్‌ను సంప్రదించొచ్చు.
- అక్కడ న్యాయం జరగకపోతే జిల్లా వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్‌ను సంప్రదించాలి.

గణాంకాలతో మార్కెట్ల తీరెటు?

దేశీ స్టాక్ మార్కెట్లకు ఈ వారం ప్రధానంగా దేశ, విదేశీ గణాంకాలు కీలకంగా నిలవనున్నాయి. అయితే ఇటీవల ఆంత్రోపిక్, శాప్ ఏఐ టూల్స్ అమెరికా నుంచి ఆసియా వరకూ టెక్నాలజీ రంగాన్ని కుదిపేస్తున్న విషయం విదితమే. ఈ నేపథ్యంలో ఇకపై మార్కెట్లు, ఇన్వెస్ట్‌మెంట్ల తీరెలా ఉండవచ్చంటూ నిపుణుల మధ్య చర్చలు అధికమయ్యాయి. వీటిమధ్య ఈ వారం ట్రెండ్‌పై పలు అంశాల ప్రభావం ఉంటుందని నిపుణులు ప్రస్తావిస్తున్నారు. వివరాలు చూద్దాం..

- సాక్షి, బిజినెస్ డెస్క్

- ఇప్పటికే రిటైల్ ద్రవ్యోల్బణం జోరు
- టోకు ధరలు, వాణిజ్య గణాంకాల దారెటు?
- కీలకం కానున్న తయారీ, సర్వీసుల పీఎంఐ
- గత వారం షాకిచ్చిన ఏఐ ఎఫెక్ట్ కొనసాగేనా?
- ఈ వారం దేశీ స్టాక్స్‌లో ట్రెండ్‌పై నిపుణులు..

దేశీయంగా నేడు(16న) జనవరి నెల టోకు ధరల వివరాలు(డబ్ల్యూపీఐ) వెల్లడికానున్నాయి. 2025 నవంబర్‌లో 0.32 శాతం నీరసించినప్పటికీ డిసెంబర్‌లో డబ్ల్యూపీఐ వార్షికంగా 0.83 శాతం బలపడింది. వెరసి గత మూడు నెలల్లో తొలిసారి పెరిగింది. ఏప్రిల్ తదుపరి వేగమందుకుంది. రిటైల్ ధరలు(సీపీఐ) 2.75 శాతం ఎగసిన సంగతి తెలిసిందే. ఇక మరోపక్క వాణిజ్య గణాంకాలు సైతం వెలువడనున్నాయి. డిసెంబర్‌లో ఎగుమతులకంటే దిగుమతులు అధికమై వాణిజ్య లోటు 25 బిలియన్ డాలర్లకు చేరింది. నవంబర్‌లో ఇది 24.53 బిలియన్ డాలర్లుకాగా.. 2024 డిసెంబర్‌లో 20.6 బిలియన్ డాలర్లు మాత్రమే. ఈ బాటలో వారాంతాన ఫిబ్రవరి నెలకు తయారీ, సర్వీసులు, కాంపోజిట్ పీఎంఐ గణాంకాలు విడుదలకానున్నాయి.

విదేశీ అంశాలు

ఫిబ్రవరి 17న యూఎస్ ఏడీపీ ఉపాధి గణాంకాలు, హౌసింగ్ మార్కెట్ ఇండెక్స్, పారిశ్రామికోత్పత్తి వివరాలు విడుదలకానున్నాయి. అంతేకాకుండా ఫెడరల్ రిజర్వ్ గత పాలసీ సమీక్షా వివరాలు(మినిట్స్) సైతం వెల్లడికానున్నాయి. గత పాలసీ సమీక్షలో ఫెడ్ ఫండ్స్ రేట్లను యథాతథంగా 3.5–3.75 శాతం వద్ద కొనసాగించేందుకు నిర్ణయించింది. ఇవి 2022 తదుపరి కనిష్టంకాగా.. తద్వారా మూడు వరుస రేట్ల కోతకు తాత్కాలికంగా బ్రేక్ వేసింది. వీటితోపాటు వ్యక్తిగత వ్యయాల ఇండెక్స్, 2025 అక్టోబర్–డిసెంబర్ జీడీపీ ముందస్తు అంచనాలు సైతం విడుదలకానున్నాయి.

పెట్టుబడుల ప్రవాహమెటు?

- ఆంత్రోపిక్, శాప్ విడుదల చేసిన ఏఐ టూల్స్ సాఫ్ట్‌వేర్ ఆధారిత సర్వీసుల రంగంలో ప్రకంపనాలు సృష్టిస్తున్నాయి. ఐటీ దిగ్గజ కంపెనీలు నిర్వహించే కొన్ని రకాల ప్రాజెక్టులకు చెక్ పడటంతోపాటు.. సిబ్బందిపై సైతం భారీ సంఖ్యలో వేటు వేయవలసి వస్తుందన్న అంచనాలు పెరుగుతున్నాయి. ఇవి ఆందోళనలుగా మారి ప్రపంచవ్యాప్తంగా ఐటీ స్టాక్స్‌లో భారీ అమ్మకాలకు కారణమవుతున్నాయి. దీంతో ప్రపంచ ఇన్వెస్టర్ల దృష్టి ఇతర రంగాలవైపు మళ్లవచ్చని కొంతమంది విశ్లేషకులు భావిస్తున్నారు. దేశీ కస్టమర్ ఆధారిత రంగాలైన బ్యాంకింగ్, ఆటోసహా కొన్ని వినియోగ ఆధారిత రంగాలవైపు ఇన్వెస్టర్లు దృష్టి సారించవచ్చని జియోజిత్ ఇన్వెస్ట్‌మెంట్స్ రీసెర్చ్ హెడ్ వినోద్ నాయిర్ పేర్కొన్నారు.
- టారిఫ్ ఆందోళనలు ఉపశమిస్తున్న నేపథ్యంలో దేశీ కరెన్సీ కదలికలు, విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్ల(ఎఫ్‌పీఐలు) పెట్టుబడులు లేదా అమ్మకాల తీరు, దేశీ ఇన్వెస్టర్ల పెట్టుబడులు, ప్రపంచ మార్కెట్ల పరిస్థితులు, ఆర్‌బీఐ, ఫెడరల్ రిజర్వ్ భవిష్యత్ పాలసీ నిర్ణయాలపై అంచనాలు తదితర అంశాలు సెంటిమెంటుకు కీలకంకానున్నట్లు విశ్లేషకులు వివరించారు. యూఎస్, భారత్‌లలో ద్రవ్యోల్బణం, జీడీపీ పురోగతి వంటి అంశాలు ఫెడ్, ఆర్‌బీఐ పరపతి విధానాలను ప్రభావితం చేసే సంగతి తెలిసిందే. వెరసి వీటికి ప్రాధాన్యత ఉన్నట్లు రెలిగేర్ బ్రోకింగ్ రీసెర్చ్ ఎస్‌వీపీ అజిత్ మిశ్రా పేర్కొన్నారు.
- క్యూ3(అక్టోబర్–డిసెంబర్) ఫలితాల ప్రభావంతో పలు రంగాల కౌంటర్లు యాక్టివ్‌గా కదులుతున్నట్లు నాయిర్ తెలియజేశారు. పటిష్ట ఫలితాలు, ఆర్డర్లు సాధించిన కౌంటర్లు బలపడుతుంటే.. నిరాశపరచిన స్టాక్స్ నుంచి ఇన్వెస్టర్లు తప్పుకుంటున్నట్లు పలువురు విశ్లేషకులు చెబుతున్నారు. వెరసి మార్కెట్ భారీ ఆటుపోట్లలోనూ విభిన్న రంగాల కౌంటర్లు యాక్టివ్‌గా ట్రేడవుతున్నట్లు వివరించారు.
- గత వారాంతాన వెలువడిన ఆశావహ యూఎస్ ఉపాధి గణాంకాలు ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్ల తగ్గింపు యోచనకు చెక్ పెట్టనున్నట్లు నిపుణులు పేర్కొన్నారు. దీంతో గత వారం విదేశీ మార్కెట్లలోనూ అమ్మకాలు తలెత్తినట్లు మిశ్రా తెలియజేశారు.

గత వారమిలా..

గత వారం(9–13) దేశీ స్టాక్ మార్కెట్లు ఐటీ రంగ కౌంటర్లలో భారీ అమ్మకాల కారణంగా డీలా పడ్డాయి. బీఎస్ఈ సెన్సెక్స్ నికరంగా 954 పాయింట్లు(1.15 శాతం) క్షీణించి 82,627 వద్ద నిలిచింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ 223 పాయింట్లు(0.9 శాతం) నీరసించి 25,471 వద్ద ముగిసింది. బీఎస్ఈ మిడ్, స్మాల్ క్యాప్స్ సైతం 1.5 శాతం చొప్పున వెనకడుగు వేశాయి.

ఎఫ్‌పీఐల కొనుగోళ్లు

ఈ నెల తొలి రెండు వారాల్లో ఎఫ్‌పీఐలు దేశీ స్టాక్స్‌లో కొనుగోళ్లకు ప్రాధాన్యమిస్తున్నారు. దీంతో ఈ నెల 2–13 మధ్య నికరంగా రూ. 19,675 కోట్లు ఇన్వెస్ట్ చేశారు. యూరోపసహా.. యూఎస్‌తోనూ వాణిజ్య ఒప్పందాలు కుదుర్చుకోవడంతో విదేశీ ఇన్వెస్టర్లు పెట్టుబడులకు ఆసక్తి చూపుతున్నట్లు నిపుణులు పేర్కొన్నారు. అయితే అంతకుముందు 2026 జనవరి(రూ. 35,962 కోట్లు), 2025 డిసెంబర్(రూ. 22,611 కోట్లు), నవంబర్(3,765 కోట్లు)లలో నికరంగా అమ్మకాలు చేపట్టిన సంగతి తెలిసిందే.

ఇండెక్సులు అటా.. ఇటా?

గత వారం యూఎస్ ట్రేడ్ డీల్ ఆశలు కలిగించినప్పటికీ ఏఐ ఆందోళనలు అమ్మకాలకు దారి చూపాయి. వెరసి ఈ వారం సైతం ఇండెక్సులు బలహీనంగా కదిలే వీలున్నట్లు సాంకేతిక నిపుణులు చెబుతున్నారు.

- నిఫ్టీకి 25,200–25,100 పాయింట్ల వద్ద మద్దతుకు వీలుంది. ఒకవేళ బలపడితే 26,000–26,100 పాయింట్లవరకూ బౌన్స్‌కావచ్చు. అయితే నిఫ్టీ 25,100 దిగువకు చేరితే 24,700వరకూ పతనంకావచ్చు.
- సెన్సెక్స్ తొలుత 82,450–82,000 పాయింట్ల వద్ద సపోర్ట్ తీసుకునే వీలుంది. ఒకవేళ తదుపరి జోరందుకుంటే 84,500–85,000 వరకూ పుంజుకునే చాన్స్ ఉంది. అయితే నీరసిస్తే 82,000 పాయింట్ల దిగువన 80,500–80,000 స్థాయిలో మద్దతు కనిపించవచ్చు.

న్యూ ఫండ్ ఆఫర్స్

టాటా ఏఐఏ ఎన్‌హాన్స్‌డ్ వేల్యూ ఇండెక్స్ ఫండ్స్

TATA AIA LIFE INSURANCE

ఓవైపు జీవిత బీమా భద్రత పొందుతూనే మరోవైపు సంపదను పెంచుకునేందుకు అవకాశం కల్పిస్తూ టాటా ఏఐఏ లైఫ్ కొత్తగా ఎన్హాన్స్‌డ్ వేల్యూ ఇండెక్స్ ఫండ్స్‌ని ఆవిష్కరించింది. ఎన్‌హాన్స్‌డ్ వేల్యూ ఇండెక్స్ ఫండ్, ఎన్‌హాన్స్‌డ్ వేల్యూ ఇండెక్స్ పెన్షన్ ఫండ్ వీటిలో ఉన్నాయి. ఇవి ప్రధానంగా వేల్యూ ఇన్వెస్టింగ్ పద్ధతిలో లార్జ్, మిడ్, స్మాల్ క్యాప్ కంపెనీల స్టాక్స్‌లో ఇన్వెస్ట్ చేస్తాయి. టాటా ఏఐఏ యూనిట్ లింక్డ్ ప్లాన్ల ద్వారా వీటిని తీసుకోవచ్చు. పిల్లల చదువులు, అసెట్స్ సమకూర్చుకోవడం, దీర్ఘకాలిక ఆర్థిక భద్రత మొదలైన ప్రణాళికలకు మొదటి ఫండ్ ఉపయోగకరంగా ఉంటుంది. రిటైర్మెంట్ నిధిని ఏర్పర్చుకోవడానికి రెండోది పని చేస్తుంది. ఈ న్యూ ఫండ్ ఆఫర్ ఫిబ్రవరి 16 వరకు అందుబాటులో ఉంటుంది.

ఓల్డ్ బ్రిడ్జ్ ఫ్లెక్సీ క్యాప్ ఫండ్

OLD BRIDGE ASSET MANAGEMENT

లార్జ్, మిడ్, స్మాల్ క్యాప్ స్టాక్స్‌లో ఇన్వెస్ట్ చేసే ఈ ఫండ్‌ని ఓల్డ్ బ్రిడ్జ్ మ్యూచువల్ ఫండ్ ప్రవేశపెట్టింది. ఫిబ్రవరి 23 వరకు ఇది అందుబాటులో ఉంటుంది. బాటమ్–అప్ వ్యూహంతో దీర్ఘకాలిక పెట్టుబడి వృద్ధికి దోహదపడే స్టాక్స్‌లో ఇన్వెస్ట్ చేస్తుంది. అయిదేళ్లకు పైగా పెట్టుబడులు కొనసాగించే వారికి అనువైన ఫండ్. కనీసం రూ. 5,000 నుంచి, సిప్ అయితే రూ. 1,000 నుంచి ఇన్వెస్ట్ చేయొచ్చు. కేవలం మార్కెట్ క్యాపిటలైజేషన్ ఆధారంగా పెట్టుబడులను కేటాయించకుండా కంపెనీ వ్యాపార నాణ్యత, వృద్ధి అవకాశాలను పరిగణనలోకి తీసుకుని ఈ ఫండ్ ఇన్వెస్ట్ చేస్తుంది. బీఎస్ఈ 500 టీఆర్ఐ దీనికి ప్రామాణికంగా ఉంటుంది.

స్టాక్స్ వ్యూ

ఎన్విరో ఇన్‌ఫ్రా	బ్రోకరేజ్: కీనోట్ క్యాపిటల్	కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 167 **టార్గెట్: రూ. 309**

ఎందుకంటే: దేశీయంగా నీరు, వృధా నీటి సంబంధ మౌలిక సదుపాయాల కల్పనలో కార్యకలాపాలు విస్తరిస్తున్న కంపెనీ ఎన్విరో ఇన్‌ఫ్రా ఇంజినీర్స్. టర్న్‌కీ డిజైన్, కన్‌స్ట్రక్షన్, ఆపరేషన్స్ అండ్ మెయింటెనెన్స్(ఓఅండ్ఎం) సొల్యూషన్లు సమకూర్చుతోంది. ఈ బాటలో ఇంజినీరింగ్, ప్రొక్యూర్‌మెంట్, కన్‌స్ట్రక్షన్(ఈపీసీ)తోపాటు.. హైబ్రిడ్ యాన్యుటీ మోడల్(హెచ్ఏఎం), ఓఅండ్ఎం ప్రాజెక్ట్ మోడల్స్ కార్యకలాపాలు నిర్వహిస్తోంది. తద్వారా సీవేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లు(ఎస్‌టీపీలు), సెవరేజ్ స్కీమ్(ఎస్ఎస్)లు, కామన్ ఎఫ్లుయెంట్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లు(సీఈటీపీలు), వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లు(డబ్ల్యూటీపీలు)సహా.. పంపింగ్ స్టేషన్లు, పైప్‌లైన్ నెట్‌వర్క్స్ ఏర్పాటు చేస్తోంది. ప్రధానంగా ప్రభుత్వం, ప్రభుత్వ మద్దతుగల క్లయింట్లకు సర్వీసులు అందిస్తోంది. వెరసి వృద్ధిలో ఉన్న దేశీ వాటర్, వేస్ట్‌వాటర్ ట్రీట్‌మెంట్ రంగంలో కార్యకలాపాలు విస్తరిస్తోంది. దీంతో డైవర్సిఫైడ్ ఆర్డర్ బుక్‌ను సొంతం చేసుకుంది. ఫలితంగా నిలకడైన వృద్ధిని సాధించేందుకు బాటలు వేసుకుంది. జల్ జీవన్ మిషన్(జేజేఎం) పథకాలలో పరిమిత ఎక్స్‌పోజర్‌ను కలిగి ఉంది. విభిన్న ప్రభుత్వ పథకాలలో పాలు పంచుకోవడం ద్వారా పరిశ్రమలో ఎదురయ్యే సవాళ్లను సమర్థవంతంగా అధిగమించగలుగుతోంది. ఈ రంగంలో పెరుగుతున్న ప్రభుత్వ వ్యయాలు, సీఈటీపీలకు ప్రాధాన్యత ఇవ్వడం, జెడ్ఎల్‌డీ, హెచ్ఏఎం ప్రాజెక్టులు కంపెనీ పురోభివృద్ధికి సహకరించనున్నాయి. వెరసి మూడేళ్ల(2026–27–28) కాలంలో వార్షికంగా ఆదాయం 25 శాతం చొప్పున పుంజుకోనున్నట్లు భావిస్తున్నాం. ఈ కాలంలో నిర్వహణ లాభ(ఇబిటా) మార్జిన్లు 24 శాతం స్థాయిలో కొనసాగే వీలుంది.



ఐఆర్‌సీటీసీ	బ్రోకరేజ్: ఏయూఎం క్యాపిటల్	కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 618 **టార్గెట్: రూ. 825**

ఎందుకంటే: రైల్వే రంగ పీఎస్‌యూ దిగ్గజం ఐఆర్‌సీటీసీ సానుకూల ఆదాయ అంచనాలు కొనసాగిస్తోంది. ఇందుకు రైల్వే టికెట్ అమ్మకాలలో నిలకడైన డిమాండ్, కేటరింగ్, టూరిజమ్, రైల్ నీర్ విభాగాలు దన్నుగా నిలుస్తున్నాయి. డిజిటల్ కార్యకలాపాల విస్తరణ, కొత్త సామర్థ్యాలు, క్లస్టర్ కాంట్రాక్టింగ్ తదితర అంశాలు రానున్న త్రైమాసికాలలో ఆదాయానికి పుష్‌నివ్వనున్నాయి. ఇటీవల రైల్ టికెట్ చార్జీలను పెంచేందుకు దేశీ రైల్వే విభాగం తీసుకున్న నిర్ణయం కంపెనీకి సానుకూల పరిమాణంగా పేర్కొనవచ్చు. వెరసి నిర్వహణ లాభ(ఇబిటా) మార్జిన్లు 35 శాతంస్థాయిలో పటిష్టంగా కొనసాగనున్నట్లు ఇండియన్ రైల్వే కేటరింగ్ అండ్ టూరిజం కార్పొరేషన్(ఐఆర్‌సీటీసీ) అంచనా వేస్తోంది. ఇందుకు పటిష్ట వ్యయ నిర్వహణ, డిజిటల్ సామర్థ్యాలు, టికెటింగ్ అమ్మకాలలో లాభదాయకత వంటి అంశాలు దన్నుగా నిలవనున్నట్లు భావిస్తోంది. ప్రధానంగా కేటరింగ్, రైల్ నీర్, టూరిజం బిజినెస్‌లలో మార్జిన్లు నిలకడను చూపనున్నట్లు పేర్కొంటోంది. అమ్మకాల పరిమాణం పుంజుకోవడం, అందుబాటు ధరలు వీటికి సహకరించనున్నట్లు అభిప్రాయపడుతోంది. రైల్వే టికెట్ల బుకింగ్‌లో కంపెనీ గుత్తాధిపత్యాన్ని కొనసాగిస్తోంది. ఆన్‌లైన్ ద్వారా టికెట్ల బుకింగ్‌ను సులభతరం చేయడంతోపాటు.. విస్తారితం చేయడం ఇందుకు దన్నునిస్తోంది. ప్రస్తుతం రైల్ ప్రయాణికులు 24 గంటలలో ఎప్పుడైనా ఆన్‌లైన్ ద్వారా టికెట్లు బుక్ చేసుకునేందుకు వీలుండటం, ట్రావెల్ సీజన్ కొనసాగుతుండటం సానుకూల ప్రభావం చూపనున్నాయి. దేశీ రైల్వేలలో ప్రస్తుతం శుద్ధ, ఆరోగ్యకర ఆహారానికి ప్రాధాన్యత పెరిగింది. ఈ విభాగంలోనూ కంపెనీకి పట్టుంది. వీటికితోడు ఆన్‌లైన్ పేమెంట్ అగ్రిగేటర్‌గా ఆర్‌బీఐ అనుమతి జోష్‌నివ్వనుంది.

గమనిక: ఈ కాలమ్‌లో షేర్లపై ఇచ్చిన సలహాలు వివిధ బ్రోకరేజ్ సంస్థలు వ్యక్తం చేసిన అభిప్రాయాలు మాత్రమే

సంతృప్తి చెందిన వినియోగదారుడిని మించిన ఉత్తమ వ్యాపార వ్యూహం లేదు.
- మైఖేల్ లెబోఫ్, అమెరికన్ రచయిత, మేనేజ్‌మెంట్ ప్రొఫెసర్

ఉఫ్.. బిగ్ రిలీఫ్!

కస్టమర్ల హక్కులకు ఆర్‌బీఐ దన్ను

- బ్యాంకులు, ఆర్థిక సంస్థల మిస్–సెల్లింగ్‌కు ముకుతాడు
- రుణం పొందాలంటే బీమా తీసుకోవాలని ఒత్తిడి చేయకూడదు
- బండిల్స్ వద్దు.. ప్రతి ఉత్పత్తికీ విడిగా సమ్మతి తీసుకోవాల్సిందే
- ఉదయం 9 నుంచి సాయంత్రం 6 వరకే టెలీమార్కెటింగ్ కాల్స్
- డీఎన్‌డీలో నమోదు చేసుకున్నవారికి కాల్స్ చేయకూడదు.
- రిస్కులు, చార్జీల గురించి బ్యాంకులు తప్పనిసరిగా చెప్పాల్సిందే
- కన్ఫర్మేషన్, అగ్రిమెంట్ కాపీ కస్టమర్లకు తప్పకుండా ఇవ్వాలి.
- మిస్–సెల్లింగ్ రుజువైతే, పూర్తి రిఫండ్‌తో పాటు పరిహారం కూడా...

రాజ్యలక్ష్మి(68) రిటైర్డ్ గవర్నమెంట్ టీచరు. ఉండేది హైదరాబాద్‌లో. ఎఫ్‌డీని రెన్యువల్ చెయ్యడానికి బ్యాంకుకు వెళ్లారు. బ్యాంకు సిబ్బంది రెన్యువల్ చెయ్యకుండా... ఎఫ్‌డీని మించిన రాబడి కచ్చితంగా వస్తుందంటూ మార్కెట్ లింక్డ్ ఇన్సూరెన్స్ ప్లాన్స్‌లో రూ.10 లక్షలు ఇన్వెస్ట్ చేయించారు. రెండేళ్లు గడిచాయి. మార్కెట్ పడిపోవడంతో ఆమె పెట్టుబడిలో 18 శాతం వరకూ పోయింది. ఎఫ్‌డీని మించిన రాబడి కచ్చితంగా వస్తుందన్నారు కదా? అంటూ బ్యాంకును నిలదీశారు. ''మార్కెట్ లింక్డ్ సాధనాల్లో ఇవి సహజం. మీరూ ఒప్పుకుని సంతకం చేశారు కదా?'' అని బ్యాంకు వాళ్లు చూపించటంతో లక్ష్మి హతాశురాలయ్యారు. ఇక వెంకటాచలం అయ్యర్ అనే 90 ఏళ్ల వ్యక్తికి ఏటా రూ.2 లక్షల ప్రీమియంతో 2124లో అంటే, వందేళ్ల తర్వాత మెచ్యూరయ్యే జీవిత బీమా పాలసీని అంటగట్టింది మరో బ్యాంకు. దీనిపై సోషల్ మీడియాలో నానా రచ్చ జరిగేసరికి సైలెంటుగా రిఫండ్ చేసేసింది. ఈ నేపథ్యంలో కస్టమర్లకుండే హక్కులను వివరించేదే ఈ వెల్త్ స్టోరీ...

బ్యాంకులు, ఆర్థిక సంస్థలు మనకు పనికిరాని, అనవసరమైన ఉత్పత్తుల్ని బలవంతంగా కొనిపించేదంతా మిస్–సెల్లింగే. దీన్నుంచి వినియోగదారులను కాపాడేందుకు రిజర్వ్ బ్యాంక్ తొలిసారి స్పష్టమైన చర్యలకు దిగింది. 'రెస్పాన్సిబుల్ బిజినెస్ కండక్ట్ అమెండ్‌మెంట్ డైరెక్షన్స్ – 2026' ముసాయిదా ప్రకారం మిస్ సెల్లింగ్ రుజువైతే, కస్టమర్ల దగ్గరనుంచి వసూలు చేసిన డబ్బు మొత్తాన్ని బ్యాంకులు వాపసు చేయాలి. సదరు ప్రొడక్టు విక్రయాన్ని రద్దు చేయాలి. ఈ ఏడాది జూలై 1 నుంచి అమల్లోకి వచ్చే అవకాశమున్న ఈ నిబంధనలతో మిస్–సెల్ చేయలేదని నిరూపించుకోవాల్సిన బాధ్యత బ్యాంకులపై పడుతుంది.

మిస్–సెల్లింగ్ ఇదీ...

రిజర్వ్ బ్యాంక్ తొలిసారిగా మిస్–సెల్లింగ్‌కంటూ స్పష్టమైన నిర్వచనాలిచ్చింది. అవేంటంటే...

- కస్టమర్ ప్రొఫైల్‌కి అనువుగా లేని ఉత్పత్తులను విక్రయించటం
- పూర్తిగా, లేక సరైన వివరాలు ఇవ్వకుండా అమ్మడం
- బండిల్‌గా ప్రొడక్టులను అంటగట్టడం
- కస్టమరు నుంచి స్పష్టమైన సమ్మతి తీసుకోకుండానే విక్రయించడం

ఇక్కడ గుర్తుంచుకోవాల్సింది ఏంటంటే, కస్టమరు ఒకవేళ అన్ని డాక్యుమెంట్స్‌పై సంతకాలు చేసినా, ప్రొడక్టు గానీ అనువైనది కాకపోతే అది మిస్–సెల్లింగ్ కిందికే వస్తుంది. ఇప్పటివరకు కస్టమర్ల సంతకాలు, డిజిటల్ క్లిక్‌లు అనే లూప్ హోల్‌ని అడ్డం పెట్టుకుని, బయటపడిపోయిన బ్యాంకులు ఇకపై అలాంటివి చేయటానికి కుదరదు. ఆర్‌బీఐ కొత్త ఫ్రేమ్ వర్క్ ప్రకారం రాజ్యలక్ష్మి ఎదుర్కొన్నది మిస్ సెల్లింగే. ఎందుకంటే ఆమె వయస్సు, రిస్కు సామర్థ్యాల రీత్యా మార్కెట్లో భారీ పెట్టుబడులు పెట్టడం రిస్కీ వ్యవహారమే. పెట్టుబడికి కూడా హాని ఉంటుందనే విషయం సరిగ్గా చెప్పకుండా ఆమెకు అరకొర సమాచారమే ఇచ్చి ఉండొచ్చు. ఇలాంటి సందర్భాల్లో ఆర్‌బీఐ మార్గదర్శకాల ప్రకారం ఆమెకు పూర్తి రిఫండ్ చేయాల్సి ఉంటుంది.

టార్గెట్లే మిస్–సెల్లింగ్‌కి మూలం..

అసలు మిస్–సెల్లింగ్‌కి మూలకారణం ఉద్యోగులకు ఉండే భారీ సేల్స్ టార్గెట్లు, ప్రోత్సాహకాలే. కాబట్టి ఇకపై బ్యాంకులు ఏవి చేయకూడదో ఆర్‌బీఐ స్పష్టంగా పేర్కొంది. అవి...

- సేల్స్ కోసం అంతర్గతంగా పోటీ పెట్టడం
- స్పెషల్ 'టార్గెట్ డేస్'ని నిర్దేశించడం
- ఎలాగైనా ప్రొడక్టును అంటగట్టేలా ప్రోత్సహించే ప్రోత్సాహకాల విధానాలు
- థర్డ్ పార్టీ ప్రొడక్టులను విక్రయించే ఉద్యోగులు నేరుగా గానీ పరోక్షంగా గానీ సదరు సంస్థల నుంచి ప్రోత్సాహకాలేవీ పొందకూడదు. రిలేషన్‌షిప్ మేనేజర్లు టార్గెట్లను పూర్తి చేసేందుకు, తమకు భారీగా కమీషన్ వచ్చే ప్రొడక్టులను అంటగట్టకుండా ఇలాంటివి కట్టడి చేస్తాయి.

బలవంతంగా బండిల్ చేయొద్దు..

రుణం ఇవ్వాలంటే ఆ రుణానికి బీమా తీసుకోవాలంటూ బ్యాంకులు లింకు పెట్టడం సహజం. ఇదే బండ్లింగ్. ఒకటి కావాలంటే మరొకటి కూడా జత కలపటం. ఆర్‌బీఐ ముసాయిదా నిబంధనల ప్రకారం...

- రుణం కోసం తప్పనిసరిగా తాము చెప్పే బీమా పాలసీని తీసుకోవాల్సిందే అంటూ బ్యాంకులు ఒత్తిడి చేయడానికి ఉండదు.
- నచ్చిన ఏ కంపెనీ నుంచైనా థర్డ్ పార్టీ ప్రొడక్టులను కొనుక్కునేందుకు కస్టమర్లకు స్వేచ్ఛ ఉంటుంది.
- కస్టమర్లు స్పష్టంగా సమ్మతించకుండా, రుణ మొత్తం నుంచి బీమా లేదా ఇన్వెస్ట్‌మెంట్ ప్రొడక్టులకు సంబంధించిన డబ్బును కట్ చేసుకోవడానికి ఉండదు.
- కస్టమర్ల సమ్మతి అనేది నిర్దిష్టంగా ఉండాలి. పూర్తి వివరాలు తెలుసుకుని ఇచ్చినట్లుగా ఉండాలి. అస్పష్టత ఉండకూడదు. వివిధ ప్రొడక్టులన్నింటికీ కలిపి ఒకే ఫారంలో లేదా డిజిటల్ చెక్‌బాక్స్ ద్వారా సమ్మతి తీసుకోవడానికి కుదరదు. ప్రతి ప్రొడక్టుకు విడిగా అప్రూవల్ తీసుకోవాల్సిందే.

డిజిటల్ 'డార్క్ ప్యాటర్న్స్' కట్టడి

బ్యాంకులు ఇకపై కస్టమర్లను మభ్యపెట్టే 'డార్క్ ప్యాటర్న్స్'లాంటి డిజిటల్ మాయవేషాలు వేయడానికి ఉండదు. ఈ డార్క్ ప్యాటర్న్స్ ఏమిటంటే..

- ఇదిగో మరికాసేపట్లోనే ఆఫర్ ముగిసిపోతుంది, త్వరపడకపోతే నష్టపోతారనే విధంగా కంగారు పెట్టేయడం
- ముందే యాడ్–ఆన్స్‌ని సెలెక్ట్ చేసేసి ఉంచడం
- ప్రీ–అప్రూవ్డ్ క్రెడిట్ కార్డులంటూ ఇచ్చేసి, కార్డ్ ప్రొటెక్షన్ ప్లాన్లలాంటివి అంటగట్టడం
- పేమెంట్ దశవరకు ఇతర చార్జీల గురించి చెప్పకుండా దాచి పెట్టి ఉంచడం
- అన్‌సబ్‌స్క్రయిబ్ చేసేందుకు సంబంధించిన ఆప్షన్లు గందరగోళంగా ఉండటం

ఇలాంటివి చేయకుండా కేంద్రీయ వినియోగదారుల హక్కుల పరిరక్షణ సంస్థ మార్గనిర్దేశకాలను బ్యాంకులు తప్పనిసరిగా పాటించాలి. తమ యూజర్ ఇంటర్‌ఫేస్‌లను తరచుగా ఆడిట్ చేసుకుంటూ ఉండాలి. దీనితో యాప్–ఆధారిత బ్యాంకింగ్‌లో పారదర్శకత గణనీయంగా మెరుగుపడుతుంది.

టెలీమార్కెటింగ్ కష్టాలకు చెక్

- కొత్త రూల్స్ ప్రకారం ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకే కాల్స్‌కి అనుమతి ఉంటుంది
- డీఎన్‌డీ కింద రిజిస్టర్ చేసుకుంటే అసలు కాల్ చేయడానికే ఉండదు
- ఏజెంట్లు తాము కూడా బ్యాంకు ఉద్యోగులమే అన్నట్లుగా వ్యవహరించకూడదు
- ప్రమోషనల్ మెసేజీలను కస్టమర్లు స్పష్టంగా సమ్మతిస్తేనే పంపాలి. అన్‌సబ్‌స్క్రయిబింగ్ ప్రక్రియ కూడా సరళంగా ఉండాలి.



ప్యాసివ్ ఫండ్లకు 'స్మార్ట్ బీటా వ్యూహాలు'

విక్రమ్ వాడేకర్
హెడ్ (ప్యాసివ్ బిజినెస్), యాక్సిస్ మ్యూచువల్ ఫండ్

దేశీయంగా పెట్టుబడుల పరిస్థితుల్లో ఇటీవల గణనీయమైన మార్పులు వస్తున్నాయి. తక్కువ ఖర్చు, వైవిధ్యం, పారదర్శకత, దీర్ఘకాల క్రమశిక్షణ తదితర అంశాలకు ఇన్వెస్టర్లు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారు. దీంతో 'ప్యాసివ్ ఇన్వెస్టింగ్' విధానం వేగంగా విస్తరిస్తోంది. ఇండెక్స్ ఫండ్లు, ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్స్‌లాంటి ప్యాసివ్ ఫండ్లు, స్వయంగా షేర్లను ఎంపిక చేసుకోవాల్సిన బాదరబందీ లేకుండా మార్కెట్‌లో పెట్టుబడులు పెట్టే అవకాశాన్ని కల్పిస్తున్నాయి. ఈ పరిణామాల నేపథ్యంలో ప్యాసివ్ ఇన్వెస్టింగ్‌కి సంబంధించి 'స్మార్ట్ బీటా వ్యూహాలు' ఒక వినూత్న మార్గంగా అవతరిస్తున్నాయి.

స్మార్ట్ బీటా వ్యూహాల నిర్వచనం..
'స్మార్ట్ బీటా వ్యూహాలు' అనేవి ఇండెక్స్‌కు అనుసంధానమైన పెట్టుబడి వ్యూహాలు. ఇవి సంప్రదాయ ప్యాసివ్ ఫండ్ల మాదిరిగా కేవలం మార్కెట్ క్యాపిటలైజేషన్ ఆధారంగా పనిచేయవు. ఈ వ్యూహంలో భాగంగా, ముందుగానే నిర్ణయించిన నిర్దిష్ట నియమాల ప్రకారం, పలు ఆర్థిక ప్రమాణాలను పరిగణనలోకి తీసుకొని షేర్లను ఎంపిక చేసి, వాటికి తగిన వెయిటేజీ కేటాయిస్తాయి. ఈ విధానం 'ప్యాసివ్ ఇన్వెస్టింగ్'లోని సరళత్వాన్ని కొనసాగిస్తూనే, అదనంగా వ్యూహాత్మక దృష్టికోణాన్ని కూడా జోడిస్తుంది. దీనితో పోర్ట్‌ఫోలియో నుంచి మరింత మెరుగైన ఫలితాలను పొందేందుకు వీలవుతుంది.

ఫాక్టర్ ఆధారిత విధానం:
స్మార్ట్ బీటా వ్యూహాల్లో విస్తృతంగా ఉపయోగించే కొన్ని ముఖ్యమైన ఫాక్టర్లు ఉన్నాయి. విలువ (వేల్యూ), మొమెంటం, నాణ్యత(క్వాలిటీ), తక్కువ వోలటిలిటీ (ఒడిదుడుకులు), సమానమైన వెయిటేజీ తదితర ఫ్యాక్టర్లను పరిగణలోకి తీసుకుంటారు. వీటిలో విలువ (వేల్యూ) అనే ఫాక్టర్, కంపెనీల షేర్ల వేల్యుయేషన్ ఆకర్షణీయంగా ఉందా లేదా అనే అంశాన్ని సూచిస్తుంది. మొమెంటం ఫాక్టర్ గతంలో స్థిరమైన పనితీరు కనబరిచిన కంపెనీ షేర్లపై దృష్టి సారిస్తుంది. నాణ్యత (క్వాలిటీ) ఫాక్టర్ ఆర్థికంగా బలమైన, స్థిరమైన లాభాలు కలిగిన కంపెనీల షేర్లను ఎంపిక చేస్తుంది. తక్కువ వోలటిలిటీ ఫాక్టర్ అనేది మార్కెట్‌తో పోలిస్తే తక్కువ ఒడిదుడుకులకు లోనయ్యే షేర్లను గుర్తిస్తుంది. సమానమైన వెయిటేజీ అనే ఫ్యాక్టర్ అన్ని షేర్లకు సమాన వెయిటేజీ ఇస్తూ, మధ్యతరహా, చిన్న కంపెనీలకు ఎక్కువ ప్రాధాన్యత కల్పిస్తాయి.

రిస్క్‌లు, పరిమితులు:
అయితే స్మార్ట్ బీటా వ్యూహాలకు కూడా కొన్ని రిస్క్‌లు, పరిమితులున్నాయి. ముఖ్యంగా ఫ్యాక్టర్ ఆధారిత రిస్క్. ఏదో ఒక ఫాక్టర్ కొన్ని మార్కెట్ పరిస్థితుల్లో బాగా పనిచేయవచ్చు. మరికొన్ని సమయాల్లో వెనుకబడే అవకాశం ఉంటుంది. సహజంగానే ప్యాసివ్ ఫండ్లు అనేవి మార్కెట్ సూచీలను అనుసరిస్తాయి. కాబట్టి, మార్కెట్ పడిపోతే వెంటనే ఫండ్ విలువా తగ్గుతుంది. కొన్నిసార్లు మంచి మార్కెట్ సమయంలోనూ సగటు లాభాలతో సరిపెట్టుకోవాల్సి వస్తుంది. ఒకే రంగానికి పరిమితయమ్యే ప్యాసివ్ ఫండ్లూ ఉంటాయి. ఆ రంగానికి ఏదైనా ఇబ్బంది వచ్చినప్పుడు మొత్తం పోర్ట్‌ఫోలియో ప్రభావితం కావచ్చు. కావున దీర్ఘకాలంలోనే ఈ వ్యూహాల అసలు ప్రయోజనం బయటపడుతుంది. అందుకే తాత్కాలిక పనితీరును చూసి నిర్ణయాలు తీసుకోవడం సరైంది కాదు.

మొత్తంగా, స్మార్ట్ బీటా వ్యూహాలు అనేవి ప్యాసివ్ ఇన్వెస్టింగ్ సరళతను, నిర్దిష్ట నియమాల ఆధారిత వ్యూహాలను సమన్వయం చేసే ఆధునిక పెట్టుబడి విధానాలుగా అభివర్ణించవచ్చు. ఇవి విభిన్న ఫాక్టర్లను కలిపి పెట్టుబడిదారులకు స్థిరమైన ఆదాయాలు అందించగలవు. భవిష్యత్తులో భారత ప్యాసివ్ ఇన్వెస్టింగ్ ప్రయాణంలో స్మార్ట్ బీటా వ్యూహాలు కీలక పాత్ర పోషించనున్నాయి. మార్కెట్లు వృద్ధి చెందుతున్న దశలో ప్యాసివ్ ఫండ్లు దీర్ఘకాలంలో మంచి ఫలితాలను ఇచ్చేందుకు ఆస్కారం ఉంది.

మెరుగైన రాబడులకు మార్గం

హెచ్‌డీఎఫ్‌సీ ఫ్లెక్సీక్యాప్ ఫండ్



ఈక్విటీల్లో దీర్ఘకాలం కోసం ఇన్వెస్ట్ చేసుకునే వారు.. వివిధ రకాల పథకాలను ఎంపిక చేసుకుంటూ ఉంటారు. ఎక్కువ మంది పోర్ట్‌ఫోలియోలో లార్జ్‌క్యాప్, మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ ఫండ్స్ కనిపిస్తుంటాయి. ఇలా భిన్న పథకాలకు కేటాయింపులు చేసుకునే బదులు.. ఒకే పథకం ద్వారా అన్ని విభాగాల్లోనూ పెట్టుబడులు పెట్టుకోవాలని భావించే వారికి ఫ్లెక్సీక్యాప్ ఫండ్స్ అనుకూలంగా ఉంటాయి. అంటే మార్కెట్ విలువ పరంగా ఇవి ఏదో ఒక విభాగానికే పరిమితం కాకుండా.. అన్ని రకాల అవకాశాల్లో ఇన్వెస్ట్ చేస్తుంటాయి. ఈ విభాగంలో టాప్ ఫండ్స్‌లో హెచ్‌డీఎఫ్‌సీ ఫ్లెక్సీక్యాప్ ఫండ్ ఒకటి.

రాబడులు..

ఈ పథకంలో ఇన్వెస్ట్ చేసిన వారికి గడిచిన ఏడాది కాలంలో రాబడి 16.19 శాతం వచ్చింది. ఇక గడిచిన మూడేళ్లలో వార్షిక రాబడి 23.07 శాతం చొప్పున నమోదైంది. ఐదేళ్లలోనూ ఏటా 21.33 శాతం చొప్పున రాబడిని ఈ పథకం ఇన్వెస్టర్లకు అందించింది. ఇక ఈ ఫండ్ ఆరంభం నుంచి (1995) చూసుకున్నా.. వార్షిక రాబడి 16.78 శాతం చొప్పున ఉండడం గమనించొచ్చు. ఈ పథకంలో కనీసం రూ.100 నుంచి సిస్టమ్యాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ (సిప్) రూపంలో ఇన్వెస్ట్ చేసుకోవచ్చు.

పెట్టుబడుల విధానం..

ఈ పథకం ఈక్విటీల్లో కనీసం 65 శాతం తగ్గకుండా, గరిష్ఠంగా 100 శాతం వరకు పెట్టుబడులు పెడుతుంది. లార్జ్‌క్యాప్స్, మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ మధ్య ఎలాంటి పరిమితులు లేకుండా.. మెరుగైన వృద్ధి అవకాశాలు ఏ విభాగంలో ఉంటే అక్కడ కేటాయింపులు పెంచే స్వేచ్ఛతో పనిచేస్తుంది. ఈక్విటీ పెట్టుబడుల విలువను ఊహించని షాక్‌ల నుంచి రక్షించుకునేందుకు పరిస్థితులకు అనుగుణంగా డెరివేటివ్స్ (ఫ్యూచర్, ఆప్షన్ కాంట్రాక్టులు) పొజిషన్లలోనూ కొంత ఇన్వెస్ట్ చేస్తుంటుంది. పరిస్థితులను బట్టి డెట్ సాధనాల్లో అరుదుగా (ఈక్విటీలు మరీ ఖరీదుగా మారినప్పుడు) 35 శాతం వరకూ ఇన్వెస్ట్ చేస్తుంది. రియల్ ఎస్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ ట్రస్ట్ (రీట్), ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ ట్రస్ట్ (ఇన్విట్)ల్లోనూ పెట్టుబడులు పెడుతుంటుంది. సగటు కంటే అధిక రాబడులు అందించాలన్నది ఈ పథకం ఉద్దేశం.

పోర్ట్‌ఫోలియో

ప్రస్తుతం ఈ పథకం నిర్వహణలో రూ.97,451 కోట్ల పెట్టుబడులు ఉన్నాయి. ఇందులో ఈక్విటీలో 82.12 శాతం ఇన్వెస్ట్ చేయగా, రియల్ ఎస్టేట్ సాధనాల్లోనూ 2.32 శాతం మేర పెట్టుబడి పెట్టింది. డెట్ సెక్యూరిటీల్లో కేవలం 0.53 శాతం పెట్టుబడులు ఉండగా, 15 శాతం మేర నగదు నిల్వలు ఉన్నాయి. మార్కెట్ వ్యాల్యూషన్లు ఆకర్షణీయంగా లేనప్పుడు ఫ్లెక్సీక్యాప్ ఫండ్స్ ఇలా చెప్పుకోతగ్గ స్థాయిలో నగదు నిల్వలు నిర్వహిస్తుంటాయి. ఈక్విటీ పెట్టుబడులను పరిశీలించగా.. ఇందులో 70 శాతం మేర లార్జ్‌క్యాప్ కంపెనీల్లోనే ఉన్నాయి. మిడ్‌క్యాప్ కంపెనీల్లో 4.25 శాతం, స్మాల్‌క్యాప్ కంపెనీల్లో 9.35 శాతం చొప్పున ఇన్వెస్ట్ చేసింది. రంగాల వారీ కేటాయింపులను పరిశీలించగా, అత్యధికంగా బ్యాంకింగ్ అండ్ ఫైనాన్షియల్ రంగ కంపెనీల్లో 47 శాతం, కన్జ్యూమర్ డిస్క్రీషినరీ కంపెనీల్లో 16.87 శాతం, టెక్నాలజీ కంపెనీల్లో 11.20 శాతం, హెల్త్‌కేర్ కంపెనీల్లో 8.18 శాతం, మెటీరియల్స్ కంపెనీల్లో 6.61 శాతం చొప్పున పెట్టుబడులు ఉన్నాయి.

టాప్ ఈక్విటీ హోల్డింగ్స్

కంపెనీ	పెట్టుబడుల శాతం
ఐసీఐసీఐ బ్యాంక్	8.90
హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్	7.82
యాక్సిస్ బ్యాంక్	7.59
ఎస్‌బీఐ	4.86
ఎస్‌బీఐ లైఫ్	4.10
కోటక్ బ్యాంక్	3.81
హెచ్‌సీఎల్ టెక్	3.13
మారుతి సుజుకీ	3
సిప్లా	2.85
పవర్‌గ్రిడ్	2.40

పన్నుల ముసాయిదాలోని "ప్రమోదం"

కె.సీహెచ్. ఎ.వి.ఎస్.ఎన్ మూర్తి
కె.వి.ఎన్ లావణ్య
ట్యాక్సేషన్ నిపుణులు

కొత్త ఇన్‌కం టాక్స్ చట్టం వచ్చింది. ముసాయిదా నిబంధనలు–2026 విడుదల అయ్యాయి. ఈ ఫిబ్రవరి 22 తేదీ వరకు సలహాలు స్వీకరిస్తారు. ఆ తరువాత వాటిని అమలులోకి తెస్తారు. ఈ ముసాయిదా ప్రతిపాదనలు చిన్న చిన్న అస్సెస్సీలకు, ఉద్యోగస్తులకు ఎంతో ఊరట, ఉపశమనం కల్పిస్తాయి అనడంలో సందేహం లేదు. ముసాయిదాలోని ప్రతిపాదనలు ప్రమోదాన్ని తెస్తున్నాయి. వివరాల్లోకి వెళ్దాం... కేవలం వ్యక్తులకు సంబంధించిన వాటిని ప్రస్తావిస్తున్నాం....

ఉద్యోగస్తులకు ఉపశమనం: ఉద్యోగికి జీతంతో పాటు అదనంగా లభించే వేతనేతర ప్రయోజనాలు/సౌకర్యాల పరిమితిని పెంచారు. కొత్తగా వచ్చే ఈ అదనపు ప్రయోజనాలతో లబ్ధి పొందేది అంతిమంగా ఉద్యోగస్తుడు. రెండు, మూడు దశాబ్దాలుగా వీటి జోలికెళ్లని డిపార్ట్‌మెంట్ ఇప్పుడు ఆచరణాత్మకంగా అడుగులేస్తోంది.

- యజమాని సమకూర్చే వాహనాల సామర్థ్యం ఆధారంగా మినహాయింపు ఇస్తారు. ఈ సదుపాయంతో డ్రైవర్ ఇవ్వడం లేదా ఇవ్వకపోవడం జరగొచ్చు. ఇంజిన్ సామర్థ్యం 1.6 లీటర్ దాటని సందర్భంలో ఇచ్చే మినహాయింపుని రూ.2,700 నుంచి రూ.8,000లకు పెంచారు. కెపాసిటీ 1.6 లీటర్ దాటితే రూ.3,200 నుంచి రూ.10,000లకు పెంచారు.

- యజమాని ఇచ్చే భోజనం విలువ పరిమితిని ఒక్కొక్క భోజనానికి రూ.50 నుంచి రూ.200లకు పెంచారు. దాని విలువ ఏడాదికి లెక్కిస్తే మినహాయింపు విలువ రూ.1,05,000 దాకా వస్తుందని అంచనా.
- గిఫ్ట్ వోచర్ల విలువని రూ.15,000 లకు పెంచారు. ప్రస్తుతం వాటి విలువ రూ.5,000గా ఉంది.
- వడ్డీ లేని రుణాలు... వడ్డీ విలువ రూ.20,000 దాకా ఉంది. దాన్ని పదింతలు అంటే రూ.2,00,000 లకు పెంచారు.
- ఎడ్యుకేషన్ అలవెన్స్.. ఒక సంతనానికి నెలకి రూ.100 ఉంది. దానిని రూ.3,000లకు పెంచారు.
- విద్యార్థులకు హాస్టల్ అలవెన్సు పరిమితిని రూ.300 నుంచి రూ.3,000లకు పెంచారు.

ప్రస్తుతం అమల్లో ఉన్న పరిమితులు దశాబ్దాల చరిత్ర కలిగినవి. కొంతమంది మరిచిపోయారు. కొంతమంది క్లెయిమ్ చేయడం మానేశారు. డిపార్ట్‌మెంట్ వారి ఆలోచనా విధానం సమకాలీన పరిస్థితులకు అద్దం పడుతోంది. ఈ పెంపుదల గణనీయం.. ఈ మేరకు ఉద్యోగస్తులకు ఎంతో పన్ను ఊరట కలుగుతుంది.

పాన్‌తో తిప్పలు తప్పుతాయ్..!
చేతిలో సెల్‌ఫోన్, బ్యాగులో ఆధార్‌కార్డు, పాన్ కార్డు లేకుండా బయటకు రాలేని పరిస్థితి. కొంతమంది జిరాక్సులు చేయించి సిద్ధంగా ఉంటారు. ప్రస్తుతం బ్యాంకులో నగదు డ్రా చేయాలంటే ఒక రోజులో రూ.50,000 దాటితే పాన్ తెలియచేయాలి. ఇక నుంచి డైలీ లిమిట్స్ ఉండవు. ఒక ఆర్థిక సంవత్సరం మొత్తంలో రూ.10,00,000 నగదు విత్‌డ్రా చేసినా, డిపాజిట్ చేసినా, ఈ పరిమితి రూ.10 లక్షలు దాటితేనే పాన్ వివరాలు ఇవ్వాలి. దీని వలన ఇల్లు కట్టిస్తున్నప్పుడు, ఏవైనా పెళ్లిళ్లు, కార్యాలున్నప్పుడు వ్యాపారంలో కొనుగోళ్లు, మెడికల్ ఎమర్జెనీ సందర్భాల్లో ఎంతో వెసులుబాటు ఉంటుంది.

స్థిరాస్తి క్రయవిక్రయ సందర్భాల్లో రూ.10,00,000 ఉన్న పరిమితిని రూ.20,00,000లకు పెంచారు. అలాగే జాయింట్ డెవలప్‌మెంట్ సందర్భాల్లో రూ.20,00,000 లోపల ఎటువంటి ఇబ్బంది లేకుండా సాఫీగా వ్యవహారాలు జరుపుకోవచ్చు.

అలాగే చిన్న, చిన్న మోటారు బైకులు కొనుగోలు సందర్భంలో విలువతో నిమిత్తం లేకుండా పాన్ అడిగేవారు. ఇక నుంచి రూ.5,00,000 దాటిన బండి కొంటేనే పాన్ అడుగుతారు.

హోటల్, ఈవెంట్ల నిర్వహణ కోసం చెల్లించే మొత్తం రూ.1,00,000 దాటితేనే పాన్ సమర్పించాలి. ప్రస్తుతం ఈ పరిమితి రూ.50,000గా ఉంది.

అయితే ఇవన్నీ ఒక దిశగా వెళ్లితే.., ఊరంతా ఒక దారి, ఉలిపికట్టెదొక దారి అన్నట్లు బీమా రంగంలో మాత్రం ఎటువంటి సడలింపు లేదు. పాన్ వాడకం సడలింపు విషయంలో డిపార్ట్‌మెంట్‌ని అభినందించాలి. సడలింపుల వలన ఎంతో సౌలభ్యం ఏర్పడుతుంది. కాలం వృథాకాదు.

టాక్సుపేయర్ ఎప్పుడూ చట్టాన్ని, రూల్స్‌తో కలిసి చదివి నిర్ణయానికి రావాలి. ఈ రూల్స్ ప్రకారం మన తెలుగు ప్రజలలో హైదరాబాద్ ఉద్యోగస్తులకు ఒక తీపి కబురు.

హైదరాబాద్ ఉద్యోగస్తులు: ఇంటి అద్దె అలవెన్సు మినహాయింపు ఢిల్లీ, ముంబై, చెన్నై, కోల్‌కతా మినహా అన్ని ప్రాంతాల్లో ఉన్న ఉద్యోగస్తులకు జీతం మీద 40% మాత్రమే ఉండేది. నిజానికి హైదరాబాద్ ఎంతో అభివృద్ధి చెందింది. దానితో పాటు సదుపాయాలు, ఇళ్లు, అపార్ట్‌మెంట్లు ఇప్పుడు విల్లాలు.. కొంతమంది ఇండిపెండెంట్ ఇంటిలో ఉంటారు. అమలులో ఉన్న రూల్స్ ప్రకారం వారికి మినహాయింపు 40% మాత్రమే ఇచ్చేవారు. ఇప్పుడు ఈ లిమిట్ అన్నీ 40% నుంచి 50 శాతానికి పెంచారు. దాని వలన హైదరాబాదులో ఎక్కువ అద్దె ఇచ్చే వారికి మంచి ఉపమశనం. అంతేకాకుండా ఈ వెసులుబాటు పూణే, అహ్మదాబాద్, బెంగళూర్‌కి వర్తిస్తుంది. వెనకోముందో ఉద్యోగస్తులకు ప్రమోదం కలిగించేలా ప్రతిపాదనలు ఉన్నాయి. అభినందనీయం..!

పన్నుకు సంబంధించిన సందేహాలు ఏవైనా ఉంటే పాఠకులు business@sakshi.comకు ఈ-మెయిల్ పంపించగలరు.

స్పామ్ కాల్స్.. ఇక బ్లాక్!

ఫిర్యాదుల అవసరం లేకుండానే నిషేధం

స్పామ్ నంబర్‌గా టెల్కోలు గుర్తిస్తే చర్యలు

కసరత్తు చేస్తున్న టెలికం నియంత్రణ సంస్థ

అవాంఛిత, మోసపూరిత కాల్స్, సందేశాలు ప్రపంచానికి సవాల్‌గా మారాయి. వ్యక్తుల భద్రతకు ముప్పుగా పరిణమించడంతోపాటు ఆర్థిక నష్టాలకూ ఇవి కారణం అవుతున్నాయి. మన దేశంలో 95% మంది మొబైల్ యూజర్లకు ప్రతిరోజూ స్పామ్ కాల్స్, సందేశాలు వెల్లువెత్తుతున్నాయంటే సమస్య తీవ్రతను అర్థం చేసుకోవచ్చు. ఈ నేపథ్యంలో స్పామ్ కాల్స్‌కు చెక్ పెట్టేందుకు టెలికం నియంత్రణ సంస్థ (ట్రాయ్) సిద్ధమవుతోంది. కస్టమర్ అందుకున్న కాల్, మెసేజ్‌ను టెలికం కంపెనీ స్పామ్‌గా గుర్తిస్తే ఆ నంబర్‌ను బ్లాక్ లిస్టులోకి చేర్చాలని భావిస్తోంది. అలాగే అధికారిక ఫిర్యాదు లేకపోయినా స్పామ్ మెసేజ్‌లు పంపే మొబైల్ నంబర్‌ను డిస్‌కనెక్ట్ చేయాలన్న ప్రతిపాదనపై ట్రాయ్ కసరత్తు చేస్తోంది. టెలికం కంపెనీలతో ఈ మేరకు చర్చిస్తోంది. ప్రస్తుతం టెల్కోలు 10 రోజుల వ్యవధిలో ఐదు ప్రత్యేక ఫిర్యాదులను స్వీకరిస్తే స్పామర్‌పై చర్య తీసుకుంటున్నాయి. తాజా ప్రతిపాదన ప్రకారం ఒక నంబర్‌ను వరుసగా 10 రోజులపాటు అనుమానిత స్పామ్‌గా ఏఐ టెక్నాలజీ గుర్తిస్తే.. ఆ నంబర్‌కు వ్యతిరేకంగా ఎటువంటి ఫిర్యాదు లేకపోయినా కూడా చర్య తీసుకోవచ్చు. ఇది అమల్లోకి వస్తే స్పామ్ కాల్స్, మెసేజెస్ కట్టడికి టెలికం కంపెనీలు చేపడుతున్న చర్యలకు మరింత ఊతం ఇచ్చినట్టు అవుతుంది. **- సాక్షి, స్పెషల్ డెస్క్**

రియల్ టైమ్‌లో విశ్లేషించి..

ప్రస్తుతం దేశంలో ఏదైనా అవాంఛిత సమాచారాన్ని స్పామ్‌గా గుర్తించడానికి నిర్దిష్ట నియమాలు లేవు. కాల్స్, సందేశాలు పంపినవారి రోజువారీ వినియోగ తీరు, కాల్స్ ఎంత సమయం మాట్లాడుతున్నారు, ఎన్ని సందేశాలు పంపిస్తున్నారు, ఎవరెవరికి, ఏ ప్రాంతంలో ఉన్నవారికి ఈ కాల్స్ చేస్తున్నారు వంటి అంశాలను టెల్కోలు ఉపయోగిస్తున్న ఏఐ సాంకేతికత రియల్ టైమ్‌లో విశ్లేషించి.. అవాంఛిత కాల్స్, మెసేజెస్‌ను గుర్తించి వినియోగదారులను అప్రమత్తం చేస్తున్నాయి. కాల్‌ను అంగీకరించడం లేదా తిరస్కరించడం అనేది కస్టమర్ నిర్ణయంపైనే ఆధారపడి ఉంటుంది. అయితే అనుమానిత స్పామ్‌గా గుర్తించిన అనేక కాల్స్ నిజమైన కాలర్ల నుంచి వచ్చినవే ఉంటున్నాయి. వాటిలో గిగ్ వర్కర్లతోపాటు ఇతర వాణిజ్య సంస్థలు ఉన్నాయి.

వ్యవస్థీకృతంగా మోసాలు..

2024 సెప్టెంబర్ నుంచి 2026 జనవరి మధ్య 7,100 కోట్ల స్పామ్ కాల్స్, 290 కోట్ల స్పామ్ సందేశాలను గుర్తించినట్లు ఎయిర్‌టెల్ ప్రకటించింది. 8 లక్షలకుపైగా మోసపూరిత లింక్స్‌ను బ్లాక్ చేసినట్లు వెల్లడించింది. సైబర్ నేరగాళ్లు ఆధునిక సాంకేతికతను ఉపయోగిస్తూ కాల్ సెంటర్లతో వ్యవస్థీకృతంగా మోసపూరిత కార్యకలాపాలు సాగిస్తున్నట్లు తెలిపింది. సైబర్ నేరగాళ్ల కారణంగా ప్రపంచవ్యాప్తంగా రూ. 92.7 లక్షల కోట్ల ఆర్థిక నష్టం వాటిల్లిందని భారతీ ఎయిర్‌టెల్ చీఫ్ రెగ్యులేటరీ ఆఫీసర్ రాహుల్ వాట్స్ వెల్లడించారు. 250కిపైగా కొలమానాలను పరిగణనలోకి తీసుకొని స్పామ్ కాల్స్, సందేశాలను గుర్తిస్తున్నట్టు చెప్పారు.

- టెల్కోలు ఏఐ సొల్యూషన్స్ సాయంతో ప్రతి నెలా సుమారు 40 కోట్ల కాల్స్, సందేశాలను అనుమానిత స్పామ్‌గా గుర్తిస్తున్నాయి.
- నమోదు కాని టెలీమార్కెటర్ల నుంచి వస్తున్న వాటిలో 7.5 కోట్ల కాల్స్, ఎస్ఎంఎస్‌లు ప్రతిరోజూ బ్లాక్ అవుతున్నాయి.
- స్పామర్లపై టెల్కోలకు రోజుకు సగటున 10,000 ఫిర్యాదులు మాత్రమే అందుతున్నాయని సమాచారం.
- 2025 ఫిబ్రవరిలో 1,16,213 స్పామ్ ఫిర్యాదులు టెల్కోలకు అందగా 2025 డిసెంబర్‌లో ఆ సంఖ్య 3,34,317కు చేరింది.
- ఫిర్యాదులలో ఎక్కువ భాగం నమోదు కాని టెలిమార్కెటర్లపైనే ఉంటున్నాయి.
- టెలిమార్కెటింగ్ కంపెనీల ప్రతినిధులు సాధారణంగా 10 అంకెల మొబైల్ నంబర్ ద్వారా కాల్స్ చేస్తున్నారు.
- భారత్‌లో 116 కోట్ల మంది మొబైల్ సబ్‌స్క్రైబర్స్ ఉన్నారు. వారిలో అవాంఛిత కాల్స్‌ను నివారించేందుకు ట్రాయ్ తీసుకొచ్చిన డు నాట్ డిస్టర్బ్ (డీఎన్‌డీ) సేవలను 22 కోట్ల మంది మాత్రమే ఎంపిక చేసుకున్నారు.

ఇంతకూ ఆ రోజు ఏం జరిగింది?

- డాక్టర్ దీపిక మృతిపై వీడని చిక్కుముడి
- ఎనస్థీషియా అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సుష్మకు షోకాజ్ నోటీసు
- ఆ రోజు నైట్ డ్యూటీలో లేకుండా ఇంటికెళ్లిన వైనం
- పీజీలు, సిబ్బంది నుంచి కూపీలాగుతున్న పోలీసులు
- పలు అనుమానాలున్నాయంటున్న దీపిక తండ్రి కోదండరామిరెడ్డి

లబ్బీపేట (విజయవాడ తూర్పు): ఎనస్థీషియా పీజీ ఫైనల్ ఇయర్ విద్యార్థి డాక్టర్ దీపిక ఇటీవల అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన ఘటన నేపథ్యంలో ఆ రోజు రాత్రి విధుల్లో ఉండకుండా ఇంటికెళ్లిన ఆ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సుష్మకు విభాగాధిపతి షోకాజ్ నోటీసు జారీ చేశారు. ఈ నెల నాలుగో తేదీ రాత్రి డాక్టర్ బత్తుల దీపిక అనుమానాస్పదంగా మృతి చెందిన విషయం తెలిసిందే. ఆమె మృతి చెందడానికి ముందు అసిస్టెంట్ ప్రొఫెసర్ రూమ్‌లో ఉంది. ఆ రోజు నైట్ డ్యూటీలో ఉండాల్సిన అసిస్టెంట్ ప్రొఫెసర్ సుష్మ ఆ రోజు రాత్రి 8.30 గంటల సమయంలోనే ఇంటికెళ్లిపోయినట్లు విచారణలో నిర్ధారించారు. దీంతో ఆమెకు షోకాజ్ నోటీసు జారీ చేశారు. ఆమె ఇచ్చే సమాధానాన్ని బట్టి చర్యలు తీసుకునే అవకాశం ఉంది. ఆ రోజు డాక్టర్ సుష్మ ఇంటికెళ్లకుండా ఉండి ఉంటే, పీజీలు ఇద్దరూ ఒకే రూమ్‌లో ఉండేవారు. డాక్టర్ సుష్మ ఇంటికి వెళ్లడంతో సీనియర్ పీజీ అయిన డాక్టర్ దీపిక ఒక రూమ్‌లో ఉండగా, మొదటి సంవత్సరం పీజీ ఇంకో రూమ్‌లో ఉన్నారు. అర్ధరాత్రి 12.45 గంటలకు తనకు వాంతులు వచ్చేలా ఉన్నాయని దీపిక పక్క రూమ్‌లో ఉన్న జూనియర్ పీజీకి ఫోన్ చేయగా, ఆమె వచ్చి క్యాన్‌లా పెట్టి ఇంజక్షన్ చేసి.. కేసు తీసుకొచ్చేందుకు క్యాజువాలిటీకి వెళ్లింది. తిరిగి వచ్చేసరికి దీపిక ఆపరేషన్ టేబుల్‌పై పడి ఉంది.

అంతర్గత కమిటీ విచారణలో ఏం తేలింది?

డాక్టర్ దీపిక మృతిపై అనేక అనుమానాలు ఉన్నాయని ఆమె తండ్రి రాష్ట్ర వైద్య శాఖ కార్యదర్శిని కలిసి వినతిపత్రం అందజేశారు. జిల్లా స్థాయి అధికారులను సైతం కలిశారు. ఆస్పత్రిలో ఇప్పటికే ముగ్గురు ప్రొఫెసర్‌లతో అంతర్గత కమిటీ విచారణ జరిపింది. వీరు ఏం తేల్చారో ఇంకా వెల్లడవ్వలేదు. తాజాగా పోలీసులు పీజీ విద్యార్థులను పిలిచి అసలు ఆ రోజు ఏమి జరిగిందనే విషయంపై కూపీ లాగుతున్నారు. ఆ రోజు రాత్రి థియేటర్‌కు ఎవరైనా వచ్చారా..? వస్తే ఎందుకు వచ్చారు..? దీపికను ఎవరైనా వేధించారా..? అనే విషయాలపై ఆరా తీస్తున్నారు. ఒకవేళ ఆత్మహత్యకు పాల్పడి ఉంటే, అందుకు కారణాలేమిటనే కోణంలో కూడా దర్యాప్తు చేస్తున్నారు. ఆమె ఫోన్ కాల్స్‌ను సమగ్రంగా పరిశీలిస్తే (స్నాప్ షాట్, ఇన్‌స్టా కాల్స్ సహా) క్లూ దొరికే అవకాశం ఉంటుందని కొందరు వైద్యులు, విద్యార్థులు చెబుతున్నారు. ఆ రోజు ఆమెతో పాటు విధుల్లో ఉన్న సిబ్బంది స్టాఫ్ నర్సు, థియేటర్ అసిస్టెంట్‌లను కూడా విచారిస్తున్నారు. పోస్టుమార్టం రిపోర్టు అందితే కొంత వరకు కొలిక్కి వచ్చే అవకాశం ఉంది.

ఎవరో కొట్టి చంపారు

పోలీసులకు రచయిత బొగ్గుల శ్రీనివాస్ సోదరుల ఫిర్యాదు

అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసిన పోలీసులు

ఫిర్యాదు చేసేందుకు కూసుమంచి పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన శ్రీనివాస్ సోదరులు

కూసుమంచి: ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం పాలేరు రిజర్వాయర్‌లోకి శనివారం కారు దూసుకెళ్లడంతో ప్రముఖ రచయిత బొగ్గుల శ్రీనివాస్ (48) మృతిచెందిన ఘటనపై ఆయన సోదరులు అబ్దుల్లా, సుధాకర్ ఆదివారం కూసుమంచి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తమ సోదరుడు శ్రీనివాస్ తల, ముఖంతోపాటు ఎడమ చేతిపై గాయాలున్నాయని.. గుర్తుతెలియని వ్యక్తులు కొట్టి చంపి ఉంటారని అనుమానం వ్యక్తం చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నాగరాజు తెలిపారు. శ్రీనివాస్ మృతదేహానికి నేలకొండపల్లి ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి సోదరులకు అప్పగించగా వారు నంద్యాల జిల్లాలోని స్వగ్రామం అల్లూరుకు తీసుకెళ్లారు. కారులో నుంచి ఒడ్డుకు వచ్చి పారిపోయిన వ్యక్తి కోసం గాలిస్తున్నామని, విచారణ వేగవంతం చేసి త్వరలోనే కేసును ఛేదిస్తామని పోలీసులు తెలిపారు.

హైదరాబాద్ నుంచి వస్తూ.. శ్రీనివాస్ ప్రయాణించిన ఏపీ 16 డీపీ 2345 కారు హైదరాబాద్ నుంచి ఖమ్మం వైపు వచ్చినట్లు టోల్ ప్లాజా సీసీ పుటేజీల ద్వారా పోలీసులు గుర్తించారు. ఈ కారు రిజిస్ట్రేషన్ ప్రకారం పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలం పాకాలపాడు గ్రామానికి చెందిన వేణుమాధవరెడ్డిదిగా గుర్తించారని తెలిసింది. కారు జాతీయ రహదారిపై వెళ్లకుండా నాయకన్‌గూడెం నుంచి పాలేరు రాష్ట్ర రహదారిపై రావడం, రిజర్వాయర్‌లో పడిపోయాక కారు నడిపిన వ్యక్తి అక్కడి నుంచి పరారవడంతో పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. శ్రీనివాస్ గతంలో హైదరాబాద్‌లో కండక్టర్‌గా ఉద్యోగం చేసేవాడని, ఆ తర్వాత ఉద్యోగం నచ్చక వదిలేసి పుస్తకాలు రాస్తున్నాడని సోదరులు పేర్కొన్నారు.

హిందూపురంలో టీడీపీ కార్యకర్త వికృత చేష్టలు

- బాలికలకు వీడియో కాల్స్ చేసి ప్రైవేటు పార్ట్స్ చూపించాలని టార్చర్
- సీఎం బావమరిది, మంత్రి లోకేశ్ మామ నందమూరి బాలకృష్ణ నియోజకవర్గం హిందూపురంలో టీడీపీ కార్యకర్త దారుణాలు
- రాష్ట్రంలో రోజురోజుకు శ్రుతిమించుతున్న కూటమి నేతల ఆగడాలు

ఎమ్మెల్యే బాలకృష్ణతో టీడీపీ కార్యకర్త నాగేంద్ర (ఫైల్)

సాక్షి, పుట్టపర్తి: కూటమి ఎమ్మెల్యే అరవ శ్రీధర్ వికృతక్రీడ మరువక మునుపే సీఎం చంద్రబాబు బావమరిది, మంత్రి లోకేశ్ మామ, ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ ప్రాతినిధ్యం వహిస్తున్న శ్రీసత్యసాయి జిల్లా హిందూపురం నియోజకవర్గంలోని చిలమత్తూరు మండలానికి చెందిన టీడీపీ కార్యకర్త నాగేంద్ర మైనర్ బాలికలతో సాగించిన వికృత చేష్టలు బయటపడ్డాయి. బాలికలతో బలవంతంగా శృంగారం చేస్తూ, వాటిని స్వయంగా వీడియోలు తీశాడు. వాట్సాప్ ద్వారా వీడియో కాల్స్ మాట్లాడడం, ప్రైవేటు పార్ట్స్ చూపించమని ఒత్తిడి చేసి రాక్షసానందం పొందిన వీడియోలు వైరల్‌గా మారాయి. నాగేంద్ర వీడియో కాల్స్, నేరుగా శృంగార వీడియోలు తీయడం నియోజకవర్గంలో కలకలం రేపుతోంది. నియోజకవర్గంలో టీడీపీ నేతల వికృత చేష్టలకు అడ్డూ అదుపు లేకుండా పోతోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. బాలికలకు సంబంధించిన వీడియోలు తీయడమే నేరమనుకుంటే.. వాటిని ఎలా బయటకు పంపించారన్న చర్చ కూడా జోరుగా సాగుతోంది. బ్లాక్‌మెయిల్ చేయడానికి అమ్మాయిల వీడియోలు తీసి ఉండవచ్చన్న అనుమానాలు రేకెత్తుతున్నాయి.

రుషికొండ బీచ్‌లో విషాదం

అలల ఉధృతికి కొట్టుకుపోయిన బీటెక్ విద్యార్థి మృతి

మృతుడి స్వస్థలం తూర్పుగోదావరి జిల్లా కొత్తపల్లి

అరవింద్ (ఫైల్)

కొమ్మాది (విశాఖ): మహాశివరాత్రి పర్వదినాన్ని ఆనందంగా గడపాలని సంద్రానికి వెళ్లిన స్నేహితులకు విషాదం మిగిలింది. అలల తాకిడికి కొట్టుకుపోయి బీటెక్ విద్యార్థి మృతి చెందాడు. ఈ ఘటనకు సంబంధించిన వివరాలు.. కొమ్మాది గాయత్రీ విద్యాపరిషత్ కళాశాలలో బీటెక్ చివరి సంవత్సరం చదువుతున్న ఐదుగురు విద్యార్థులు ఆదివారం రుషికొండ బీచ్‌కు చేరుకున్నారు. అక్కడ స్నానాలు ముగించుకుని రాడిసన్ బ్లూ వెనుక వైపు ఉన్న తీరానికి వెళ్లారు. అరవింద్ నాయుడు (21) మళ్లీ సముద్రంలోకి దిగగా, అలల ఉధృతికి ఒక్కసారిగా కొట్టుకుపోయాడు. అతడిని కాపాడేందుకు ప్రయత్నించిన మరో స్నేహితుడు గోకులకృష్ణ ప్రమాదంలో చిక్కుకున్నాడు. గమనించిన లైఫ్ గార్డ్స్ బోటులో వెళ్లి గోకుల కృష్ణను సురక్షితంగా ఒడ్డుకు చేర్చారు. అపస్మారక స్థితిలో ఉన్న అరవింద్‌కు సీపీఆర్ చేసినప్పటికీ ఫలితం లేకపోయింది. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ అరవింద్ మృతి చెందాడు. అరవింద్ స్వస్థలం తూర్పుగోదావరి జిల్లా కొత్తపల్లి గ్రామం. అతని తండ్రి సూర్యప్రకాష్ ఫిర్యాదు మేరకు ఆరిలోవ పోలీసులు కేసునమోదు చేశారు.



Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Published at D. No. 5 - 625, Vadlamudi Road, Atmakur Village, Mangalagiri Mandal, Guntur Dist-522 503, (AP) and Printed at Jagati Publications Limited, D. No. 5 - 625, Vadlamudi Road, Atmakur Village, Mangalagiri Mandal, Guntur Dist-522 503, (AP).,
EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of news under the PRB act) Phone No : 0863-2512581 Fax No: 0863-2512584, RNI Regn No. APTEL/2008/23801. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

క్లుప్తంగా...

'పీఎం సేతు' ద్వారా నైపుణ్య శిక్షణ

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ప్రధానమంత్రి స్కిల్ ఎడ్యుకేషన్ ఫర్ ట్రాన్స్‌ఫర్మేషన్ అండ్ అప్‌గ్రేడేషన్ (పీఎం సేతు) పథకం ద్వారా నైపుణ్య శిక్షణ బాధ్యతలను కన్సల్టెన్సీ సంస్థలకు అప్పగిస్తోంది. రాష్ట్రంలో పీఎం సేతు పథకం ఎం ప్యానలింగ్ ఏజెన్సీగా వ్యవహరిస్తున్న ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఇందుకోసం ఆసక్తిగల సంస్థల నుంచి బిడ్లను ఆహ్వానిస్తోంది. ఆసక్తిగల సంస్థలు బిడ్లు దాఖలు చేయడానికి చివరి తేదీ ఫిబ్రవరి 19గా నిర్ణయించారు.

జనసేన సభ్యత్వ నమోదు ప్రారంభం

సాక్షి,అమరావతి: జనసేన పార్టీ క్రియాశీలక సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని పార్టీ అధ్యక్షుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆదివారం ప్రారంభించారు. రాష్ట్రవ్యాప్తంగా ఈ నెల 26 నుంచి మొదలు కానుండగా, పిఠాపురం నియోజకవర్గంలో వారం ముందు నుంచే ప్రారంభమవుతుందని తెలిపారు. అధినేత పవన్ కళ్యాణ్ తొలి సభ్యత్వం తీసుకొని, కార్యకర్తల బీమా కోసం రూ.2 కోట్లు విరాళంగా అందించారని పార్టీ కార్యాలయం ఒక ప్రకటనలో పేర్కొంది.

తునికాకు కొనుగోలు ప్రారంభించాలి

సాక్షి, అమరావతి: గిరిజన ప్రాంతంలో తునికాకు కొనుగోలును వెంటనే ప్రారంభించాలని ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు సంఘ రాష్ట్ర అధ్యక్షు కార్యదర్శి లోతు రామారావు కే సురేంద్ర, సహాయ కార్యదర్శి అశోక్ ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆంధ్రప్రదేశ్ ఫారెస్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ తునికాకు కొనుగోలుపై గతేడాది నవంబర్‌లో ప్రభుత్వానికి ప్రతిపాదన పంపించిందన్నారు. మూడు నెలలు అవుతున్న నేటికీ ప్రభుత్వం తునికాకు కొనుగోలు చేయలేదని, వెంటనే కొనుగోలు చేయాలని, లేని పక్షంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

ముస్లింలకు బాబు మరోసారి మోసం

సాక్షి, అమరావతి: ఎన్నికల సమయంలో ముస్లిం మైనార్టీలకు ఇచ్చిన హామీల అమలుకు చంద్రబాబు ప్రభుత్వం బడ్జెట్ కేటాయింపులు జరపలేదని ఏపీ హజ్ కమిటీ మాజీ చైర్మన్ షేక్ గౌస్ లాజమ్ ఆదివారం మండిపడ్డారు. చంద్రబాబు అధికారంలోకి వచ్చాక మూడు బడ్జెట్‌లలో ముస్లిం సంక్షేమానికి, అభివృద్ధికి ఎంత మేరకు నిధులు ఖర్చు చేశారో శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. హామీలు అమలు చేయకుండా ముస్లింలను చంద్రబాబు మరోసారి మోసం చేస్తున్నారని గౌస్ లాజమ్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

వెబ్‌సైట్ ద్వారా ఆర్టీఐ సమాచారానికి అవకాశమివ్వాలి: సీపీఎం

సాక్షి, అమరావతి: సమాచారం కోసం సమాచార హక్కు చట్టం(ఆర్టీఐ) వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు కోరారు. ఈ విషయమై ఆర్టీఐ కమిషనర్‌కు రాసిన లేఖను దాయన ఆదివారం మీడియాకు విడుదల చేశారు. సాంకేతిక పరిజ్ఞానం పెరిగిన నేపథ్యంలో ఆన్‌లైన్ ద్వారా సమాచారం పొందే సౌలభ్యం చాలా అవసరమన్నారు. దేశంలో అనేక రాష్ట్రాల్లో ఆన్‌లైన్ సౌకర్యం ఉందని, ఏపీలోనూ ఆ అవకాశం కల్పించాలని శ్రీనివాసరావు కోరారు.

మనసే.. మరణశాసనం

చిత్తూరు నగరానికి చెందిన 53 ఏళ్ల వ్యక్తి ఒకప్పుడు ధనవంతుడు. కార్లల్లో షికారు చేసినవాడు. ఎప్పుడూ అతని చుట్టూ 10 మంది ఉండేవారు. అలా దర్జాగా బతికిన ఆ వ్యక్తి చివరకు అప్పుల పాలయ్యాడు. ఆర్థిక కష్టాలను అధిగమించలేక.. మత్తుకు బానిసయ్యాడు. మానసికంగా కుంగిపోయాడు. కుటుంబసభ్యులు వైద్యం చేయించినా నయం కాకపోవడంతో చివరకు ప్రాణాలు కోల్పోయాడు.

చిత్తూరు జిల్లా బంగారుపాళెం మండలానికి చెందిన 30 ఏళ్ల యువకుడు మద్యానికి బానిసయ్యాడు. తాగి తాగి మతిపోగొట్టుకున్నాడు. ప్రవర్తనలో మార్పులు చూసిన కుటుంబసభ్యులు ఆ యువకుడిని చికిత్స కోసం చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తీసుకొచ్చారు. మూడు నెలలుగా చికిత్స తీసుకుంటున్నాడు. క్రమం తప్పకుండా మందులు, మాత్రలు వాడుతున్నారు. ప్రస్తుతం ఆ వ్యక్తి నిలకడగా ఉంటూ సొంత పనులు చేసుకుంటున్నాడని, మళ్లీ మద్యం జోలికెళితే, మానసిక సమస్యలు తప్పవని వైద్యులు చెబుతున్నారు.

- నిశ్శబ్దంగా ప్రాణాలు తీస్తున్న మానసిక వ్యాధులు
- కుటుంబ కలహాలు, ఆర్థిక కష్టాలు, పనిఒత్తిడులే కారణం

కాణిపాకం: ఆధునిక సమాజంలో మనిషి జీవితం ఉరుకులు పరుగులతో సాగుతోంది. ఉదయం నిద్రలేస్తే ఇంటి సరుకుల నుంచి ఈఎంఐలు, బ్యాంకు అప్పులు, డ్వాక్రా చీటీలు, వ్యాపారాలు, పిల్లల చదువులతో సతమతమవుతున్నారు. లక్ష్యాన్ని అందుకోవాలనే తపనతో విద్యార్థులు, ఉద్యోగులు, గృహిణులు, వ్యాపారులు ఇలా అందరూ మానసిక ఒత్తిడికి గురవుతున్నారు. దీనికితోడు మత్తుకు బానిసవుతూ మానసిక రుగ్మతలకు గురవుతున్నారు. చిత్తూరు జిల్లాలో మానసిక వ్యాధిగ్రస్తుల సంఖ్య విపరీతంగా పెరుగుతోంది. ప్రతి వంద మందిలో 20 నుంచి 25 శాతం మంది మానసిక రుగ్మతల బారిన పడుతున్నట్లు వైద్యనిపుణులు చెబుతున్నారు. యువకుల నుంచి పెద్దల వరకు ఒత్తిళ్లకు గురై మానసిక జబ్బును కొని తెచ్చుకుంటున్నారని గుర్తించారు. మరోవైపు మద్యంతో చిత్తవుతున్నారని వెల్లడిస్తున్నారు. ఇక ఆర్థిక కష్టాలు, ప్రేమ, పెళ్లిలు, ఇతరత్రా సమస్యలతో కూడా మానసికంగా ఇబ్బందిపడుతున్నారు. ఈక్రమంలో చిత్తూరు నగరంలోని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి ప్రతిరోజూ 40 నుంచి 50 ఓపీలు వస్తున్నాయని వైద్యులు చెబుతున్నారు.

ఆర్థిక కష్టాలు చిదిమేస్తున్నాయి

ఆర్థిక భారం తట్టుకోలేక అనేక మంది మానసికంగా పూర్తిగా కుంగిపోతున్నారు. వ్యవసాయం నుంచి వ్యాపారం వరకు, ఉద్యోగాల నుంచి పెట్టుబడుల వరకు ఎక్కడ చూసినా అనిశ్చితి. కుటుంబాన్ని పోషించలేని స్థితిలో పడిపోయిన వ్యక్తి మౌనంగా లోలోపలే ఆత్మహత్యే మార్గంగా ఎంచుకుంటున్నారు. ఇక ఉద్యోగాల్లో టార్గెట్లు, ఒత్తిడి, భద్రత లేమి మనుషులను యంత్రాల్లా మార్చేసింది. నిద్రలేని రాత్రులు, ఆందోళనతో గడిచే రోజులుం చివరకు డిప్రెషన్. కానీ మానసిక జబ్బు అన్న మాట బయటకు చెప్పడానికి చాలామంది భయపడుతున్నారు.

ఆత్మహత్యలు... చివరి ఫలితం

ఈ కారణాల ఫలితం ఒక్కటే ఆత్మహత్యలు. మానసిక జబ్బు చివరకు ప్రాణాంతక నిర్ణయానికి నెడుతోంది. ఇటీవల హైదరాబాద్‌తోపాటు పలు ప్రాంతాల్లో చోటుచేసుకున్న ఆత్మహత్యలు దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించాయి. ఇవి కేవలం సంఖ్యలు కాదు.. చెదిరిపోయిన కుటుంబాల కథలు.

ఒత్తిడితో దుష్ప్రభావాలు

- నిద్ర పట్టకపోవడం
- ఆకలి లేకపోవడం, లేక ఎక్కువ ఆహారం తినడం
- ఊబకాయం
- మహిళల్లో పీరియడ్స్ ఇబ్బందులు
- తీవ్రమైన ఒత్తిడి ఉన్న వారిలో హృద్రోగ సమస్యలు
- వ్యాధి నిరోధక శక్తి తగ్గడంతో ఇన్‌ఫెక్షన్స్

ఒత్తిడికి లోనుకావొద్దు...

తీవ్రమైన ఒత్తిళ్లకు గురయ్యే వారు అనేక రుగ్మతలకు గురవుతున్నారు. నిద్రలేమి సమస్యలు మనిషిని తీవ్రంగా వేధిస్తున్నాయి. ముఖ్యంగా యువకులు తీవ్రమైన ఒత్తిడికి గురవుతున్నారు. మద్యానికి బానిసవుతున్నారు. సెల్‌ఫోన్ ప్రభావం కూడా ఎక్కువగా ఉంది . ఆర్థికంగా రాణించకపోవడం వంటి సమస్యలు మానసిక సమస్యలను తీవ్రతరం చేస్తున్నాయి. ఇవి మనిషిని చంపేసేంతగా పనిచేస్తున్నాయి. ఇటీవల కొన్ని ఘటనలను ఆధారంగా తీసుకుని ప్రజలు మేల్కొవాలి. మానసిక సమస్యలుంటే.. వెంటనే డాక్టర్లను కలిసి చికిత్స తీసుకోండి.

– దినేష్, మానసిక వైద్య నిపుణులు, చిత్తూరు

సెల్‌ఫోన్.. చేతిలో ఉన్న విషం

సెల్‌ఫోన్‌లతో కాలక్షేపం చేస్తూ మనుషులు తెలియకుండానే మానసిక జబ్బులను కొనితెచ్చుకుంటున్నారు. వాస్తవ జీవితానికి దూరమై, వర్చువల్ ప్రపంచంలో మునిగిపోతూ ఒంటరితనాన్ని పెంచుకుంటున్నారు. సోషల్ మీడియా పోలికలు, అవమానాలు, నెగెటివ్ కంటెంట్ యువత మనస్సును చిదిమేస్తోంది. దీనికితోడు ఒంటరి జీవనం పెరిగిపోవడంతో కొందరు మద్యం, మత్తు పదార్థాలకు బానిసలవుతున్నారు. ఇవి సమస్యలకు పరిష్కారం కాదని తెలిసినా, తాత్కాలిక ఉపశమనానికి అలవాట్లలో చిక్కుకుపోతున్నారు. చివరకు మానసిక, శారీరక, ఆర్థికంగా పూర్తిగా కుమిలిపోతున్నారు. ఇక ఒకప్పుడు కుటుంబాలతో కలిసి మెలిసి జీవించిన సమాజం ఇప్పుడు విడిపోయింది. మాట్లాడే మనుషులు లేరు. వినే చెవులు లేవు. బాధను పంచుకునే వారు లేక అనేక మంది లోలోపలే కుంగిపోతున్నారు. పల్లె, పట్నం తేడా లేకుండా మానసిక రుగ్మతలు వ్యాపిస్తున్నాయి.

ఇవి పాటించాలి

- సమయానికి నిద్రపోవాలి.
- సమతుల ఆహారం తీసుకోవాలి
- క్రమం తప్పకుండా వ్యాయమం చేయాలి
- యోగా, మెడిటేషన్‌పై దృష్టి సారించి, క్రమం తప్పకుండా పాటించాలి
- అధిక సెల్‌ఫోన్ వాడకం వదలి.. పుస్తక పఠనంపై దృష్టి మళ్లించాలి
- భావోద్వేగాలు, ప్రవర్తనపై అదుపు కలిగి ఉండాలి
- అసమానతలు, సమస్యలను ధైర్యంగా పరిష్కరించుకోవాలి

నెమలి నడకలేవీ!

ఎక్కడా కనిపించని జాతీయ పక్షి

చెంగు చెంగుమని గెంతుతూ.. పురివిప్పి ఆడుతూ.. అందమైన పింఛంతో మైమరపిస్తూ.. గిరి సీమకే వన్నె తెచ్చే నెమలి జాడలు కనుమరుగు అవుతున్నాయి.. ఆ జాతీయ పక్షి కనిపించని రోజులు దాపురిస్తున్నాయి. వేటగాళ్ల ఉచ్చుకు, ప్రభుత్వం నిర్లక్ష్యానికి గురవుతున్నాయి. ఇప్పటికైనా యంత్రాంగం కళ్లు తెరవకుంటే, నెమళ్ల అందాలు ఇక మన్యానికి కనుమరుగేనని నిపుణులు హెచ్చరిస్తున్నారు.



- అంతకంతకూ అంతరిస్తున్న వైనం
- వేటగాళ్ల ఉచ్చుకు బలి

వై.రామవరం: మన్యం.. వన్య ప్రాణులకు ఆవాస కేంద్రం. ఈ అటవీ ప్రాంతం ఎన్నో జీవుల మనుగడకు ఆధారం.. అలాంటి గిరిసీమలో నెమలి పురివిప్పి ఆడితే శోభాయమానమే.. నయన మనోహరమే.. ఇది ఒకప్పటి మాట. ఇప్పుడు జాతీయ పక్షి జాడ చిక్కడం లేదు. పోలవరం జిల్లాలో మొత్తం 12 మండలాలు ఉన్నాయి. ఇందులో సుమారు 827 గ్రామాలు ఉండగా, 4,00,300 హెక్టార్ల అటవీ ప్రాంతం విస్తరించి ఉంది. గతంలో ఎక్కడబడితే అక్కడ దర్శనమిచ్చే నెమలి అసలు మచ్చుకైనా కానరావడం లేదు. సుమారు 25 ఏళ్ల కిందటి వరకూ ఏజెన్సీ ప్రాంతంలో అటవీ ప్రాంతానికి ఆనుకుని ఉన్న ప్రధాన రహ దారులు, ఇరువైపులా ఉన్న పొలాల్లో, గ్రామాల శివారుల్లో ప్రతి రోజూ తెల్లవారు జామునే అందమైన అరుపులతో జనాలకు నెమళ్లు కనిపించేవి. ప్రస్తుతం ఎక్కడో లోతట్టు అటవీ ప్రాంతంలో తప్ప, మిగతా ప్రదేశాల్లో నెమలి అరుపులే వినిపించడం లేదు. వేటగాళ్ల ఉచ్చు బారినపడి నెమలి జాతి అంతరించి పోతుందన్నది జగమెరిగిన సత్యం.

కారణాలు ఎన్నో..

వేటగాళ్లు జంతువులను వేటాడమే కాకుండా, వేసవిలో అటవీ ప్రాంతంలో పెట్టే నెమలి గుడ్లు, అప్పుడే పుట్టిన నెమలి పిల్లలను తెచ్చుకుని అమ్ముకోవడంతో జాతీయ పక్షి అంతరించి పోతుందన్న అభిప్రాయాన్ని కొందరు వ్యక్తం చేస్తున్నారు. పొలాల్లో పండిన పంటలు తినడానికి వచ్చే నెమళ్లు, పంటలకు కొట్టిన పురుగు మందుల బారినపడి మృత్యువాత పడడం మరో కారణం. చెట్ల నరికివేతతో దట్టమైన అటవీ ప్రాంతంలోకి ఉన్న కొన్ని పక్షులు వలసపోయి ఉండవచ్చని మరికొందరి అభిప్రాయం. 25 ఏళ్ల క్రితం అధికార లెక్కల ప్రకారం వై.రామవరం మండల అటవీ ప్రాంతంలో 18 వేలకు పైగా ఉండే నెమళ్లు, ప్రస్తుతం 2 వేలకు దిగజారిపోయాయని అటవీ శాఖ అధికారుల ద్వారా తెలుస్తోంది. ఇదే పరిస్థితి మిగతా 11 మండలాల్లోనూ ఉంది. అయినా వన్య సంరక్షణ అటవీ శాఖ విభాగం అధికారులు మొద్దు నిద్ర వీడడం లేదు. అలాగే జిల్లాలోని ఈ శాఖలో సిబ్బంది కొరత వేధిస్తోంది. ఉన్నవారు డిప్యూటేషన్‌పై వస్తున్నారు. ఈ కారణంగా పర్యవేక్షణ కూడా అంతంత మాత్రంగానే ఉంటోంది. ఫలితంగా అటవీ ప్రాంతంలో వన్యప్రాణుల సంరక్షణ ప్రశ్నార్థకంగా మారుతోంది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి, అంతరించి పోతున్న జాతీయ పక్షి నెమలి జాతిని కాపాడే చర్యలు చేపట్టాలని పలువురు విజ్ఞప్తి చేస్తున్నారు.

కలసికట్టుగా అడ్డుకుందాం

అటవీ ప్రాంతంలో ఉచ్చు పెట్టేవారిపై నిఘా పెట్టాం. అలాంటి వారి గురించి తెలిస్తే ప్రజలు కూడా సమాచారం అందించి సహకరించాలి. అందరూ కలసి పనిచేసి నిఘా పెడితే వన్యప్రాణుల వేటను సులభంగా అరికట్టవచ్చు. నేను కొత్తగా విధుల్లో చేరాను. జాతీయ పక్షి నెమలి వివరాలు తెలుసుకుంటాను.

–శ్రీనివాసరావు, అడ్డతీగల రేంజ్ అధికారి

అడవుల నరికివేతే కారణం

జాతీయ పక్షి నెమలి ప్రస్తుతం ఎక్కడా కనిపించడం లేదు. అడవులను నరికివేసి వ్యవసాయాలు చేస్తుండడం, ఆ ప్రాంతంలో జనసంచారం ఎక్కువగా ఉండడంతో నెమలులు దట్టమైన అటవీ ప్రాంతంలోకి వెళ్లిపోతున్నాయి. పొలాల్లో పురుగు మందులు చల్లిన పంటలను తిని కొన్ని నెమళ్లు చనిపోయాయని చెబుతున్నారు. ఇలా అనేక కారణాలతో నెమళ్లు కనుమరుగు అయ్యాయి. అలాగే వేటగాళ్లపై వన్య ప్రాణి సంరక్షణ శాఖ అధికారులు తగు చర్యలు తీసుకోవాలి.

–కడబాల ఆనందరావు, ఎంపీపీ, వై.రామవరం

ఉచ్చుకు బలి

జాతీయ పక్షి నెమలితో పాటు, అడవి జంతువులను వేటాడడం నేరం. అయినా దీనిని వేటగాళ్లు పట్టించుకోవడం లేదు. ప్రస్తుతం విద్యుత్ తీగలతో ఎక్కువగా అడవి జంతువులను వేటాడుతున్నారు. ఈ జంతువుల వేట కోసం అమర్చిన విద్యుత్ తీగలను తాకి పొలం పనులకు వెళ్తూ ఎంతోమంది అమాయక గిరిజనులు ఈ మధ్యకాలంలో మృత్యువాత పడ్డారు. జిల్లాలోని వై.రామవరం మండలంలో అనేక మంది చనిపోయాయని సమాచారం. తీగలు అమర్చిన వారు పట్టుబడకుండా తప్పించుకుంటున్నారు. మళ్లీ వేరే ప్రాంతంలో ఉచ్చులు పెడుతూ సాగిపోతున్నారు. వీరిని పట్టుకోవడం అసలే సిబ్బంది కొరతతో ఉన్న వన్యప్రాణి విభాగం అధికారులకు సవాలుగా మారింది.

వై.రామవరం మండలం లోతట్టు ప్రాంతం శేషరాయి గ్రామ సమీప అటవీ ప్రాంతంలో జాతీయ పక్షి నెమలి (ఫైల్)

పొల్లూరు జల్లింత కావాలిలే..!

- పొల్లూరు పర్యాటకానికి కొత్త సొబగులు
- మౌలిక వసతుల కల్పనపై అటవీ శాఖ దృష్టి
- సుకుమామిడి నుంచి గుడిస వరకు ట్రెక్కింగ్
- గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలోనే బీజం
- జెన్‌కో రూ.50 లక్షల సీఎస్సార్ నిధులతో పనులు
- ఫారెస్ట్ రేంజర్ నానాజీ

పర్యాటకుల కోసం నిర్మిస్తున్న మరుగుదొడ్లు

గుడిసలో కనువిందు చేస్తున్న గిరి సీమలు

ఉప్పొంగి జాలువారుతున్న పొల్లూరు జలపాతం

మోతుగూడెం: ప్రకృతి అందాలకు నిలయమైన పోలవరం జిల్లాలోని పొల్లూరు జలపాతం అభివృద్ధిపై అటవీ శాఖ దృష్టి సారించింది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలోనే ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేసేందుకు ప్రతిపాదనలు తయారై పనులు కూడా మొదలయ్యాయి. ఇందులో భాగంగా అక్కడి మౌలిక వసతుల కల్పనపై ఆ అటవీశాఖ దృష్టి సారించింది. ఏపీ జెన్‌కో సంస్థ కేటాయించిన రూ.50 లక్షల సీఎస్సార్ నిధులతో ఈ పనులు చేపట్టారు.

అభివృద్ధితో పాటు సౌకర్యాలు..

ఏపీ జెన్‌కో సంస్థ ఇచ్చిన నిధులతో పొల్లూరు జలపాతం వద్ద అభివృద్ధి పనులు చురుగ్గా సాగుతున్నాయి. వర్షాకాలంలో ముఖ్యంగా జూన్ నుంచి సెప్టెంబర్ వరకు ఈ జలపాతం ఉప్పొంగి ప్రవహిస్తూ పర్యాటకులకు కనువిందు చేస్తుంది. కొండల మధ్య సుమారు 50 అడుగులు ఎత్తు నుంచి నీరు జాలువారుతూ ఎందరో పర్యాటకులను ఆకర్షిస్తుంటుంది. ఈ జలపాతం పొల్లూరు నుంచి డొంకరాయికి వెళ్లే మార్గంలో రహదారికి అర కిలోమీటరు దూరంలో ఉంది. ఫోర్‌బే, డొంకరాయి అటవీ ప్రాంతాల నుంచి ప్రవహిస్తూ కొల్లూరు వద్ద సీలేరు నదిలో కలుస్తుంది. ఇక్కడి జలపాతం ప్రవేశ ద్వారాన్ని ఎంతో ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. సుమారు 50 వరకు కార్లు పార్కింగ్ చేయడానికి అనుకూలంగా ఈ స్థలాన్ని చదును చేశారు. అలాగే పర్యాటకులు సేదతీరేందుకు రెల్లుగడ్డితో నిర్మించిన పగోడాలను, కూర్చొనేందుకు వీలుగా గ్రానైట్ బెంచ్‌లు ఏర్పాట్లు చేశారు. జలపాతాన్ని చూడడానికి వచ్చే మహిళల సౌకర్యం కోసం మూడు మరుగుదొడ్లు, దుస్తులు మార్చుకునేందుకు మూడు గదులు నిర్మిస్తున్నారు. అంతే కాకుండా కెఫ్టే (టీ,కాఫీతో పాటు టిఫిన్, శీతల పానీయాలు) అందించేందుకు షాప్‌ను ఏర్పాటు చేస్తున్నారు. మరోవైపు సేవానియర్స్ ఏర్పాటు చేసి స్థానికంగా ఉండే అటవీ ఉత్పత్తులను ఈ స్టాల్‌లో ఉంచి పర్యాటకులకు అందిస్తున్నారు. ఇవే కాకుండా పది మీటర్ల సీసీ రహదారిని రూ.3.5 లక్షలతో నిర్మించారు. సోలార్ సీసీ కెమెరాలు సైతం ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టారు. పార్కింగ్ ప్రాంతాల్లో చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేన్నారు. అలాగే చెత్త లేకుండా శుభ్రంగా ఉంచడానికి డస్ట్‌బిన్‌లు ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటి వరకు 70 శాతం సుందరీకరణ పనులు, మౌలిక సదుపాయాల కల్పన పూర్తయినట్లు స్థానిక రేంజర్ జి.నానాజీ తెలిపారు.

ఫారెస్టు రేంజర్ నానాజీ

అటవీ మార్గంలో ట్రెక్కింగ్

మారేడుమిల్లి మండలం గుడిస ప్రాంతానికి మోతుగూడెం సమీపాన సుకుమామిడి గ్రామం నుంచి (ఏనుగుల బాట) 12 కిలోమీటర్ల మేర ట్రెక్కింగ్ చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. గత ఐదు నెలల క్రితం ఈ గ్రామం నుంచి గుడిసె వరకు కొండలు గుట్టలపై ట్రెక్కింగ్ మార్గానికి అటవీశాఖ అధికారులు సర్వే చేశారు. సుమారు ఐదు మీటర్ల వెడల్పున 12 కిలోమీటర్ల మేర కాలి బాటకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. అటవీ శాఖ ప్రధాన కార్యాలయం నుంచి అనుమతులు రాగానే దీనికి రూపకల్పన చేయనున్నట్టు వారు తెలిపారు. ట్రెక్కింగ్ చేయాలనుకునే వారి నుంచి కొంత రుసుము తీసుకొని గైడ్‌లను ఏర్పాటు చేస్తామని అధికారులు, అలాగే తరువాత వర్షాకాలం లోపు ఫైర్ క్యాంపింగ్‌తో పాటు, నైట్ స్టే చేసేందుకు క్యాంపింగ్ టెంట్లు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు వారు తెలిపారు. వీటి వల్ల రాత్రి వేళల్లో కూడా గుడిస అందాలను తిలకిస్తూ గడిపేందుకు అవకాశం ఉంటుంది. అలాగే పర్యాటకులు బస చేసేందుకు మోతుగూడెంలో ఏపీ జెన్కో అతిథి గృహం ఉంది. ఇందులో ఆరు గదులు ఉన్నాయి. ఇవి ఖాళీగా ఉంటే అద్దెకు ఇచ్చే అవకాశం ఉంది. ఇవి కాకుండా ప్రైవేట్ రిసార్టులు పొల్లూరులో ఒకటి, మోతుగూడెంలో ఏడు ఉన్నాయి. గదికి 24 గంటలకు రూ.2500 వరకు అద్దె ఉంటుంది. నలుగురు నుంచి ఆరుగురు ఉండేందుకు అనువుగా ఇవి ఉంటాయి. రిసార్టులలో భోజన సదుపాయం కూడా ఉంది. జలపాతం సందర్శనకు భద్రాచలం, రాజమహేంద్రవరం నుంచి రావచ్చు. ఈ రహదారి మార్గాల్లో బస్సు సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయి. ప్రధాన రహదారి నుంచి కాలినడకన జలపాతం వద్దకు వెళ్లవచ్చు. రాజమహేంద్రవరం నుంచి వచ్చే రహదారి మెరుగ్గా ఉంది.

జలపాతం వద్ద పర్యాటకుల కోసం నిర్మిస్తున్న కట్టడాలు

కోటలో రాజస వివాహం

ఆరావళి నీడలో వివాహ వైభవం

సరస్సుల నగరంలో కళ్యాణ వైభోగం

వసంత కాలాన రాజస్థాన్‌లో వివాహాల సందడి నెలకొంటుంది. అక్కడి అందమైన సరస్సుల నడుమ ఉన్న రాజమందిరాలు కమణీయమైన కళ్యాణ మహోత్సవాలకు ప్రత్యేక వేదికలుగా మారుతాయి.

రాజస్థాన్‌లో వెడ్డింగ్ సీజన్ అంటే ఒక రాజస అనుభూతిని సొంతం చేసుకునే అవకాశం కూడా. ఇక్కడి ఆరావలి పర్వత సిరుల మధ్య, సూర్యకాంతిని ప్రతిబింబించే జలసిరి సాక్షిగా జరిగే వివాహ వేడుక ఒక కళాత్మక సన్నివేశంలా అనిపిస్తుంది. ఈ భూమిలో పెళ్లి అంటే కేవలం సంప్రదాయం మాత్రమే కాదు, అది ఒక సంస్కృతి, అంతకు మించి జీవితాంతం నిలిచే మధురస్మృతి.

ఎలా వెళ్లాలి?

తెలుగు రాష్ట్రాల నుంచి రాజస్థాన్‌కు రైలు మార్గాలు అందుబాటులో ఉన్నాయి. వాయుమార్గం ద్వారా మహారాణా ప్రతాప్ ఎయిర్‌పోర్ట్ చేరుకుని అక్కడి నుంచి ఉదయ్‌పూర్‌కు ప్రయాణించవచ్చు. నగరంలోకి ప్రవేశించే సమయంలో పర్వతాల నీడలు, సరస్సుల అందాలు స్వాగతం పలుకుతాయి.

ఏం చూడాలి?

ఉదయ్‌పూర్‌లో సిటీ ప్యాలెస్, లేక్ పిచోలా, జగ్ మందిర్, ఫతే సాగర్ సరస్సు, సహేలియోకి బరి వంటి ప్రదేశాలు వివాహ సందర్భంలో మరింత అందంగా కనిపిస్తాయి. సరస్సుల తీరాలు, కోటల శిల్పకళ నగర వైభవాన్ని ప్రతిబింబిస్తాయి.

రాజస వేదికల ప్రారంభం

రాజస్థాన్‌లో శరదృతువులో ప్రారంభమయ్యే వివాహాల సందడి వసంతకాలానికి చేరుకునే సరికి మరింత ఉత్సాహంగా మారుతుంది. పగలు సూర్య కాంతి, రాత్రి దీపాల వెలుగులతో కోటలు మరింత మాయాజాలంలా కనిపిస్తాయి. ఇక్కడి కోటల్లో వైభవంగా కళ్యాణం చేసుకోవాలని చాలా మంది కలలు కంటారు.

పాలరాతి ప్రాంగణాల్లో రంగోలీలు చిత్రక థల్లా విరాజిల్లుతాయి. బ్యాండ్, బాజా, బారాత్ సందడితో సాయంత్రపు గాలి కూడా ఉత్సవ వాతావరణాన్ని అలుముకుంటుంది. ఈ రాజస భూమిలో వివాహ వేడుక ప్రకృతి మధ్యలో సాగే ఒక అనుభూతి. పర్వతాల నీడలో, సరస్సుల ప్రతిబింబంలో, ఎత్తైన కోటల మధ్య జరిగే కళ్యాణం ప్రతి క్షణం ఒక గీతంలా నిలుస్తుంది.

సరస్సుల మధ్య వివాహ వైభవం

వెడ్డింగ్ సీజన్‌లో ఉదయ్‌పూర్ ప్రత్యేక శోభను సంతరించుకుంటుంది. సరస్సుల అందంతో 'సిటీ ఆఫ్ లేక్స్' గా పేరు పొందిన ఈ నగరం సూర్యాస్తమయం వేళ వర్ణరంజిత దృశ్యంగా మారిపోతుంది.

ఉదయ్‌పూర్ సిటీ ప్యాలెస్ ప్రాంగణంలో జరిగే అలంకరణ, బాల్కనీ నుంచి సరస్సును చూస్తూ గడిపే క్షణాలు వధూవరులకే కాదు అతిథులకు కూడా చిరస్మరణీయంగా నిలుస్తాయి. అందుకే పలువురు ప్రముఖులు ఇక్కడే డెస్టినేషన్ వెడ్డింగ్‌కు ఆసక్తి చూపుతున్నారు.

లేక్ పిచోలా మీద వెలిగే దీపాలు నీటిపై ప్రతిబింబించి కొత్త కాంతిని విరజిమ్ముతాయి. ద్వీపం మధ్యలో ఉన్న జగ్ మందిర్ సాయంత్రం వేళ స్వర్ణకాంతితో ప్రకాశిస్తుంది.

ఫతే సాగర్ సరస్సు తీరంలో ప్రభాత వేళ హల్దీ, మెహందీ వేడుకలు మరింత అందంగా కనిపిస్తాయి. పుష్పాల మధ్య నిలిచిన సహేలియోకి బరి ఉద్యానవనం ప్రీ-వెడ్డింగ్ వేడుకలకు సజావుగా సరిపోతుంది.

- ఎం.జి. కిశోర్, ప్రయాణికుడు

సాంస్కృతిక వేదిక

రాజస్థానీ పెళ్లి అంటే రంగుల పండుగ. బంధనీ వస్త్రాలు, పగిడీ అలంకారం, జానపద నృత్యాలు ఇవన్నీ కలిసి వివాహాన్ని మరింత ఉత్సవంగా మార్చేస్తాయి. మండపం మధ్య అగ్ని సాక్షిగా జరిగే వివాహానికి పర్వతాలు, సరస్సులు, కోట శిఖరాలు నిశ్శబ్ద సాక్షులుగా నిలుస్తాయి. స్థానిక కళాకారుల సంగీతం, ఢోలు శబ్దం, షెహ్నాయి స్వరాలు వేడుకకు భావోద్వేగాన్ని జోడిస్తాయి. పెళ్లి అంటే రెండు కుటుంబాల కలయిక మాత్రమే కాదు రెండు మనసుల కలయిక అని చాటుతాయి.

ఉదయ్‌పూర్ రుచులు

రాజస్థాన్ భోజనం దేశవ్యాప్తంగా ప్రసిద్ధి. దాల్ బాటీ చూర్మా, గట్టే కి సబ్జీ, వివిధ రకాల మిఠాయిలు, కచోరీలు, జిలేబీలు ఇవన్నీ వివాహ విందును మరింత రుచికరంగా మారుస్తాయి.

పర్యాటనకు సరైన సమయం శరదృతువు నుంచి వసంతకాలం వరకు ఉదయ్‌పూర్‌లో వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. నవంబర్ నుంచి మార్చి మధ్య కాలంలో రాజస్థాన్ మరింత సుందరంగా కనిపిస్తుంది. ఈ సమయంలో వివాహాల ఉత్సాహం కూడా ప్రత్యేకంగా అనిపిస్తుంది.

రాజస్థాన్‌లో వివాహ సీజన్ అంటే రాజస శోభ, ప్రకృతి సౌందర్యం, సాంస్కృతిక సంగీతం కలిసిన ఒక సుగంధ అనుభూతి. ఫోటోల్లో కనిపించే దృశ్యాల కంటే గుండెల్లో నిలిచే జ్ఞాపకాలే ఎక్కువ. అందుకే అనేక మంది ఇక్కడ వివాహం చేసుకోవాలని కలలు కంటారు.

ఊటి అసలు పేరు తెలుసా?!

మనమందరం సాదాసీదాగా ఊటి అని పిలిచే ఈ హిల్ స్టేషన్ అసలు పేరు ఉదగమండలం. ఈ పేరు ఎందుకు వచ్చింది అని ఎప్పుడైనా ఆలోచించారా? దీనికి సమాధానం తెలుసుకోవాలంటే కొంచెం చరిత్రలోకి వెళ్లాలి. ఉదగమండలం అనే పేరు తోడా అనే తెగల భాష నుంచి వచ్చిందని స్థానికులు చెబుతారు. ఒతకల్ మండు లేదా ఉదగై మండలం అనే పదానికి అర్థం పర్వతాల మధ్యలో ఉన్న గ్రామం. నీలగిరి పర్వత ప్రాంతంలో నివసించే తోడా తెగల వారికి ఇది పవిత్ర స్థలం. విదేశీ పాలనకు ముందు ఈ ప్రాంతంలో తోడా తెగలే నివసించేవారు. తర్వాత వారి ఉచ్చారణకు అనుగుణంగా పేరును మార్చుతూ చివరకు ఊటి అని ప్రాచుర్యం పొందింది. అయినప్పటికీ స్థానికులు ఇప్పటికీ ఉదగమండలం అనే పేరును గౌరవంగా ఉపయోగిస్తారు.

తెలిమంచుతో కప్పబడిన పర్వతాలు, పచ్చని తేయాకు తోటలు, ప్రశాంత వాతావరణం ఈ ప్రాంతానికి ఉదగమండలం అనే పేరు ఎంతో తగినదిగా అనిపిస్తుంది.

దక్షిణ భారత వివాహ వేదికలు

ఈ మధ్య ట్రెండ్‌గా మారిన డెస్టినేషన్ వెడ్డింగ్ లేదా ప్లాన్డ్ వెడ్డింగ్ ఇలా ప్రత్యేక ప్రదేశాల్లో పెళ్లి చేసుకోవడం కొత్త విషయం కాదు. దక్షిణ భారతంలో ఈ సంప్రదాయం చాలా కాలంగా కొనసాగుతోంది.

గోపురం మధ్యలో మంగళ ధ్వని

తమిళనాడులోని మదురై మీనాక్షి అమ్మ వారి ఆలయం ప్రాంగణంలో జరిగే వివాహం ఒక దివ్యానుభూతి. ఈ ఆలయం దక్షిణ భారత సంస్కృతికి ప్రతీక. సుప్రభాత వేళలో మంగళ వాయిద్యాలు వినిపిస్తుంటే ఆ వాతావరణం దివ్యానుభూతికి లోను చేస్తుంది. ఇక్కడ ఆలయ నిబంధనల ప్రకారం మాత్రమే వివాహాలు నిర్వహిస్తారు. పూర్తి వివరాల కోసం ఆలయ అధికారులను సంప్రదించాలి.

దేవుని సొంత నేలలో

కేరళలోని కుమారాకోమ్‌లోని జలసరి నడుమ ప్రకృతి సాక్షిగా వివాహం జరుగుతుంది. ఈ ప్రాంతం కొబ్బరి చెట్లు, నీటి ప్రతిబింబాలు, ప్రశాంత వాతావరణంతో ప్రసిద్ధి చెందింది.

కోట వైభవం సాక్షిగా

హైదరాబాద్‌లోని చౌమహల్లా ప్యాలెస్‌లో రాజసంగా వివాహం నిర్వహించవచ్చు. హైదరాబాద్‌లోని ఈ రాజమహల్ నిజాం కాలపు వైభవాన్ని గుర్తు చేస్తుంది. ఇక్కడి వేడుకలకు ముందస్తు అనుమతులు అవసరం.

సరస్సు నుంచి సముద్ర ద్వీపం వరకు..

విదేశీ వివాహ వేదికలు

జీవితంలో వివాహం ఒక కీలక మలుపు. ఈ మలుపును ప్రత్యేకంగా నిలిపే ప్రయత్నమే ప్రత్యేక ప్రదేశాల్లో వివాహం లేదా డెస్టినేషన్ వెడ్డింగ్. ఇటలీలోని లేక్ కోమో తీరం అందమైన వేదికగా నిలుస్తుంది. నీటిలో ప్రతిబింబించే దీపాల కాంతులు, వెనుక నిలిచే పర్వతాలు ఇవన్నీ వెడ్డింగ్ డ్రీమ్‌కు ప్రతిబింబంలా కనిపిస్తాయి.

శాంటోరిని, గ్రీస్

శాంటోరిని ద్వీపం తెల్లని గృహాలు, నీలి ఆకాశానికి ప్రసిద్ధి. సూర్యాస్తమ సమయంలో జరిగే వివాహం జీవితాంతం గుర్తుండే అనుభూతిగా మిగులుతుంది.

సువాసనల మధ్య వివాహం

ఫ్రాన్స్ దేశంలోని లావెండర్ పూల తోటల మధ్య జరిగే వివాహం ఒక స్వప్నంలా అనిపిస్తుంది.

బీచ్‌లో కళ్యాణం

ఇండోనేషియా దేశంలోని బాలి ద్వీపం సముద్రతీర ప్రాంతం ప్రకృతి వైభవానికి ప్రసిద్ధి. అలల శబ్దం, పచ్చని చెట్లు, సంప్రదాయ అలంకరణలు అన్నీ కలిసి ప్రత్యేకమైన వాతావరణాన్ని సృష్టిస్తాయి. ఇలా ప్రతి ప్రదేశం తన ప్రకృతి, చరిత్ర, సంస్కతితో వివాహాన్ని ఒక మధురమైన జ్ఞాపకంగా మార్చేస్తుంది. కొత్త ప్రదేశంలో కొత్త జీవితాన్ని ప్రారంభించడం ఒక అందమైన అనుభూతిగా మిగిలిపోతుంది.

నేపాల్ రాజధాని కఠ్మాండులోని పశుపతినాథ్ ఆలయంలో ఆదివారం సాయంత్రం సంధ్యా హారతి వేళ భక్తులతో నిండిన ప్రాంగణం

ఆదివారం మహాశివరాత్రి సందర్భంగా ప్రయాగ్‌రాజ్‌లోని ఓ ఆలయంలో శివలింగాలకు భక్తుల పూజలు

శ్రీలంక రాజధాని కొలంబోలోని పొన్నాంబలవనేశ్వర్ ఆలయంలో ఆదివారం ఉదయం పూజల కోసం క్యూలలో వేచి ఉన్న భక్తులు

శివోహం..!

మహాశిరాత్రి పర్వదినాన ప్రతిధ్వనించిన శైవ క్షేత్రాలు

- కాశీ నుంచి పశుపతినాథ్ ఆలయం దాకా భక్తుల తాకిడి

న్యూఢిల్లీ/వారణాసి: మహాశివరాత్రి సందర్భంగా ఆదివారం దేశవ్యాప్తంగా ఉన్న శైవ క్షేత్రాలు భక్తులతో పోటెత్తాయి. హరహర మహాదేవ్.. అంటూ శివనామ స్మరణలతో ఆలయాలు ప్రతిధ్వనించాయి. ఉత్తరప్రదేశ్‌లోని ప్రపంచ ప్రసిద్ధ కాశీ విశ్వనాథుని ఆలయానికి దేశంలోని వివిధ ప్రాంతాలతోపాటు విదేశాల నుంచి లక్షలాదిగా భక్తులు తరలివచ్చారు. ఏకబిగిన 45 గంటలపాటు దర్శనాలను అనుమతిస్తామని, కనీసంగా 15 లక్షల మంది భక్తులు వస్తారని ఆలయ సీఈవో భూషణ్ మిశ్రా తెలిపారు. మలేసియా, శ్రీలంక తదితర 62 దేశాల్లో ఉన్న శివాలయాలతోపాటు దేశంలో ఉన్న 54 ప్రధాన జ్యోతిర్లింగాలు, శక్తి పీఠాలు, యాత్రాస్థలాల నుంచి కూడా కానుకలు అందాయన్నారు. మధురలోని ప్రాచీన భూతేశ్వర్ మహాదేవ్ ఆలయం వెలుపల భక్తులు పెద్ద సంఖ్యలో క్యూ కట్టారు. సీఎం యోగి ఆదిత్యనాథ్ గోరఖ్‌నాథ్ ఆలయంలో శివపార్వతుల కల్యాణం సందర్భంగా స్వయంగా రుద్రాభిషేకం జరిపారు. కశ్మీర్ వ్యాప్తంగా కశ్మీరీ పండిట్‌లు శివాలయాలను సందర్శించుకున్నారు. దాల్ సరస్సు సమీపాన ఉన్న శంకరాచార్య ఆలయానికి పెద్ద సంఖ్యలో చేరుకుని, పూజలు చేశారు.

వారణాసిలో శివలింగానికి భక్తుల పూజలు

సంగంలో 40 లక్షల మంది స్నానాలు

మహాశివరాత్రి పుణ్యదినం, మాఘ మేళా చివరి రోజైన ఆదివారాన్ని పురస్కరించుకుని గంగ, సంగంలో 40 లక్షల మందికి పైగా భక్తులు పుణ్యస్నానాలాచరించారు. శనివారం రాత్రి నుంచే ఇక్కడికి భక్తుల రాక ప్రారంభమైంది. ఈ ఏడాది జనవరి 3వ తేదీన మాఘమేళాలో మొదలైనప్పటి నుంచి మొత్తమ్మీద 22 కోట్ల మంది భక్తులు గంగలో స్నానం చేశారని జిల్లా మేజిస్ట్రేట్ మనీశ్ కుమార్ వర్మ తెలిపారు.

పశుపతినాథునికి పూజలు

నేపాల్ రాజధాని కఠ్మాండులో ఉన్న 5వ శతాబ్దం నాటి ప్రసిద్ధ పశుపతినాథ ఆలయంలో మహాశివరాత్రిని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు జరిపారు. సుమారు 4,500 మంది సాధువులు, వందలాదిగా నాగ సాధువులు ఇందులో పాల్గొన్నారు. బాగ్మతి నదీ తీరాన ఉన్న ఈ ఆలయం నాలుగు ద్వారాలను భక్తుల సందర్శనల కోసం అర్ధరాత్రి దాటాక 2 గంటలకే తెరిచారు. కనీసం 8 లక్షల మంది పశుపతి నాథుని దర్శించుకుని, మొక్కులు తీర్చుకున్నారని అధికారులు తెలిపారు. వీరిలో 30 శాతం మంది భారతీయులేనని వివరించారు. అదేవిధంగా, గోకర్ణేశ్వర్, మఖన్ మహాదేవ్ ఆలయాల్లోనూ ప్రత్యేక పూజలు జరిపారు. అదేవిధంగా, శ్రీలంక రాజధాని కొలంబోలోని శ్రీ పొన్నాంబలవనేశ్వర్ కోవిల్ ఆలయం భక్తులతో కళకళలాడింది.

ఉపరాష్ట్రపతి, ప్రధాని శివరాత్రి శుభాకాంక్షలు

మహాశివరాత్రి పర్వదిన సందర్భంగా దేశ ప్రజలకు ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శుభాకాంక్షలు తెలిపారు. ఈ పవిత్రమైన పండుగ కాశీ నుంచి రామేశ్వరం వరకు భారత ఆధ్యాత్మిక సంప్రదాయానికి సజీవ చిహ్నమని ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్ పేర్కొన్నారు. 'మహాదేవుడు, మాతా పార్వతి ప్రజలందరికీ ఆశీస్సులు, మంచి ఆరోగ్యాన్ని ప్రసాదించాలి'అని ఆయన ఆకాంక్షిస్తూ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. 'ఆది దేవుడైన మహాదేవుడు అందరిపై తన కృప, ఆశీస్సులు కురిపించాలి. దేశ శ్రేయస్సు సమున్నత శిఖరాలకు చేరాలి'అని ప్రధాని ఆకాంక్షించారు.

కష్టించేతత్వం, క్రమశిక్షణ

- జీవితంలో విజయానికి కీలకం
- సీజేఐ సూర్యకాంత్ ఉద్బోధ

చండీగఢ్: కష్టించేస్వభావం, సాధించాల్సిన లక్ష్యంలో స్పష్టత, క్రమశిక్షణ, పట్టుదల.. జీవితంలో విజయానికి అత్యవసరమని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ సూర్యకాంత్ తెలిపారు. సమగ్రత, విలువ, నైతికలతోపాటు సమాజం, దేశం పట్ల అంకితభావంతో విజయ మార్గంలో పయనించాలన్నారు. హరియాణాలోని రొహ్‌తక్‌లో ఉన్న మహర్షి యోగానంద విశ్వవిద్యాలయం (ఎండీయూ) స్వర్ణోత్సవాల్లో ఆదివారం సీజేఐ పాల్గొని ప్రసంగించారు. గ్రామీణ ప్రాంతం నుంచి వచ్చిన విద్యార్థిగా వర్సిటీ క్యాంపస్‌లో ఎన్నడూ ఎటువంటి వివక్షకు గురికాలేదని చెప్పారు. ప్రతిభ, కష్టించేతత్వం, మేధాశక్తికి విలువనిచ్చే వాతావరణం క్యాంపస్‌లో ఉండేదని గుర్తు చేసుకున్నారు. ఇలాంటి సంప్రదాయ పునాదులపై అందుకున్న విద్య తనను న్యాయవ్యవస్థ వైపునకు ఆకర్షించిందని చెప్పారు. అనంతరం ఆయన క్యాంపస్‌లో గోల్డెన్ జూబిలీ గేట్‌ను ప్రారంభించారు.

ఒకే ఒక్కడు..!

మురికి రాజధానిపై 'చీపురు' సత్యాగ్రహం

ఢిల్లీ.. దేశ రాజధాని! మెరిసిపోయే మెట్రోలు, రాజప్రసాదాల్లాంటి భవనాలు.. కానీ వాటి వెనుకే వికృతమైన మురికి కూపాలు. రోడ్ల పక్కన పేరుకుపోయిన చెత్త కుప్పలు, బస్టాండ్ల దగ్గర దుర్గంధాలు అలవాటైపోయాయి. చూసీచూడనట్టు ముక్కు ముడుచుకుని వెళ్లిపోవడం నగరజీవి దైనందిన చర్య అయిపోయింది. కానీ, ఆ మురికిని చూసి ఒక సామాన్యుడి రక్తం మరిగింది. అతనే మహమ్మద్ ఆసిఫ్ అలియాస్ 'ఆసిఫ్ హిందుస్తానీ'. తన చేతిలోని కెమెరాను ఆయుధంగా, చీపురును ధ్వజంగా మార్చుకుని, ఏళ్ల తరబడి పేరుకుపోయిన పాలకుల నిర్లక్ష్యంపై ఆసిఫ్ ఒంటరి పోరాటం మొదలుపెట్టాడు.

నలుగురికి 62 పార్కుల బాధ్యత

ఆసిఫ్ చేసేది కేవలం వీధులు ఊడ్చడం కాదు.. ప్రభుత్వ అసమర్థతను నిలదీయడం .. ఢిల్లీలోని రోహిణిలో ఒక మురికి బస్టాండ్‌ను స్వయంగా శుభ్రపరచిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో అధికారుల వెన్నులో వణుకు మొదలైంది. ఆయన నిగ్గు తేల్చిన వాస్తవాలు వింటే ఎవరికైనా మతిపోవాల్సిందే. పశ్చిమ ఢిల్లీలో కేవలం నలుగురు పారిశుధ్య కార్మికులు కలిసి 62 పార్కులను నిర్వహించాలట! ఇది మనుషులకు సాధ్యమయ్యే పనేనా? పారిశుధ్య కార్మికులకు పని చేయాలనే ఉన్నా, వారి దగ్గర సరైన పరికరాలు లేవు. కాలం చెల్లిపోయి, కనీసం చెత్తను లోడ్ చేయడానికి కూడా పనికిరాని తుప్పు పట్టిన వాహనాలు అధికారుల దౌర్భాగ్యానికి నిదర్శనాలుగా నిలుస్తున్నాయి.

నిర్లక్ష్యపు గోడలు బద్దలు కొడుతూ..

'పరిశుభ్రత.. అనేది ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదు, అది వ్యక్తిగత జవాబుదారీతనం'.. అని ఆసిఫ్ గట్టిగా నమ్ముతున్నాడు. చిప్స్ ప్యాకెట్ లేదా ప్లాస్టిక్ స్ట్రా రోడ్డుపై పారేసే ముందు 'ఒక్క క్షణం ఆగి ఆలోచించండి'అని ఆయన పిలుపునిస్తున్నాడు. ఆ ఒక్క క్షణం చేసే ఆలోచనే నగరాన్ని మారుస్తుందన్నది ఆయన వాదన. మౌలిక వసతుల కన్నా మనుషుల మైండ్‌సెట్ మారడమే నిజమైన పరిష్కారమని నిరూపిస్తున్నాడు.

రేపటి కల.. సంయుక్త పోరాటం

ఆసిఫ్ లక్ష్యం కేవలం ఒక్క రోజు నిరసన కాదు. ఇది ఒక సుదీర్ఘ ప్రయాణం. యువతలో చైతన్యం తీసుకురావడం ద్వారా పరిశుభ్రతను ఒక అలవాటుగా మార్చాలని ఆయన ఆకాంక్షిస్తున్నాడు. 'ప్రభుత్వం, పౌరులు కలిసి పనిచేసే ఒక పటిష్టమైన నమూనా రావాలి'.. అని ఆయన గొంతెత్తుతున్నాడు. అధికారుల ఏసీ గదుల వెనుక దాగున్న ఉదాసీనతను కడిగేయాలంటే, సామాన్యుడు ఇలా వీధిలోకి రాక తప్పదని ఆసిఫ్ తన ప్రతి అడుగుతోనూ చాటి చెబుతున్నాడు.

వ్యవస్థలోని లోపాలను ఎత్తిచూపుతూనే, పౌర బాధ్యతను గుర్తు చేస్తున్న ఆసిఫ్ పోరాటం ఇప్పుడు ఒక ప్రభంజనంలా మారుతోంది.

– సాక్షి, నేషనల్ డెస్క్

ఆగండి, మీ ఐడీ చూపండి!

- ఫీల్డ్ మార్షల్ మునీర్‌ను అడిగిన సెక్యూరిటీ సిబ్బంది
- మ్యూనిక్ సదస్సులో పాక్ ఆర్మీ చీఫ్‌కు చేదు అనుభవం

మ్యూనిక్: పాకిస్తాన్ ఎదురులేని అధికారాలను చలాయిస్తున్న ఆర్మీ చీఫ్ ఫీల్డ్ మార్షల్ ఆసిమ్ మునీర్‌కు అంతర్జాతీయ వేదికపై ఘోర అవమానం జరిగింది. జర్మనీలోని మ్యూనిక్‌లో జరుగుతున్న మ్యూనిక్ భద్రతా సదస్సుకు వెళ్లిన ఆయన్ను సెక్యూరిటీ సిబ్బంది ఆపారు. ఐడీ కార్డు చూపాలని అడిగారు. ఇందుకు సంబంధించిన సంక్షిప్త వీడియో ఒకటి సామాజిక మాధ్యమాల్లో వైరలవుతోంది. 'స్టాప్, వేరీజ్ యువర్ ఐడీ? ప్లీజ్ ఫ్లిప్ యువర్ ఐడీ కార్డ్'అని మహిళా భద్రతాధికారి ఒకరు ఆయన్ను అడగడం, మునీర్ ఐడీ కార్డు చూపగా లోపలికి అనుమతించడం అందులో ఉంది. సదస్సుకు హాజరైన మిగతా వారిని అడిగినట్లే ఫీల్డ్ మార్షల్ మునీర్‌ను కూడా గుర్తింపు ధ్రువీకరణ చూపాలంటూ భద్రతాధికారి అడిగారని, ఇది నిబంధన అని పాక్ అధికారి ఒకరు సమర్థించుకున్నారు.

ఇదో రకం వేధింపు

మునీర్‌ను గుర్తింపు కార్డు చూపాలని కోరడంపై ఆన్‌లైన్‌లో రకరకాల అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. ఈ ఘటనను కొందరు దౌత్యపరమైన వేధింపుగా పేర్కొనగా, అత్యున్నత స్థాయి నేతలు పాల్గొనే ప్రపంచ వేదికల్లో ఇలాంటి తనిఖీలు సాధారణమంటూ కొందరు చెప్పారు. పాక్ మాజీ సైనికాధికారి ఆదిల్ రజా దీనిపై స్పందిస్తూ..అంతర్జాతీయ స్థాయి కార్యక్రమాల్లో మునీర్ గురించి ఎవ్వరికీ తెలియదన్నారు. అయితే, గేట్ కీపర్ అడిగినా కూడా మునీర్ వినయంగా పరిచయం చేసుకుంటారంటూ వ్యాఖ్యానించారు.

ఏడాది కాలంలో మన బలగాలు 28 వేల మందిని కాపాడాయి

సాక్షి, న్యూఢిల్లీ: మన సాయుధ బలగాలు గత ఏడాది కాలంలో దేశవ్యాప్తంగా ప్రాకృతిక విపత్తుల్లో చిక్కిన 28,293 మంది పౌరులను రక్షించాయి. 7,318 మందికి వైద్య సాయం, 2,617 మందికి ఆక్సిజన్‌ను అందించి ప్రాణాలు నిలిపాయి. వరదలు, వర్షాలు మొదలుకొని సునామీ వంటి అత్యవసర పరిస్థితుల్లోనూ తామున్నామంటూ చేయూత అందిస్తున్నాయి. గతేడాది తెలంగాణతో పాటు పది రాష్ట్రాల్లో వరదలు, భూకంపాలు వంటి ప్రకృతి వైపరీత్యాలు సంభవించాయి. తెలంగాణలో టన్నెల్ కూలిన ఘటన, అసోం బొగ్గు గనిలో జరిగిన ప్రమాదం వంటివాటిలో సహాయక చర్యల్లో బలగాలు కీలకంగా వ్యవహరించాయి. గతేడాది మార్చిలో మయన్మార్‌లో భారీ భూకంపం సమయంలో ఆపన్నులకు చేయూత అందించేందుకు మన సైన్యం 'ఆపరేషన్ బ్రహ్మ' చేపట్టింది.'ఆపరేషన్ సాగర్ బంధు' ద్వారా శ్రీలంకలో వరద బాధితులను ఆదుకుంది.

బ్రిటన్‌తో వాణిజ్య ఒప్పందం ఏప్రిల్ నుంచి అమల్లోకి

న్యూఢిల్లీ: భారత్, బ్రిటన్ మధ్య కుదిరిన స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం ఏప్రిల్ నుంచి అమల్లోకి రానుంది. ఈ ఒప్పందం ఏప్రిల్ నుంచి అమల్లోకి వస్తుందని ఆశిస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వ అధికారి ఒకరు తెలిపారు. గతేడాది జూలై 24న ఇరు దేశాలు సమగ్ర ఆర్థిక వాణిజ్య ఒప్పందం (సీఈటీఏ)పై సంతకం చేశాయి. 2030 నాటికి 56 బిలియన్ డాలర్ల వాణిజ్యాన్ని రెట్టింపు చేయడమే లక్ష్యంగా ఈ ఒప్పందం జరిగింది. ఇది అమల్లోకి వస్తే చాక్లెట్లు, బిస్కెట్లు, సౌందర్య సాధనాలు వంటి వస్తువులపై సుంకాలు తగ్గనున్నాయి. అంతేకాదు స్కాచ్ విస్కీపై 150 శాతం ఉన్న సుంకం 75 శాతానికి తగ్గనుంది. 2035 నాటికి 40 శాతానికి తగ్గిస్తారు. ప్రస్తుతం 110శాతం ఉన్న సుంకాలను రానున్న ఐదేళ్లలో 10శాతానికి తగ్గించనున్నారు. ఇవన్నీ దశలవారీగా అమలు కానున్నాయి. ఇక భారత్‌కు చెందిన వస్త్రాలు, పాదరక్షలు, రత్నాలు–నగలు, క్రీడా సామగ్రి, బొమ్మలు వంటి ఉత్పత్తులను యూకేకు ఎగుమతి చేయడానికి అవకాశం ఉంటుంది. వ్యవసాయ ఉత్పత్తులను కూడా పన్నుల సుంకాలు లేకుండా ఎగుమతి చేసే లభించనుంది. ఈ ఒప్పందంతో దేశంలోని చిన్న, సన్నకారు రైతులకు ప్రయోజనం కలుగుతుందని భావిస్తున్నారు.

యూకే పార్లమెంట్ ఆమోదం తర్వాతే...

అయితే ఈ ఒప్పందం అమలు కావడానికి ముందు యూకే పార్లమెంట్ ఆమోదం పొందాల్సి ఉంది. ఇటీవల యూకే పార్లమెంట్‌లోని హౌస్ ఆఫ్ కామన్స్ ఈ ఒప్పందంపై చర్చించింది. ఈ సందర్భంగా వాణిజ్య శాఖ మంత్రి క్రిస్ బ్రయంట్ మాట్లాడారు. ఈ ఒప్పందం ఇరు దేశాల మధ్య చారిత్రాత్మక విజయమన్నారు. ఈ ఒప్పందాన్ని అమలు చేయడానికి ముందు రెండు సభల్లో చర్చలు, సమీక్షలు నిర్వహిస్తాయని తెలిపారు.

మాల్దీవుల్లో తేలిన... ఇస్రో రాకెట్ శకలాలు!

కలకలం రేపుతున్న ఉదంతం

న్యూఢిల్లీ: భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) లోగోతో కూడిన భారీ రాకెట్ శకలం మాల్దీవ్స్ దేశానికి సంబంధించిన దీవిలో కనిపించడం కలకలం సృష్టించింది. సముద్రంలో మరో ఇద్దరితో కలిసి చేపల వేట సాగిస్తున్న ఓ మత్స్యకారుడు దీన్ని తొలుత గుర్తించి ఒడ్డుకు తీసుకొచ్చాడు. అనంతరం అధికారులకు సమాచారం చేరవేశాడు. ఇది తెల్ల రంగులో వంపు తిరిగిన ఆకారంలో కనిపిస్తోంది. రాకెట్‌లో ఇదొక అంతర్భాగమని గుర్తించారు. రాకెట్ నింగిలోకి దూసుకెళ్లిన తర్వాత ఉపగ్రహాలు భద్రంగా విడిపోయేలా ఇది రక్షణ కల్పిస్తుంది. ఈ శకలం ఫోటోలను ఎల్.కునాహందూ దీవిలోని స్థానిక ప్రభుత్వం విడుదల చేసింది. స్థానిక మీడియాలో ఇవి దర్శనమిచ్చాయి. ఇందులో శకలంపై ఇస్రో లోగోతో పాటు భారత అధికారిక చిహ్నం కూడా ఉంది. ఈ రాకెట్‌ను 2025లో తయారు చేసినట్లు కొన్ని అక్షరాలు సైతం ఉన్నాయి. శకలం బరువు తక్కువగానే ఉన్నట్లు గుర్తించారు. శకలంపై కొన్నిచోట్ల పెయింట్ చెదిరిపోయింది. దక్షిణ మాల్దీవ్స్‌లోని ఎల్.కునాహందూ దీవి సాధారణంగా నిర్మానుష్యంగా ఉంటుంది. ఇక్కడ జనావాసాలు లేవు. అయితే, శకలం ఆకాశం నుంచి పడిందా? లేక సముద్రంలో నీటి ప్రవాహానికి కొట్టుకొచ్చిందా? అనే దానిపై చర్చ మొదలైంది. ఇస్రో రాకెట్లను భారత్‌లోని శ్రీహరికోట నుంచి ప్రయోగిస్తుంటారు. ప్రయోగం పూర్తయ్యాక రాకెట్లు సముద్రంలో కూలిపోతుంటాయి. శకలాలు సైతం సముద్రంలో పడిపోతాయి. మాల్దీవ్స్‌లో కనిపించిన రాకెట్ శకలం శ్రీహరికోట నుంచి ఇక్కడికి వచ్చినట్లు అంచనా వేస్తున్నారు. బలమైన ఈదురు గాలులకు తోడు సముద్ర నీటి ప్రవాహ దిశకు అనుగుణంగా ప్రయాణిస్తూ ఇక్కడిదాకా కొట్టుకొచ్చినట్లు చెబుతున్నారు.

తొలుత అర్థం కాలేదు

మత్స్యకారుడు ఇచ్చిన సమాచారంతోనే ఈ శకలం గురించి తమకు తెలిసిందని కునాహందూ కౌన్సిల్ అధ్యక్షుడు ఇబ్రహీం షకీబ్ చెప్పారు. అందులోని విడిభాగాలు మళ్లీ ఉపయోగపడుతాయన్న ఉద్దేశంతోనే ఒడ్డుకు చేర్చాడని అన్నారు. మొదట దాని గురించి ఏమీ అర్థం కాలేదని చెప్పారు. ఈ నెల 13వ తేదీన పోలీసులు క్షుణ్నంగా పరిశీలించారని, అది భారత్‌కు సంబంధించిన వస్తువుగా నిర్ధారించారని వెల్లడించారు. 2025 డిసెంబర్‌లో శ్రీలంక సముద్ర తీరంలోనూ ఇలాంటి శకలమే కనిపించింది. ఇస్రో సాధారణంగా ఎల్‌వీఎం3, పీఎస్ఎల్వీ రాకెట్లను ప్రయోగిస్తుంది. ఉపగ్రహాలను కక్ష్యలోకి ప్రవేశపెట్టిన తర్వాత సముద్రంలో కూలిపోతాయి. చాలావరకు నీటిలో మునిగిపోతాయి. తేలికైన భాగాలు ముక్కలుగా విడిపోయి నీటిపై తేలుతుంటాయి. నీటిలో ముందుకు కొట్టుకుపోతుంటాయి. తీరానికి చేరుకుంటాయి. అయితే, శ్రీహరికోట నుంచి మాల్దీవ్స్ దాకా సుదీర్ఘ దూరం ప్రయాణించడం అరుదైన సంఘటనగా చెప్పుకోవచ్చు.

ఏప్రిల్ 22న తెరుచుకోనున్న కేదార్‌నాథ్ ఆలయం

రుద్రప్రయాగ్: ఉత్తరాఖండ్‌లోని పవిత్ర కేదార్‌నాథ్ ఆలయం ఏప్రిల్ 22న తెరుచుకోనుంది. ఆదివారం మహాశివరాత్రి సందర్భంగా మందిరాన్ని తిరిగి తెరవడానికి శుభ సమయాన్ని నిర్ణయించినట్లు బద్రీనాథ్–కేదార్‌నాథ్ ఆలయ కమిటీ అధికారి హరీష్ గౌర్ తెలిపారు. సంప్రదాయం ప్రకారం ఉఖీమఠ్‌లోని ఓంకారేశ్వర్ ఆలయంలో కేదార్‌నాథ్ తేదీని ఖరారు చేశారు. పండితులు, పూజారుల పూజలు, ప్రత్యేక ప్రార్థనల తరువాత ఆలయాన్ని తిరిగి తెరవడానికి ముహూర్తాన్ని లెక్కించారు. అనంతరం 12 జ్యోతిర్లింగాల్లో ఒకటైన ఈ ఆలయం ఏప్రిల్ 22న ఉదయం 8 గంటలకు తెరుచుకున్నట్లు తెలిపారు. ఏప్రిల్ 23న బద్రీనాథ్ కూడా తెరుచుకోనుంది. దీంతో భక్తులు జ్యోతిర్లింగ దర్శనం చేసుకునే అవకాశం లభించనుంది. శీతాకాల దృష్ట్యా ఆరు నెలలుగా మూసేసిన ఆలయాన్ని ఏప్రిల్ 22న తిరిగి తెరవడుకు అధికారులు ఏర్పాట్లు ముమ్మరం చేశారు. కేదార్‌నాథ్ ద్వారాలు తెరవడం తోనే ఉత్తరాఖండ్‌లో ప్రసిద్ధమైన చార్‌ధామ్ యాత్ర మొదలవుతుంది.

దేశంలోనే తొలి 'గో మ్యూజియం'!

మధుర: ఉత్తరప్రదేశ్‌లోని మధురలో దేశంలోనే మొట్టమొదటి నేషనల్ కౌ కల్చర్ మ్యూజియం (జాతీయ ఆవు సంస్కృతి ప్రదర్శనశాల) ఏర్పాటు కానుంది. పండిట్ దీనదయాళ్ ఉపాధ్యాయ వెటర్నరీ యూనివర్సిటీ ప్రాంగణంలో ఏర్పాటు చేయనున్నారు. ఈ మ్యూజియం ఆవుల సాంస్కృతిక, ఆధ్యాత్మిక, శాస్త్రీయ ప్రాముఖ్యతను తెలియజేస్తుందని, గో సంరక్షణపై సమగ్ర అవగాహనను పెంపొందిస్తుందని అధికారులు తెలిపారు. ఈ ప్రాజెక్టు సంబంధించి భూమికోసం బ్రజ్ తీర్థ వికాస్ పరిషత్ ఉపాధ్యక్షుడు శైలజాకాంత్ మిశ్రా, ఆగ్రా డివిజనల్ కమిషనర్ నగేంద్ర ప్రతాప్, జిల్లా కలెక్టర్ సీపీ సింగ్, మధుర బృందావన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఉపాధ్యక్షుడు ఎస్ లక్ష్మీ వెటర్నరీ యూనివర్సిటీ ప్రతిపాదిత స్థలాన్ని పరిశీలించారు. అనంతరం ప్రాజెక్టు రూపురేఖలపై చర్చించారు. మ్యూజియంలో సుమారు 100 డిజిటల్, సింబాలిక్ ఆవుల నమూనాలు ప్రదర్శించనున్నట్లు కమిషనర్ నాగేంద్ర ప్రతాప్ తెలిపారు. ఆవు వారసత్వ గొప్పతనం గురించి భవిష్యత్ తరాలకు అవగాహన కల్పించేందుకు దేశంలో అన్ని ప్రధాన ఆవుల జాతులు, అలాగే అంతరించి పోతున్న జాతులు అందులో ఉంటాయన్నారు. ఆవు పాలు, పెరుగు, జున్ను, నెయ్యి వంటి ఉత్పత్తుల ప్రదర్శనతోపాటు, అవి అందించే ఆయుర్వేద ప్రయోజనాలను ప్రదర్శించనున్నట్లు వెల్లడించారు. సందర్శకులకు స్వచ్ఛమైన పాల ఉత్పత్తులను అందించే ఒక డైరీ పార్లర్‌ను కూడా ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

ఏకత్వం, అనుబంధాలే మన విలువలు

ప్రపంచ సామాజిక సామరస్య కేంద్రంగా భారత్: భాగవత్

గోరఖ్‌పూర్: ప్రపంచ సామరస్య, సామాజిక సామరస్య కేంద్రంగా భారత్ నిలుస్తుందని ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భాగవత్ అన్నారు. కుల, మతాలకతీతంగా ఏకత్వం, పరస్పర అనుబంధాలు దేశ నాగరికత విలువల్లో పాతుకుపోయాయన్నారు. ఆర్ఎస్ఎస్ గోరక్ష ప్రావిన్స్ సంస్థ శతాబ్ది ఉత్సవాలను పురస్కరించుకుని ఆదివారం నిర్వహించిన 'సామాజిక సద్భావ్' సభలో ఆయన మాట్లాడారు. చాలా దేశాల్లో సంబంధాలన్నీ ఆర్థిక లావాదేవీల మీద ఆధారపడి ఉంటాయని, కేవలం భారత్‌లోనే మానవ సంబంధాలుంటాయని అన్నారు. అంతర్లీనంగా ఉన్న సాంస్కృతిక ఐక్యత వల్ల ఆచారాలు, వస్త్రధారణ, సంప్రదాయాల్లో తేడాలేవీ ప్రజలను విడదీయలేవన్నారు. ఆర్ఎస్ఎస్ వందేళ్ల మైలురాయికి చేరడం కేవలం వేడుక కాదని, ఆత్మపరిశీలనకు అసలైన సమయమని చెప్పారు. కులాలను పక్కన పెట్టి మొత్తం హిందూ సమాజం కోసం పనిచేయాలని పిలుపునిచ్చారు.

అదసలు ఇంటర్వ్యూనే కాదు: కాంగ్రెస్

న్యూఢిల్లీ: ప్రధాని మోదీ తాజాగా పీటీఐకి ఇచ్చిన ఇంటర్వ్యూ అసలు ఇంటర్వ్యూనే కాదంటూ కాంగ్రెస్ మండిపడింది. ముందుగానే సిద్ధం చేసి ఉంచుకున్న స్క్రిప్ట్, ప్రజల దృష్టిలో పడేందుకు చేసిన ప్రయత్నంగా పేర్కొంది. అమెరికా ఒత్తిళ్లకు లొంగిపోయిన ప్రధాని మోదీ, పత్రికా శీర్షికలకు ఎక్కడం ద్వారా తన వైఫల్యాన్ని కప్పిపుచ్చుకునేందుకు ప్రయత్నించారని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ ఎద్దేవా చేశారు. 'ప్రభుత్వం ఇటీవల పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన వార్షిక బడ్జెట్ తుస్సుమన్న బాంబు వంటిది. ఇందులో ఏమాత్రం కొత్తదనం లేదని ప్రధానికి తెలుసు. ఈ బడ్జెట్‌పై మార్కెట్లు ప్రతికూలంగా స్పందించాయి. పెట్టుబడిదారులు కూడా సంతృప్తి చెందలేదు. వీటన్నిటినీ దృష్టిలో ఉంచుకునే ప్రధాని మోదీ పీటీఐతో మాట్లాడారు'అని జైరాం రమేశ్ తెలిపారు. ఆయన అత్యంత సంక్షిప్తంగా చెప్పిన విషయాల్లోనూ నిజం కొంతేనన్నారు.

బీఎస్పీ-ఎస్పీ మధ్య బలమైన బంధం: అఖిలేశ్

లక్నో: సమాజ్‌వాదీ పార్టీ(ఎస్పీ) చీఫ్ అఖిలేశ్ యాదవ్ బహుజన్ సమాజ్ పార్టీ(బీఎస్పీ)తో మైత్రిపై కీలక వ్యాఖ్యలు చేశారు. ఉత్తరప్రదేశ్ మాజీ సీఎం మాయావతి సారథ్యంలోని బీఎస్పీ, తమ ఎస్పీలు దగ్గరవుతున్నాయని, ఈ బంధం మరింత బలోపేతం కానుందని పేర్కొన్నారు. ఆదివారం వివిధ పార్టీలకు చెందిన 15 వేల మంది ఎస్పీలో చేరిన సందర్భంగా ఏర్పాటైన కార్యక్రమంలో మాట్లాడారు. 2019 సార్వత్రిక ఎన్నికల్లో ఎస్పీ, బీఎస్పీలు ఉమ్మడిగా బరిలోకి దిగాయి. ఎన్నికల అనంతరం విడిపోయాయి. ప్రతిపక్షాల మధ్య ఐక్యత సాధించేందుకు, రాజకీయాలను కొత్తమలుపు తిప్పేందుకు గతంలో బీఆర్ అంబేడ్కర్, రామ్ మనోహర్ లోహియా వంటి మహామహులు ఎంతగానో కృషి చేసినప్పటికీ..అప్పటి రాజకీయ వాతావరణం, పరిస్థితులు అందుకు సహకరించలేదని ఆయన చరిత్రను గుర్తు చేశారు. 'పార్టీలు జట్టుకట్టడం, ఆ తర్వాత విడిపోవడం సాధారణమై పోయింది. రానున్న కాలంలో ప్రతిపక్షాల మధ్య ఐక్యత కుదురుతుందని ఆశిస్తున్నా'అని ఆయన అన్నారు.

మరో చమురు ట్యాంకర్ సీజ్

వాషింగ్టన్: వెనెజులా నుంచి అక్రమంగా చమురును తరలిస్తున్న ట్యాంకర్‌ను స్వాధీనం చేసుకున్నట్లు అమెరికా మిలటరీ తెలిపింది. నిషేధిత జాబితాలో ఉన్న వెరోనికా–3 అనే ఈ ట్యాంకర్‌ను కరీబియన్ సముద్రం నుంచి అనుసరిస్తూ హిందూమహా సముద్రంలో ఉండగా సీజ్ చేశామంది. ట్యాంకర్‌పైకి తమ బలగాలు దిగుతున్న వీడియోను పెంటగాన్ విడుదల చేసింది. పనామాకు చెందిన ఈ ట్యాంకర్‌పై ఆంక్షలున్నాయి. అధ్యక్షుడు మదురో పట్టుబడిన, జనవరి 3వ తేదీనే ఇది వెనెజులాను వీడినట్లు తెలిపింది. ఇందులో 20 లక్షల బ్యారెళ్ల ముడి చమురు ఉంది. 2023 నుంచి కార్యకలాపాలు నిర్వహిస్తున్న ఈ ట్యాంకర్ నౌక రష్యా, ఇరాన్ నుంచి కూడా అక్రమంగా చమురును తరలిస్తోందని పెంటగాన్ ఆరోపించింది. అమెరికా ఆంక్షల కారణంగా వెనెజులా ఇతర దేశాల పేరుతో ట్యాంకర్లను నిర్వహిస్తూ దొంగచాటుగా చమురును తరలిస్తోంది. అయితే, వీటిని గతేడాది డిసెంబర్ నుంచి అమెరికా మిలటరీ అడ్డుకుంటోంది. జనవరిలో వెనెజులా అధ్యక్షుడు మదురోను రాజధాని కారకాస్‌లోని తన నివాసంలో ఉండగా అమెరికా బలగాలు నిర్బంధించి తీసుకెళ్లడం తెల్సిందే.

పెళ్లి చేసుకోనన్నంత మాత్రాన... అత్యాచారంగా పరిగణించలేం

ఉత్తరాఖండ్ హైకోర్టు తీర్పు

డెహ్రాడూన్: మేజర్లు పరస్పర అంగీకారంతో సుదీర్ఘకాలం పాటు సహజీవనం చేసిన అనంతరం పురుషుడు వివాహానికి అంగీకరించనంత మాత్రాన దాన్ని అత్యాచారంగా పరిగణించలేమని ఉత్తరాఖండ్ హైకోర్టు తేల్చిచెప్పింది. వారి బంధం విఫలమైనంత మాత్రాన అది క్రిమినల్ కేస్ కాదని అభిప్రాయపడింది. ఆ హామీ మొదటి నుంచీ అబద్ధమని తేలితేనే నేరమవుతుందని పేర్కొంది. ఒక వ్యక్తి తనను పెళ్లి చేసుకుంటానని నమ్మించి అత్యాచారం చేశాడని ఆరోపిస్తూ ముస్సోరీకి చెందిన మహిళ వేసిన కేసును కోర్టు కొట్టేసింది. సూరజ్ బోరా అనే వ్యక్తి 45 రోజుల్లో తనను వివాహం చేసుకుంటానని చెప్పాడని, తర్వాత అందుకు తిరస్కరించాడని సదరు మహిళ ఫిర్యాదు చేశారు. ఈ కేసును న్యాయమూర్తి జస్టిస్ ఆశిష్ నైథానీ విచారించారు. ఇద్దరు మేజర్లని, నిందితుడు సంబంధం ప్రారంభం నుంచి మోసం చేసే ఉద్దేశంతో ఉన్నట్టు నిరూపించడానికి కచ్చితమైన ఆధారాలు లేవని అభిప్రాయపడ్డారు. ''దీర్ఘకాలిక సంబంధం పరస్పర అంగీకారాన్ని సూచిస్తుంది. కనుక ఈ దశలో నిందితునిపై క్రిమినల్ చర్యలు కొనసాగించడం వేధించడమే అవుతుంది'' అని స్పష్టం చేశారు. 2023 జూలై 22న ఈ మేరకు దాఖలైన ఛార్జ్‌షీట్‌ను కూడా పూర్తిగా కొట్టేశారు.

రాష్ట్ర జాబితాలోని అంశంపై కేంద్రం చట్టం చేయొచ్చా?

భారత రాజ్యాంగం దేశంలో సమాఖ్య వ్యవస్థను ఏర్పాటు చేసింది. రాజ్యాంగంలో ఎక్కడా సమాఖ్య అనే పదాన్ని ప్రయోగించపోయినా.. భారతదేశం సమాఖ్య రాజ్యమే. ఎందుకంటే సమాఖ్య మౌలిక లక్షణాలన్నీ భారత సమాఖ్యలో ఉన్నాయి. సమాఖ్యలో అత్యంత ముఖ్య లక్షణం అధికార విభజన. రాజ్యాంగంలో కేంద్ర, రాష్ట్రాల మధ్య చాలా విస్తృతమైన, స్పష్టమైన అధికార విభజన జరిగింది.

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం
జనరల్ స్టడీస్
పాలిటీ

కేంద్ర - రాష్ట్ర సంబంధాలు

రాజ్యాంగంలో కేంద్ర, రాష్ట్రాల మధ్య మూడు రకాల సంబంధాలను పొందుపర్చారు.

1. శాసన సంబంధాలు (Legislative Relations)–11వ భాగం, ప్రకరణ 245 నుంచి 255
2. పరిపాలనా సంబంధాలు (Administrative Relations)–11వ భాగం,ప్రకరణ 256 నుంచి 263
3. ఆర్థిక సంబంధాలు (Financial Relations)– 12 భాగం, ప్రకరణ 264 నుంచి 300

కేంద్ర, రాష్ట్రాల మధ్య శాసన సంబంధాలు

భాగం 11లోని ప్రకరణలు 245 నుంచి 255 వరకు కేంద్ర, రాష్ట్రాల మధ్య ఉన్న శాసన సంబంధాలను పొందుపరిచారు. శాసన సంబంధాలు అంటే పార్లమెంట్, రాష్ట్ర శాసనసభలు ఏయే అంశాలపై చట్టాలు చేయవచ్చో వివరించే ప్రక్రియ.

ప్రకరణ–245: కేంద్ర పార్లమెంట్, రాష్ట్ర శాసనసభల చట్టాల భౌగోళిక పరిమితులు:

- పార్లమెంట్ రూపొందించే చట్టాలు దేశంలో అన్ని ప్రాంతాలకు, అన్ని సంస్థలకు వర్తిస్తాయి. ఇవి ఇతర దేశాల్లో నివసిస్తున్న భారతీయులకు కూడా వర్తిస్తాయి(ప్రకరణ 245(2)). ఈ అధికారాన్నే 'Extra Territorial Legislation' లేదా 'సీమాంతేతర చట్టాలు' అంటారు.
- రాష్ట్ర శాసనసభలు చేసిన చట్టాలు ఆ రాష్ట్ర భూభాగాలకు మాత్రమే వర్తిస్తాయి. వీటికి సీమాంతేతర చట్టాల పరిధి లేదు.

పార్లమెంట్ చట్టాలపై పరిమితులు:

- పార్లమెంట్ చేసిన చట్టాలు కొన్ని ప్రాంతాలకు.. ముఖ్యంగా కేంద్ర పాలిత ప్రాంతాలైన అండమాన్ నికోబార్ దీవులు, దాద్రానగర్ హవేలి, డామన్–డయ్యూ ప్రాంతాలకు వర్తించవు. వీటి పరిపాలనను రాష్ట్రపతే నేరుగా నియంత్రిస్తారు. పరిపాలన ఆదేశాలను రాష్ట్రపతి జారీ చేస్తారు. ఇవి పార్లమెంట్ చట్టాలతో సమాన ప్రతిపత్తిని కలిగి ఉంటాయి.
- రాష్ట్రాల్లోని కొన్ని షెడ్యూల్డ్ ప్రాంతాలకు కూడా పార్లమెంట్ చట్టాలు వర్తించవు. ఈ ప్రాంతాలకు సంబంధించి ప్రత్యేక ఆదేశాలు జారీ చేస్తారు. అసోం గవర్నర్‌కు ఆ రాష్ట్రంలోని స్వయం ప్రతిపత్తి ఉన్న జిల్లా మండలి (Autonomous District Council)కి సంబంధించి ప్రత్యేక అధికారాలు ఉంటాయి.
- మేఘాలయ, త్రిపుర, మిజోరాం రాష్ట్రాల్లో స్వయం ప్రతిపత్తి ఉన్న జిల్లాలపై రాష్ట్రపతికి ప్రత్యేక అధికారాలు ఉంటాయి.

ప్రకరణ–246: కేంద్ర, రాష్ట్రాల మధ్య అధికార విభజన: కేంద్ర,రాష్ట్రాల మధ్య అధికారాలను మూడు జాబితాల్లో విభజించారు. వీటికి సంబంధించిన వివరాలను ఏడో షెడ్యూల్‌లో పేర్కొన్నారు.

జాబితాలు

కేంద్ర జాబితా (Union List) ప్రకరణ 246 (1): రాజ్యాంగం అమల్లోకి వచ్చిన ప్రారంభంలో ఈ జాబితాలో 97 అంశాలున్నాయి. తర్వాత ఈ జాబితాకు 2ఎ, 92ఎ, 92బి, 92సి అంశాలను చేర్చారు. 33లో ఉన్న అంశాలను తొలగించారు. ప్రస్తుతం ఇందులో వంద అంశాలున్నాయి.

జాబితాలోని ముఖ్యాంశాలు: దేశ రక్షణ, అంతర్జాతీయ వ్యవహారాలు, బ్యాంకింగ్, కరెన్సీ, అణుశక్తి, బీమా, ప్రసారాలు, వైమానిక, నౌకా సర్వీసులు మొదలైన జాతీయ ప్రాముఖ్యం ఉన్న విషయాలను కేంద్ర జాబితాలో పొందుపరిచారు.

కేంద్ర జాబితాలోని అంశాలపై పార్లమెంట్ చట్టాలను రూపొందించవచ్చు, సవరించవచ్చు, రద్దు చేయవచ్చు.

రాష్ట్ర జాబితా(State List)ప్రకరణ 246(3): రాజ్యాంగం అమల్లోకి వచ్చినప్పుడు ఇందులో 66 అంశాలున్నాయి. ప్రస్తుతం 61 అంశాలు మాత్రమే ఉన్నాయి. ఈ జాబితాలోని ఎంట్రీ 11,19, 20, 29, 36లోని అంశాలను ఉమ్మడి జాబితాలోకి మార్చారు.

జాబితాలోని ముఖ్యాంశాలు: శాంతి భద్రతలు, పోలీస్, వ్యవసాయం, నీటిపారుదల, స్థానిక సంస్థలు, ప్రజారోగ్యం, పారిశుధ్యం, జైళ్లు, గ్రంథాలయాలు, మార్కెట్లు, వడ్డీ వ్యాపారం తదితర స్థానిక ప్రాముఖ్యం ఉన్న అంశాలను ఈ జాబితాలో పొందుపరిచారు.

ఉమ్మడి జాబితా (Concurrent List) ప్రకరణ 246(2): ప్రారంభంలో ఈ జాబితాలో 47 అంశాలు ఉండేవి. ప్రస్తుతం 52 ఉన్నాయి. ఈ జాబితాలో ఎంట్రీ నంబర్ 11ఎ న్యాయపాలన, సబార్డినేట్ కోర్టుల వ్యవస్థీకరణ, 17ఎ అడవులు, 17బి వన్యప్రాణుల సంరక్షణ, 20ఎ జనాభా నియంత్రణ, కుటుంబ నియంత్రణ, 25 సాధారణ విద్య, సాంకేతిక విద్య, 33ఎ తూనికలు, కొలతలు.

పై అన్ని అంశాలను 1976లో 42వ రాజ్యాంగ సవరణ ద్వారా ఉమ్మడి జాబితాలోకి చేర్చారు. అందువల్ల ఉమ్మడి జాబితాలోని అంశాలు 47 నుంచి 52కు పెరిగాయి.

కేంద్ర, రాష్ట్ర శాసనాల మధ్య వైరుధ్యం

ఉమ్మడి జాబితాలోని అంశాలపైన పార్లమెంట్, రాష్ట్ర శాసనసభలు చట్టాలు చేయవచ్చు. అయితే కేంద్ర శాసనానికి, రాష్ట్ర శాసనానికి మధ్య వైరుధ్యం ఏర్పడితే.. అంతిమంగా కేంద్ర శాసనానికే ఆధిక్యత ఉంటుంది. కొన్ని సందర్భాల్లో మినహాయింపు ఉంటుంది.

ప్రకరణ 254 ప్రకారం.. ఉమ్మడి జాబితాలోని అంశాలపై రాష్ట్రపతి పూర్వానుమతితో రాష్ట్ర శాసనసభ చట్టం చేసి, ఇదే అంశంపై పార్లమెంట్ కూడా చట్టం చేస్తే.. పార్లమెంట్ చేసిన చట్టం రాష్ట్ర శాసనసభ చేసిన చట్టానికి విరుద్ధమైతే, రాష్ట్ర శాసనసభ చేసిన చట్టమే చెల్లుబాటవుతుంది.

కేంద్ర, రాష్ట్ర చట్టాల వివాదాల పరిష్కారానికి సంబంధించిన సూత్రాలు (Doctrines)

కేంద్ర, రాష్ట్రాల మధ్య అధికార విభజనకు సంబంధించి వివాదాలు తలెత్తితే.. వాటిని పరిష్కరించడానికి సుప్రీంకోర్టు కొన్ని న్యాయ సూత్రాలను అవలంబిస్తుంది. ప్రతి సూత్రానికి అంతర్గతంగా ఒక పరమార్థం ఉంటుంది. వాటిని కింది విధంగా వివరించవచ్చు.

డాక్ట్రిన్ ఆఫ్ పిత్ అండ్ సబ్‌స్టాన్స్: సమాఖ్య వ్యవస్థలో కేంద్ర, రాష్ట్రాల మధ్య అధికార విభజన జరిగిన సందర్భాల్లో ఒక నిర్ణీత అంశం లేదా చట్టాన్ని ఒక జాబితాలో పొందుపరుస్తారు. ఆ జాబితాలో పొందుపరిచిన అంశం, మరో జాబితాలో పొందుపరిచిన అంశాన్ని సందర్భానుసారం కొంత వరకు అతిక్రమించినా, ఆ చట్టాలను రద్దు చేయరు. అలాంటి సందర్భాల్లో ఆ అంశంలోని సారాంశాన్ని పరిగణనలోకి తీసుకుంటారు. దీన్నే 'పిత్ అండ్ సబ్‌స్టాన్స్' అంటారు. ఉదాహరణకు, మనీ లెండింగ్ (రుణం ఇవ్వడం) అనే అంశం రాష్ట్ర జాబితాలో ఉంది. దీనికి సాక్ష్యంగా ఆధారంగా రాసే ప్రామిసరీ నోటు అనే అంశం కేంద్ర జాబితాలో ఉంది. మనీ లెండింగ్‌ను నియంత్రిస్తూ రాష్ట్రం చేసిన చట్టం సందర్భానుసారం కేంద్ర జాబితాలోని ప్రామిసరీ నోటు అనే అంశంలోకి చొరబడ్డా.. రాష్ట్రం తన శాసనసభ పరిధిని అతిక్రమించిందనే నెపంతో న్యాయస్థానం ఆ చట్టాలను కొట్టివేయదు. ఎందుకంటే ఆ చట్టంలోని ప్రధాన సారాంశం రాష్ట్ర జాబితాలోనే ఉంది. అనుకోకుండా ఆ చట్ట పరిధి కేంద్ర జాబితాలోకి విస్తరించినా..ప్రధాన ఉద్దేశం రాష్ట్ర జాబితాలోని అంశాన్ని నియంత్రించడమే అవుతుంది. కేంద్ర, రాష్ట్రాలు తమ పరిధులను అతిక్రమించాయనే సమస్య ఉత్పన్నమైనప్పుడు న్యాయస్థానం 'పిత్ అండ్ సబ్‌స్టాన్స్' సూత్రం ప్రకారం తీర్పులు చెబుతుంది. ఈ అంశాన్ని సుప్రీంకోర్టు సదరన్ ఫార్మాస్యూటికల్ వర్సెస్ కేరళ ప్రభుత్వం(1981),స్టేట్ ఆఫ్ రాజస్థాన్ వర్సెస్ చావ్లా కేసుల్లో స్పష్టీకరించింది.

డాక్ట్రిన్ ఆఫ్ కలరబుల్ లెజిస్లేషన్: కేంద్ర రాష్ట్రాల అధికారాల విభజన ఉద్దేశం రెండింటి మధ్య ఎలాంటి విభేదాలు తలెత్తకుండా చూడటం. అయితే శాసన శాఖ తన పరిధిలో లేని అంశాలను ఉన్నట్లుగా ఊహించుకుని దురుద్దేశపూర్వకంగా చట్టాలు చేస్తే, అలాంటి చట్టాలను కలరబుల్ లెజిస్లేషన్ అంటారు. ఈ సూత్రం ముఖ్య ఉద్దేశం.. ప్రత్యక్షంగా చేయలేని పనిని పరోక్షంగానూ చేయకూడదు (You can not do indirectly what you can not do directly i.e. no person who has no title can not transfer it to others) ఉదాహరణకు 'రైల్వేలు' కేంద్ర జాబితాలో ఉంది. ఆ అంశాలపై రాష్ట్ర శాసనసభలు చట్టాలు చేస్తే, ఆ చట్టాలు కలరబుల్ లెజిస్లేషన్ అవుతాయి.

డాక్ట్రిన్ ఆఫ్ రిపగ్నెన్సీ: రిపగ్నెన్సీ అంటే ఇష్టం లేకపోవడం లేదా అసంబద్ధం అని అర్థం. ఒక చట్టం ఒక పనికి అనుమతించి, మరో చట్టం ఆ పనికి అనుమతిని నిరాకరిస్తే దాన్ని అసంబద్ధం లేదా డాక్ట్రిన్ ఆఫ్ రిపగ్నెన్సీ అంటారు. ఉమ్మడి జాబితాలోని అంశాలపై పార్లమెంట్, రాష్ట్ర శాసనసభ చట్టాలు చేయవచ్చు. రెండింటి మధ్య వివాదం ఏర్పడితే అంతిమంగా కేంద్ర చట్టమే చెల్లుబాటవుతుంది. పార్లమెంట్, రాష్ట్ర శాసనసభ చట్టాలు రెండూ పరస్పర విరుద్ధమైతే, డాక్ట్రిన్ ఆఫ్ రిపగ్నెన్సీ ప్రకారం ఆ చట్టాల చెల్లుబాటును నిర్ణయిస్తారు.

ఉదాహరణకు హత్య నేరానికి ఐ.పి.సి. 302 ప్రకారం శిక్ష పడుతుంది. బాల నేరస్థులకు సంబంధించి ఒకవేళ ఆ రాష్ట్రం ప్రత్యేక చట్టం చేసి ఉంటే, ఆ రాష్ట్ర చట్టం ప్రకారం వారిని విచారించి శిక్షించాల్సి ఉంటుంది. అలాంటి చట్టాలకు సి.ఆర్.పి.సి.లో మినహాయింపు ఉంటే రాష్ట్ర చట్టాలే చెల్లుబాటు అవుతాయి.

డాక్ట్రిన్ ఆఫ్ రెసిడ్యూరీ పవర్స్: రెసిడ్యూరీ అంటే మిగిలిపోయిన భాగం అని అర్థం. మూడు జాబితాల్లో ప్రస్తావించని అంశాలను అవశిష్ట అధికారాల పేరుతో కేంద్రానికి ఇచ్చారు. కాబట్టి అవశిష్ట అధికారాలపై చట్టం చేసే అధికారం పూర్తిగా కేంద్ర ప్రభుత్వానికే ఉంటుంది. ఈ సూత్రం ముఖ్య ఉద్దేశం కేంద్ర ప్రభుత్వాన్ని బలోపేతం చేయడమే.

ఉదాహరణకు పార్లమెంట్ అవశిష్ట అంశాలకు సంబంధించి పార్లమెంట్ సంపద పన్ను చట్టం–1957; బహుమతి పన్ను చట్టం–1957; కమిషన్ ఆఫ్ ఎంక్వైరీ యాక్ట్–1952 మొదలైన చట్టాలను రూపొందించింది. ఇవి డాక్ట్రిన్ ఆఫ్ రెసిడ్యూరీ పవర్స్‌లోకి వస్తాయి.

డాక్ట్రిన్ ఆఫ్ ఇమ్యూనిటీ ఆఫ్ ఇన్‌స్ట్రుమెంటాలిటీస్: కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తమ ఆస్తులపై పరస్పరం పన్నులు విధించుకోడానికి మినహాయింపు ఉంది. దీన్ని డాక్ట్రిన్ ఆఫ్ ఇమ్యూనిటీ ఆఫ్ ఇన్‌స్ట్రుమెంటాలిటీస్ అంటారు. ప్రకరణలు 285, 287, 288, 289లో వీటిని ప్రస్తావించారు.

ప్రకరణ 247 ప్రకారం.. కేంద్ర జాబితాలో పొందుపరచిన అంశాలకు సంబంధించి అదనపు న్యాయస్థానాలను ఏర్పాటు చేసే అధికారం పార్లమెంట్ కలిగి ఉంటుంది.

అవశిష్ట జాబితా (Residual List) ప్రకరణ 248(1): అవశిష్ట జాబితాలోని అంశాలపై పార్లమెంట్ మాత్రమే చట్టం చేస్తుంది. అవశిష్ట జాబితా అంటే కేంద్ర జాబితా, రాష్ట్ర జాబితా, ఉమ్మడి జాబితాలో ప్రస్తావించని అంశాలు.

ప్రకరణ 248 (2) ప్రకారం.. రాష్ట్ర జాబితా, ఉమ్మడి జాబితాలో లేని అంశాలకు పన్ను విధించే అధికారం పార్లమెంట్‌కు ఉంటుంది.

అమెరికా, ఆస్ట్రేలియాలో అవశిష్ట అధికారాలను రాష్ట్రాలకు ఇచ్చారు. కెనడాలో అవశిష్ట అధికారాలు కేంద్రానికి ఇచ్చారు. భారత ప్రభుత్వ చట్టం –1935 ప్రకారం అవశిష్ట అధికారాలను ఆనాటి గవర్నర్ జనరల్‌కు ఇచ్చారు.

ప్రకరణ 249 (1) ప్రకారం.. జాతీయ ప్రయోజనాల దృష్ట్యా రాజ్యసభ 2/3 వంతు సభ్యుల మెజారిటీతో ఒక తీర్మానం చేస్తే.. ఆ తీర్మానాన్ని లోక్‌సభ కూడా ఆమోదిస్తే ఆ అంశంపై పార్లమెంట్ చట్టాలను రూపొందిస్తుంది. ఆ విధంగా రాష్ట్ర జాబితాలో అంశాలపై పార్లమెంట్ చేసిన చట్టాలు ఒక సంవత్సరం వరకే అమల్లో ఉంటాయి (ప్రకరణ 249(2)). అవసరమైతే తీర్మానం ద్వారా మరో ఏడాది వరకు పొడిగించవచ్చు. గడువు ముగిసిన తర్వాత, ఆరు నెలల వరకు మాత్రమే అలాంటి చట్టాలు అమల్లో ఉంటాయి. తాత్కాలికంగా కేంద్ర జాబితాలోకి బదలాయించిన అంశం తిరిగి రాష్ట్ర జాబితాలోకి చేరుతుంది.

ప్రకరణ 250 (1) ప్రకారం.. దేశంలో జాతీయ అత్యవసర పరిస్థితి (ప్రకరణ 352) అమల్లో ఉన్నప్పుడు, పార్లమెంట్ రాష్ట్ర జాబితాలోని అంశాలపై శాసనాలను రూపొందిస్తుంది. అలాంటి శాసనం అత్యవసర పరిస్థితి అమల్లో ఉన్నంత కాలం చెల్లుబాటవుతుంది.

ప్రకరణ 250 (2) ప్రకారం.. అత్యవసర పరిస్థితి ఎత్తేసిన ఆరు నెలల తర్వాత ఆ చట్టాలు రద్దవుతాయి.

ప్రకరణ 251 ప్రకారం.. ప్రకరణలు 249, 250 అనుసరించి పార్లమెంట్ రాష్ట్ర జాబితాలో చేసిన చట్టాలకు, అంతకుముందే రాష్ట్రాలు వాటి జాబితాలో చేసుకున్న చట్టాలకు వైరుధ్యం ఏర్పడితే.. పార్లమెంట్ చేసిన చట్టమే చెల్లుబాటు అవుతుంది.

ప్రకరణ 252 (1) ప్రకారం.. రెండు లేదా అంతకంటే ఎక్కువ రాష్ట్రాలు ఉమ్మడి ప్రయోజనార్థం రాష్ట్ర జాబితాలోని అంశాలపై చట్టాలు చేయమని కోరితే.. అలా కోరిన రాష్ట్రాలకు వర్తింపజేస్తూ రాష్ట్ర జాబితాలోని అంశాలపై పార్లమెంట్ చట్టాలు రూపొందిస్తుంది.

ఉదాహరణకు ఎస్టేట్ సుంకం చట్టం–1955; ప్రైజ్ కాంపిటీషన్ చట్టం–1955; వన్యప్రాణి సంరక్షణచట్టం–1972; జలకాలుష్య నివారణ చట్టం–1974; పట్టణ, ఆస్తుల పరిమితి చట్టం–1976; మానవ అవయవాల మార్పిడి చట్టం–1994 మొదలైన చట్టాలను పార్లమెంట్ రూపొందించి రాష్ట్రాలకు వర్తింపజేసింది.

ప్రకరణ 252(2) ప్రకారం.. పైన పేర్కొన్న విధంగా రూపొందించిన శాసనాన్ని సవరించే లేదా రద్దు చేసే అధికారం పార్లమెంట్‌కు మాత్రమే ఉంటుంది.

ప్రకారణ 253 ప్రకారం.. అంతర్జాతీయ ఒప్పందాల అమలు కోసం అవసరమైన శాసనాలను రూపొందించే అధికారం పార్లమెంట్‌కు ఉంది. ఈ ఒప్పందాల అమలుకు రాష్ట్రాల చట్టాలు అవరోధాలుగా ఉంటే వాటిని పార్లమెంట్ సవరించవచ్చు.

ఉదాహరణకు ఐక్యరాజ్య సమితి ప్రత్యేక అవసరాల రక్షణ చట్టం–1947; జెనీవా ఒప్పందం చట్టం–1960; హైజాకింగ్ వ్యతిరేక చట్టం–1982 లాంటి చట్టాలను పార్లమెంట్ రూపొందించింది.

ప్రకరణ 254 ప్రకారం.. ఉమ్మడి జాబితాలోని వైరుధ్యాలను తొలగించడం, పార్లమెంట్ రూపొందించిన శాసనానికి రాష్ట్ర విధానసభలు రూపొందించిన శాసనం విరుద్ధంగా ఉంటే, పార్లమెంట్ రూపొందించిన శాసనానికి అధిక్యత ఉంటుంది.

ప్రకరణ 255 ప్రకారం.. కొన్ని చట్టాలను రూపొందించే సమయంలో రాష్ట్రపతి, గవర్నర్‌ల పూర్వానుమతి అవసరం. ఒకవేళ అలాంటి చట్టాలను వీరి పూర్వానుమతి లేకుండా రూపొందిస్తే అవి చెల్లవు అని చెప్పే అధికారం రాష్ట్రపతి, గవర్నర్‌లకు ఉండదు. వారి అనుమతి తీసుకోవడమనేది కేవలం ప్రక్రియకు సంబంధించిందే కానీ, వారి అధికారాలకు చెందింది కాదు.

ఇతర భాగాల్లోని ప్రకరణలు (18వ భాగం)

ప్రకరణ 352 ప్రకారం.. జాతీయ అత్యవసర పరిస్థితి సమయంలోనూ కేంద్రం రాష్ట్ర జాబితాలో చట్టాలు చేయవచ్చు.

ప్రకరణ 356 ప్రకారం.. రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన విధించినప్పుడు రాష్ట్ర జాబితాలోని అంశాలపై పార్లమెంట్ రాష్ట్ర శాసనసభ తరఫున చట్టాలను రూపొందించవచ్చు.

పెట్రోలియం బావిని మొదటగా ఎక్కడ కనుగొన్నారు?



టెట్/డీఎస్సీ- ప్రత్యేకం
జాగ్రఫీ

భారతదేశం - ఖనిజ వనరులు

వజ్రాలు: ప్రపంచంలో ప్రస్తుతం వజ్రాల ఉత్పత్తిలో రష్యా, బోట్స్‌వానా, కాంగో, కెనడా దేశాలు మొదటి నాలుగు స్థానాల్లో ఉన్నాయి. భారతదేశంలో నిల్వలు, ఉత్పత్తిపరంగా మధ్యప్రదేశ్, ఆధ్రప్రదేశ్ మొదటి రెండు స్థానాలను ఆక్రమించాయి. కింబర్లైట్ శిలాస్థరాల్లో ఇవి లభ్యమవుతున్నాయి.

గనుల విస్తరణ:

- మధ్యప్రదేశ్ – కేన్ నది ఒడ్డున ఉన్న పన్నా.
- ఆంధ్రప్రదేశ్ – అనంతపురం జిల్లాలోని వజ్రకరూర్ కింబర్లైట్, కృష్ణా నదిలోయ.
- కేరళ – కోజికోడ్.

అభ్రకం (మైకా): మైకా ఉత్పత్తిలో భారత్ ప్రపంచంలోనే ప్రథమ స్థానంలో ఉంది. ఎలక్ట్రికల్ ఇండస్ట్రీలో ఇన్సులేటర్‌గా, ఎలక్ట్రానిక్ ఇండస్ట్రీలో మైక్రో చిప్స్ రూపంలో, గ్లాస్ ఇండస్ట్రీలో గట్టితనం కోసం దీన్ని ఎక్కువగా వినియోగిస్తున్నారు.

ఇది హైడ్రోసిలికేట్ల రూపంలో భూపటలంలో మూడు రూపాల్లో లభ్యమవుతుంది.

అవి:

1. **మస్కోవైట్ (పొటాష్ మైకా):** శ్వేత వర్ణంలో ఉంటుంది. దీన్నే 'రూబి మైకా' అంటారు. ఇది అత్యంత నాణ్యమైంది.
2. **ఫ్లోగోపైట్:** పసుపు రంగులో ఉంటుంది. దీన్నే 'మెగ్నీషియా మైకా' అంటారు.
3. **బయొటైట్:** నలుపు వర్ణంలో ఉంటుంది.

గనుల విస్తరణ:

- బిహార్ – గయ.
- జార్ఖండ్ – కోడెర్మా, హజారీబాగ్, సింగ్భమ్, పాలమావు.
- ఆంధ్రప్రదేశ్ – నెల్లూరు (గూడూరు).
- తెలంగాణ – ఖమ్మం.

బెరైటీస్ (ముగ్గురాయి): బెరైటీస్ నిల్వలు, ఉత్పత్తిపరంగా భారతదేశం ప్రపంచంలోనే ప్రథమ స్థానంలో ఉంది. దేశంలో ఆంధ్రప్రదేశ్‌లోని మంగంపేట, అనంతరాజుపేట (కడప జిల్లా) ప్రాంతాలు వీటికి ప్రసిద్ధి చెందాయి. ఈ ఖనిజం బేరియం ఆక్సైడ్‌ల రూపంలో లభ్యమవుతుంది. దీన్ని ముడి చమురును వెలికితీయడంలో కందెనగా, వైద్య అవసరాలకు ఉపయోగిస్తారు.

గనుల విస్తరణ:

- ఆంధ్రప్రదేశ్ – కడప.
- తెలంగాణ – ఖమ్మం.

ఆస్‌బెస్టాస్ (రాతి నార): సిమెంటు రేకులు, తాళ్లు, పెయింటింగులు, బుల్లెట్‌ప్రూఫ్ జాకెట్ల తయారీలో ఆస్‌బెస్టాస్‌ను ఉపయోగిస్తారు. వీటి నిల్వలు, ఉత్పత్తిలో రాజస్థాన్, ఆంధ్రప్రదేశ్ మొదటి రెండు స్థానాల్లో ఉన్నాయి. ఈ గనుల్లో పనిచేసే కార్మికులు 'ఆస్‌బెస్టోసిస్' అనే ఊపిరితిత్తులకు సంబంధించిన కేన్సర్‌కు గురవుతున్నారు.

సున్నపురాయి: సున్నపురాయిని 75 శాతం సిమెంట్ పరిశ్రమల్లో, 16 శాతం స్టీల్ ఇండస్ట్రీల్లో ఉపయోగిస్తారు. భారతదేశంలో నిల్వలపరంగా కర్ణాటక, రాజస్థాన్; ఉత్పత్తిపరంగా మధ్యప్రదేశ్, రాజస్థాన్ మొదటి రెండు స్థానాల్లో ఉన్నాయి.

డోలమైట్: దీన్ని 90 శాతం స్టీల్ ఇండస్ట్రీల్లో, 4 శాతం ఎరువుల పరిశ్రమల్లో వాడుతున్నారు. దీని ఉత్పత్తిలో ఛత్తీస్‌గఢ్, ఒడిశా మొదటి రెండు స్థానాల్లో ఉన్నాయి.

గ్రాఫైట్: పెన్సిళ్లు, ఎలక్ట్రిక్ బ్యాటరీల తయారీలో దీన్ని వాడతారు. దీని నిల్వల విషయంలో చైనా, భారత్ మొదటి రెండు స్థానాల్లో ఉన్నాయి. భారత్‌లో దీని ఉత్పత్తిలో ఒడిశా, జార్ఖండ్, తమిళనాడు మొదటి మూడు స్థానాల్లో ఉన్నాయి.

ఇతర లోహ, అలోహ ఖనిజాలు

జింక్: ఇది సల్ఫైడ్ల రూపంలో లభ్యమవుతుంది. గాల్వనైజేషన్ ప్రక్రియలో దీన్ని ఎక్కువగా ఉపయోగిస్తారు. నిల్వలు, ఉత్పత్తిలో రాజస్థాన్ ప్రథమ స్థానంలో ఉంది.

సీసం: ఇది 'గెలీనా' అనే సల్ఫైడ్‌ల రూపంలో లభ్యమవుతుంది. దీన్ని కేబుల్ కవర్లు, పెయింట్ల తయారీలో, రబ్బర్ తయారీకి చెందిన 'వల్కనైజేషన్' ప్రక్రియలో ఉపయోగిస్తారు. ప్రపంచంలో నిల్వలు, ఉత్పత్తి పరంగా ఆస్ట్రేలియా మొదటి స్థానంలో ఉంది. న్యూ సౌత్ వేల్స్,క్వీన్స్‌లాండ్‌లోని బ్రోకన్ హిల్స్ ప్రాంతాల్లో ఇది ఎక్కువగా లభ్యమవుతోంది.

భారతదేశంలో సీసం నిల్వలు రాజస్థాన్,ఆంధ్రప్రదేశ్ (కర్నూలు, గుంటూరు), తెలంగాణ (నల్గొండ, ఖమ్మం),బిహార్, ఒడిశా రాష్ట్రాల్లో ఉన్నాయి.

తగరం: మలేషియాలో దీని ఉత్పత్తి ఎక్కువగా ఉండగా స్మెల్టింగ్ ఇండస్ట్రీ ఎక్కువగా సింగపూర్‌లో ఉంది. భారత్‌లో దీని నిల్వలు జార్ఖండ్ (హజారీబాగ్), బిహార్ (గయ), ఛత్తీస్‌గఢ్‌లో ఉన్నాయి.

వెండి (సిల్వర్): అర్జంటైట్ రూపంలో క్వార్ట్జైట్ శిలాస్థరాల్లో బంగారంతో కలిసి లభ్యమవుతుంది. దీన్ని ఎలక్ట్రో ప్లేటింగ్, ఫొటోగ్రఫీ, పారిశ్రామిక రసాయనాల తయారీలో ఉపయోగిస్తారు. దీని నిల్వలు రాజస్థాన్(జువార్)లో ఎక్కువగాఉన్నాయి. కర్ణాటక (కోలార్), ఆంధ్రప్రదేశ్ (కడప, గుంటూరు, కర్నూలు), జార్ఖండ్ (రాంచీ, హజారీబాగ్) ప్రాంతాల్లోనూ వీటి నిల్వలు ఉన్నాయి.

టంగ్‌స్టన్: రాజస్థాన్‌లోని 'డేగనా' ప్రాంతంలో ఉన్నాయి.

నికెల్: ఒడిశాలో ఎక్కువగా లభిస్తోంది.

కోబాల్ట్: రాజస్థాన్, కేరళలో దీని నిల్వలు అధికంగా ఉన్నాయి.

ఉప్పు: గుజరాత్ దీని ఉత్పత్తికి ప్రసిద్ధి.

రాతి ఉప్పు: మండి (హిమాచల్ ప్రదేశ్)లో అధికంగా లభ్యమవుతోంది.

కియొనైట్: జార్ఖండ్‌లో అధికంగా లభిస్తుంది.

జిప్సం: రాజస్థాన్‌లో దీని నిల్వలు అధికం.

ఇంధన ఖనిజాలు

మండే స్వభావం ఉన్న ఖనిజాలు, పునరుత్పత్తి చెందని సాంప్రదాయ ఇంధన వనరులు (బొగ్గు, పెట్రోలియం, సహజవాయువు) ఇంధన ఖనిజాలకు ఉదాహరణ. ఇవి ప్రధానంగా హైడ్రోకార్బన్లు.

బొగ్గు: దీన్నే నల్ల బంగారం అంటారు. ఇది దేశంలో ప్రధానంగా రెండు భౌమ కాలాలకు చెందిన అవక్షేప శిలాస్థరాల్లో లభ్యమవుతోంది. **అవి:**

1) **గోండ్వానా బొగ్గు:** దేశంలో లభ్యమయ్యే బొగ్గులో 90 శాతం ఈ రకానికి చెందిందే. ఇది ఎక్కువగా దిగువ గోండ్వానా యుగానికి చెందిన అవక్షేప శిలాస్థరాల్లోని దామోదర్ లోయ(జార్ఖండ్–దామోదర్),సోన్ (మధ్య ప్రదేశ్), మహానది (ఒడిశా),గోదావరి (ఆంధ్రప్రదేశ్), వార్ధా (మహా రాష్ట్ర) లో నిక్షిప్తమై ఉంది. ఇది అత్యంత నాణ్యమైన బొగ్గు.

2) **టెర్షియరీ బొగ్గు:** ఇది ఎక్కువగా తమిళనాడు, గుజరాత్, రాజస్థాన్, అసోం, జమ్ము–కశ్మీర్‌లోని ద్వీపకల్ప, ద్వీపకల్పేతర ప్రాంతాల్లో లభ్యమవుతోంది.

బొగ్గులోని కర్బన శాతాన్ని అనుసరించి దీన్ని 4 రకాలుగా వర్గీకరించారు. అవి..

1. **అంత్రసైట్:** అత్యంత నాణ్యమైన బొగ్గు. ఇందులో 90–95 శాతం కార్బన్ ఉం టుంది. జమ్ము–కశ్మీర్‌లో మాత్రమే కొద్ది పరిమాణంలో లభ్యమవుతోంది.
2. **బిట్యూమినస్:** ఇందులో 85–90 శాతం కార్బన్ ఉంటుంది. దేశంలో ఎక్కువగా లభ్యమయ్యే రకం ఇది. దీని వినియోగం కూడా ఎక్కువే.
3. **లిగ్నైట్ (బ్రౌన్‌కోల్):** 30–40 శాతం కార్బన్ ఉంటుంది. దీని నాణ్యత తక్కువ. తమిళనాడులోని నైవేలి ప్రాంతంలో 90 శాతం నిల్వలు ఉన్నాయి.
4. **పీట్:** కార్బన్ 10 శాతం మాత్రమే ఉంటుంది. ఇది కర్ర నుంచి బొగ్గు ఏర్పడటంలోని మొదటి దశ. దీన్నే కొయ్య బొగ్గు అని కూడా అంటారు.

భారత్‌లో 285 బిలియన్ టన్నుల బొగ్గు నిల్వలున్నాయి. వీటిలో 200 బిలియన్ టన్నులు బిట్యూమినస్, మిగిలినవి లిగ్నైట్ రకానికి చెందినవి. బొగ్గు నిల్వల్లో జార్ఖండ్, ఒడిశా, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్,పశ్చిమబెంగాల్,తెలంగాణ;ఉత్పత్తిలో ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్,ఒడిశా, మధ్యప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలు వరుసగా మొదటి స్థానాల్లో ఉన్నాయి.

దేశంలో ప్రధానమైన గోండ్వానా బొగ్గు గనులు

జార్ఖండ్ – జారియా, బొకారో, డాల్టన్‌గాజ్.
పశ్చిమ బెంగాల్ – రాణిగంజ్, గిరిధి, కరన్ పురా, డార్జిలింగ్.
ఛత్తీస్‌గఢ్ –కోర్బా, బీరమ్‌పూర్, చిరిమిరి, హస్‌డో–అరంద్, తాతాపాని– రామ్‌కోలా.
మధ్యప్రదేశ్– సింగ్రౌలి, సొహాగ్‌పూర్, ఉమారియా.
మహారాష్ట్ర – చందా, వార్ధా, కంప్టీ, భాండర్.
తెలంగాణ – సింగరేణి, కొత్తగూడెం, తాండూరు, పాల్వంచ.

టెర్షియరీ బొగ్గు గనులు:

తమిళనాడు – నైవేలి జయమ్ కొండ చోళాపురం, మన్నార్ గుడి, హిమాచల్ ప్రదేశ్, చంద్రలోయ.
అసోం – మాకుమ్, జెంజి, నజీరా, జయపూర్.
రాజస్థాన్ – బికనీర్ .
ఉత్తర ప్రదేశ్ – నామ్‌చిక్, నాంరుధ్.

బొగ్గు ఉత్పత్తిలో చైనా, యూఎస్‌ఏ, భారత్ వరుసగా మొదటి మూడు స్థానాల్లో ఉన్నాయి.

విస్తరణ:

యూఎస్‌ఏ: పెన్సిల్వేనియా నుంచి అలబామా వరకు ఉన్న అపలేచియన్ ప్రాంతం, కెంటకీ, పశ్చిమ వర్జీనియా.
ఉక్రైన్: డొనెట్స్క ప్రాంతం.
రష్యా: కుజ్‌నెట్స్క బేసిన్ .
కజకిస్థాన్: కరగండా.
జర్మనీ: రూర్ లోయ.
ఆస్ట్రేలియా: న్యూసౌత్‌వేల్స్.

పెట్రోలియం: దీన్నే ముడి చమురు, రాతి నూనె, క్రూడాయిల్, బంగారుద్రవం అని కూడా అంటారు. ఇది ప్రధానంగా అవక్షేప శిలల నుంచి లభ్యమవుతుంది. ప్రపంచంలో మొదటిసారిగా పెట్రోలియం బావిని 'పెన్సిల్వేనియా'లో కనుగొన్నారు. పెట్రోలియం నిల్వలు, ఉత్పత్తి, ఎగుమతుల్లో సౌదీ అరేబియా ప్రథమస్థానంలో ఉంది. దీని వినియోగంలో యూఎస్‌ఏ మొదటి స్థానంలో ఉంది. తర్వాత స్థానాల్లో చైనా, జపాన్, ఇండియా ఉన్నాయి.

భారతదేశంలో మొదటగా అసోంలోని 'మాకుమ్' ప్రాంతంలో ముడి చమురును గుర్తించారు. 'దిగ్బాయ్' ప్రాంతంలో దీన్ని ఉత్పత్తి చేశారు. దేశంలో చమురు నిక్షేపాల అన్వేషణ, వెలికితీత కోసం 1957లో 'డెహ్రాడూన్'లో ఆయిల్ అండ్ నేచురల్ గ్యాస్ కమిషన్ (ONGC)ను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఇది విదేశాల్లో చమురు నిక్షేపాలను వెలికి తీయడానికి OVL (ONGC Videsh Ltd.) అనే సంస్థను ఏర్పాటు చేసుకుంది. ఇటీవల రష్యాలోని 'శకాలిన్' క్షేత్రంలో పెట్టుబడులు పెట్టారు.ప్రస్తుతం ముడి చమురు ఉత్పత్తిలో మహారాష్ట్ర ప్రథమ స్థానంలో ఉండగా, గుజరాత్ రెండో స్థానంలో ఉంది.

ముడి చమురు బావుల విస్తరణ:

మహారాష్ట్ర: ముంబై–హైలోని పొన్న, ముక్త, గాంధార, హీరా బావులు, శాలిశెట్టి, బస్సైన్.

గుజరాత్: అంకలేశ్వర్ (జవహర్‌లాల్ నెహ్రూ ముడి చమురు బావి), నవ్‌గావ్, థోర్కా కలోల్, కోసాంబ (వీటన్నింటినీ కలిపి గాంధార క్షేత్రం లేదా కాంబే బేసిన్ అంటారు), ఖంబట్ బేసిన్‌లోని అలియాబాట్, కచ్ ప్రాంతంలోని కలోల్, మేసిన్.

అసోం: దిగ్బాయ్, నహర్ కాటియా, మొరాన్, హుగ్రీజన్, సిబ్ సాగర్, రుద్రసాగర్.

తమిళనాడు: కావేరి బేసిన్‌లోని నారీమనం, కోవెల్‌పూల్.

త్రిపుర:మూమ్‌బాగ,బారాముర,దేవ్‌టమూరు.

ఏపీ: కేజీ బేసిన్‌లోని రవ్వ, లింగాల.

సహజవాయువు: భారతదేశంలో మొదటిసారిగా సహజవాయువును హిమాచల్ ప్రదేశ్‌లోని జ్వాలాముఖి వద్ద కనుగొన్నారు. సహజవాయువును ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి రవాణా చేయడానికి గ్యాస్ అథారిటీ ఆఫ్ ఇండియా (GAIL)ను ఏర్పాటు చేశారు. ఈ సంస్థ నిర్మించిన పైప్ లైన్లలో ప్రముఖమైంది – HBJ పైప్‌లైన్. ఇది గుజరాత్‌లోని హజీరా నుంచి మధ్య ప్రదేశ్‌లోని బీజాపూర్ మీదుగా ఉత్తర ప్రదేశ్‌లోని జగదీష్‌పూర్ వరకు ఉంది. ప్రస్తుతం దీన్ని ఉత్తర ప్రదేశ్‌లోని దుబ్రాల వరకు (1750 కి.మీ.) పొడిగించారు.

విస్తరణ:

1. అసోం, త్రిపుర
2. కాంబే బేసిన్ (గుజరాత్)
3. బాంబే హై
4. కేజీ బేసిన్ కైకలూరు, పాసర్లపూడి (ఆంధ్రప్రదేశ్)
5. కావేరి బేసిన్ (తమిళనాడు)
6. రాజస్థాన్‌లోని తానోట్

అణు ఇంధన ఖనిజాలు

ఇవి శక్తిని వికిరణ రూపంలో వెదజల్లే అస్థిర కేంద్రక పదార్థాలు. యురేనియం (పిచ్‌బ్లండ్), థోరియం (మోనోజైట్), జిర్కానియం, ఇల్మనైట్, టిటానియం వీటికి ఉదాహరణ.

యురేనియం: దేశంలో యురేనియం నిల్వలు ఎక్కువగా జార్ఖండ్ (జాదుగూడ), బిహార్ (గయ), ఆంధ్రప్రదేశ్ (కడప జిల్లాలోని తుమ్మలపల్లి), తెలంగాణ (నల్గొండ జిల్లాలోని పెద్ద అడిశర్లపల్లి), రాజస్థాన్‌లోని ఆరావళి పర్వత ప్రాంతాల్లో ఉన్నాయి.

థోరియం: ఇది ఎక్కువగా కేరళ, విశాఖ తీర ప్రాంత ఇసుక రేణువుల్లో లభ్యమవుతోంది.

ఇల్మనైట్, టిటానియం ఎక్కువగా విశాఖ తీరంలో లభిస్తోంది. జిర్కానియం కేరళ తీరంలో; లిథియం జార్ఖండ్, మధ్యప్రదేశ్, రాజస్థాన్ ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్ ప్రాంతాల్లో లభ్యమవుతోంది.

మాదిరి ప్రశ్నలు

1. **నాణ్యత ఆధారంగా ఇనుప ధాతువు రకాలను ఆరోహణ క్రమంలో అమర్చండి.**
   ఎ. మాగ్నటైట్ బి. హెమటైట్
   సి. లియోనైట్ డి. సెడరైట్
   1) డి, సి, బి, ఎ 2) సి, డి, బి, ఎ
   3) ఎ, బి, సి, డి 4) ఎ, సి, బి, డి
2. **అల్యూమినియం భూ పటలంలో ఏ రూపంలో లభ్యమవుతుంది?**
   1) పెరైట్ 2) బాక్సైట్
   3) మాగ్నసైట్ 4) శుద్ధలోహం
3. **కోర్బా బొగ్గు గనులు ఎక్కడ ఉన్నాయి?**
   1) మధ్యప్రదేశ్ 2) జార్ఖండ్
   3) ఛత్తీస్‌గఢ్ 4) ఒడిశా
4. **సఖాలియన్ చమురు క్షేత్రం ఉన్న దేశం?**
   1) అమెరికా 2) ఉక్రైన్
   3) చైనా 4) రష్యా
5. **కరగండా బొగ్గు క్షేత్రం ఏ దేశంలో ఉంది?**
   1) కజకిస్థాన్ 2) జర్మనీ
   3) ఉక్రైన్ 4) జాంబియా
6. **సింగరేణి బొగ్గుగనులు ఉన్న రాష్ట్రం?**
   1) ఆంధ్రప్రదేశ్ 2) మధ్యప్రదేశ్
   3) తెలంగాణా 4) ఒడిశా
7. **మార్గేరీటా బొగ్గు నిక్షేపాలు ఉన్న ప్రాంతం?**
   1) మేఘాలయ 2) అసోం
   3) మణిపూర్ 4) త్రిపుర
8. **ఒడిశాలోని సుకిండా దేనికి ప్రసిద్ధి?**
   1) కాపర్ 2) క్రోమైట్ 3) బాక్సైట్ 4) బొగ్గు

సమాధానాలు

1) 1; 2) 2; 3) 3; 4) 4; 5) 1; 6) 3; 7) 2; 8) 2.

టీవీకి కంటికి మధ్య కనీసం ఎంత దూరం ఉండాలి?

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

బయాలజీ

మాదిరి ప్రశ్నలు

1. మైటోకాండ్రియా మాత్రికలో జరిగే శ్వాసక్రియ చర్యల వలయాలను విశదీకరించిన వారెవరు?
   1) సర్‌హాన్స్ క్రెబ్స్ 2) బెన్సన్
   3) మెల్విన్ కాల్విన్ 4) ష్వాన్
2. అయోడిన్ చర్య దేన్ని కనుగొనడానికి ఉపయోగపడుతుంది?
   1) కాంతి
   2) గ్లూకోజ్
   3) పిండి పదార్థం
   4) కార్బన్ డై ఆక్సైడ్
3. తేనెటీగలు తేనె పెట్టును దేని కోసం నిర్మించుకుంటాయి?
   1) మకరంద సేకరణ
   2) జాతి (సంతానం) ఉత్పత్తి కోసం
   3) రక్షణ
   4) పైవన్నీ
4. వర్గం అనే వర్గీకరణ అంతస్తును ప్రవేశ పెట్టిన వారెవరు?
   1) లిన్నెయస్ 2) హెకెల్
   3) హైమన్ 4) విట్టేకర్
5. స్పంజికల్లో కణాంతర జీర్ణక్రియ ఏ కణాల్లో జరుగుతుంది?
   1) ఆర్కియోసైట్స్
   2) కాలర్ కణాలు
   3) పినాకోసైట్స్
   4) అమీబోసైట్స్
6. కిందివాటిలో సమవిభజన ఉపయోగంకానిది?
   1) క్రోమోజోముల సంఖ్య స్థిరంగా ఉండటానికి తోడ్పడుతుంది
   2) జీవుల్లో పెరుగుదల కోసం దోహద పడుతుంది
   3) గాయాలు మానడానికి తోడ్పడుతుంది
   4) పాత కణాల నుంచి కొత్త కణాలు ఏర్పడటానికి దోహదపడుతుంది
7. సామాన్య సూక్ష్మ దర్శినిని కనుగొన్న వారెవరు?
   1) జకేరియస్ జాన్సన్
   2) రస్కా
   3) నాల్
   4) లీవెన్ హాక్
8. కిందివాటిలో క్లోరోప్లాస్టులు లోపించిన కణాలేవి?
   1) జంతుకణాలు 2) శైవలాలు
   3) శిలీంధ్రాలు 4) 1, 3
9. కిందివాటిలో సౌరశక్తిని వినియోగించుకో గలిగినవి ఏవి?
   1) ఉత్పత్తిదారులు
   2) వినియోగదారులు
   3) విచ్ఛిన్నకారులు
   4) ద్వితీయ వినియోగదారులు
10. జీవి మనుగడకు అవసరం కాని క్రియ ఏది?
   1) శ్వాసక్రియ
   2) ప్రత్యుత్పత్తి
   3) ప్రసరణ
   4) విసర్జన
11. టోనోప్లాస్ట్ కలిగిన కణాంగం ఏది?
   1) మైటోకాండ్రియా 2) గాల్జి సంక్లిష్టం
   3) రిక్తిక 4) కణత్వచం
12. వ్యాధులు సంక్రమించినప్పుడు తయారయ్యే ప్రతిరక్షకాలు అనేవి..?
   1) ప్రోటీన్ నిర్మాణాలు
   2) ప్రోటీనేతర నిర్మాణాలు
   3) కార్బోహైడ్రేట్ నిర్మితాలు
   4) సెల్యులోజ్ నిర్మితాలు
13. పెద్ద వృక్షాల్లో నీటి ప్రసరణ జరగడానికి తోడ్పడే ప్రక్రియ ఏది?
   1) బాష్పోత్సేకం
   2) విసరణ, ద్రవాభిసరణ
   3) వేరు పీడనం, బాష్పోత్సేకం
   4) వేరు పీడనం
14. కిందివాటిలో సేంద్రీయ పదార్థం కానిది?
   1) కొవ్వు పదార్థం 2) విటమిన్లు
   3) పిండి పదార్థం 4) డీఎన్ఏ
15. ఏ మొక్కలో దారు నాళాలు నీటి ప్రసరణలో చురుగ్గా పాల్గొంటాయి?
   1) టెరిస్ 2) ఫైకస్
   3) పైనస్ 4) ఏదీకాదు
16. ఏ మొక్కల్లో రెసిన్ నాళాలు కనిపిస్తాయి?
   1) టెరిడోఫైట్‌లు
   2) శైవలాలు
   3) బ్రయోఫైట్‌లు
   4) వివృత బీజాలు
17. అంతర్జాతీయ ఆహార దినోత్సవం ఏ రోజున నిర్వహించుకుంటారు?
   1) అక్టోబరు 10
   2) అక్టోబరు 26
   3) అక్టోబరు 16
   4) అక్టోబరు 24
18. 'మింగడం' అనేది ఏ రకమైన చర్య?
   1) నియంత్రిత
   2) అనియంత్రిత
   3) అసంకల్పిత 4) ప్రతీకార చర్య
19. ప్రౌఢ మానవుని నోటిలో ఉండే కుంతకాల సంఖ్య?
   1) 8 2) 4 3) 6 4) 2
20. వినడంలో పాత్ర వహించే లోపలి చెవి నిర్మాణం ఏది?
   1) పేటిక
   2) కర్ణావర్తం
   3) అర్ధవర్తుల కుల్యలు
   4) యూస్టాషియన్ నాళం
21. మానవుడికి చీకటిలో వస్తువులన్నీ బూడిద రంగులో కనిపించడానికి కారణమైన కణాలేవి?
   1) దండాలు
   2) కోనులు
   3) దండాలు, కోనులు
   4) పైవేవీకాదు
22. రోమాలు, గోర్లు, గిట్టల రూపంలో జీవులకు రక్షణ కలిగించే కణజాలం ఏది?
   1) ఉపకళా 2) అస్థి
   3) ఎడిపోస్ 4) కార్టిలేజ్
23. రసభరితమైన పొలుసు ఆకులను కలిగి ఉండే మొక్కలో కనిపించే భూగర్భ కాండ రూపాంతరం ఏది?
   1) దుంప 2) కొమ్ము
   3) లశునం 4) మొగ్గలు
24. 'అవిసీనియా' మొక్కలో ప్రధాన వేర్లను కాకుండా వాయుగత వేర్లను తొలగిస్తే ఏమవుతుంది?
   1) కిరణజన్య సంయోగక్రియ జరగదు
   2) నత్రజని స్థాపన ఆగిపోతుంది
   3) బాష్పోత్సేకం ఆగిపోతుంది
   4) శ్వాసక్రియ ఆగిపోతుంది
25. ఒక విద్యార్థి తనకు దొరికిన మొక్క కాండం నుంచి అనేక వేర్లు సమాన పరిమాణంలో ఉండటాన్ని గమనించాడు. అది కిందివాటిలో ఏ మొక్క అయి ఉండవచ్చు?
   1) వేరుశనగ 2) కంది
   3) మొక్కజొన్న 4) చిక్కుడు
26. కిందివాటిలో జన్యు వ్యాధికి ఉదాహరణ?
   1) డిఫ్తీరియా 2) హీమోఫిలియా
   3) టెటానస్ 4) రేచీకటి
27. రక్తంలో సహజ రక్త స్కందక నివారిణి?
   1) హీమోలైసిన్ 2) హిరుడిన్
   3) హెపారిన్ 4) సోడియం సిట్రేట్
28. కింద పేర్కొన్న ఏ చేపల్లో అంతర అస్థి పంజరం మృధులాస్థితో నిర్మితమై ఉంటుంది?
   1) టీలియోస్ట్ 2) రోహు
   3) వల్లగో అట్టు 4) షార్క్
29. కణంలోని జీవ పదార్థంలో నీటి శాతం?
   1) 90-95 2) 85-90
   3) 70-80 4) 30-40
30. నాడీ వ్యవస్థ నిర్మాణాత్మక ప్రమాణం ఏది?
   1) డెండ్రాన్ 2) నెఫ్రాన్
   3) న్యూరాన్ 4) ఆక్జాన్
31. ఎర్ర రంగు గులాబీ పసుపురంగు కాంతిలో ఎలా కనిపిస్తుంది?
   1) తెలుపు 2) ఎరుపు
   3) పసుపు 4) నలుపు
32. కంటి చూపుపై ప్రభావం పడకుండా ఉండాలంటే టీవీకి కంటికి మధ్య కనీసం ఎంత దూరం ఉండాలి (మీటర్లలో)?
   1) 1.5 2) 2.5 3) 5.5 4) 0.5
33. మొక్కలు నీటిని, ఖనిజ లవణాలను పీల్చుకునే విధానం గురించి తెలుసుకోవాలనుకునే విద్యార్థి దేన్ని అధ్యయనం చేయాలి?
   1) ప్లాంట్ మార్ఫాలజీ
   2) ప్లాంట్ ఫిజియాలజీ
   3) ప్లాంట్ ఇకాలజీ
   4) ప్లాంట్ ఎంబ్రియాలజీ
34. కిందివాటిలో లైకేన్లలో కనిపించే జీవనం, అందులో పాల్గొనే జీవులు వరుసగా?
   1) పరాన్న జీవనం – శైవలం, శిలీంధ్రం
   2) సహజీవనం – శైవలం, బ్రయోఫైట్
   3) పూతికాహారం – శైవలం, శిలీంధ్రం
   4) సహజీవనం – శైవలం, శిలీంధ్రం
35. నిస్సల్ కణికలు కలిగిన కణాలేవి?
   1) న్యూరాన్లు 2) నెఫ్రాన్లు
   3) ఇసినోఫిల్స్ 4) లింఫోసైట్లు
36. శరీరం మొత్తం బరువులో మెదడు బరువు సుమారుగా ఎంత శాతం?
   1) 13 2) 5 3) 2 4) 8
37. మానవుని సామాన్య రక్తపీడనం 120/80. ఇందులో పై సంఖ్య దేన్ని సూచిస్తుంది?
   1) డయాస్టోలిక్ పీడనం
   2) సిస్టోలిక్ పీడనం
   3) ఊర్ధ్వ పీడనం
   4) రక్తపోటు
38. పత్రం ద్వారా కొత్త మొక్కలను ఏర్పరిచే మొక్క ఏది?
   1) చేమంతి
   2) కరివేపాకు
   3) రణపాల
   4) గడ్డి
39. ఒక పుష్పాన్ని పరిశీలిస్తే అందులో రక్షక, ఆకర్షక పత్రావళి మాత్రమే ఉన్నాయి. అయితే అది ఏ రకమైన పుష్పం?
   1) ద్విలింగ 2) అసంపూర్ణ
   3) ఏకలింగ 4) సంపూర్ణ
40. కొబ్బరిలో తినే భాగం ఏ స్థితిలో ఉంటుంది?
   1) ఏకస్థితిక 2) ద్వయస్థితిక
   3) త్రయస్థితిక 4) బహుస్థితిక
41. కణ విభజనలో ద్విగుణీకృతం అయ్యేవి?
   1) రైబోజోములు
   2) గాల్జీ సంక్లిష్టం
   3) క్రోమోజోములు
   4) క్లోరోప్లాస్టులు
42. 'టానిన్స్' అనే పదార్థాల ఉపయోగం ఏమిటి?
   1) పాలను నిల్వ చేయడానికి వాడతారు
   2) తోళ్లను శుద్ధి చేయడానికి వాడతారు
   3) ఆల్కహాల్ తయారీలో ఉపయోగిస్తారు
   4) జున్ను తయారీలో వినియోగిస్తారు
43. 'నీలి విప్లవం' అనేది వేటి ఉత్పత్తికి సంబంధించింది?
   1) పాలు
   2) కూరగాయలు
   3) తేనెటీగలు
   4) చేపలు
44. కిందివాటిలో డాక్టర్ ఎల్లాప్రగడ సుబ్బారావు కనుగొన్నది ఏది?
   1) టెట్రాసైక్లిన్ 2) పెన్సిలిన్
   3) ఇన్సులిన్ 4) వ్యాక్సినేషన్
45. ఒక తరం నుంచి మరో తరానికి లక్షణాలు సంక్రమించే విషయం గురించి తెలియజేసే శాస్త్రం ఏది?
   1) పిండోత్పత్తి శాస్త్రం
   2) జన్యు శాస్త్రం
   3) సూక్ష్మజీవ శాస్త్రం
   4) జీవ సాంకేతిక శాస్త్రం
46. మానవుని జీర్ణ వ్యవస్థలో కిందివాటిలో ఏ పదార్థం జీర్ణం కాదు?
   1) ప్రోటీన్లు
   2) కార్బోహైడ్రేట్లు
   3) కొవ్వులు
   4) సెల్యులోజ్
47. కాడ్‌లివర్ నూనెలో అధికంగా ఉండేది?
   1) విటమిన్-బి 2) ప్రోటీన్లు
   3) విటమిన్-ఎ 4) విటమిన్-సి
48. ఇందిరాగాంధీ జూ పార్క్ ఎక్కడ ఉంది?
   1) ఏలూరు 2) గుంటూరు
   3) నెల్లూరు 4) విశాఖపట్నం
49. ఎడారి మొక్కల్లో ఆహారాన్ని తయారు చేసే భాగం ఏది?
   1) పత్రం 2) వేరు
   3) కాండం 4) ఫలం
50. అగ్‌మార్క్ ప్రయోగశాల మనరాష్ట్రంలో ఎక్కడ ఉంది?
   1) కాకినాడ
   2) విజయవాడ
   3) గుంటూరు
   4) అనంతపురం
51. బొద్దింకలో రక్తాన్ని హృదయంలోకి పంపడానికి ఉపయోగపడే నిర్మాణాలేవి?
   1) వాయు నాళ కండరాలు
   2) పక్షాకార కండరాలు
   3) హృదయ కండరాలు
   4) ఉరః కుహర కండరాలు
52. కిందివాటిలో ఏ జీవిలో చర్మం శ్వాసాంగంగా ఉండదు?
   1) బొద్దింక 2) వానపాము
   3) జలగ 4) సాలమాండర్
53. కిందివాటిలో శరీర కుహర ద్రవం కలిగిన జీవి ఏది?
   1) అమీబా
   2) పారమీషియం
   3) వానపాము
   4) వర్టిసెల్లా
54. పీయూష గ్రంథిలోని తమ్మెల సంఖ్య?
   1) 4 2) 3 3) 2 4) 5

సమాధానాలు

1) 3; 2) 3; 3) 4; 4) 2; 5) 4;
6) 1; 7) 4; 8) 4; 9) 1; 10) 2;
11) 3; 12) 1; 13) 3; 14) 4; 15) 2;
16) 4; 17) 3; 18) 1; 19) 1; 20) 2;
21) 1; 22) 1; 23) 3; 24) 4; 25) 3;
26) 2; 27) 3; 28) 4; 29) 2; 30) 3;
31) 4; 32) 2; 33) 2; 34) 4; 35) 1;
36) 3; 37) 2; 38) 3; 39) 2; 40) 3;
41) 3; 42) 2; 43) 4; 44) 1; 45) 2;
46) 4; 47) 3; 48) 4; 49) 3; 50) 3;
51) 2; 52) 1; 53) 3; 54) 2.

Indian Financial Network is the...

BANK EXAMS

BANKING AWARENESS

Model Questions

1. The Reserve Bank's affairs are governed by a central board of directors. The board is appointed by the Government of India in keeping with the Reserve Bank of India Act. It is Appointed/ nominated for a period of....
   a) 6 years
   b) 5 years
   c) 4 years
   d) 3 years
   e) 2 years
2. As per SEBI guidelines, in a Book Building process the cap in the price band
   a) should be at least 10 per cent of the floor price
   b) should not be more than 20 per cent of the floor price
   c) should not be more than 30 per cent of the floor price
   d) no limits e) none
3. _______ is a short term security (7 days to 365 days) issued by a corporate entity (other than a bank), at a discount to the face value?
   a) Commercial Paper
   b) Certificate of Deposit
   c) Non-convertible Debenture
   d) Treasury Bill
   e) None of the above
4. Who is the chairman of NITI Ayog ?
   a) Narendra Modi
   b) Arvind Pangaria
   c) Mangu Singh
   d) Anupam Srivastava
   e) Ashok Kumar Roy
5. The Nai Manzil Scheme is designed as an integrated education and training programme that provides youth from minority communities skills needed for different tasks in a rapidly changing world. It also provides them trade related training in which of the following areas:
   a) Manufacturing
   b) Engineering
   c) Services
   d) Soft skills
   e) All the above
6. Indian Financial Network [INFINET] is the...
   a) Communication backbone for the Indian Banking and Financial sector
   b) Association of the employers of the banking and financial sector
   c) Closed user group network of SBI and its subsidiaries
   d) All of the above
   e) None of the above
7. In Mutual Funds, A close ended fund means:
   a) The corpus is of fixed size with a definite redemption period
   b) Listing on stock exchanges provides easy liquidity
   c) The market price is always below the Net Asset Value
   d) All of the above
   e) None of the above
8. Which of the following is correct statement in respect of debit cards
   a) Debit card facility is provided to those having savings bank account/current account holders
   b) This facility is not extended to cash credit/loan account holders
   c) It is an unsecured credit facility
   d) Debit card is issued to all the persons who visit the branch
   e) a and b
9. In the term IPO, what do you mean by "P"?
   a) Provisions
   b) Public
   c) Private
   d) Prudent
   e) Pension
10. The Overall Priority Sector Lending Target to be increased to _______ by Foreign Bank with more than 20 Branches by 2018?
   a) 60 percent of adjusted Net Bank Credit
   b) 40 percent of Adjusted Net Bank Credit
   c) 32 percent of adjusted Net Bank Credit
   d) 25 percent of adjusted Net Bank Credit
   e) 30 percent of adjusted Net Bank Credit
11. When it comes to scheduled commercial banks, which out of the following is not true?
   a) Nationalised banks
   b) Regional Rural banks
   c) Foreign banks
   d) Private sector banks
   e) Local area banks
12. Which amongst the following is called as mother of deposits?
   a) Current account
   b) Fixed deposit
   c) Recurring deposit
   d) Savings bank
   e) Reinvestment deposit
13. "Micro Finance" is a ______ of banking services?
   a) Introduction stage
   b) Saturation stage
   c) Research stage
   d) Decline stage
   e) None of the Above
14. Which amongst the following is not term deposits issued by commercial banks?
   a) Current account
   b) Fixed deposit
   c) Recurring deposit
   d) Reinvestment deposit
   e) All the above
15. What is the main purpose of Open market operations?
   a) A fiscal device which assists Government borrowing
   b) A monetary measure to regulate quantity of money in circulation and the cash reserves of the commercial banks
   c) A measure to counteract extreme trends in business
   d) A measure to influence the balance of payments position
   e) None of the above
16. What is the full form of MSME?
   a) Mini, Small and Medium Enterprises
   b) Micro, Small and Medium Enterprises
   c) Mini scale Marketing Enterprises
   d) Medium Scale Marketing Enterprises
   e) None of the above
17. A customer is required to maintain adequate balances in his/her accounts in order to use his ____ card in the merchant establishments?
   a) Smart Card
   b) Credit Card
   c) Add-on Credit card
   d) Debit Card
   e) None of the above
18. Which of the following are the latest guidelines issued by the RBI in respect of opening new branches in villages?
   a) To open more brick and mortar branches in villages where there are no banking facilities and population is more than 5,000.
   b) Banks to submit a roadmap on how many branches they will be opening by 31 March 2017.
   c) The roadmap by end of January 2016.
   d) BCBF Model to be discontinued
   e) Only a, b, c
19. Name the financial instrument which is/are issued for short term (up to one year) borrowing by RBI on behalf of the Government of India?
   a) Treasury Bills
   b) Commercial Paper
   c) Certificate of Deposit
   d) Non-convertible Debenture
   e) Only b & c
20. KYC (Know Your Customer) norms were implemented in the Indian banking system in 2002 as per the directive of ?
   a) SEBI b) RBI c) IBA
   d) IRDA e) None of these
21. Often, we read in the newspapers that several Indian companies are taking the FCCB route to raise capital. What does the term FCCB stand for?
   a) Foreign Currency Convertible Bond
   b) Foreign Convertible Credit Bond
   c) Financial Consortium and Credit Bureau
   d) Future Credit and Currency Bureau
   e) None of these
22. ATM cards are issued to a person who maintains any of following accounts with the bank
   a) saving bank account
   b) current accounts
   c) term deposits
   d) loan or cash credit accounts
   e) either a or b
23. A commercial paper is
   a) A paper issued by Reserve Bank of India an trade and commerce
   b) An unsecured money market instrument issued in the form of promissory note
   c) A document issued by IDBI for seeking refinance facility from Reserve Bank India
   d) All of the above
   e) None of the above
24. Which of the following would fall under the category of retail banking?
   a) Home Loans
   b) Credit Cards
   c) Personal Loans
   d) Car Loans
   e) All of these
25. Who decides how much quantity of the coins to be minted?
   a) Reserve Bank of India
   b) Central Government
   c) Finance Ministry
   d) Both RBI and Central Government decide
   e) None of the above
26. What are the components of Foreign Exchange Reserves?
   a) Foreign currency assets,
   b) Gold,
   c) Special Drawing Rights
   d) Reserve Position in the IMF
   e) All the above
27. The chairman of Regional Rural Bank is appointed by _____?
   a) State Government
   b) Reserve Bank of India
   c) Central Government
   d) Sponsoring bank in consultation with NABARD
   e) None of the above

KEY

1) c 2) b 3) a 4) a 5) e
6) a 7) d 8) e 9) b 10) b
11) e 12) d 13) a 14) a 15) b
16) b 17) d 18) e 19) a 20) b
21) a 22) e 23) b 24) e 25) b
26) e 27) d